సంపుటము 18
సంచిక 9

భారతి

వృష. భాద్రపదము
1941 సెప్టెంబరు

రవీంద్రుని అస్తమయము

భారతకవిచంద్రుడు రవీంద్రుడు అస్తమించినాడు. శ్రావణపౌర్ణిమాపుణ్యదినమునాడు పుణ్యలోకమున కేగినాడు. పుణ్యపురుషుడు! నిర్విచారముగా నిష్క్రమించినాడు.

కాని, భారతీయులకిది నిజముగా పవిఘాతముగా పరిణమించుటలో ఆశ్చర్యమావంతయు లేదు. భారతదేశాభ్యుదయమునకై అహోరాత్రములు అలమటించుచు అశ్రాంతముగా శ్రమించిన మహామహులలో రవీంద్రుడొకడు. భారతదేశఖ్యాతిని దేశదేశములకు, ఖండఖండములకు ప్రాకించి, దానిని మహోచ్చ శిఖరములందు నిలిపిన పరిణతప్రజ్ఞుడాయన.

అట్టి దీప్తతార భారతాకాశమునుండి రాలిపోయినది!

కాని— అతని పండబారిపోయిన వృద్ధ భౌతిక దేహమే నేడు మన కగోచరమైనది. అజరామరమైన అతని కీర్తి కలకాలము మన కన్నులముందు కాంతిలుచునే యుండును. దానికి క్లాంతి లేనే లేదు; ఉండనే ఉండదు. అది ధ్రువతార!

రవీంద్రుని వ్యక్తిత్వము నానారూపములుగా అతని భౌతిక దేహమునుండి బహుదూరము వ్యాపించిపోయి ప్రపంచమందు పలుమూలల నిలవరమేర్పరచుకొన్నది.

వందలకొలది పిల్లవత్తులను వెలిగించిన ఆతల్లివత్తి తాను ఆరిపోయినంతమాత్రమున ఆ పిల్లవెలుగుల వెల్లువ అంతటనింతట ఆరిపోవునదేనా? కాదు, ముమ్మాటికిని కాదు. అది అఖండజ్యోతి!

దేశములో రవీంద్రుని మించిన కవులుండిన నుండవచ్చు. అదేరీతిగా, అతనికంటె ఒకచేయి మించిన రాజకీయవేత్తలు, తత్త్వశాస్త్రనిష్ణాతులు, నటులు, గాయకులు, నవలానిర్మాతలు, నాటకకర్తలు, కథకులుకూడ ఎందరెందరో ఉండవచ్చు. కాని, రవీంద్రుని వలె సాహిత్యము, రాజకీయములు, తత్త్వజ్ఞానము, అభినయము, సంగీతము, చిత్రకళ, శిక్షణ, సమాజసేవ – ఇత్యాదిగా పలురంగ

ములందు ఏకప్రకారమైన ప్రజ్ఞగలవారు మట్టుకు నూటికి కోటికి ఒక్కరు, శతాబ్దములకు సహస్రాబ్దములకు ఒక్కరుమాత్రము పుట్టుచుందురు. ఇట్టిసంఘటన అపురూపముగా గాని సంభవించదు. అటువంటి మహావ్యక్తుల మహస్సు మహోజ్జ్వలమై మానవజాతికి మార్గదర్శిమై మారెరుగక మనియుండగలదు.

రవిదృష్టి వలెనే రవీంద్రుని దృష్టి గూడ విశ్వవ్యాపి యైనది. అందుచేతనే ఆయన ప్రతిదానిని ఆ విశ్వదృష్టితోనే విలోకించుచుండెను. ఆ విశ్వజనీనమైన విలోకనకు ఫలమే విశ్వభారతి. అఖిలభారత కళాకేంద్రమై అది విశ్వవిఖ్యాతిని గడించుటకు ఆయన పడ్డ పాట్లకు పరిమితిపారములు లేవు. విశ్వసాహిత్యసమ్మేళనమై విశ్వభారతి విస్తారకీర్తిని గడించుకొన్నది.

రాజకీయముల పొంతకు రవీంద్రుడు ఎక్కువగా పోలేదు. కారణ మాయనకే తెలియవలెను. ఆయన తదేకదీక్షగా చరించినది ఒక్క సాహిత్య రంగమే. అట్లని ఇతరముల నాయన యెన్నడును ఉపేక్షించినవాడు కాడు. యథోచితముగా, యథాకాలముగా ఆయన రాజకీయములను గూడ చేపట్టకపోలేదు. కాని, అవి ఆయనపాలిటికి ఉపసర్జనము లైనవి.

సాహిత్యరంగములో ఆయనది అందె వేసిన చేయి. ఒకశాఖ కాదు, అన్ని శాఖలలోను ఆయన పరినిష్ఠిత ప్రజ్ఞను ప్రదర్శించినాడు. ఒక కథలా, ఒక నాటకములా, ఒక గేయములా, ఒక నవలలా, ఒక చిత్రములా- ఎన్నని యెన్నుట, ఎన్నిశాఖ లని వింగడించుట— అన్ని శాఖలలోను ఆయనది పారముట్టిన ప్రజ్ఞ. ఆప్రజ్ఞను రుచి చూడనివాడు నేడు పామరులలో పామరుడుగా పరిగణింపబడుచున్నాడు. ఆయనరచనలు దేశము నలుమూలలు— దేశమే యేగుటి, ప్రపంచము నందంతటను విశేషాదరముతో పఠింపబడుచున్నవి. ఆయనప్రజ్ఞ ఫలించినది.

ఆయన పుంభావ సరస్వతి! సాహిత్య చక్రవర్తి! ఒక్క కలముపోటుతో — గీతాంజలి మూలముగా విదేశీయ సాహిత్యవేత్తలను సైతము సైయన తలలూపించి మెప్పించి అనన్యసామాన్యమైన నోబెల్ బహుమతిని సంపాదించినాడు. తలవనితలంపుగా ఈమధ్యనే ఆక్స్ఫర్డు డాక్టరేటు బిరుదము గూడ బహూకరింపబడినది. అసలు ఆయనకు ఈ బిరుదములు, ఈ బహూకరణములు నెందుకు? ఈ చిరుకొలతలకు అందనిది ఆయనప్రతిభ.

కవికుమారుల కెందరికో ఆయన గురుదేవు డైనాడు. కథకులపాలిటికి కల్పద్రుమము, నవలాకారులకు నౌక, గేయకర్తలకు గీతాచార్యుడు నయినాడు. ఆయన గురుదేవుడు! కవిసార్వభౌముడు :!

మాతృభాషయందు ఆయనకు గల మమకారము దీటులేనిది. ఆయన ఏదివ్రాసినను, ఏదిచెప్పినను అది మొట్టమొదట మాతృభాషయందే. అటుపిమ్మటనే భాషాంతరములలోని కనువాదములు. కలకత్తా విశ్వవిద్యాలయ పట్టప్రదానోత్సవములో పట్టభద్రులకు స్నాతకోపన్యాస మిచ్చునప్పుడే ఆయన బెంగాలీలోనే ప్రసంగించి ప్రశంసల నందుకొన్నాడే, ఇక తన సొంత రచనల విషయమున లెక్కేమిటి?

ఆయన దేశాభిమానముకూడ అట్టి దీటు లేనిదే. దేశశ్రేయస్సే తన శ్రేయస్సుగా, దేశ క్షేమమే తన ఏకైకలక్ష్యముగా దినములు గడపిన దీక్షాశాలి ఆయన. దేశావమానమును ఆయన అణుమాత్రమైనను సహించలేకుండెను. అట్లు అవమతించిన వారిని జంకుగొంకులు లేక, అవక్ర విక్రమముగా ఎదిరించి చించి చెండాడు చిత్త స్వభావ మాయనది. అనారోగ్య దశలో అలమటించుచుకూడ ఈ మధ్యనే ఆయన రాత్‌బోను తూలుమాటలకు త్రుళ్లిపోయి, తోక త్రొక్కిన త్రాచువలె రేగి ఆ మిస్సమ్మ జాతిజాతినే తూర్పారబట్టినది ఈ మహోన్నత స్వభావ ఫలితము కాక మరేమి? అట్టి సన్మాన్యమైన స్వభావముకలవాడే కానిచో, అయాచితముగా ప్రభుత్వ ప్రసాదితమైన సర్ బిరుదమును, పంజాబు వధల ప్రమేయముతో ప్రభుత్వము పైన నేరోసి, "ఇట్టి నీ బిరుదెంత, నీ వెంత" యన్నట్లు అతిచులకనగా పరిత్యజించుట జరుగు నదేనా?

అటువంటి దేశభక్తుడు, దేశారాధకుడు, దేశశ్రేయస్స్వామి నేడు దివికేగినాడు. కవి సార్వభౌముని దర్శనము కరవైపోయినది. సాహిత్యచక్రవర్తి సాక్షాత్కారము సమాప్తమైనది.

దేశమిప్పుడు విషమస్థితిలో నున్నది. దుర్బలస్థితియం దున్నది. దానికి అవలంబన, పోషణ, ప్రోత్సాహములు అవసరములై యున్నవి. రవీంద్రుడు ఈ అన్నిటిని అమర్చుచుండెను. అటువంటి అమోఘమైన ఆలంబన అంతరించి అఘోరించవలసిన దుర్గతి మనకు పట్టినందుకు అశ్రువులు రాల్చనివా డెవ డుండును?

భారతసాహిత్యమునకు అండయై, ప్రోదియై నిలిచి, దాని పరీమళములను ప్రపంచమునకు వెదచల్లి విశ్వసాహిత్యములో దానికి మహోన్నతస్థానమును కల్పించి భారతజాతి నాగరికత నుజ్జ్వలింపజేసిన సాహిత్యచక్రవర్తి-కవిసార్వభౌముని మరణమునకు కన్నీరు రాల్చని సాహిత్యవేత్త యెవడుండును?

ఆయనఆత్మ నిత్యతృప్తితో, నిత్యశాంతితో వెలయునట్లు భగవంతు డనుగ్రహించు గాక!



రవికవి జీవితగాథ

లోకోత్తరుల జీవిత గాథాసుధాస్వాదన మమందానంద సంధాయకమనుట నిర్వివాదాంశము. అట్టి వారి జీవితములు మానవకోటికి ఆదర్శప్రాయములై యలరారుటయే కాక విశ్వమానవకల్యాణ మహాభాగ్యమునకు మార్గదర్శకములను సందియము లేదు. శ్రీరవీంద్ర కవీంద్రు డట్టి మహాశయుడనుట దబ్బర కానేరదు. సాహిత్యనభోమండలమున రవీంద్రు డన్వర్థనామధేయుడై వెలుగొందినాడు.

ఆతని సుకృతికి వన్నెరు! ఆతని స్మృతికి కన్నీరు!

రవీంద్రుని బాల్యము

అది యొక మహాపుణ్యదినము. విశ్వభారతీ విధాతయగు రవీంద్రు డుదయించుటచే క్రీ. శ. ౧౮౬౧-వ సంవత్సరము మే నెల ౭ వ తేదీ యెంతయు చరితార్థమైనది. మహర్షి దేవేంద్రనాథటాగూరు రీమహాశయుని జనకుడు. ఆతని కేడ్గురు కొమరులు. అందు కనిష్ఠుడు రవీంద్రుడు. రవీంద్రుని తల్లి చిన్ననాటనే పరమపదించెను. పత్నీవియోగానంతరము దేవేంద్రుడు తన సుతుల నింటికడ విడచి దేశాంతరముల కేగెను. ఇక గృహసేవకులే వీరికి యజమానులైరి.

పువ్వుపుట్టగనే పరిమళించును. జ్యోతి వెలుగగనే కాంతి నొసగును. రవీంద్రుని సహజమేధస్సునకుతోడు కుశాగ్రబుద్ధిగల తన సోదరుల సాంగత్యము 'పండితి తావి యబ్బినభాతి' యయ్యెను. ఆతని బాల్యము చిత్రవిచిత్రానుభవములతో గడచిపోయెను. తా నొకపరి వ్యాధినివారణార్థ మొకపల్లెకు గొంపోబడెను. అప్పట నాతి డుదయసాయంసమయసంధ్యారాగముల బోడగాంచి ప్రకృతిరామణీయకమున కత్యంతపారవశ్యము నొందెనట! అటుపిమ్మట నొకసారి యాతడు హిమాలయములకు తీసికొనిపోబడెను. అచ్చటి పర్వతరాజములను తిలకించినంతనే యాతని హృదయజలధిని భావతరంగము లప్రతిహతముగ నుప్పతిల్లజొచ్చెను. ఆయ్యది కవిహృదయము! వయస్సా చిన్నది, భావములా కనకుత్తుంగ తరంగసంకాశములు! కవిరై పుట్టవలయునే గాని పుట్టి కవి గానేర డనుట కింతకంటె తార్కాణ మేమి కావలయును?

రవీంద్రనాథటాగూరు పాఠశాలా విద్యాభ్యాస మంత సక్రమముగా జరుగలేదు. పాఠశాలయెడ నాతని కచిరకాలములోనే విముఖత పొడసూపెను. బడిలో గురువుల యధికార దండనాదు లాతనికి దుస్సహములుగా దోచెను. అందువల్ల నతడు పట్టుదల వహించి పాఠశాలకు త్వరలోనే తిలోదకము లర్పించినాడు. స్వగృహముననే విద్యాభ్యాసమునకు తన సమ్మతి నొసగినాడు!

ఈడుకు మించిన కైత

పదునైదవయేటనే రవీంద్రుని కవితాసరస్వతి వీణియ మీటినది. ఈడుకమునే నెలలొలుకు తొలిపలుకులు 'కవిగాథ' యను గీతాకృతిని బొంది సుకృతి నొందినవి. ఈ బాలకోకిల యవ్యక్తరాగాలాపమునకు జగతియెల్ల తలయూపి జోహారు లొసగినది. ఈ శాతికా గీతికను ఇతని యగ్రజుడగు జ్యోతీంద్రుని 'భారతి' యను పత్రికాముఖమున విని రసికజన మయూరములెల్ల మనోహరనృత్య మొనర్చినవి. ఇంకను శ్రోతలీ గీతము నరగాహన మొనర్చుకొనలేదు! కాని యిదేమి, యింతలోనే మరియొక గీతాలాపము! 'అడవి పువ్వు'లట! ఆహా యెంత మనోహర మనునామధేయము! ఇక దానియందలి భావరసాలంకార చమత్కృతి యెట్టిదో! నేనే ఆ కవీంద్రుని మధురలేఖనిరైయున్నచో! దీనినికూడ 'భారతి' ధరణి భూమికి పంచిపెట్టినదట! పాటవెంట పాట! ఇదియే కవీంద్రుని బాట! అనతికాలములోనే సాహిత్యకవి రచనానుసుణముగ గీతములలోనే కథలు! ఇవిగాక వేరుగ జానపద గీతములు!

ఇంకేమి యమృతఫలములు తలయూపెనో ఆకవి చంద్రుని ముఖభారతియందే!

రవీంద్రునికి పదునేడవయేడు ప్రాప్తించినది. న్యాయవాదవృత్తి తన యాత్మను పేరంటమునకు బిలచినది. అర్ధానికై యాతడింగ్లాండునందు త్రీర్ఘుడు కాదలచినాడు. అచట నొకయేడు గడపి మగిడి పుట్టినింటికి వచ్చినాడు. పోవునపు డాతని కింగ్లాండుపై గలిగిన యభిమానము వచ్చునపు డనస్యామునకు తావొసగినది

అందుల కింగ్లీషుపరిస్థితు లతనికి నచ్చకుంటరే కారణము.

౧౮౮౧ నుండి రవీంద్రుడు కవితానభోవీథిని మెల్ల మెల్లన పైకి ప్రాకసాగెను. 'సాయంకాలగీతములు' నూతన సరస్వతీ కంఠమాలయందలి ప్రథమకుసుమ మగుచ్చను. తరువాత వెలువడిన 'ఉదయగీతములు' అను వేరొండు నుచ్చను. ఇవి సర్వాంగశోభితములై సమస్త లక్షణ లక్షితములై యలరినవి. వీనియందలి మకరంద మాధుర్యము తేర్పంబంగులగు రసిక శిఖామణులకే తెలియగలదు! అతఁ డాకాలమున 'భాంతకురా వీర్ హాట్' (Bhantakura vir hat) అనునొక వ్యాసమును, 'ప్రకృతిపగ' (Nature's Revenge) అనునొక నాటకమును సృష్టించెను. ౧౮౯౦లో 'మానసి' అను పేరుతో మరికొన్ని గీతముల నాతఁడు లోకమున వెదజల్లెను. ఇవి యాతని మేధావికాసమును వేనోళ్ల చాటుటకై బయలు వెడలియుండనోపును.

ప్రజలతో పరిచయము

రవీంద్రుడు రెండుమా రింగ్లండుదేశమునకు పోయి వచ్చెను. పిదప తన ముప్పదియవయేట తనతండ్రియాజ్ఞ మతోనుసారముగా 'షిలైడ్' యనుచోటికి తన భూస్థితిని చక్కపరచుకొన నేగెను. అచ్చట నాతని వ్యవహార సామర్థ్యము తన కవితాదీప్తిని మించి దీపించెను. ఆస్తి పెంపొందెను. అప్పుడు వరిసిన చే 'చిరిగిన యుత్తరములు' (Torn letters) అను నమ్మూతబింకువు. ఆస్తిని మాయుకొను కవిపత్తమున కచ్చటి కర్షకకార్మికుల కష్టనిష్ఠురము లెట్లు హృదయసంపుటమునుండి నాస్తి కాగలవు? అతని దయార్ద్రమానసమున కీరచనలే ప్రబల తార్కాణములు. నాటకములేమి, కథలేమి, గీతములేమి, వ్యాసములేమి—సర్వమును అతని లేఖినికి కరతలామలకములై విలసిల్లినవి. ఆతని కవితాప్రవంతి దివ్యగంగాఝరివలె వెల్లివిరిసినది. జగము శుభాత్మతలచే దీని నాశీర్వదించినది.

సంప్రదాయములపై దాడి

౧౮౯౪-వ సంవత్సరములో టాగూరు 'సాధన' యను తన పూర్వసాహిత్యపత్రికకు పీఠిక్కలునిందు చేసి 'భారతి' అను మరియొక రాజకీయపత్రికకు స్వాగతగీతములు పాడినాడు. భ్రమరకీటన్యాయమో యన్నట్లు కవి క్రమక్రమముగా వ్యవహర్తయై వెలసినాడు. కవితాకన్యను తన హృదయసౌధమునుండి పారద్రోలి రాజకీయకిరాతుడు దానిని తనవశము చేసికొనినాడు. లోకవ్యవహారము లాతనికి పెండిపంటలయ్యెను. కాని తన సహజకవితాప్రభావాతిశయముచే నాకాలమునందు సహితము (౧౮౯౬-౧౯౦౦) అతఁడు 'కల్పన', 'కథ', 'కాహిని', 'క్షణిక' యను కొన్ని గద్యకావ్యరత్నములచే తన సాహిత్యసౌందర్యలహరి నలంకరింపకపోలేదు. ఇందు కుదిపాత్తము వంగపండితుల శైలిపై తుపాకిగుండు. ఇక వేరుగ చెప్పనేల? యుద్ధము పరస్పరమయ్యెను. పండితప్రకాండులు దబ్బతిన్న తేనెటీగలవలె నాతనిని చెరపట్టిరి. వారాతని గ్రంథాన్వేషణ మొనర్చి రంధ్రాన్వేషణమునకు నడుముకట్టిరి. టాగూరురచనలు సంప్రదాయవిరుద్ధములని ఖండించిరి. లక్షణవిరుద్ధములని తమ వాపకంటకముల నాతనిపై గ్రుమ్మరించిరి. తన దరణ్యరోదన మని తెలిసికొని టాగూరు కుమ్మవాదములనుండి విరమించి విద్యావిషయములపై నంపుజూపెను. ఆధునికవిద్యావిధాన మాసనయుక కంటకయు కృత్రిమముగ గన్పట్టెను. వెంటనే బోల్పూరుకు రెండుమైళ్లదూరమున శాంతినికేతనమువద్ది 'విశ్వభారతి' యను ముద్దుపేరుతో నొక విద్యాలయమును స్థాపించెను. అతఁడు దానిని జాతీయాశయానుగుణముగాను, ప్రకృతికి సన్నిహిత సంబంధముతోను నడుప నుద్దేశించెను. అయ్యది దిన దినాభివృద్ధినొంది నేడు ప్రాచీప్రతీచీవిజ్ఞానసమ్మేళన కేంద్రమై ఖండఖండాంతరముల ఖ్యాతిగాంచి విరాజిల్లుచున్నది. అచ్చట నున్నపుడే యాతఁడు 'గోర' యను మక్కువపుస్తకంగవరల నొకదానిని దేశమాతపాదకమలములయందు పూజాకుసుమముగ నర్పించెను.

రాష్ట్రాభిమానము

౧౯౦౫-వ సంవత్సర మొక విషాదసమయము. వంగరాష్ట్రవిభజనను ప్రభుత్వమువారు బలవంతముగ నమలుజరుపుటచే ప్రజలయం దాందోళనానలము మింటికెగయజొచ్చెను. రవీంద్రుడుమాత్ర మెట్టులా విభజనను ప్రతిఘటింపకుండును? అతని యప్పటి రాజకీయరచనాధోరణి చదివి తెలియవలెనే కాని చెప్పిన బోధపడునది కాదు. విద్యార్థిజనో త్తేజకములగు గీతా

జ్యోతుల నెన్నిటినో అతడు దేశమున విరియజిమ్మెను. ఇక తానో? స్వయము వంగదేశమంతయు సంచార మొనర్చి ప్రబోధ మొనర్చుటయే కాక జాతీయసంఘములను, పాఠశాలలను రాష్ట్రమంతటను స్థాపించి స్వరాష్ట్రాభిమానమును వెల్లడిపరచెను.

కాని యేమిమాయ జరిగెనో! రవీంద్రుడు డాకస్మికముగ రాజకీయములకు స్వస్తిజెప్పి మరల తన పూర్వాదర్శముల నారాధింప దొడగెను! ఈ కాలమున తన యాశ్రమమం దుండియే 'ఆటమ్ పండుగ', 'చీకటి గది రాజు' (The King of the dark chamber), 'పోస్టాఫీసు' మున్నగు సద్గ్రంథ సంఘము లలముకొనెను. రవీంద్రునకు కీర్తికాంతతోపాటు నోబెల్ బహూకృతి కామినినిగూడ నొనగూర్చిన యభిసారిక 'గీతాంజలి' యను కావ్యకన్యకామణియు నిక్కాలమున వెలువడినదే. ౧౯౧౦ లో నాతడాది బ్రహ్మసమాజమును పునరుద్ధరింపదలచెను. కాని పాపము పర్యవసానము "అన్యథా చింతితం కార్యం దైవమన్యత్ర చింతయేత్" అను సామెతగా పరిణమించి ప్రయత్నములు ఫలించినవి కావు! మితవాదు లాతని పాల శనిగ్రహము లైరి. దానంజేసి యాతడది మాని శాంతినికేతన కార్యక్రమమునే మరల పూనెను. ఆహో, మహాశయులకు సహితమెన్ని ప్రతిబంధకములు! ఎన్ని యాశాభంగములు! అయినను ప్రతిబంధకము లెక్కుడుగా మహాశయులకే కలుగునుగాని లాతివారి కట్లు కలుగగలవు? అట్టివాని నోర్పుమెయి లంఘించు వారలే మహనీయు లగుదురుగదా!

సంసార విషయములు

మన మింతవరకును కవీంద్రుని లోకవ్యవహారములనే స్మరించుచు నాతని సంసార ప్రస్తావనయే చేయ మరచితిమి. కావున నొకక్షణ మీగోష్ఠిని వీడి యాతని యింటికి త్వరత్వరగా బోయివత్తము. అతడు ౧౮౮౩ లో, అనగా తన యిరువదిరెండవయేట మృణాళినీదేవిని చేపట్టెను. ఆతనికి మువ్వురు కూతులు, నిద్దరు కొమరులు గలిగిరి. కాని కాచిన కాయ లన్నియు పండలేదు. ద్వితీయపుత్రుడు పిందెగానే రాలిపోయెను. ౧౯౦౨ లో పాపము తన జీవితేశ్వరియే

రవీంద్ర కవీంద్రుని జీవితములోని కొన్ని ముఖ్య ఘట్టములు

జననము — 1861, మే, 7
ప్రథమ కవితాప్రకటన — 1875, ఫిబ్రవరి, 25
ప్రథమ గ్రంథప్రకటన — 1881, మే
వివాహము — 1883
పత్నీ వియోగము — 1902
నోబెల్ పారితోషికప్రాప్తి — 1913, నవంబరు, 13
సర్ బిరుదప్రాప్తి — 1915, జూన్, 3
సర్ బిరుదత్యాగము — 1919, మే, 30
విశ్వభారతి స్థాపన — 1921, డిసెంబరు, 22
నిధనము — 1941, ఆగష్టు, 7

పతి నెడబాసి పరలోకమున కేగెను. ఆతని కది గొప్ప గొడ్డలిపెట్టయ్యెను. తదుపరి ఇద్దరు కొమార్తెలును కనుమూసిరి. చివర కొక కొమరుడుమాత్రము దక్కెను. ఆతని పేరు రథీంద్రనాథుడు. అతడిప్పటికిని బ్రతికియున్న యేకైక తనయుడు. మిగిలిన యొక్క కొమరిత పేరు మీరా. తన భార్య మరణానంతర మాతడు పునర్వివాహ మొనర్చుకొనలేదు. అప్పటినుండియు నతని బాహ్యవ్యవహారములు మరింత ప్రభావంతములై విలసిల్లినవి.

నోబెల్ బహుమతి ప్రాప్తి

కష్టములుమాత్ర మిల్లుకట్టుకొని కలకాలము కాపురము సేయునా? కొన్నిదినములు చీకటి, కొన్ని దినములు వెన్నెల! ఒకప్పుడు విలాసము, మరొకప్పుడు విలాపము! ఇయ్యదియే జీవితపు పరీక్షయు, ప్రపంచ రహస్యము, సృష్టియందలి మూలసూత్రము! కారుమబ్బులు క్రమముగ సడలసాగినవి. మంచిదినములు మరల తలచూప జొచ్చినవి. రవీంద్రుడు మరల ఇంగ్లాండుప్రయాణమునకు సన్నద్ధుడయ్యెను. పూర్వ

నైపుణ్యమును మరచి కలకత్తాపౌరు లతనికి అఖండ సన్మాన మొనర్చిరి! ఆత డింగ్లాండు జేరెను. అచ్చట తన 'గీతాంజలి' యాంగ్లానువాదమును మిత్రుడగు 'రోతెన్ స్టైయిన్' న కొసగెను. అది యపరిమితా నంద భరితాంతఃకరణు డయ్యెను. వెంటనే దానిని విమర్శకాగ్రేసరుల కంపెను. వారు దానిని తలనైని డుకొనిరి. ఆంగ్లపత్రికల ప్రశంసావాక్యములు దేశ మెల్లెడల మారుమ్రోగినవి. ఆహా! రవీంద్రుని నోము లిప్పటికిగదా ఫలించినవి!

తరువాత యమెరికాఖండమును దర్శించి ౧౯౧౩ లో నాతడు పురిటిగడ్డకు క్రమ్మరి వచ్చెను. ఇక నిప్పుడు మన దేశీయు లాతని కవితావైదుష్యము నామో దించిరి!! కలకత్తా విశ్వవిద్యాలయమును జోహారు లొసగసాగెను!! ౧౯౧౩ వ సంవత్సరపు సాహిత్య శాఖ నోబెల్ బహుమాకృతి రవీంద్రుని పాలైనది! "ఇంతింతై వటు డింతయై మరియు దా నింతై" యనిన ట్లాతని కీర్తి దిగంత విశ్రాంతమయ్యెను. "తన వెంటన్ సిరి, లచ్చివెంట నవరోధవ్రాతమున్, దానివెంటను పక్షీంద్రుడు" అన్నరీతి పూర్వశత్రువు లందరును మిత్రులు కాజొచ్చిరి. కలకత్తావిశ్వవిద్యాలయ మొక డాక్టరేట్ డిగ్రీని నమస్కారపూర్వకముగ నాతనికి సమర్పించు కొనెను. బ్రిటిషుప్రభుత్వమువా రాతనికి 'నైట్‌హుడ్' టైటిలు నంటగట్టిరి. లోకములో నతివృష్టిపై నతివృష్టి, యనావృష్టిపై ననావృష్టి యన్నట్టిదేకదా! ౧౯౧౩-వ సంవత్సరము రవీంద్రునికి ఉత్తమోత్తమకాలమైనది! దానితోనే యతని దశ మారినది.

పండితుల విద్వేషము

విశ్వవిఖ్యాతి పెరుగసాగినకొలది రవీంద్రుని విశ్రాంతి తరుగసాగెను. కవితాధోరణికి వలయు ప్రశాంతత యాతని కంబరపుష్పమయ్యెను. చూడవచ్చిన యభిమానులకు సహితము విశ్రాంతిలేమి దర్శన మిచ్చెడి వాడు కాడు. పండితులు మరల ముట్టడి ప్రారంభించిరి. అగ్నికి గాలి తోడైనట్లు వీరికి సనాతనులు చేయికలిపిరి. ఆతని సపఖ్యాతిపాల్సేయజూచిరి. రవీంద్రుడు చలింపలేదు. అప్పుడు (అనగా ౧౯౧౪ నందు) వెలువడినవే 'అడవికొంగలవిహారము', 'ఫాల్గుణి' యను పద్యకావ్యద్వంద్వమును, 'ఇల్లు, లోకము' అను గద్యకావ్యమును.

౧౯౧౬ లో నాతడు జపాను చూడనేగెను. అచ్చట 'జాతీయత'నుగూర్చి గంభీరోపన్యాసము లొసగెను. తరువాత యమెరికాలో 'జాతీయత-మానవత్వ ము'నుగూర్చి యుపన్యసించెను. పిదప మాతృదేశో న్ముఖు డయ్యెను. అప్పటి రైయిరోపాసంగ్రామ మాతని మృదుహృదయమును కలచివైచుచుండెను. అతడు హింసాపూర్వకముగ రుధిరపాతమును ప్రతికాముఖముగ నిరసించుచుండెడివాడు.

సర్ బిరుద పరిత్యాగము

౧౯౧౯ లో జలియన్‌వాలాబాగ్ ఉదంతమును సహింపజాలక రవీంద్రుడు బ్రిటిషుప్రభుత్వదత్తమగు 'నైట్‌హుడ్' బిరుదును పరిత్యజించెను. కాని యేలనో తరువాతియెత్తిన సహాయనిరాకరణోద్యమమున కాయన సహాయనిరాకరణ మొనర్చెను! ౧౯౧౯ లో నే యాతడు చెన్నరాష్ట్రమున పర్యటన మొనర్చెను.

౧౯౨౦ లో మరల కవీంద్రుడు బ్రిటను, ఫ్రాన్సు, జర్మనీ, అమెరికాలకు విజయముచేసెను. దానితో నాతని యంతర్జాతీయదృక్పథము విస్త రించినది. పిదప రవీంద్రుడు 'శిశుభోలానాథ్' అను బాలహృదయదర్పణములగు గీతముల వ్రాసెను. ౧౯౨౪ లో మరల నాతడు మలయా, చైనా, జపానుల కేగి వారితో విజ్ఞానసంబంధమును కలుగజేసెను. ఇట లీలో నాతడు ముసోలీనీని కలసుకొనెను. మరియొక తూరి ఆతడు మలయా, జావా, బాలి, సయాము దేశముల కేగెను. అప్పుడు రచింపబడినవే 'జగజ్జోతి', 'క్రాస్ కరెంట్సు' (Cross-currents) అను సద్గ్రంథములు. ౧౯౩౦ లో నాతడు ఆక్సుఫర్డులో హిబ్బర్టు ఉపన్యా సముల పేర విజ్ఞానమాణిక్యములను వెదజల్లెను. అటనుండి యాతడు జర్మనీ, రష్యా, అమెరికా సంయుక్తరాష్ట్ర ములకు పోయెను. రష్యాలో నాతడు 'రెయిజల్ చిట్టి' యను నొక విప్లవనిరసనగ్రంథరాజమును వెలువరించెను.

చిత్రకళా వ్యాసంగము

వార్ధక్యమున టాగూరు చిత్రలేఖనాభ్యాసము నకు గడంగెను! కవిత్వమునకు మంగళము పాడినాడా?

లేదు, లేదు. ముసలికవిత్వము మూర్ధలొలికినది. కవీంద్రుని కలము కరుణరసములతో పలికినది. ఆతని రచనల యందు రసము తనివిదీర తొలికినది. రసికలోకము జోహారు పలికినది. ఇంక వారికి కేమికావలెను? ౧౯౩౮ లో 'వనవాజనుల జీవగాథలు' సంచిత పామర జనరంజకముగ నాట్యమాడినవి.

తుదిదినములు

తలచుకొన్న కోర్కెలు ఫలించుచున్నవి. ౧౯౪౦లో ఆక్స్‌ఫర్డువిశ్వకళాపరిషత్తువారు 'Doctor of Letters' డిగ్రీ వారికొసగి గౌరవించిరి. ఆనా రోగస్థితియందుసహితము చెన్న సన్న దనుక ఆయన గ్రంథములు వ్రాయుచునే యుండెనట! చిన్నక్కయు చరిత్రమునుకూడ వ్రాసెనట! కాని ఆతడు తన విశ్వభారతి కెన్నడును మరచినవాడు కాడు. అదియే రవి జీవితఫలము, నోములపంట, స్వప్నకాంతి. నిజముగ విశ్వభారతి విశ్వభారతియే యయ్యెను. ఏదీ యీనా డావిశ్వభారతీనేత! ఆ విశ్వమానవకల్యాణ ప్రదాత! ఆ యున్నతాశయముల నేత! ఆ నవీన సంప్రదాయసంధాత!

ఇక నిట్టి గాయకగ్రామణి, ఇట్టి రాజకీయ నేత, ఇట్టి కవిశిఖామణి, ఇట్టి దేశసేవాధురంధరుడు, ఇట్టి కరుణార్ద్రహృదయుడు, ఇట్టి చిత్రకళాభిలాషి, ఇట్టి యంతర్జాతీయ విఖ్యాతపురుషుడు, ఇట్టి విశ్వశాంతిసౌభాగ్యాభిలాషి, ఇట్టి సుగుణరాశి, ఇట్టి వేదాంతి దీపకరల మన భారతదేశమున కెన్నడు దయించునో కదా!

[చిట్టా రామకృష్ణరావు]

రవీంద్రుని తుదిగీతము

[రవీంద్రనాథటాగూరుగారు తమ అంతిమదినములలో రోగశయ్యయం దుండియే, తమ అసర్గళమైన కవితాధోరణి వెల్లివిరియ 'మృత్యువు'ను గురించి యీ క్రిందిగీతమును రచించిరి. ఇదియే వారి తుదిగీతమైనది]

[బెంగాలీ మూలము]

ृत्यु.

दुःखेर आँधार रात्रि बारे बारे
एसेछे आमार द्वारे ।
एकमात्र अस्त्र तार देखेछिनु
कष्टेर विकृतभाल त्रासेर विकटभंगी यत,
अन्धकारे छलनार भूमिका ताहार ।
यत बार भयेर मुखोस तार करेछि विश्वास,
तत बार हयेछे अनर्थ पराजय ।
एइ हा'र-जित खेला, जीवनेर मिथ्या ए कुहक,
शिशुकाल ह'ते विजड़ित पदेपदे एइ विभीषिका,
दुःखेर परिहासे भरा ।
भयेर विचित्र चलच्छवि—
मृत्युर निपुण शिल्प विकीर्ण आँधारे.



విశ్వకవి కీ. శే. డా. శ్రీ రవీంద్రనాథ టాగూరు

[శ్రీ రేఖామూర్తుల కేశవరావుగారు రచించిన రూపచిత్రము]

ప్రకృతివైచిత్రికి పల్లవులం బాడు రక్తిసంధ్యా నిర్ఝరమునదోఁగి
ధాతుశైలిసెసంగు పూతవాఙ్మయ మహోదయ శిలోచ్చయపాను తటిని బొడమి
ప్రతిభాస్ఫురణ కవిత్వ మరీచిరింఛోలి వెలఁగించి నిర్దుర మేలుకొల్పి
ప్రాచ్యపాశ్చాత్య విద్వన్మణి సంస్తుతి 'గీతాంజలి'ని మహోద్యోత మెవసి
జనహృదంభోజరంజనచణత నొగడి-భువిని వెలయించి రహిఁ గళాపూర్ణులలర
విజయశుభ్రప్పసురభులు నిండఁగ జల-కవిరవీంద్రుండు సురలకై దివికిఁజేరె. [శతావధాని చెల్లా పిచ్చయ్యశాస్త్రి.]



రవికవి

= శ్రీ బొడ్డు బాపిరాజు =

అనవధికమ్ము భారతవియత్తల మెల్ల నతిక్రమించి వె
ల్గిన యొక దివ్యతార మలిగెన్. తపనీయ తదీయకాంతి వా
హినులు దిశాంచల మ్మధిగమించుచు పూచిన పూల తీర్చి ది
ద్దినవటె క్రొత్తయందములు దిక్పతిరత్నకిరీటకోటికిన్.

నిన్ను రసస్వరూపరమణీయునిగా మధుకావ్యవీథులన్,
నిన్ను పురాఋషిప్రతిభనిల్చిన జ్యోతిగ భావసీమలం
దెన్నడొ పోల్చుకొంటి, మటులే కనుపించెద విప్పు డింక లే
వన్నది నీవు కా; వొక జరామయ మస్థికులాయ మో కవీ!

శ్రమపడి వచ్చివచ్చి యొక చల్లని నీడల వ్రాలి తృప్తిగా
నమృతము గ్రోలుచున్నయటులై యెటు నూహల కందరాని సౌ
ఖ్యము కలిగించు నీ కృతు లఖండరసోజ్వల మంత్రవేణు రా
వములు సమస్తదేశముల ప్రాణముకన్నను ప్రాణముల్ గదే!

కేవల భౌతికార్థ పరిఖిన్నులు శాంతివిపన్ను లంధ దు
ర్జీవను లైన నిత్యమృతు లెందరు లేరు? యుగప్రవర్తకున్
నీవలె సత్కళాశిఖరినిన్ మృతజీవిని కన్నకీర్తి యే
పూవుల పూజనే భరతభూమికి దక్కెనదో కవీ! రవీ! [వనేశ్వ

ఈ ప్రపంచ జీవన శూన్య హేమపాత్ర-నింపితివి కావ్యమధువునన్ త్రిభు
రీగళాలంబి వైజయంతీ గళత్ప-రిమళ పారిజాత ప్రసూనమవు నీవు.

ఆయుర్వేదము : జ్యౌతిషము

ఆయుర్వేద
తత్త్వవివేకము : ౧

= శ్రీ రాణీ వెంకటాచల ప్రసాదశాస్త్రి =

"కుశలాన్న ప్రమదితవ్యమ్" అని శ్రుతి తెలుపుచున్నది. కావున మానవుడు కుశలముం గోరి, ఆరోగ్యమును గాపాడుకొనుట యావశ్యకమై యున్నది. అందులకు "ఆయుఃకామయమానేన ధర్మార్థసుఖసాధనమ్" ఇత్యాదివచనములచే, ఆయుర్వేదమునకు తప్ప వేరు సాధనము కానరాదు. ఆయుర్వేదమునకు మూలగ్రంథములుగా చరక, సుశ్రుత, వాగ్భటములు నేడు గానంబడుచున్నవి. వానిలో కొన్ని విషయములు విరోధాభాసములుగా నుండుటచే, నిశ్చయజ్ఞానప్రతిబంధకములై, యపార్థముల కవకాశమిచ్చుచున్నవి. ఈ సంశయార్థముల వారించుటకు, కేవలాయుర్వేదమే కాక తర్క, జ్యౌతిష, రసాయన, సాంఖ్య, పదార్థవిజ్ఞాన శాస్త్రముల సహాయముగూడ కావలసి యున్నది. సుశ్రుతుడుగూడ

"ఏకం శాస్త్ర మధీయానో న విద్యాచ్ఛాస్త్రనిశ్చయమ్,
తస్మా ద్బహుశ్రుత శ్శాస్త్రం విజానీయా చ్చికిత్సకః"
(సు. సూ. ౪–౭)

అని తెలిపినాడు. "సర్వేషాం శాస్త్రాణాం పరబ్రహ్మణి తాత్పర్యాత్" అను నభియుక్తవచనముకూడ, సర్వశాస్త్రములును, స్వరూపాదులలో పూర్ణభేదము గలవైనను ఫలమునందు భేదములేక యొకే తత్త్వమును దెలుపుచున్నవని తెలుపుచున్నది.

చరకుడు తాను చెప్పబోవు వైద్యశాస్త్రమునకు కణాదఋషిప్రోక్తములగు ద్రవ్య, గుణ, కర్మ, సామాన్య, విశేష, సమవాయము లనెడి షట్పదార్థములను బునాదివేసినాడు. సుశ్రుతుని శారీరమునకు కపిలసాంఖ్యము చేయూత నిచ్చినది. రసవీర్యవిపాకాదులంగూర్చిన వైద్యశాస్త్రమునకు ఋతువిభాగాది విమర్శనముకల జ్యోతిశ్శాస్త్ర మాధారమైనది. ఇట్లే జ్యోతిశ్శాస్త్రపరివర్తనమే వైద్యశాస్త్రమని పాడ చూపకమానను. ద్రవ్యముల కార్యక్రమముం దిలకించినచో, రసాయన వైద్యశాస్త్రముల కభేదము వాటిల్లకమానదు. పదార్థవిజ్ఞానశాస్త్రము, నిఘంటువులు మొదలగువాని వర్ణనములు వైద్యశాస్త్రైకదేశములేయని తెల్లమగుచున్నది. అథర్వణవేదము మూలమై, ఈ శాస్త్రములన్నియు శాఖారూపములై లోకకల్యాణరూపమైన ఫలమును బ్రసాదించుచున్నవని చెప్పకతప్పదు. ఇట్లీ శాస్త్రములన్నియు నాయుర్వేదమునకు సహకారులేయగుచున్నవని సిద్ధాంతము.

ఆయుర్వేదతత్త్వము లన నేమి?

"భూతేభ్యోహి పరం యస్మాన్నాస్తి చింతా చికిత్సితే" (సు. శా. ౧. అ.) ఇత్యాదివచనములచే మహాభూతములకు మీదనున్న మూలప్రకృతి మొదలగు తత్త్వముల మాట యటుంచి, భూతములకు లోబడియున్న వాతాదిగుణములను చికిత్సలో గ్రహించినందున "కల్పాంతస్థాయిత్వం తత్త్వస్య లక్షణమ్" అనెడు లక్షణవచనమును బట్టి, సృష్టిమొదలు ప్రళయముదాక నిలిచియుండు ద్రవ్యము తత్త్వమని చెప్పబడుచున్నది. కావున వాతాది మహాభూతకార్యములగు వాతపిత్తశ్లేష్మములును, వానికార్యములగు రసాసృగాదులగు (రసము, రక్తము, మాంసము మొదలైనవి) మలములును తత్త్వపదవాచ్యము లగుచున్నవి. "దోషధాతుమలా మూలం సదా దేహస్య" (వా. సూ. ౧౧ అ.) అని యిట్లే శరీరమూలములుగా చేర్కొనబడియున్నవి. అందుచే, అవగా నట్టి తత్త్వములనుబట్టియే చికిత్స పుట్టుటచే, పురాతనకాలమున చెప్పబడిన చికిత్సావిధానమే నేటికిని, నేటి కన నేల—

మానవశరీర మున్నంతవరకు మార్పునొందక యొకేతీరున దేదీప్యమానమై, ఫలవంత మగుచు నేయుండు ననుట సయుక్తికముగా నున్నది. దానంజేసి పురాతనకాలపు ఆయుర్వేద మిప్పటి కాలమున ఫలవంతము కాదని నవీనులు చేయు నాక్షేపము నిరాధార మనియు తేలుచున్నది. ఇట్లు శాశ్వతఫలదానచణంబులగు తత్త్వములనుగూర్చి వినుర్శన మిందుగలదు. కావున నియ్యది 'ఆయుర్వేదతత్వవివేకము' అను సార్థకనామము గల దయ్యెను. ఇందు నొలత జ్యోతిశ్శాస్త్రమునకును ఆయుర్వేదమునకును గల సంబంధ మీవ్యాసమున వివరింతును.

కాలము ద్రవ్యము. చికిత్సయం దది మిక్కిలి అవసరమైనది. కాలము ఋతురూపము. కావున ఋతు వినుర్శనము ప్రకృతాంశమై యున్నది. దానివలన ఆయుర్వేదజ్యోతిశ్శాస్త్రముల బాంధవ్యము తేట పడును. కావున మున్ముం దది వివరింప బూనితిని.

"అగ్నిర్జ్యోతి ర్జ్యోతిరగ్ని స్సూర్యోజ్యోతి ర్జ్యోతిస్సూర్యః" ఇత్యాది వేదవచనములచే అగ్ని, సూర్యుడు మొదలగు తేజఃపదార్థములు జ్యోతిస్సు లనబడుచున్నవి. వానింగూర్చి తెలుపునది జ్యోతిశ్శాస్త్రము. "శాస్త్రాద్యస్మా త్కాలబోధో యత స్స్యాత్" అనుటచే జ్యోతిశ్శాస్త్రము కాలమును బోధించు ననుమాట విశదమే. ఆకాలము —

"లోకానా మంతకృత్కాలః
కాలోఽన్యః కలనాత్మకః,
స ద్విధా స్థూలసూక్ష్మత్వా
న్మూర్త శ్చామూర్త ఉచ్యతే.
ప్రాణాదిః కథితో మూర్తః
త్రుట్యాద్యోఽమూర్తసంజ్ఞకః"

(సూ. సి. ౧-౧౦)

అని ప్రాణాదిపరిమేయమైనది (లెక్కకు వీలైనది) మూర్తమని, తద్భిన్నమగు అపరిమేయకాలము (లెక్కకందనిది) అమూర్తమని తెలియుచున్నది. అట్టి మూర్తకాలములో నొకసంవత్సరము 'ప్రజాపతి' యనిరి. కావున నిది ముఖ్యకాలభాగ మగుచున్నది. "సంవత్సరో వై ప్రజాపతిః" అని శ్రుతి. సంవత్సర మన నెంత? సూర్యునియొక్క భగణకాలము. అనగా సూర్యుడు అశ్వినీనక్షత్ర ప్రథమకలయందు ప్రవేశించినది మొదలు తిరిగి యచటకు జేరినట్లు ఆపాతదృష్టికి గానవచ్చెడి కాలము. దీనినే "సౌరాంతే భగణః స్మృతః" (సూ. సి. ౧-౨౮) అని సూర్యసిద్ధాంతము తెలుపుచున్నది. ఇయ్యది ప్రకృతపాశ్చాత్యసమ్మతమైన సూక్ష్మవేధ సిద్ధభగణకాలముకంటె భిన్నమైనది. సూర్యుడు తిరిగెడి యామార్గమునకు క్రాంతివృత్తము (Ecliptic) అని పేరు. మనము నివసించు భూమియొక్క దక్షిణోత్తర ధ్రువముల మధ్యభాగమగు నిరక్షదేశమునకు అభిముఖముగా నాకాశములో ప్రాక్పశ్చిమములకు వ్యాపించిన వృత్తమునకు విషువవృత్తము (Equater) అని పేరు. ఈవృత్తమునకు పైన జెప్పిన క్రాంతివృత్తము సుమారు ౨౩ అంశలు తిర్యక్త్వము (Decline) కలుగునట్లు రెండు సమభాగములుగా ఛేదించుచున్నది. ఈ ఛేదించుటలో విషువవృత్తమున రెండుచోట్ల కోతలు పడును. ఈకోతలే సంపాతములు (Equinoxes) అందురు. అందులో నొక సంపాతము అశ్వినీ నక్షత్ర ప్రథమకలయందు స్థిరముగా నున్నదను కొనెదరు. అప్పుడు దీనిని స్థిర మేషసంపాత మందురు. దానికి ౧౮౦ అంశలపై రెండవదగు తులాసంపాతము గలుగును. ఈరెండు సంపాతములకు మధ్య, అనగా మేషరాశినుండి తులవరకు నుండెడి క్రాంతివృత్తము భాగమునకు ఉత్తరగోళ మనియు, కర్కవృత్త మనియు పేరిడిరి. దీనినే ఆంగ్లమున Tropic of cancer అని యందురు. ఇయ్యది భూమియొక్క నిరక్షదేశమున కుత్తరముగా ౨౩ అంశలవరకు వ్యాపించియుండును. తులనుండి మేషమువరకు నుండెడి క్రాంతివృత్తి భాగమునకు దక్షిణగోళ మనియు, మకరవృత్తమనియు, ఆంగ్లమున Tropic of Capricorn అనియు పేరిడిరి. ఇయ్యది నిరక్షదేశమునకు దక్షిణముగా ౨౩ అంశలవరకు వ్యాపించియుండును. ఈ సంపాతములలో సూర్యుడు గతివశముచే వచ్చి యొక్కరో జుండును. ఆ రెండురోజులను 'విషువద్దివసము' లందురు. అపుడు దినరాత్రుల ప్రమాణము సమముగా నుండును. ఇక సూర్యు డుత్తరగోళమందలి కర్కటకప్రథమకలలో ప్రవేశింపగానే దక్షిణమునకు అభిముఖు డగును. అది మొదలు తులలో ప్రవేశించుటకు వత్సరచతుర్థాంశ

కాలము పట్టును. అది సుమారు మూడుమాసములుండును. అంతవరకు విషువవృత్తమునకుత్తరదిశయందుండునుగాని యతడు దినదినము దక్షిణముగా బోవుచుండునుగాన ఈ మూడు మాసములకాలమును దక్షిణాయన ప్రథమ ఖండముగా గ్రహించిరి. ఈ ఖండమునందు సూర్యుడు దక్షిణాయనగతుడైనంతమాత్రమున బలహీనుడుగాక తులావిషువత్తువరకు వచ్చుసరికి క్రమముగా చంద్రకళా న్యాయముగా క్షీణించుచున్న బలము గలిగియే యుండును.

ఈ రహస్యమును గమనించియే ఆయుర్వేదమున రసోత్పత్తి యిట్లు పేర్కొనబడెను:

"సూర్యుడు దక్షిణాయనగతుడైన పైన వివరించిన కాలములో, ప్రథమమున ఆమ్లరసము, పిదప లవణ రసము పుట్టుచున్నవి. ఇవి ఆగ్నేయరసములు."

"సౌమ్యే విసర్గే తయో స్త్వాగ్నేయయోః అమ్లలవణయోః ఉత్పాదకః కథమితి నవాచ్యం యతః బలప్రకర్షవతో ఽర్కస్య క్షీయమాణబలస్యాపి విషువత్ప్రత్యాసత్తం బలస త్త్వ మ స్త్యేవేతి వృత్పాదిత మేవ"

(చ. సూ. ౬అ. ౭సూ. వ్యా.)

అని చక్రపాణి వచించెను పిదప తులమొదలు మకరము ప్రవేశించువరకు సుమారు మూడు మాసములు పట్టును. ఈకాలములో సూర్యుడు విషువవృత్తమునకు దక్షిణదిశయందుండి గమనములోగూడ దినదినము దక్షిణముగనే పోవుచుండును. ఈ మూడుమాసములలో సూర్యుడు బలహీనుడుగా నుండును. మొత్తమీ యారుమాసములకు దక్షిణాయన మని పేరు. దీనినే విసర్గకాలమని వైద్యులనుచున్నారు. దీనిని రెండేసిమాసముల కొక ఋతువుగా వర్ష శరత్ హేమంతము లని మూడింటిగా విభజించి వీనిలో క్రమముగా ఆమ్ల, లవణ, మధురరసములు పుట్టునని తెల్పిరి.

"వర్షాశరద్ధేమంతే ష్వృతుషు...అమ్ల లవణ మధురా యథాక్రమమితి" (చ. సూ. ౬—౮)

ఈ విసర్గకాలమున సూర్యునకు బలము తగ్గ ననియు,అందుచే చంద్రునకు బలము హెచ్చునుగాన ఈ కాలము సౌమ్యకాల మనియు,ఇందు చంద్రుడు ప్రాణులకు బలమునిచ్చునుగాన విసర్గకాల మనియు చెప్పిరి. ఇది సౌమ్యకాలముకాన, ఇందు బుట్టిన రసములన్నియు శీతవీర్యముకలవిగా నుండవలయునుగదా ? అట్లుగాక రెండురసములు ఆగ్నేయము లగుటకు కారణ మేమి ? అన్నచో, సూర్యునకు బల మొకేసారి తగ్గక, పైన చెల్పినరీతిని క్రమక్రమముగా తగ్గునుగాన ఈదక్షిణాయనమున మొదటిదగు వర్షర్తువునందు బుట్టెడి ఆమ్లరసములో ఆగ్నేయాంశ మధికముగా నుండును. దాని పిమ్మట శరదృతువున బుట్టిన లవణరసములో ఆగ్నేయాంశము స్వల్పముగ నుండును. దానివెనుక వచ్చు హేమంతమున బుట్టిన మధురరసములో ఆగ్నేయాంశము బొత్తుగా తగ్గునుగాన లేదనియే చెప్పుచున్నారు.

ఇట్టే మకరసంక్రాంతిమొదలు మేషమువరకు సూర్యుడు విషువవృత్తమునకు దక్షిణదిక్కులో నుండియే యుత్తరాభిముఖుడై నడచును. ఇట్లు నడచుకాలము సుమారు మూడు మాసము లుండును. ఈ కాలములో రవికి బలము క్రమముగా పెరుగును. కాని ఒకేసారి పెరుగదు. కావున ఈకాల మాగ్నేయమైనను, సౌమ్యగుణము గలదిగానే ఉండును. పిమ్మట మేషమునుండి కర్కటమువరకు రవి విషువవృత్తమున కుత్తరదిశలో ఉత్తరాభిముఖుడై నడచును. ఇందులకు మూడుమాసములు పట్టును.ఇం దగ్నిగుణ మధికము. మొత్త మీయారుమాసములు నుత్తరాయణమగును. ఇందు సూర్యుడు ప్రాణుల బలము నాకర్షించునుగాన దీనిని చరకాదులు 'ఆదాన కాలము' అనిరి. దీనిని రెండేసి మాసముల కొకటిగా విభజించి, శిశిరవసంతగ్రీష్మములని పేరిడిరి. ఇందు వరుసగా తిక్త, కషాయ, కటు రసములు పుట్టు ననిరి.

"శిశిరవసంతగ్రీష్మే ష్వృతుషు యథాక్రమం రౌక్ష్య ముత్పాదయంతో రూక్షా రసా స్తిక్త కషాయకటుకాం శ్చాభివర్ధయంతో నృణాం దౌర్బల్య మావహంతి" (చ. సూ. ౬-౬)

రసనిష్పత్తివిచారణలో పెక్కుమంది పెక్కు విధముల చెప్పినను, సంవత్సరమున కాలఋతువులు గాన వానిలో పుట్టెడి రసము లారే యని తుదకు సిద్ధాంతీకరించిరి.

"షడృతుకత్వాచ్చ కాలస్య, ఉపపన్నో మహాభూతానా మూనాతిరేకవిశేషః"

(చ. సూ. ౨౬ - ౩౯)

ఆమ్లరసములు మహాభూతముల న్యూనాధిక భావమును బట్టి పుట్టుచున్నవని యీ సూత్రములోనే "ఏవ మేషాం షణ్ణాం రసానాం షట్త్వ ముపపన్న మూనాతిరేక విశేషా న్మహాభూతానామ్" అని చెప్పి యుండుటచే ఋతువులు రసములకు కారణములు కావని తోచుచున్నది. అందులకు చక్రపాణి "యద్యపి ఋతుభేదేఽపి భూతోత్కర్ష విశేష ఏవ కారణం. యదుక్తం: తావేతా వర్క వాయూ ఇత్యాది. తథాఽపి, బీజాంకుర కార్యకారణ భావవత్ సంసారానాదిత్వాదైవ భూతవిశేష ఋతోర్వా కార్యకారణ భావో వాచ్యః. హేమంతకాలే సోమగుణాతిరేకో భవతి. శిశిరే వాయ్వాకాశాతిరేకః. ఏవం తస్యాశితయోత్తరసోత్పాదక్రమేణ వసంతాదావపి భూతోత్కర్షో జ్ఞేయః" అని సమాధాన మిచ్చినాడు. అనగా రసోత్పత్తికి భూతములే కారణ మని చెప్పిరి. సంసార మనాదియగుటచే చెట్టు ముందా, విత్తు ముందా అన్నట్లే, భూతములకు, ఋతువులకు కార్యకారణభావము, అన్యోన్యాశ్రయ మని చెప్పవలెను. కావున హేమంతమున సోమగుణాతిరేకము, శిశిరమున వాయ్వాకాశాది భూతాతిరేకము, ఇట్లే వసంతాదులలో నాయాభూతము లధికములగుటయు సంభవించుచున్నదని తాత్పర్యము. ఇట్లే రసనిష్పత్తికి, సూర్యునకు కాలమునకు సమవాయి సంబంధము చూపబడినది.

గ్రహములకు వైద్యముతో సంబంధము

సంవత్సరరూపమైన కాలమునందలి దక్షిణోత్తరాయణములకు చంద్రసూర్యులే కారకులయి "యే ద్వే కాలం విభక్తః" యనెడి వచనమునకు లక్ష్యమగుట చేతను, "చంద్రమా మనసో జాతః, చక్షో స్సూర్యో అజాయత" అనియు,

"అథ సృష్ట్యాం మనశ్చక్రే
బ్రహ్మాహంకార మూర్తిభృత్
మనస శ్చంద్రమా జజ్ఞే
సూర్యోఽక్ష్ణ స్తేజసాం నిధిః.

(సూ. సి. ౧౨-౨౨)

అనెడి ప్రమాణము చేతను,

"మనసః ఖం తతో వాయుః
అగ్ని రాపో ధరా క్రమాత్,
గుణైకవృద్ధ్యా పంచైవ
మహాభూతాని జజ్ఞిరే"

(సూ. సి. ౧౨-౨౩)

అనెడి భూతసృష్టికంటె విలక్షణమై, చంద్ర సూర్యులు ప్రథమసృష్టి యగుటచేతను, "అగ్నీషోమా మహాబలౌ" అనుటచే ఉష్ణశీత వీర్యములకు కారకులై బలాఢ్యులగుటచే చంద్రసూర్యులు ప్రధానులగుటయు, వారివలన నేర్పడు ఆరుఋతువులు సంవత్సరాంశములై, అందు బుట్టిన ఆరురసములు గల ద్రవ్యములు సౌమ్యములు, ఆగ్నేయములు అని రెండుగ విభజింపబడుటయు జరిగినది. సౌమ్యమునకు ఆప్యమనియు, చాంద్రమనియు పేరులు గలవు. ఆగ్నేయమునకు సౌర మను పేరు గలదు. రూక్షస్నిగ్ధాది గుణములు గల ద్రవ్యమునకు గుణి యని పేరు. మధురాదిరసములు గుణములు. గుణిగుణములకు సమవాయిసంబంధము కలదు గావున రసములు పుట్టును అని చెప్పినచోట రసములు కల పదార్థములు పుట్టునని యెఱుంగవలయును.

ఈ రసనిష్పత్తిలో ప్రతిరసము పంచభూతాత్మకమే యైనను, వానియందు ప్రత్యేకముగా రెండేసి భూతము లధికముగా నుండును. వాగ్భటు డిట్లనియె:

"క్ష్మాంభోగ్ని క్ష్మాంబు తేజఃఖ
వాయ్వగ్న్యనిల గోనిలైః,
ద్వయోల్బణైః క్రమాద్భూతై
ర్మధురాదిరసోద్భవః"

(వా. సూ. ౧౦-౧)

కావున ద్రవ్యజాతము అగ్నీషోమాత్మకమై మరల పంచభూతాత్మకమగుటచే పార్థివ, ఆప్య, ఆగ్నేయ, వాయవ్య, నాభసములని యైదు భాగము లగుచున్నది. మొత్తము ద్రవ్యము పంచభూతాత్మకమైనను, ఏభూత మధికమైయుండునో దాని కా పేరు గల్పించిరి.

ఈద్రవ్యము పుట్టుటకు—

"సూర్యో మరీచి మాదత్తే సర్వస్మాద్భువనాదపి,
తస్యాః పాకవిశేషేణ స్మృతం కాలవిశేషణమ్"

అను శ్రుతినిబట్టి పాక మావశ్యకము. పాక మనగా విజాతీయమైన తేజస్సుయొక్క సంయోగము.

"పాకో నామ విజాతీయ తేజస్సంయోగః"
(న్యాయబోధిని)

ఆ పాకము సూర్యచంద్రుల శీతోష్ణతలపై నాధారపడియున్నది. కావున వారిరువురు జగద్రచనకు కారకులయిరి. ఆ రచన పలువిధములగుటకు పంచభూతములు కావలసియున్నది. కావున భూగోళమునందున్న భూజలాది పంచభూతములచే "సవితృతం కాలవిశేషణమ్" అనెడి శ్రుతినిబట్టి సూర్యరశ్మివలన కాలము పుట్టినది కాన అట్టి దక్షిణోత్తరాయణరూపకాలమువలన పాకము నొందిన ద్రవ్యములు పెక్కువిధములుగా తయారగుచున్నవి.

"తప్తేన తప్తమయసా ఘటనాయ యోగ్యమ్."— కాలిన యినుము కాలిన యినుముతో కలుపుటకు వీలగును కావున పాకదశ నొందినపుడే భూతము లొకదానితో నొకటి కలియుటకు వీలగుచున్నది. ఉడుకుచున్న పులుసులో నీటితో కలిపిన వరిపిండియే పరిపక్వమైన పాకమునొందును కాని, నీటితో కలుపని పొడిపిండి పాకము నందదు. ఉండలుగూడ కట్టును! అట్లే ప్రాణిరచనకుగూడ చంద్రసూర్యులను పాకము నొందించు సాధనములుగా దయామయుడగు పరమేశ్వరుడు తన మనోనేత్రమున సృజించియే, పిదప పంచభూతములను, వానినుండి కుజాదితారాగ్రహపంచకమును రచించినాడు. అగ్ని, భూమి, ఆకాశ, జల, వాయు అనువానివలన వరుసగా అంగారక, బుధ, బృహస్పతి, శుక్ర, శనులు పుట్టిరి. ఇక సూర్యుని చుట్టును తిరుగుచున్న నెప్ట్యూన్, యురేనస్ మొదలగు నితరగ్రహములు పెక్కులున్నవి. కాని ప్రాణిరచనకు, ముఖ్యముగా పంచభూతములకు పక్వాంశములను ఈయగల్గుటలో కుజాదిపంచకమే చాలునని మనపూర్వులు శాస్త్రమున కుజాదిపంచకమునే స్మరించి, మిగిలినవానిని విడిచిరి. వైద్యులుకూడ పంచవింశతి తత్త్వముల నెఱిగినవారయ్యును, చికిత్సాక్రమమునకు చేతనాధాతువులు గల పంచభూతములనే గ్రహించి, మిగిలినవానిని విడిచిరి. బ్రహ్మ, ప్రాజాపత్య మానములనుగూడ గుర్తింపగలిగినవారికి నెప్ట్యూన్ మొదలగు గ్రహముల స్వరూపస్వభావము లగమ్యము లనుట హాస్యాస్పదము.

కావున తేలిన సారాంశ మేమనగా; కుజాది గ్రహపంచకము పంచమహాభూతములకు పక్వాంశముల నిచ్చుచున్నది. కావున భూగోళమునందలి ప్రాణిరచనకది కారణమైనట్లు స్పష్టమే. కావున జ్యోతిశ్శాస్త్రమునందలి జాతకసంహితాస్కంధములలో శనికుజాది పంచకముయొక్క స్థితిగతులనుబట్టి, అవి భూగోళమునందలి పచ్యమాన భూతపంచకమున కిచ్చుచున్న భూతపంచకాంశముల లెక్కను నిశ్చయించి, దాని యాధారముచే ప్రాణులకు కలుగబోవు సుఖదుఃఖములు నిరూపింపబడుచున్నవి. ఉదాహరణముగా—

వాయు, అగ్ని, జలములనుండి శని, కుజ, శుక్రులు పుట్టిరిగావున వారు క్రమముగా వాత, పిత్త, శ్లేష్మముల కధిపతు లగుచున్నారు. వీరు జాతకమున బలిష్ఠులయి, తనుభావమం దున్నను, ఆ భావమును జూచుచున్నను ఆ జాతకు డాయాప్రకృతులు గలవాడగుచున్నాడు. ఇట్లే జాతకఫలములను సయుక్తికముగా, సోపపత్తికముగా సాధించుట సులభము. కావుననే వైద్యుడు రోగిని చికిత్సింపబోవునపుడు, వాని జాతకమును పై లక్షణములచే జర్చించి, అందువలన రోగస్వరూప స్వభావాదులను, సాధ్యాసాధ్యతలను గ్రహించి చికిత్సింపవలయునని వాగ్భటాదు లుద్ఘోషించుచున్నవి. కుజాదిగ్రహపంచకము తమ కిరణప్రసారము చేతనే భూగత భూతపంచకమునకు తమతమ యంశముల నిచ్చుచు, ద్రవ్యముల కాయాగుణములకు కారణమగుచున్నవి. అందువలన ఓషధులు వృద్ధినొందుచున్నవి. ఓషధులవలన అన్నము, దానివల్ల జంగమప్రాణికోటి గల్గుచున్నవి.

"పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోఽన్నం" (శ్రుతి)

ఇట్లు షడ్రసములు గల వస్తువులు సూర్యాది నవగ్రహములకు అవయవము లగుచున్నవి. "అన్నాత్పురుషః" అను శ్రుతిచే "పంచభూత శరీర సమవాయపురుషః ఇత్యుచ్యతే. తస్మిన్ క్రియా సోఽధిష్ఠానమ్" (సు. సూ.) అనుటంబట్టి ఈ ద్రవ్యజన్యపురుషుడే వైద్యశాస్త్రప్రవృత్తికి కథానాయకుడైనాడు.

దీనినిబట్టి జ్యోతిశ్శాస్త్ర వైద్యశాస్త్రములు మానవునకు, ప్రకారాంతరమున, నొక్కటే ఫలమును బోధించునవిగాని భిన్నశాస్త్రములు కావని సిద్ధమగుచున్నది. కావున జ్యోతిశ్శాస్త్ర జాతకస్కంధము మానవుని భౌతికఫలముల దెలుపుచు సంహితాస్కంధములో ప్రపంచమంతటియొక్క భౌతికఫలములను ఎట్లు దెల్పుచున్నదో అట్లే వైద్యశాస్త్రముకూడ ఒక ప్రాణియొక్క భౌతికధర్మములను దెల్పుచు, చరకమునందలి విమానస్థానము జనపదధ్వంసాది ధర్మములను దెల్పుచు సర్వజగత్తుయొక్క రోగక్షేమమును దెల్పుచున్నది.

కావున జ్యోతిశ్శాస్త్ర, వైద్యముల కేకవాక్యత సంఘటించుకొని ఫలములను సాధించుటకు పూనుకొందురుగాక యని దేశీయులను హెచ్చరించుచున్నాను.

నిరాశ

= శ్రీ బి. వి. శ్రీనివాసాచార్య =

ప్రతిదినమ్ము నిదేతీరు — రాత్రి రాత్రి
మొల్ల వేచి వేచి విసిగి, ఇంక తనదు
నేర్పు లిట సాగనీనని నిశ్చయింతు;
అపుడు వేంచేయు ప్రభువు నిశాంతమునకు.

కొంటె నగవుల ప్రభువు నాకు నెదురైన
ఎంత నిలద్రొక్కుకొనిన చలించు నెడద;
ఈ మదీయ మ్మణు వణువు ఎప్పుడెపుడు
ప్రాలుదు ప్రభునియందని పల్లటిలును,
లాస్యదుదధికై సాగు తరంగిణివలె.

ఏమో — ఎప్పటియట్ల వచ్చు నని ఏదీ! మూడునాళ్లాయెగా
ఆ పూళిం గల నెమ్మిపించియము లాస్య మ్మొందు వర్తిల్లి, ఏ
లీ? మందారమ! విన్నవా యెదవు — శౌరిన్ — నంగనాచుల్ గదే ...
ఏ మందో యిడి వశ్య జేసికొనినా రింకేటి యాత్మేశుడే!

ఒకతె కా దిర్వురును కాదు — సకలు రీ వ్ర
జాంగనలు నాస్వామి అంగన లటు!
ఈ మహాంభోధి నొకలేశ మీ యభాగ్య—
ఈమె జ్ఞాపకమటు స్వామి ప్రేమమునకు.

ఏ యాశా లవ దీపిత
మై యెడద నిలుచునె గాని, ఆ వంశీ శ్రీ
గాయక మూర్తిని బాసి, స
ఖి! యస్తిత్వము గలదటు ఈ రాధికకున్?

ఎన్ని నిశీథినుల్ గడచు నిట్లు శశాంక వికాస మేది? ఈ
క్రొన్నన ఇట్లె వాడుపడి, రూపరి పోవలె — ఈకుటీరమం
దెన్నటికిన్ తమస్వినియె; ఏల మహాకలుషమ్ము లీస్థలుల్
వెన్నుని పాదపంకజ పరీమళ చాలన లానజేసెదున్?

గద్యపద్యములు-వాని విభిన్నత

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు

బ్రహ్మాండమగు సముద్రమువంటి సంస్కృత వాఙ్మయ మున్నది. ఆకాశమువంటి విశాలమగు నాంధ్రసాహిత్య మున్నది. కాని దానియందును, దీనియందును గద్యకావ్యములు లేనే లేవనవంత తక్కువగా నున్నవి. సంస్కృతమున నున్నవి చాలకొద్దియే: హర్షచరితము, కాదంబరి, సుబంధుని వాసవదత్త, దండిదో కాదో నేటికింకను స్థిరపడని దశకుమార చరితము, పంచతంత్రము మొదలగునవి. ప్రాకృతభాషలలో 'బృహత్కథ' యొక్కటే గద్యకావ్యముగా మిగిలినది. పాళీభాషకథ మనకుఁ దెలియదు. జైనబౌద్ధుల వ్యావహారికదృష్టినిఁ జూడఁగా వారేమైనను వచనమును పోషించియుందు రను విశ్వాసము గలుగుచున్నది. కాని మన మాగ్రంథములఁజూచి చదువు భాగ్యమునకు నోఁచుకొనలేదు. సముద్రతరంగములవలె లేచి వచ్చుచున్న వైదికమతముల భీమగర్జనములనుండా మధుర వాఙ్మయము గొఱ్ఱెపిల్లలవలె నంతరించినది. మతోద్రేకము సాహిత్యసౌభాగ్యమును ధ్వంస మొనర్చినది. కాఁగా సంస్కృతవాఙ్మయమున గద్యకవితకు ప్రాధాన్యములేదు. ఇఁక తెనుఁగందమా! దానికిఁ బ్రత్యేక వ్యక్తిత్వమే లేదు. సంస్కృతమునడుగు జాడలఁ బట్టి "దాసోహ" మని నడచిన దాంధ్రి. వారు ఛందము నాదరించినట్లే వీరు పద్యకవిత్వమార్గము ననుసరించిరి. కాని మఱి యే శుభమాచనమునకో, చంపూగ్రంథములే వ్రాయఁదొడఁగిరి. నన్నయభట్టారకుఁడే తొలుత నాపంథ ననుసరించెను. అతనికి ముందే సంస్కృతమున చంపూగ్రంథము లుండినవిగదా! అందువలన నా



'జనహోమతత్పరుఁడు' తెనుఁగునందుఁ గూడ నాపంథనే యవలంబించెనేమో! నన్నయవచనములఁ జూచినాతఁడు దానిని ప్రత్యేకకళగా గ్రహించినట్లు కానఁబడదు. పద్యమునఁ జెప్ప శక్యముగాని దానిని గద్యమునందుఁ జెప్పఁ బూనుకొన్నట్లే యుండును. లేక రెండుపద్యములకు సంబంధము గల్పింప వలసివచ్చినప్పుడు దీనిని వాడును. అంతేగాని దాని కొక స్వాతంత్ర్యమును గాని, వ్యక్తిత్వమును గాని యొసఁగ లేదు. కాఁగా స్వతంత్రము లగు కేవల వచన గ్రంథములు గడచిన రెండుమూఁడు శతాబ్దముల క్రిందటివఱకుఁ దెనుఁగువాఙ్మయమునఁ గలుగనే లేదు. నన్నయ కన్నను వచనమున మాధుర్యమును గురిసినవాఁడు తిక్కన. తిక్కన కవితాగుణము లన్నియు నాతని వచనములయం దున్నవి. అతని వచనములలో ఛందస్సు గూడ నున్నది; ఉండును గూడ. గద్యమునఁ గాని, పద్యమునఁ గాని భావానుగుణమగు ఛందస్సును గూర్చుటలో కవిబ్రహ్మ సిద్ధహస్తుఁడు. కాని వచనము నందలి బంధము పద్యరచనమునకన్న సూక్ష్మము. నిర్వహించుటయం దెంత కష్ట మున్నదో దానిని, గ్రహించుటయందుఁ గూడ నాపాటి కష్టమే— దానికన్న నెక్కువయే కలదు.

"ఆ నియమ మెచ్చటనున్నది, చూపింతువా?" యని హేతుబద్ధముగ నడిగినచో బదులు చెప్పు టంత సులభసాధ్యము కాదు. కాని యా పదముల పరిమాణములో— బంధమునఁ గానవచ్చు నుయ్యాలవంటి యూఁగులలో— నొకవిధమగు భావానుగుణమగు బంధము కవి రేఁకు కొసెనని గురుతింపవలెను.

సాధారణముగాఁ బురాణములు చదువునప్పుడు—ఉబుసుపోకకుఁ జదువునప్పుడుగూడ—వచనమున కొక రాగము నేఁటి మన నాగరికతావాసనచేఁ దప్పినది. కాని, చేర్చు టొక సంప్రదాయమై యున్నది. అట్టి యలవాటుతోనే చదివినప్పుడు మనకు దానియందున్న బంధగతి గోచరించుటయుఁ, గన్నుల్లార్పుటయు జరుగును. అట్టిచోటులనే యెక్కువగా రసానుభూతి కూడ కలుగును. ఈమార్గముననే తిక్కన ననుసరించి నడచినవాఁడు ముఖ్యముగా నాచన సోమనాథుఁడు. అతని వెంట శ్రీనాథుఁడు. వాని యడుగులలోఁ బోయిన దాంధ్రకవితాపితామహుఁడు. సూరన్న గడుసుదనముగల యర్థదృష్టి గలవాఁడు. ముఖ్యముగా మీమాంసకుఁడు. అందువలన వాఁ డీ వర్ణితములు గమనించినను జోడింప యత్నింపలేదు. ఇఁక కావ్యము నంతయు సంగీతముతోనే నడపిన రామరాజభూషణు నడుగవలసినపని లేదు గదా! పద్యకవిత పూర్వనిబద్ధము. గద్యము స్వతంత్రము గనుక నా ఛందస్సు గూడ వ్యక్తుల ననుసరించి భిన్నభిన్నగతుల నడచును. ఈ క్రిందివానిని జూడుఁడు. శ్రీనాథుఁడు తన శృంగారనైషధమునందు—

"అజ్వైదర్చి నిర్ఝర మదనశర శిలాశంకు సంకలిత వేదనాదూయమాన మానసులై, విజృంభిత మనోభవ భుజాస్తంభంబులగు హిమారంభంబులును, గాలాగరుకళంకిత కామినీ కంఠమూలంబు లగు శిశిర కాలంబులును, గలకంఠ కామినీ కంఠకోమల కుహూకార కోలాహలకరంబిత కకుబంతంబులగు వసంతంబులును, సాయంతన సమయ సంఫుల్ల మల్లికామోద మేదుర సమీరణఘోషంబులగు నిదాఘంబులును, విరహిజన హృదయభయంకర స్తనిత సందోహంబులగు జలధరాగమంబులును, సకలజన మనోవికాస సమయంబులగు శారదసమయంబులును"

తిక్కన—

"ఇట్లు సంకులసమరంబైన సస్త్రశస్త్ర సంఘట్టనంబున వెడలు మంటలు మింట నడరి, మధ్యాహ్న ప్రచండంబులైన చండకిరణు కిరణంబుల మగిడింప నరదంబులు దాకి, పడి, పారలు కరులును, కరిహస్తాకర్షణ విధ్వస్తంబులగు రథంబులును"

నాచన సోమనాథుఁడు—

"మరుగులు సించియు, గాయంబులు నొంచియు, మర్మంబులు గీఱియు, మహీతలంబులు దూఱియు"

అతనిదే—

"తునకలయ్యును తుమురయ్యును, ఇంతింతలయ్యును నిసుమంతలయ్యును, చిరునుగ్గయ్యును చిదురుపలయ్యును, మంచయ్యును మసిమంచయ్యును"

ఇంకొకటి—

"మతిచెడి మల్లాడదిర్లై, యేపు దేఁగి యపురుసవురై, యనుపొప్పి యదవదన్లై, యంతంత విన్ని యరవరలై, పారలేక పలపల్లై"

ఉత్తరహరివంశము—

"శూలంబులు వోయినను నోలంబులు దలంపక, చాపంబులు విఱిగినను తాపంబులు బొరలక"

మఱియొకటి—

"లావునఁ జిక్కియు, ప్రేవులఁ జిక్కియు, మెడలు ప్రగ్గియు, తొడలు పగ్గియు"

ఈ పై యుదాహరణములను గమనించినప్పు డనుగతికమగు నొకగతి — లయ — ఆంతరికముగ దాఁగియున్నట్లగుపడును. ఇట్టి చోటులలో పద్యగద్యములకు భేదమే మాత్రము నుండదనియే యొప్పుకొనవలసివచ్చును. మన తెనుఁగునందుకన్న సంస్కృతమునం దీపరిపాటి యెక్కువగా నున్నది. వారు చాలచోటుల మధురతకొఱకై ప్రాసమునే కాక యతినికూడ జోడింపుచువచ్చిరి. మనవారు మరి యెందుచేతో గాని వచనమున ప్రాసనొక్కదానినే యేరుకొనిరి. ఇంతేకాదు — వచనమువందలి మధురతను తెనుఁగుకవులలోఁ జాలమంది గమనింపలేదనుట నిక్కము. భట్టబాణుని కాదంబరినిఁ జూచినవారికి వచనమునందుఁ గల ఛందస్స్పందన మేమో బోధపడును. ఒక శైలి గాదు, ఒకలయ గాదు — మానవుఁ డెన్ని విచిత్ర సృష్టులు చేయవచ్చునో, అతఁడన్నియుఁ దన చమత్కృతి ప్రభావముచేఁ జూపించెను. మాత్రాచ్ఛందము లేమి, గణచ్ఛందము లేమి — యాతని వచనమున మిన్నాగులవలె సరసరలాడిపోయినవి. తెనుఁగున పాలకురికి సోమనాథుఁడు ద్విపదయందువలె వచనమున విజృంభించి నడచిన మహాకవి కాఁడు. "గద్యం కవీనా

నికషం వహంతి" అని యాతని సిద్ధాంతము. నిక్కముగా నతఁడు దన ప్రతిన నెరవేర్చుకొనెను. తన ప్రతిభానికషమున భాషాసువర్ణము నొఱసి, చక్కని జాతిరత్నములఁ దయారుచేసి "ప్రపంచమంతయు నా యెంగిలి పో"మ్మని గద్దించి పలికెను. నిజమే — వస్తు వెట్లున్నను, భాష, భావము అతని కలముముందు పరిచారికలై నడచినవి. పండితుల తలలు గిర్ర దిరిగినవి. రసజ్ఞులు 'భళీ' యన్నారు. భారతి చనుమిట్టల యందుఁ బులకరించినది. సర్వవిషయముల సార్థకనామధేయుఁ డైనాఁడు. సరిగదా! కాఁగా వచనమునఁగూడ భావానుగతికమగు లయ యున్నపుడు గద్య పద్యములకు భేదమే లేదని తేలినది. ఇఁకఁ దక్కిన గుణములు రెంటికిని సమానములే. గద్యపద్యములు రెంటియందును గూడ శబ్దముచేతనే యర్థము స్ఫురింపఁజేయఁబడవలెను. ధ్వని, రసము — ఈ రెండును ప్రపంచమునకే జీవధర్మములు. మరి యవి యీ రెంటికిని భేదకములగునా? ఎన్నటికిని గావు. కాలేవుకూడ. అయిన నీ రెంటికి భేదమే లేదా? ఉన్నది. సాదృశ్య మున్నంత భేదముగూడ లేకపోలేదు. నాకుఁజూడ వీరిరువురును భిన్నప్రకృతిగలవారు. వచనకవికి తన్మయీభావమున కన్న విమర్శనాదృష్టి యెక్కువ. ఏదేని యొక విషయమును వర్ణింప దొరకొన్నపుడు కవి కావేశము చాలభాగము దోడునను. ఆ వస్తువో, లేక భావమో — దాని సాక్షాత్కారముచేఁ గలిగిన యానంద మాతని కలమును నడుపును. ఆ యావేశమున — నియమితమగు ఛందమున — వాతని కవిత వానకారున బీళ్లయందు జింకపిల్లలవలె నిశ్శంకముగ గ్రేళ్లుదాటుచుఁ బోవును. ఆతఁ డా భావమును విమర్శింపఁడు. విమర్శనముతోఁ బని లేదు. విచికిత్సచేయఁ బూనుకొన్నచో కలము సాగదు కూడ. అతఁ డానందకాంతాపరవశుఁడు. "భావాంబర వీథి విశ్రుత విహారి." తలతో నాతని కంత యెక్కువ పనిలేదు. వాని హృదయము వీణాతంత్రివలె రింగున మ్రోగుచునే యుండును. ఆ యూపులో నొక్కసారి యవతలకి దూకి, తరువాత వెనుదిరిగి చూచును. వచనరచయిత యట్లు గాదు. భావన, లేక వేదనను నాతఁ డంత చులుకనగా విడువ వీలు లేదు. కన్నైతులతో జాగ్రత్తగా దాని గతుల గమనించుచునే యుండును. పద్యగద్యములు రెండును భావనలోఁ బూదు పూవులే. వచనమున మెదడు యొక్క భాగమే కొంచె మెక్కువగా నుండును. ఫలముగూడ రెంటికిని నొకటియే. పదార్థసమితియు నొక్కటే యైనను సృష్టిమాత్రము విభిన్నమైనది. వచనము నిర్వహించుట కష్టమైనపని గూడ. పద్యమునం దావేశము పాఠకుని లోఁగొనును. శైలిలోఁగాని, నిర్మాణమునఁగాని యొక కొంత కొఱఁత యుండినను దానిని వాఁడు గమనింపఁడు. సముదిత మగు సౌందర్యమును జూచి యానందించును. పద్య మొక పుష్పగుచ్ఛమువంటిది. తామరపూవువంటిది. ఒకచోటఁ బూవు లొత్తుగా లేకపోవచ్చును; మరియొకచోట నెక్కువగా నుండవచ్చును; ఒకచోట పాడవుగా నుండవచ్చును; ఇంకొకయెడ కొంచెము తక్కువగా నుండవచ్చును. కడపటఁ గలుగు నానందమునఁ,నివి యన్నియు మఱుగిపోవును. సముదితానందమాత్రమే మిగులును. ఉదాహరణముగాఁ గవితాపితామహుని పద్యమునే చూతుఁడు.

"తతనితంబాభోగ ధవళాంశుకములోని
యంగదట్టపు కావిరంగువెలయ
శశికాంత మణిపీఠి జాజువారఁగఁ గాజు
లుత్తుంగ కుచపాళి నత్తమిల్ల
తరుణాంగుళీధూత తంత్రీస్వనంబుతో
జిలిబిలిపాట ముద్దులు ఘటింప
వాలాపగతి సోక్కి యరమోడ్పు గనుదోయి
రతిపారవశ్య విభ్రమముఁ దెలుప
ప్రౌఢి బలికించు గీత ప్రబంధములకు
క్రమకరపంకరుహరత్న కటక ఝణఝణ
ధ్వనివిస్ఫూర్తి తాళమానములు గొలుప
నింపు దళుకొత్త వీణ వాయించుచుండి."

(మను. ౩ ఆశ్వా)

వరూథిని వీణవాయించెడు ఘట్టము నిందు వర్ణించుచున్నాఁడు. ఈపద్యమును జదువునప్పుడు భావానుగుణమగు రాగము తొలుత వాహోర్యక మగునదిగాఁ జేరుచున్నది. రతిపారవశ్యవిభ్రమము, తరుణాంగుళీ, తతనితంబము, జిలిబిలిపాట, ప్రౌఢి, ఉత్తుంగకుచపాళి, ఇంపు దళుకొత్త మొదలగు శబ్దములు ధ్వనిపుష్టిచే

వానకాలమందలి మయూరములవలె నటించియున్నవి. ఆంధ్రభాషయందు అరుదుగాఁ గానఁబడు నతిమనోహరము లగు పద్యములలో నిది యొకటి యనుట కేమాత్రము సందేహమును లేదు. భావమును క్రమముగాఁ బెంచుటలో నొకపద్ధతి పాటింపఁబడినది. సర్వవిధముల నుత్తమ మగు పద్యమే. శైలిలో ఉయ్యాల తూఁగుచున్నది. అచ్చుపోఁతయందుఁ దీసిన కమ్మివలె చాలవరకు నడచినది. శైలిని నడుపు విషయమునందు అల్లసానివారు సృష్టికర్తను దప్పులుదిద్దు చేర్పరి. ఆవిషయమున వారితోని మెచ్చుకొను యోగ్యతే మనకు లేదు. సరిగదా. కాని పాదపాదమును విమర్శింపఁ బూనుకొందము. మొదటిపాదము ప్రభాత సూర్యునివలె మహాగంభీరముగ నున్నది. అతని భావతీక్ష్ణత, సౌందర్యపిపాస, ఆలంకారికత ప్రత్యక్షమగుచున్నవి. ధవళాంశుకమునకు వెనుక నున్న యంగదట్టములోని పరభాగత నెంత చక్కఁగా విశదీకరించినాఁడు! ఆయన మహారసికుఁడు. రసికతకుఁ దగినట్లు — దరిద్రుల మనోరథములవలె — భావము లన్నియు నిట్టూర్పులలో నిమిరిపోక కొంతకుఁ గొంతరైనను సుఖకరముగా ననుభవించిన రేఖాశాలి. పాశవిక శృంగారము గాక నాజూకుగా ననుభవించినాఁడు. దానికై తపించినాఁడు. తనజీవితము నంతయు నందులకై వినియోగించినాఁడు. ప్రతిపదార్థమును ధర్మశాస్త్రపుబజారులలో నమ్మి వాశనము సేయు సాంతకుఁడుగాఁడీయన. తనహృదయమునకుఁ దాను సేవకుఁడు. వాఁడు బృహస్పతిగాని యితరుల భావముల కాశింపని స్వతంత్రుఁడు. ఆదర్శ బ్రదుకు బ్రదుకని ధీరుఁడు. ఆత్మవిశ్వాసముగల మనీషి. గంభీరమగు తత్త్వమును విమర్శించినాఁడు. లలితమగు జీవితమున దానిని సమన్వయమొనరించుకొన్నాఁడు. చిలుకపలుకులవలె ఛాందస సూత్రముల వల్లింపఁడు. ప్రతిపలుకును తన హృదయాంతరాళమునుండి ధ్వనింపఁజేయును. నిజముగా వరూథినివంటి మధురమూర్తిని సృష్టించిన యమృతహస్తుఁడే భావయందరైన నస్నాఁడాయని యాశంకింపవలసియున్నది. అతని వరూథినీకాంతముందు రసజగత్తు జోహారు లిచ్చినది. ఆమెసౌందర్యమునకు ప్రకృతి పులకించినది. పెద్దనలలితహృదయమును వలచి భావములు పరుగిడి వచ్చినవి. భావ. సూతని కలమును ముద్దిడుకొన్నది. అపురూపమగు సృష్టి యొనర్చినాఁడు: వరూథిని పుత్తడిబొమ్మ, ప్రౌఢకాఁరుమెరుగు, అమృతలతిక, మానవుల సుఖస్వప్నములలోని జీవితకళ, ప్రణయప్రపంచరాజ్ఞి, కవితా సామ్రాజ్యసర్వస్వము. మరి యామెను సృష్టించిన కవి? అంతకన్న ధన్యుఁడు లేఁడు. ఇది యాతని పద్యమునకుఁ గవితాదృష్టితోఁ గావించు వ్యాఖ్య. ఇఁక దృష్టిభేదమున విమర్శింతము. "కాయు లత్తుకకుచపాళి నత్తమిల్ల" అనునది రెండవ పాదము. మొదటిదానిలోని గంభీరతలో సగముగాదు — నూరింట నొక భాగము దీనికి లేదు. పాదపూరణార్థమై వ్రాయఁబడినట్లున్నది. ఈ చరణమున ప్రకృతి విరుద్ధమేదియును లేదు. కాని మొదటిచరణమునకే రస ప్రవాహము యొక్క కట్టుదాఁటిన పితామహుని భావన దీనియందింకను వెనుకకు — భావనాగంభీరతత్త్వము లోనికిఁ బోవలసియుండెను. ఎందుకో రెండవ పాదమున గసఁబోసికొన్నాఁడు. మూఁడవదానిలో పరిమళమున్నది. కాని అది మొదటిదానికన్న నెక్కుడు దానియందైనను దీక్ష్ణతగలది గాదు. నాలుగవ పాదమున మఱల నాకాశమున రెక్కలుగట్టి యెగిరినాఁడు. కడపటి గీత పాదమంతయు — వెనుక నెవరో తరుముచున్నట్లు — తొందరగాఁ బరువెత్తినాఁడు. ఈరీతి ప్రత్యేకముగ దృష్టితోఁ జూచినపుడు పంచరమున నొక యసమగ్రత — పూర్తిగా నసమగ్రత గాకున్నను ఒకవిధమగు Fluctuation గానవచ్చును. వచనరచనమునందీపద్ధతి పనికిరాదు. ప్రతివాక్యమును స్వతంత్రము. ఏదాగి కడి చక్కని క్రియతో, మంచిపరిపాటితో నిలువవలెను. పూర్వాపరసందర్భములు కవితయందుకన్న చక్కఁగాఁ బాటింపవలెను. ఏ విషయమును గొంచెము దగ్గించినను, ఎక్కించినను బాగుగాఁ బట్టియిచ్చినట్లు గానవచ్చును. ప్రతివాక్యమునకున్న సౌందర్యమును వృద్ధి పరుపవలెను. పద్యమునందన్వయము క్లిష్టమైనచో క్షమింతురు. కాని వచనమునం దట్లు గాదు. స్పష్టముగా నన్వయము సరిదిరిపోవలెను. పద్యమునందువలె రాగము, గణములు మొదలగు బాహ్యోపకరణములు తోడుపడుట యిందు లేదు. ఏదిచేసినను, ఏ యావేశ ముద్భవించినను — రచయితయొక్క శక్తిపైననే

యాధారపడవలెను. ఒక విషయమును, లేక ఒక సన్నివేశమును వచనమునందుఁ జెప్పవలసివచ్చినప్పుడు తాను వ్రాయవలసిన, లేక చూపింపవలసిన విషయమును, దానికిఁ గావలసిన యంగములను తొలుతనే నిర్ణయించుకొనుటయే కాక వానిని దానెట్లు క్రమముగా నభివృద్ధి జెందింపవలసినదియు సిద్ధపరచికొని యుండవలెను. కడకు నాటకమందు విమర్శసంధివలె కడపట విశకలితము లై యున్న యన్ని యంగములను గలిపికొని యొకపాకమునకుఁ దెచ్చి ఫలమును జేర్పవలెను. అనఁగా నాటకకారున కేసర్వతోముఖ దృష్టి గలదో, ఆశక్తి వచనరచయిత కుండవలెను. పూర్వాలంకారికులు వచనరచనము నొక ప్రత్యేక కళగా గమనింపకపోవుటచే సంధులు మొదలగు నియమములు నాటకకర్తకే విధించిరి. కాని, నిదానముగా నాలోచించినచో నాటకకర్తవంటి నియమములు వచనమును వ్రాయు కళాశాలికిఁ గూడ నుండవలెను. కవికి తన్మయీభావము ముఖ్యమగు మనోవృత్తి యని తొలుతనే విన్నవించితిని గదా! వచనరచనాకారున కావేశ ముండరాదు. ఉండినచో నాతని రచన రక్తికెక్కదు. అప లతఁడు వ్రాయనే లేఁడు. ఒక సన్నివేశమును భావించినపుడు కవి లీనుఁడగును. వచనకారుఁడు దానికి బహిర్ద్రష్టుఁడుగా నిలచి యాధారమును జెయిపెట్టి కలచును. దాని తరతమ భావములు విమర్శించును. నవలాకారులను మీరు మాదిరియుందురు. అతఁడు సన్నివేశములను జిత్రించుననే యుండును. ప్రపంచమును వెక్కిరించును. ఏడువఁడు గాని యేడ్పించును. నవ్వఁడు గాని నవ్వించు విద్య నభ్యసించియుండును. అతని సృష్టి కృత్రిమము. అతని మనసు సినిమా తెర. ముఖమున కరదీపము బూనికొన్న నర్తకునివలె కలముబట్టినపుడు అనేక విచిత్రములు గావించును. కుంచికను వదలినవెంటనే సుఖమునకన్నను మధురమగు మనస్సుతో హాయిగా నుండును. అతఁడు నవ్వినను, ఏడ్చినను ఇతరులకొఱకే. పైగుణములు వచనరచయిత కుండవలసినవి. లేనిచోట తత్క్షణమున వాఁడు కవియయినవాఁడని యొప్పికొనవలెను. కవికిఁ గూడ నాలంకారికు లిట్టి మనస్తత్వమే యుండఁదగునని చెప్పిరి. కాని మనకుఁ జాలవరుడుగాఁ గానఁబడును. కవి కా మనస్తత్వ మసాధ్యమని కూడ నా నమ్మకము. వాని నోట వెడలు ప్రతిమాటయు నావేశము ప్రవంతిలోఁ బూచిన పుష్పమైనపుడు దాతఁ డావేశమును విడువవలెననుట చాల నసంబద్ధము. సూరన్న కున్నది నవలాకారుని మనసు. అతఁడు వ్రాసినవి ప్రబంధములు. అందుకే సూరన్న కావ్యము లౌచిత్యముకే కౌఁగిలించినవి. రసవిషయమునఁ గొఱఁత గనుపడఁ జొచ్చినది. ఒకవేళ నవలాకారుఁడైనను, లేక నాతనివంటి నాటకకర్తయుఁ గవిత్వము వ్రాయఁగలరు గాని కవి మాత్ర మెన్నటికిని నాటకకర్తగా, నవలాకారుఁడుగాఁ గాలేఁడు. భవభూతి కేవలకవి. అతని నాటకరచనము జేరుగాఁ దన స్వభావమున కెదురు నిలిచిన నడత. దానికిఁ దగిన ఫలమునే యాతఁ డనుభవించెను. ఈ కొఱఁత వాఁడే యెఱిఁగి యుత్తర రామచరితమును— అది నాటకమైనను— కేవల మొక దుఃఖపూరిత కావ్యముగా మార్చివేసెను. పద్యరచన మొక నిర్ణీతమగు పద్ధతి. చిరపరిక్షుణ్ణమగు రాజమార్గము. కవికి భావము దోఁచుటయే తడవు, వెంటనే యాతఁ డా చిరపరిచిత మార్గమున తొందరగా వెళ్లఁగలఁడు. వచనరచయిత కట్లు గాదు. అచ్చుకట్టును గూడ నాతఁడే కట్టుకొనవలయును. పాత్రముల నాతఁడే సిద్ధపఱచుకొని యాడింపవలెను. కవిగతి కొక సంప్రదాయమున్నది. వచనరచయితకది లేదు. అతఁ డప్పుడే చేరుగా నా ఉద్యానవనమును నిర్మించుకొనవలెను. ఏది చెడినను వచనము రక్తిగట్టదు. పాఠకులను శ్లోవనింపలేఁడు. కవి, వచనరచయిత— వీ రిరువురు నా దృష్టికి విభిన్నవ్యక్తులు. కొన్ని విషయములలోఁ బోలిక లున్నవి. అంతకు తగినన్ని భేదములు కూడ నున్నవి. కవికి భావన యెక్కువ; వచనకారునకు మేనస్సెక్కువ. అతఁడు భావించును; ఇతఁడు గుణదోషములను బింగడించి తన తమ భావములఁ జెల్చును. అతఁడు భావుకుఁడు; ఈతఁడు గొంతవఱకు విమర్శకుఁడు. కవికి తన్మయీభావము వెన్నతోఁ బుట్టిన విద్య. గద్యరచయిత నావేశము తెరచును. అతని కలము చల్లగా సాగిపోవలెను. కవితయందు ముఖ్యముగాఁ గానవచ్చునది సముచితమగు సౌందర్యము.

వచనమునం దవ తువగత సౌందర్యముచే నవయువి విభూషిత మగును. కవితకు గానము, గణములు మొదలగు వాని తోడ్పాటు గలదు. ఈతని కది లేదు. కవి మార్గము చిరపరిక్షుణ్ణము. ఇతఁడు స్వయముగా వస్తువుతో జీ లయను, గతిని నిర్మించుకొనవలెను. కవికి ధ్వనియు, నావేశము ముఖ్యములు. వచనమున కౌచితి జీవగఱ్ఱ. గద్యమునకు స్పష్టత జీవధర్మము. వచనరచయితకు సర్వతోముఖదృష్టి తప్పక యుండి తీరవలెను. కవికి నన్న మంచిదే. లేకున్నను పెద్ద కొఱంతే గాఁ గానఁబడి కళను వికారముగా మార్చదు. ద్వంద్వ భావముల కలబలత వచనమునకుఁ గావలెను. కవితకంత పనిలేదు. కనుక నీ రెండును చాల విభిన్నములగు కళలు. అట్లే సృష్టించు వ్యక్తులుగూడ భిన్నులే. ఈ రెండు శక్తులను నాటకకారుఁడు జోడించుకొనవలెను. ఇది చాల దుర్ఘట మగు పని. అందుకే ప్రాచీనులు నాటకకర్తను భావప్రపంచశిఖరముపైఁ గూరుచుండఁ బెట్టిరి. ఎట్లును గద్య పద్యములు అక్కచెల్లెండ్రవలెఁ గలసి మెలసినవైనను - లేదు వేరుగానైనను ప్రపంచమునకుఁ గావలసినవే. వానిని సృష్టించువారును గావలెను. కాని, గద్యము పద్యమంత సులభము గాదనుటమాత్రము మఱచిపోరాదు. వచనకవితా చక్రవర్తి బాణుని మాట లింకొకసారి నిదానముగా నాలోచింతము: "గద్యం కవీనాం నికషం వదంతి." ఏమందురు? నేఁ జెప్పినమాట లన్నియు నాతని యుక్తిప్రాయము లేనా? ఆతని భావములయం దంతటి గభీరత యున్నది. వచనమును సమగ్రముగ వర్థమొనరించుకొన్నవాఁడు కావుననే, బాణుఁడు దాని కసదృశమగు గౌరవముఁ దేఁగలిగెను. మన తెనుఁగువారీ విషయము నంతగాఁ దఱచిచూచినట్లు లేదు గాని గమనించిరనుటకు సూచనలుమాత్రము లేకపోలేదు. వానిని మన మొకసారి తడవిచూచుట మంచిపనియైనది గాదా? ఆ యాచారమును నిలుపుకొనుటయో? అది యంతకన్న గొప్ప ప్రయత్నము. దానికిఁ బూనుకొనఁ దగువారు విద్యార్థులు, ప్రాచీన సంప్రదాయముల నెఱిఁగినవారు, నాకన్న గొప్పవారు.

జ్యోతి

= శ్రీ అత్తిలి సూర్యనారాయణమూర్తి =

ఇంద్రనీలపు జాలి
సంద్రాల రెపరెపలు
కరవీరదళకోప
మరవింద యనురాగ
మధురమాలికలలో
మలగు వెలుగుల జాలు
వెలిగించవోయ్
జ్యోతి
తలపించవోయీ!

వలపులో తెలిరేఖ
తలపులో పోడుపుస్మృతి
రాగప్రస్తారాల
జోగుబంగరుకథకు
వెలిగించవోయ్
జ్యోతి
పలికించవోయీ.

విజయవిలాస నాయికలు, తద్విశేషాలు

శ్రీ కొండూరు
— వీరరాఘవాచార్యులు —

ఉలూపి :: చిత్రాంగద :: సుభద్ర

రఘునాథరాయల కాలమున వెలువడిన రసవత్కావ్యములలో 'విజయవిలాస' మొకటి. అర్జునుఁడు తీర్థయాత్రవెడలి ఉలూపి, చిత్రాంగద, సుభద్రలను వివాహమాడి, యింద్రప్రస్థమునకు వచ్చుటతో విజయుని విలాసము వర్ణింపఁబడినది.

'విజయవిలాసము'న విజయుని విలాసమునకుఁ బాత్రభూతలైన నాయికలు ముగ్గురు. అం దొకర్తె చిలువ చెలువయగు నులూపి; రెండవయామె పాండ్య రాజసుతయగు చిత్రాంగద; మూఁడవ కన్నె యర్జునుని మేనమఱఁదలగు సుభద్ర. ఈముగ్గురినిగూర్చిన సంగ్రహ పరిశీలనమే యీ వ్యాసము యొక్క ముఖ్యోద్దేశము.

మత్స్యయంత్రము నేసి తెచ్చుకొన్న ద్రౌపదిని అయిదుగురు సోదరులును ఒక్కొక్క రొక్కొక్క యేఁడనుభవింపు మాతృదేవి కుంతి యాజ్ఞ. పతి యొకని యధీనములో నున్నప్పుడు వేఱొక్కఁ డామెను జెనకరాదు. మీఁదుమిక్కిలి వారి కేళిమందిరము దండకేనిఁ బోరాదు. అట్లు జరుగుచో నొకసంవత్సరము భూప్రదక్షిణము సేయవలసియుండుట పాండవులు మొదట చేసికొన్న సమయము.

పాఱుఁ డొక్కరుఁడు తనగోవుల దొంగ లెత్తికొనిపోఁగా దానిం దెచ్చి యీయ నర్జునుని వేఁడికొనెను. అర్జునునకుఁ దదానయనార్థమై విలునమ్ములు దెచ్చికొనుటకుఁగాను ధర్మజుని పాన్పటింటి ముంగల కేఁగవలసివచ్చినది. పూర్వకృతసమయ న్యాయానుసారముగా తీర్థయాత్ర కేఁగవలసిన యుద్యోగము చేకూరినది.

ఇంతకుముందే 'గదు'నిచేత సుభద్రాదేవిరూపరేఖాలావణ్యాదులు విని యామె నెప్పుడెప్పుడు చూతునా యని క్రీడి యువ్విళ్లూరుచుండెను. దానికి తోడు భూప్రదక్షిణము : ద్వారకకు త్రోవదీయుచున్నది. మనసులో పొంగులువారుచున్న ప్రియాసందర్శనాభిలాషముఁ దీర్చుకొన నింతకన్న చక్కని యదను దొరకదు. అన్నకు మ్రొక్కి యనుజ్ఞ నర్థించినాఁడు. “ఇది విప్రహితము,దీనికన్న ధర్మ మేమున్న”దని యుధిష్ఠిరుఁడు వారించెను. వినలేదు. గోప్రదక్షిణమే భూప్రదక్షిణ మన్నాఁడు గూడను. ఎన్ని చెప్పినను పార్థునకు నచ్చలేదు. అన్న పనుపున తన పురోహితుఁడైన ధౌమ్యుని తమ్ముని కుమారుని విశారదుని వెంటఁదీసికొని పయనమైనాఁడు.

అరణ్యతీర్థములఁ గ్రుంకు వెట్టుచు గంగాభవానిం దర్శించినాఁడు. శాంతను (భీష్ముని) గన్న తల్లి యగు నామెను అర్చనచేసికొని కాపాడుమని ప్రార్థించి, యందలి భూసురులకు దానములుచేసి, ఆశ్రితకల్పమహీరుహమై కన్పట్టు క్రీడిని ఉలూపి దర్శించినది. తాను నాశ్రయించి మనోభిలాషము నెఱవేర్చుకొనవచ్చునుగదా? అందుకే యప్పటి పార్థుని ఆశ్రితకల్పమహీరుహమును జేసినాఁడు కవి.

ఉలూపి

ఉలూపి నాగకన్నియ; రూపవిభ్రమరేఖాఖని; కోమలచ్ఛాయపు కుటిలాలక; నాగరికముద్రగల బాగరి. మున్ను ద్రౌపదీస్వయంవరమున కేఁగిన కామరూపభోగులవలన మత్స్యయంత్ర మొకరేటున నేసి సమస్తరాజులఁ గెలిచిన యర్జునుని మేలువార్తలు, వీరవిలాససంపద చల్లగా విన్నది. అతనిమీఁది ప్రేమబీజమును నిజహృదయములో నాటుకొన్నది. ఆమనోహరరూపునికొఱకే తన యెలజవ్వనమంతయు జన్నియవట్టి సమయమునకై వేచియున్నది. ప్రణయబీజము మొలకరించి క్రమప్రవృద్ధమైనది. పండుసైతము కనువిందొనర్చినది.

భోగవతినుండి యెప్పుడును భాగీరథికడకు వచ్చుట యాకన్నియ కలవాటు. ఉరగీమణికావున గమనాగమన ప్రయాసము లేదు. మాయచేతనో, మంత్రముచేతనో రాఁగలదు.

ఆనాఁడు సైకతమున విహరించెడు కైరవేష శేషుని జయంతునితమ్ముని దవులనే కాంచినది. చూచుటతోడనే జలక్రీడఁ దేలిన యాతని క్రీడిగా నెఱింగినది. ఇఁక నేమి, తమకము మనసులోఁ జెనగొన్నది. సొట్టసియాడినది. గబ్బిచన్నులమీఁదఁ బులకలు పొటమరించినవి. కోరికలు తీటలు పెట్టినవి. వేఁడుకలు మదిలో దొట్టికొన్నవి. అచ్చెలువ తొంగలిఱెప్పలను పైకెఁ ద్రోసినది. పాపము, పెట్టిన దృష్టి దీయక యాతని నాశ్చర్యచకితయై చూడసాఁగినది. ఇంతటైనపిమ్మట మనసిజుఁడు వెత్తినాఁడా యూరకొనుటకు? సమయమిదే యని పింజపింజ గాఁడున ట్లేసినాఁడు.

ఎంత భావశబలత! ఎన్ని కోరిక లామెను నుత్తగొన్నవి. దీనిని బట్టి యులూపి కాతనిమీఁద నున్న తమకము చెప్పవలనిగానిది. చూడఁబోయిన నామె కన్నియ, ముగ్ధ. ఇన్ని భావము లెట్లు? ప్రౌఢాత్వము ద్యోతితమగుచున్న దేమి? మనకే కాదు, అర్జునునికి నా భ్రాంతియే కలుగును. ఇదియంతయు కామశాస్త్రమును, శృంగారకావ్యములను జదివి యలవఱచుకొన్న భావతన్మయత. లేకున్న నర్థోపపత్తి లేదు.

ఉలూపి ఇంతవఱకు నాతని సౌందర్యమును చిత్తరువులపై వ్రాసికొన్నది. పద్యములలో — పాటలలో పాడుకొన్నది. అదియంతయు నూహామాత్రమే. ఇప్పు డా త్రిజగన్మోహనాకృతిని కనులారఁ గాంచినది. తన కుపభోగ్యము కానున్న ప్రతి అవయవమును మనసుదీర వర్ణించుకొన్నది. "అకటా నన్నితఁ డేలిన నొకటా నచ్చికము లేక యుండఁగ వచ్చు"నని ముఱిసినది. "నాహృదయము మన్మథ తల్లజు నీని"కని హృదయసమర్పణముగూడఁ జేసికొనినది. ఈ విధముగా నువ్విళ్లూరెడు మనస్సుతో తన మనోహరాంగములు గల్గినందులకు ఫల మాజగదేకమోహనుని చేపట్టుటయే యని కొనియాడినది.

సంజపడినది. యామినీవిటకుల శేఖరుఁ డర్జునుఁడు జాహ్నవీతటమున సంధ్యవార్చి జపతత్పరుఁ డైనాఁడు. ఇది యదనని యెంచి యులూపి మాయయచ్చుపడినట్లు క్రీడిని తన నగరునకుఁ గొంపోయినిల్పినది.

ఇదియంతయు పార్థుఁ డెఱుఁగనే యెఱుఁగఁడు. జపముచేసి కనులు దెఱచునప్పటికి ప్రపంచమే మాఱి పోయినది. గంగ లేదు. ఇసుకతిన్నియ లేదు. తామర పూలు లేవు. మసకమసక సంజకెంజాయ లేదు. సెలతాల జగతి. అలకలపాన్పు. పసిడియుప్పరిగె (మేడ). కప్పురంపుఁదావి. మిసిమికెంపుల కాంతి. ఇది కలయా, మాయయా? కానిమ్ము. ఎదుట నేమున్నది?

ఒఱపులకు నెల్ల నొజ్జయైన భుజగగజగామిని! అర్జునుఁడు పోల్చుకొనలేకపోయినాఁడు. ఇది మదన సుంఖితమాయానటనమా, గంగాఘటనమా అని విచార ఘటనాశయుఁ డైనాఁడు. "వధూమణీ! ఎవ్వరిదాన వీవు, పేరేమి, ఒంటరిగా నుండఁ గారణ మే"మని ముద్దుమాటలతోఁ బ్రశ్నించినాఁడు పెండ్లికొడుకువలె. పెండ్లికొడుకుగానిచో వధూమణి యను సంబోధన మేల? అనవుడు నామె సోగకన్నులఁ జెలఁజూచి, "ఓమదవతీనవమన్మథ! ఈజగంబు పాతాళము. నే నులూపి యను భుజంగమరాజకన్యకను" అని పిలుపులోనే సోద్దేశమును సూచించినది. సూచించినమాత్ర మేమగును? చెప్పవలదా మనసులోని కోరికను? "సరిలేని విలాసముగని వరియించి తోడికొనుచు వచ్చితి నిన్నో కురువీర!" అని కుంచెపగులఁ గొట్టినట్లు జంకుగొంకు లేని చాతుర్యమును జూపి తన యుత్కటాభిలాషను వెలిఁగించినది.

ఉలూపిసోయగమునకు విజయుఁడు విస్మితుఁడై నాఁడు. సుభద్రాసౌందర్యము చెవులసోఁకి, ఆదిదృక్షచే పయనము సాగించిన రసికశేఖరునకు నాగకన్నియ చెలువము వింతగొలుపు టాశ్చర్యమేమి? ఏసౌందర్యారాధనకు తాను బయలుదేఱెనో తాదృశసౌందర్యనిధి దేవతయే తన కెదురైన తప్పించుకొనఁ గలఁడా నరుఁడు? అచ్చెరువొంది "రూపవిభ్రమరేఖాఖను లెందు నాగకన్యలె యని వింటిని, నేఁడు నిక్కమయ్యె" నని పరిపృచ్ఛగొన్నాఁడు

వినను వ్రతముగైకొనియున్న నన్నీమె యేల తేవలయును? భూలోక మేడ, పాతాళ మెక్కడ? ఇంతుల కింత సాహస మని యాశ్చర్యచకితుఁడై

"కాముకుఁడఁగాక వ్రతినై
భూమిప్రదక్షిణము సేయఁబోయెడువానిం
గామించి తోడి తేఁదగ
నా మగువ! వివేక మించుకైనను గలదా?"

అని తన వ్రతచందము దెల్పుచు సన్నని చీవాట్లను పూనుకొన్నట్లు నటించినాఁడు.

క్రీడివ్రతము ఉలూపికి నచ్చలేదు. మోమున మొలకనవ్వొలయ నన్నది: "అతులితవిలాసరేఖాకృతు

లన్ వలపించి యిట్లు త్రిభువనలీలావతుల వలయించు చేవా వ్రతమునఁగా నీకు రూపవంచితమదనా!" అని. ఎంత యభిప్రాయగర్భమైన పలుకు పలికినది. త్రిలోకములయందలి లీలావతుల వలయించు రూపఁట క్రీడికి. భూలోకకామినులు ఇదివరకే అలరియున్నారు. తాను పాతాళలోకపు సుభ్రుత. ఇపు డాతని వరించి యలరుచున్నది.

నీ వ్రతముచందము తెలియు నన్నది. అయిన నీ వికారకార్య మేలనో? అది మన్మథుని ప్రేరణ. వికారకృత్యము మానరాదా? వీలులేదు. ప్రాణాపాయము తటస్థించిన నెట్లు? కావుననే "ప్రాణదానంబు కంటెను వ్రతము గలదె? ఎఱుఁగవే ధర్మపరుఁడ" వని పలికినది. "మేల్పడిన నాతి నలంచుట న్యాయము కా" దన్నది.

విజయుఁ డింకొక యెత్తు వేసినాఁ డామె మనస్సును బరీక్షించుటకు — "పరసతి నెనయుట రాజులకు ధర్మమా" యని. పరసతియని యేల భ్రాంతి కలిగెను? ఆమె ప్రౌ[illegible]త్తైని, ప్రౌఢచేష్టితమునుబట్టి, స్వాతంత్ర్యమునుబట్టి. ఈ భ్రాంతి యథార్థము కాకపోయినను పార్థుఁడు సమర్థించుకొనఁగలఁడు తనకీ భ్రాంతి గలుగుట సకారణ మని.

ఈమాట యననప్పటికి నర్జునుఁడు మెత్తపడినాఁ డనియు, నతఁ డిఁక పరసతి యను శంకాలేశము మాత్ర మున్నదనియు గ్రహించిన పాఁపఱేఁపజవరాలు ఎదలోని వలపు దాఁపుకొనలేక యాతని తెలిముద్దు నెమ్మొగమును కలికిమిటారిమాపునోఁ దనివితీరఁ జూచి, "కన్నియఁగాని వేఱొక తెఁగాను మనోహరరూప! నీకు నే జన్మియవట్టి యుంటి నెఁజవ్వనమంతయు నేఁటి దాఁక" నన్నది. అయినను నమ్మఁడేమోయని నమ్మించు కోసమై "నాకన్నలతో" డని యొట్టు పెట్టుకొని నమ్మ మన్నది. కాదన్న నాతని మోవిమధురామృతము నాని నాననీతు నన్నది. అమ్మ! ఉలూపి! ఎంతజాణ! ఎంత మాటనేర్పరి! ఇంతకన్న నాకులుకులాఁడి నమ్మించఁగల రీతి యేది? ఉలూపి కెంత మోహము గలదో యీ సీసమని పలుకుబడి తెలుపుచున్నది.

తన వలపు చేసిన చేఁతలు చెప్పుకొనుటకు నీతి కాదన్నది. ఇంక నాలసింపనేల యని "నీ వొప్పెడి దాఁకఁ దాళుటకు మది మెచ్చునా?" అని దైన్యమును సూచించినది. అర్జునుని వ్రతపుబిగువు సడలినది కాని ఇంకను పట్టుపట్టి చూచుచున్నాఁడు.

ఫణిజాతి, నరజాతు లను జాతిభేదమును దాటి, అన్యజాతి ప్రవర్తించు టర్హముకా దన్నాఁడు.

తనుల మెంచని పాండవముఖ్యుని పలుకు లా చిలువ చెలువకు నచ్చునా? ఇదివఱకే సంబంధములను బోల్చుకొనియున్నది కాఁబోలును, కుముద్వతీ కుశ రాజుల సంబంధమును, నర్మదా పురుకుత్సుల ప్రణయమును జ్ఞప్తికిఁ దెచ్చినది. అర్జునుఁడు ముదురుపాకములో నున్నాఁడని తలఁచి "...అక్కునఁ జేర్పక జంపుమాటలన్ వ్యాకులపెట్టు టేల? విరహాంబుధి ముంపక పోకునన్ జలంబేకద నీకు మంచిదిఁక నీఁతకు మిక్కిలి లోఁతు గల్గనే" యని యంతర్వ్యాప్య యయి దీనత్వమును వెల్లివిరియించినది.

దీని కెంతటివాఁడైన వశుఁడుగాక తప్పెడి దేమి? "అని వదియించునప్పుడు ముఖాబ్జము వంచెడి విన్నఁబాటు చక్కని తెలిపోఁగకన్నుఁగవఁ గ్రమ్ముచునుండెడి బాష్పములన్ గళంబునఁ గనిపించు గద్గదిక ముప్పిరిగొన్ వలవంతి"ను తెలియఁజేయ నా రసికాగ్రణి రసార్ద్రీభూతహృదయుఁడై "చక్కరబొమ్మ నా వ్రతముచందము దల్పితి నంతెకాక నీ చక్కఁదనంబు గన్న నిముసంబయిన న్నిలుపోవ శక్యమే యక్కునఁ జేర్ప" కని దయతో నానతి యిచ్చినాఁడు.

కులుకుసుబ్బల ప్రాయంపుఁ గోమలి యులూపి క్రీడిని వలచినది. అతనిచే వలపించుకొన్నది. మీనాంకుఁ డొనర్చిన శుభైకముహూర్తమున నంగజరాజాకేతనమును దుల్లఁగొట్టి గెలుపుగొన్నది.

అర్జునుఁ డంగీకారమును దెలిపినప్పుడు తన్నావరించిన సిగ్గుదొంతరలు సంభోగసమయమున సెలవు గైకొన్నవి. ఆమెరతి ప్రౌఢరతిని దలపించుచున్నది.

"శయ్యకుఁ దార్చఁగాఁ దఱుచు
జాఱెఁ దనంతటఁ జక్కదిద్దఁబోఁ
బయ్యెద జాఱె నయ్యెదిరి
పాటునఁ గ్రక్కున నీవి జాఱె రా
జయ్యకు న్విలాసినియు
యారముఁ జూచి కవుంగిలించె."
"కాఁగిటఁ జేర్చునప్పటి సు
ఖంబె లతాంగికిఁ బారవశ్యముల్
మూఁగఁగఁ జేసె మోవి పలు
నొక్కు లురోజనఖాంకముల్ మొద
ల్గాఁగల కందుకేళి సుఖ
లక్షణము ల్పయి పెచ్చులయ్యె..."

దీనిని కామకళాభిజ్ఞుఁడైన కవి సమర్థించుకొనుచున్నాఁడు. "అల్లాఁ గద నెట్టివారలకు నగ్గలపుం దమి గల్గియుండినన్" అని. ఎట్టివారలకైనను—ముగ్ధలకైనను నని కవియభిమతము కాఁబోలు. మన్మథుఁడు పై

కొనుటచే లజ్జ గ్రింకువడినది. ఉలూపి రతిపారవశ్య విభ్రమమునఁ జొక్కినది. దవ్వుల నుండి తాను గన్న కలలకు సాఫల్యమును గన్నది. సెబాస్!

చిత్రాంగద

ఈమె మలయధ్వజబాహుజను క్షితిపుని గారాబు పట్టి. బాలికాతిలకమే కాని యులూపివలెఁ బ్రౌఢ తనముఁ జూపి వలచి వలపింపఁగల దిట్ట గాదు. అందు కును గారణము గలదు. ఉలూపి క్రీడిని స్వయంవరించు కొన్నది. ఇది యట్లు గాదు. అర్జునుఁడే చిత్రాంగదను జూచి మోహాకులచిత్తుఁ డయినాఁడు. మఱియు చిత్రాంగదది పెద్దవార లెఱిఁగి వారియభిమతమునఁ జేసిన పెండ్లి. అనుట చిన్నారి పొన్నారియగు చిత్రాంగదనే మనము కాంతుము.

చిత్రాంగదసౌందర్యము మాత్రమే మతిలోక మని యర్జునుఁడు మురిసిపోయినాఁడు. విశారదుఁడు గూడ "ఈ తన్వంగితోఁ బోల్పఁగా నెన లే దెచ్చటఁ గాంచ మా తుహినభూభృత్సేతుపర్యంతముల్" అని సర్టిఫికెట్టిచ్చినాఁడు. చిత్రాంగదపాటి జోటి గలదా యని కిరీటి మాటిమాటికి మెచ్చుకొన్న వధూటి చిత్రాంగద. ఈమెనుగూర్చి విశేషముగఁ జెప్పవలసినది లేదుగాని అర్జునుఁడే స్వయముగ విశారదు పంపి, తన కామె నీయవలసిన దని రాజు నర్థించుటచే చిత్రాంగద లోకోత్తర సౌందర్యమును, అలఘుకులశీల గుణములును వ్యక్తము లగుచున్నవి.

విజయుఁ డులూపిని చేకొంట యించుమించు గాంధర్వవిధితో ననవచ్చును. చిత్రాంగదకరగ్రహణ మట్టిది గాదు. పెద్ద లెఱిఁగి చేసిన పెండ్లి. మామూలు అన్నట్లు ముచ్చట్లకుఁ గొఱత లేదు.

మనోజకేళీభవనమునఁ జిత్రాంగదను జూచి మోహము నిల్పికొనలేకపోయినాఁడు క్రీడి. అనేక మనోజవికారములను బచరించినాఁడు. తాను శృంగార వనములో నామెను జూచినప్పటినుండి పొందిన విరాళిని, వలపుతలఁపులను ఏకరువుపెట్టినాఁడు. చక్కిలిగింతలాదిగాఁగల చేష్టల నెన్నింటినో చేసినాఁడు. ఎన్ని చేసిన నేమి? ఆమె ముద్దరాలు. "దాసిన నింగితం బెఱిఁగి దాయఁగనేఁక తత్తరంబునన్ జేసిన చేతకున్ బదులు సేయ నెఱుంగక, మేను మేనితో రాసిన యంతనే కళలు రంజిలి" బాల కౌఁగెంటిలో నుండి పోయినదేకాని ప్రతిసేఁత సేయ లేదు. రసికశేఖరుఁ డైన క్రీడి ముద్దరాలి మన్మథక్రీడలోని ముగ్ధానందమును జవిచూచినాఁడు. మనసు మఱల సుభద్రాగత మగుచున్నది. మనము నీ ముద్దరాలిని వీడి యవ్వలి కరిగి సుభద్రం గాంతము.

సుభద్ర

సుభద్ర కుందనపుం బ్రతిమ; పార్థసారథికిఁ దోఁబుట్టువు. పార్థునకో, మేనమఱఁదలే. తన లోకోత్తర సౌందర్యముచేతను, గుణాతిశయముచేతను, మేనఱికపుఁగూర్మి పెంపునను గవ్వడిని సన్న్యాసినిఁ జేసిన మన్మథ నిస్త్రింశము.

గదుఁడు చెప్పఁగా నామెరూపలావణ్యముల కచ్చెరువుపడిన యర్జునుఁడు సమయమునకు నిరీక్షించు చుండ, దైవికముగ భూప్రదక్షిణము సంభవించినది. ఈ తీర్థయాత్రవల్ల ముఖ్యఫలము సుభద్రను బెండ్లిచేసి కొనుటయే. పాండవవంశాంకూరమగు నభిమన్యుని పుట్టువునకు సుభద్రాకరగ్రహణమే కారణ మగుటచే నీ పెండిలి ప్రాముఖ్యమును బొందుచున్నది.

కృష్ణునుమతిని గుహావాసన్న్యాసియైన కిరీటికి సుభద్ర సేవలు చేయుచున్నది. అర్జునుని రూపలావణ్యముల నిదివఱకే వినియున్నదిగావునఁ గొన్నాళ్లుండి యొకానొకనాఁడు తనకు డెందములో ననుకొన్నది, "వాసవిరూపచిహ్నముల వార్తలు మున్ వినియుండుదుంగదా యాసొబగెల్ల నేఁడు గనన య్యెడు వీరల యందు" నని. ఇతఁడే యర్జునుఁడా యని హృదయము సందేహించుచున్నను గన్పట్టెడి యసంగతిచేఁ గాదనుకొన్నది. "ఇవ సన్న్యాస మసంగతంబగు మహా సుకుమారుఁడు రాకుమారుఁ డీగాసికి నోర్చునే?" కనుక కాదు. "కలరెకా మఱి మానిసిఁబోలు మానుసుల్!"

ఈ విషమున సంశయమును దీర్చుకొని యాయువతి పతింప మెప్పటియట్లు సేవలొనర్చుచున్నది.

కలవారి యాఁడుపడుచు గావున నిద్దంపు మేలి సొమ్ములు, చక్కఁగా దిద్దిన కస్తూరిబొట్టు, మఱి యిఁక కావలసిన యలంకారవిశేషములు—వీనితో ప్రొద్దొక సింగారమున వచ్చెడి ముద్దియను గాంచిన కుంతి ముద్దులకొడుకు మోహాతురతకుఁ గడ లేదు.

సుభద్ర జగదేకసుందరి. అర్జునుఁడు మేనబావ కూఁతుకు. ఆమెకోసము యతివేషముఁ బూని వచ్చినాఁడు. తన భాగ్యవశమున ఆ పువుఁబోణియే సేవ సేయుట ప్రాసఁగినది. ఒక్కొకసారి ఒంటిపాటు ననును. ఇఁక నా రసికశేఖరుఁడు తత్తరముతో సెప్ప డెప్పఁడా యనుట యబ్బురమా?

దీవనల మూలమున నాతఁడు పల్కు శ్లేషభంగిమలు సుభద్రకు లజ్జాకరము లయినవి. అయినను మనసులోని యభిలాష మే కావున "మీరు మహాత్ములు, తన చేసిన సేవకునై మనసులరి వచించి"రని వేడుక పడుచున్నది. పిచ్చిపిల్ల!

ఒకనాఁడు నేపథ్యవిలాసమును జక్కఁగ సంతరించుకొనివచ్చి కృతకయతిని

"మీ రింద్రప్రస్థము గని
వారా? పాండవులఁ జూచివారా? సుఖులై
వా రందఱు నొకచో ను
న్నారా? వీరాగ్రగణ్యు నరు నెఱుఁగుదురా?"

అని ముద్దుముద్దుగా మేనబావముచ్చట్లలోనికి దింపినది. మొదటిమాటలో నరుఁ డీమెకు వీరాగ్రగణ్యుఁడు. కాదా మఱి? ఎవ్వరికిని జేరఁగాని మత్స్యయంత్రము ఛేసి చెలువను గైకొన్న సవ్యసాచి సామాన్యుఁడా? ఈ యుత్తమక్షత్రియాంగన మున్ముందుగా కామించునది రూపధేయముకన్న వీరసంపదయే కదా? సౌందర్యాదు లనంతరభావులు. ఉలూచియు సవ్యసాచి ఈ వీరవిలాససంపదకే సమాకృష్టయయినది.

కిరీటిని గుర్తించుటకుఁ గల పోలికలను జెప్పి, "వాని మేనత్తకొడుకు గావలయు నాకు నర్జునుండు పరాక్రమోపార్జునుండు" అని యీమహామహుని భూప్రదక్షిణసమాచారమును బృచ్ఛించుచున్నది. విజయుని దలంచినంతనే సుభద్రకుఁ గోరిక లీరికలెత్తినవి. హృదయము, మాటలు రసార్ద్రము లైపోయినవి. ఇఁక నామె కెంత వలపో యాతనిపై? తెలపోయనైనను లేముగదా!

మాటిమాటికి తన యనురాగము తేటపడునట్లడుగు నాతరుణీలలామకు విజయుఁడు వలపు వడ్డికిఁ బాఱఁగా —

"ఆకవ్వడి యతివేషముఁ
జేకొనియున్నాఁడు నీకుఁ జెంతనె, యెన్నా
ళ్లో కలదు వచ్చి, యింకను
నీకేలక మిందుకైన నీ వెఱుఁగవుగా?"

అనవంతలో సుభద్ర తన మనసులోని భావమే నిక్కువ మయ్యెనని యెంచి, సిగ్గు అగ్గలమయి దిగ్గున లేచిపోఁబోయినది.

సవ్యసాచి తెలివితక్కువవాఁడా పోనిచ్చుటకు? ఆమెకరాబ్జము నొడిసి పట్టుకొన్నాఁడు. దేవకిపట్టి లలాటపట్టిక చెమటపెట్టినది. చనుకట్టు గగుర్పొడిచినది. కట్టుంగొంగు గూడ సంత వీడెనఁట. ఎన్ని సాత్త్వికభావము లుదయించెను! ఇఁక మరుని కిదే సమయము. శేకిరూపులు సారించి తరుణిని, నరుని సరికోలలఁ బడజేసినాఁడు. నరుఁ డవ్వారారోహను చేతిమీఁదికి రాఁదిగువ నామె నమ్రవదనయై దూరముననే నిలఁబడినది. క్రీడి చిలుకనో గోరవంకనో చాటు చేసికొని పెండ్లిసుద్దుల నెచ్చరించినాఁడు.

సుభద్రమన మాతని మనవులకు నలరిపోయినది. మాటల తియ్యందన మింతింతని యనఁగూడని యక్షర సుధాసమగ్రములైన కులుకుఁబల్కులతో —

"మేరలా యిది మీయింటివారలకును?
పెద్ద లున్నారె వారె పెండ్లి సేయఁ
గలరు వేగిరపాటింత వల దటంచు
విన్నపము సేయరాదె యో చిన్ని చిలుక!"

అని చిలుక నోరఁజేసి పలికినది. అటుతరువాత నాఘనుని వీడి మెఱుఁగుఁదీవియఁబోలె మెలంత యంతిపురమున కరిగినది. అరిగిన నేమాయె? చేతోభవుఁడు చేతఁగానివాఁడా? అలుగులఁ బదను పెట్టుచున్నాఁడు. సుభద్ర తన తెలివిలేమికిఁ గుందుచున్నది. ఎట్టిదా తెలివిలేమి?

"దిగ్గన లేచి తన్నతఁడు
త్రపమదంబునఁ జందమామలా
నిగ్గుటరంగుమీఁదికయి
నెమ్మిఁ గరాబ్జము వట్టి యీడ్చినన్,
బిగ్గఁ గవుంగిలించి సుఖ
నీరధిఁ దేలఁగనీక"

సిగ్గువడినది. ఇంతకన్న తెలివితక్కువ యేమి కావలెను? చిరతపఃఫలము చేతి కందినప్పుడు గొబ్బున ననుభవింపని తాను వెడఁగుఁగోమలి కాదా? కనుకనే ఆ నేరమునకు ఫల మిప్పు డనుభవింపవలసివచ్చినది.

విరహము దుస్సహము. యౌవనము మదోద్రిక్తము. "ఆముకవిసిన కుచకుంభసీమయం దామదవతీ నవమన్మథుని జేర్చుకొని సుఖించు టెన్నఁడో" యని యెంచరాని కోర్కులకు నెదనుమ్మకొని, భావమగ్నయై కలలుగాంచి కళవళపడుచున్నది సుభద్ర. ఆహా! వలపు తీపిపస యెట్టిది!

ఇన్నాళ్లవలె మునిచెంగటికిఁ బోని యీ యంగన వదినెల వేళాకోళపు మచ్చికమాటలకు గుఱి యైనది. సత్యారుక్మిణుల మూలమునఁ గిరీటిరహస్యము బయలు ప్రాఁకినది. అమ్మాయి విరాళి తల్లి దేవకికిని నివేదించిరి. ఇఁక నేమి? పెండ్లి సేఁతకు సన్నాహము.

వివాహమునకు బలరాముఁ డనుకూలుఁడుగామి, నాతని 'నంతరీపము' నకు శివార్చనకై యంపి సుభ

ద్రాక్షముల ముడిపెట్టినారు. అత్తవారింటి కంపకములు గూడ జరిగినవి. మాయలాఁడు కృష్ణుఁడు పాయుధమైన రథమునీఁద శౌలియాలిని, మఱఁదిని ఎక్కించి తాను చల్లగా పెఱఁగన ట్లన్న వద్దకు జారినాఁడు.

ఈ రహస్యపుఁ బెండ్లిసంగతి నెఱింగని, ప్రోలి కాపువారు దద్దరించిరి సుభద్ర నెఱజాణతనము, మతి చిత్రము నద్దీపింపఁ, దప్పించుకొనిపోవుటకై —

" తేరు గడపఁగ మాయన్న దిద్దె నన్ను
నేయ నేరిపె వింట నొక్కింత నాకు
నాఁడిసె సత్యభామ మున్న దకరైన
నిలిచి మున్నర కౌరుఁ గెలిచె గాదె."

అని, రాజకన్యగాఁబట్టి తన ధీరత మనుక చేటపఁగా తేరు వడపుటలో నరువకు బాసటగాై యద్దగింతల నవలఁ ద్రోసి యింద్రప్రస్థము సేరుకొన్నది, కోరుకొన్న మగనితోఁ గూడ.

ఇఁక నిట క్రీడి రతిక్రీడావిలాసము, సుభద్రా పతినవోఢావిలాస ము 'విజయవిలాసము'నసే కొంతు రని యూపని పాఠకులకు వదలి యొక్క పద్యము నుదా హరింతును:

" గాఢాలింగనవిముఖము
రూఢాంగస్వేదభర మరుంద్రవ్రీడా
గూఢాపాంగము నను మన

వోఢా సంగమము వేడుకొనఁ"గెన దఁట పతికి. కాని యీ నవోఢ యెంతకాలము ముద్దరాలిగా నుంచఁ గలఁడు? ప్రౌఢ నొనర్చినఁగాని పరువంపు జవ్వనంపు ఫలము చవిగొంట గాదు. కాఁబట్టి—

"నొక్కి పలుమొనఁ బలుమొన నొక్క నేర్పె
వంటి గోరులచేఁ గళ లంట నేర్పెఁ
బొక్కి బిగికౌఁగిలింతలఁ బొక్క నేర్పె—"

ఈ నేర్పులతో నారామములయందు చతురతలు మీర రతులఁ జెనఁగిన యూవల కొంతకు నెలమసలినది. పాండవకులాంకురము అభిమన్యుఁ డుదయించి నాఁడు. విజయుని విలాసము ఫలించినది.

చేమకూరకవి శృంగారకళామర్మజ్ఞుఁడు. అతని చేతిలోఁ దీర్చిన యీ మువ్వురు నాయికలును కామశాస్త్రసూత్రములకు లక్ష్యభూతలు. కామోప భోగపరాయణలు. ఒక్క చిత్రాంగద తప్ప సుభద్ర, ఆమెతలలోనుండి వెళ్లిన యులూపి యొంత గడు సరులో, మరుని మెఱుంగుకటారులో తెలియమునే యున్నది. విజయుని లోకోత్తర సౌందర్యమునకు విజితులైన వీరు మన్మథరాజాధిష్ఠిత మైన శృంగార ప్రపంచమును దప్ప రెండవ జగము నెఱుఁగరు. భార తీయ సంప్రదాయానుసారము కవి వారిని పత్ని వ్రతుల నొనర్చి మాతృత్వమును జవి చూపినాఁడు కాని, యుదికూడ లేకున్న వీరి కామక్రియా పారతంత్ర్య మెంతటి దయ్యెడిదో మన మూహింపవచ్చునే లేము. ఏక రసవ్యగ్రహృదయ లగుటచే రసాంతరము గాని, భావ శబలత గాని వీరిలో మనకుఁ గన్పట్టను.

సీత, శకుంతల, చంద్రమతి, దమయంతి, ద్రౌపది మున్నగుఁగలవారియందువలె వివిధభావావస్థల నందు హృదయము, తత్త్వసోచిత కళావైదగ్ధ్య వీరియందుఁ గానము. కేవలము మన్మథక్రీడకోస నుపాదించు ప్రతిమలవలెఁ దోఁచునట్టిది వీరి చిత్రణము.

ద్రౌపది మున్నగుఁగల నాయిక లట్టివారు కారు. సర్వరసములయందును భావకుల నట్టాఁతెలాఁగిచు వలంతులు. లోతుపాతులు గల యొడంబడ వారి వద్ద కాని దొరకవు.

గ్రంథము 'విజయవిలాస'మగుటఁబట్టి, అందును మువ్వురు నాయికలను గూర్పవలసియున్నది. గనుక కేవల శృంగారవిలాసమే యుండుఁ బ్రాధాన్యము కావలసివచ్చినది. కవి నేయునదియును లేదు. ఇంక నాతనికి శృంగారముపైఁ గల మక్కువను మక్కువను వీరి నెపమునఁ దీర్చుకొన్నాఁడు. పడుచువారి వయసుకొవరపుఁ జేష్టలను, మాటలను మనసారఁ జిత్రించినాఁడు.

విజయవిలాసములోని సుభద్రను పీడి భారతములోని సుభద్రను దీసికొన్నచో నానారసభావ సంపన్నమయిన హృదయము, స్త్రీజనోపాదేయమైన తలఁపులు చిక్కఁగలవు. సంసారములోని కష్టసుఖములు, అన్నలవద్ద వియ్యమునందు నందనందనులు, సంయోగవియోగములయందలి సుఖదుఃఖభావరసముల యొడుదుడుకులు గేస్తురాలైన సుభద్ర వ్యక్తము చేయును. క్రొత్తగా కాపురమునకు వచ్చిన కోడలనుట, నీమెకు మన్మథరసపుఁజవులుదక్క రసాంతరానుభూతి మూరంగతమైనది.

సీరియల్ నాటకము:



రా జ రా జు

= శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి =

ఇర్వైవెకూడో రంగం

రాజరాజు నగరు.

జాము రాత్రి అయింది.

పచారు చేస్తూ రాజరాజు ఉగ్రుడై వున్నాడు.

చేతులు కట్టుకుని, మహారుద్రయ్య, ఒక పక్కగా నుంచుని వున్నాడు.

***

రాజరాజు—"వెళ్లాను, వచ్చేశాను" అని యింత గాదా? "వచ్చారు, వెళ్లిపోయారు" అని ఆ వెర్రి జాణలా? ఎన్ని విధాల అడిగినా వొక్కటే మాటా? ఇది యివాళే ప్రారంభం అయి వుంటే వుభయులకూ యింత ఐకకంఠ్యం కలగడం సాధ్యం టండీ?

మహారుద్రయ్య—(చూస్తూ వూరుకుంటాడు.)

రాజరాజు— తానే వివాహం చేసుకుంటానని ఆదిలోనే పట్టు పట్టగూడదూ? అప్పుడే కత్తికట్టి వుండినా యెంత బాగుండిపోనూ?

మహారుద్రయ్య—(చూస్తూ వూరుకుంటాడు.)

రాజరాజు—ఇంత ద్రోహప్పని— యింత నీచప్పని—యింత దారుణప్పని మరేమయినా వుందిటండీ? అప్పుడలా వూరుకున్న అబ్బాయి వొకరి ప్రోద్బలం లేకుండా ఇప్పుడిలా చెయ్యడమన్నా సాధ్యం టండీ?

మహారుద్రయ్య—ఈ సందేహం నాకు మొదట్లోనే తట్టింది. ఎవరి ప్రోత్సలం వుండినా లేకపోయినా సుబుద్ధి ప్రోద్బలం మాత్రం— (అర్థోక్తి)

రాజరాజు—తమ్ముక్కడి ప్రోద్బలం లేదంటారా మీరు? చిట్టి వీరన్నగారి కిది తెలిసివుండదంటారా మీరు?

మహారుద్రయ్య— తెలిసివుండవచ్చు; కాని—(అర్థోక్తి)

రాజరాజు—తల్లికూడా—(అర్థోక్తి)

మహారుద్రయ్య— (దోసిలి వొగ్గి) అంత మాట సెలవిప్పించవద్దు మహాప్రభూ! తక్కినవారి నెవరి నేమన్నా— (అర్థోక్తి)

రాజరాజు—వాళ్లని మాత్రం అని ప్రయోజనం?

మహారుద్రయ్య—అదే నేను మనవి చేసుకునేది. జరిగిపోయినదానికి హేతువులూ, వివరాలూ ఏమయినా కావచ్చు; వాటివల్ల మన కేమీ ప్రయోగా

జనం లేదు. కనక యిక ముందు జరగవలసింది — (అర్ధోక్తి)

రాజరాజు—(పళ్లు కొరుకుతూ) ఉప్పు పాతర వెయ్యాలి మీ మాతృద్రోహికి—(అర్ధోక్తి)

మహారుద్రయ్య—(చెవులు మూసుకుని మొగం వంచుకుంటూ) శివశివా! శివశివా!

రాజరాజు—(మహారుద్రయ్య కేసి తీక్ష్ణంగా చూస్తాడు.)

మహారుద్రయ్య—దయ తలచవలసిం దని నేను ప్రార్థించడంలేదు; కాని యేలినవారు చాలా దూరం ఆలోచన చెయ్యవలసివుంది.

రాజరాజు—పోనీ, శిరచ్ఛేదం— ఏమంటారు మీరు?

మహారుద్రయ్య—వినలేను మహాప్రభూ!

రాజరాజు—(చకితుడై) అదేమిటండీ?

మహారుద్రయ్య—తమకి తెలవని దేమి వుంది? నేను మనవి చేసుకోవలసిన అగత్యమున్నా దేమిటి? ధర్మాని కిన్ని మార్గాలు లేవు. తన్నిర్వహణం కూడా నిక్కచ్చిగానే చెయ్యవలసివుంది; కాని దానికి విశేష విధు లున్నాయి.

రాజరాజు— నా కంతమాత్రమూ తెలవ దంటారా మీరు?

మహారుద్రయ్య—ఎంతమాట?

రాజరాజు— మరి మీరు చెప్పే విశేష విధు లేమిటి?

మహారుద్రయ్య—ఇది యేలినవారి ఆత్మవృత్తం. ఆపైని, యిటు స్వచ్ఛంద మైన లోకం, అటు అవిచ్ఛిన్న మైన వంశం.

రాజరాజు—(పళ్లు కొరుకుతూ) వంశం! ఇలాంటి నీచులవల్లనా వంశాభివృద్ధి కోరవలసింది?

మహారుద్రయ్య—మరో మార్గం ఏదీ?

రాజరాజు—(ఉద్రిక్తుడై రూక్షంగా చూస్తూ కొంచెంసేపు వూరుకుని) మీ రేమంటా రండీ?

మహారుద్రయ్య—(దోసిలి వొగ్గి) ముందు, చాలా దూరం ఆలోచించవలసిం దని మ మ్మేలినవారిని మళ్లీ మళ్లీ ప్రార్థించుకుంటున్నాను.

రాజరాజు—తరవాత?

మహారుద్రయ్య—తరవాత శిక్ష విధించవలసిం దనే నామనవి.

రాజరాజు—పోనీ, మీరు విధించ మనే శిక్ష యేమిటి?

మహారుద్రయ్య — మనవి చేసుకుంటున్నాను. (గంభీరంగా చూసిచూసి) మహాప్రభూ! మరి చిత్రాంగీ దేవమ్మగారి సంగతి—(అర్ధోక్తి)

రాజరాజు—(కురుసుగా) అది వేరే సంగతి.

మహారుద్రయ్య — నేను కాదనడం లేదు. దాంతో పాటు "ద్రోహం జరిగిందా లేదా" అనేది కూడా వేరే సంగతే. ఇంత వున్నదల్లా యేమిటంటే? ద్రోహమే జరిగి వుంటే దానికి అబ్బాయిగారొక్కరే బాధ్యులు కారు.

రాజరాజు— అయితే?

మహారుద్రయ్య—అది నిర్ధారణ అయిపోయింది కనక, యిప్పుడు, ద్రోహం జరిగిందా లేదా అన్న విచారణ. ఇది అవశ్యమూ చెయ్యవలసిందే; కాని యెటు నిర్ధరించడమూ మనకి సాధ్యం కాదు. సర్వమూ ఆ మార్కండేయస్వామికే యెరుక. ఎంచేత నంటే? చిన్న రాణీగారి వ్రతం సంగతి యోచిస్తే—(అర్ధోక్తి)

రాజరాజు— ఇప్పుడా వ్రతంమాట యెందు కండీ?

మహారుద్రయ్య—(నిదానంగా) ఇప్పుడే కాదు, అప్పుడే మనవి చేసుకున్నాను నేను, ఆ వ్రతం అంగీకరించవ ద్దని.

రాజరాజు— (తేల్చేస్తూ) సరేసరే, ఆ వ్రతం సంగతి యేమిటి?

మహారుద్రయ్య— చిన్న రాణీగారి వ్రతం సంగతి యోచిస్తే, ద్రోహం జరిగివుండవచ్చు. అబ్బాయిగారి శీల నైశిత్యం స్మరిస్తే, జరిగివుండకా పోవచ్చు.

రాజరాజు—(వెటకారంగా తల యెగర వేసుకుంటూ) ఓహో, అదా మీ యెత్తు?

మహారుద్రయ్య—తమ రాగ్రహిస్తే నేను మనవి చేసుకోలేను; కాని నేను విన్నవించుకునేది పూర్తి కాకుండా—(అర్ధోక్తి)

రాజరాజు —అలాగే కానివ్వండీ, చూతాం.

మహారుద్రయ్య— చిత్తం చిత్తం. వెళ్లినట్టు

మీరూ అంగీకరిస్తారు. వచ్చినట్టు వారూ అంగీకరిస్తారు. పూజాసమయంలో—(అర్ధోక్తి)

రాజరాజు — అవునవును. మీరూ గుర్తించారూ అదీ? పోతుటీగ అయినా చూడగూడదని నియమం కదా, ఆ పేరు చెప్పే నన్ను దూరంగా వుంచుతున్నారు కదా, మరి అమ్మాయి యెలా వెళ్లగలిగానూ ?

మహారుద్రయ్య — అంటే, బాధ్యత యెవరి మీద—(అర్ధోక్తి)

రాజరాజు — (నవ్వి) మీకు తోచిన శిక్ష యేమిటో తొరగా చెప్పండీ!

మహారుద్రయ్య — కనక, పూర్వాపర సందర్భాలు బాగా పరిశీలిస్తే, శిక్ష విధించాలి; ఆశిక్ష ఉభయతారకంగానూ వుండాలి.

రాజరాజు — ఊహూ!

మహారుద్రయ్య — నా మనవి యేమిటంటే? బతికుండగా కళ్లబడకుండా వుండేటట్టూ, రాజమహేంద్రపురమే ప్రవేశించకుండా వుండేటట్టూ, ఈ ప్రాంతమే మరిచిపోయేటట్టూ కట్టడిచేసి, దూరస్థమైన యే మండలానికో ఆధిపత్యం—(అర్ధోక్తి)

రాజరాజు — (మండిపడి పళ్లు కొరుకుతూ) మండలాధిపత్యం! వంచన్న పాశంగా సామ్రాజ్యాధిపత్యమే యివ్వవద్దూ?

మహారుద్రయ్య — (ముఖం వంచుకుని వూరుకుంటాడు.)

రాజరాజు — ఈ విషయం మీ రింత తేలిగ్గా భావిస్తారని నే ననుకోలేదు. మీ రింత అసందర్భంగా ఆలోచన చెబుతా రని కూడా నే ననుకోలేదు.

మహారుద్రయ్య — (ముఖం వంచుకుని వూరుకుంటాడు.)

రాజరాజు — ఇది నలుగురికీ తెలిస్తే నా స్థితి ఎంత లఘ్వాన్న మయిపోతుందో—(అర్ధోక్తి)

[తెరలో]

“ మహాప్రభూ! ”

రాజరాజు — (ద్వారం కేసి చూస్తూ) ఏమిటదీ?

మహారుద్రయ్య — చిట్టి మహాప్రభూ!

రాజరాజు — ఎందుకట?

మహారుద్రయ్య — (ద్వారం కేసి చూస్తూ) చిట్టీ!

[చిట్టి వస్తుంది. “ఎందుకూ?” అన్నట్టు రాజూ, మహారుద్రయ్యా ఆత్రంగా చూస్తారు.]

చిట్టి — దర్శనం కోరి మహామంత్రిగారు వేచి వున్నారు మహాప్రభూ!

మహారుద్రయ్య — (చకితు డవుతాడు.)

రాజరాజు — (చిట్టితో రూక్షంగా) ఇప్పుడెంతమాత్రమూ వీలులేదు. నువ్వు మళ్లీ యీవార్త తేవడానికి వల్లకాదు. శీఘ్రంగా వెళ్లమను.

[చిట్టి వెళ్లిపోతుంది]

మహారుద్రయ్య — (నసుగ్గా) సంగతేమిటో — (అర్ధోక్తి)

రాజరాజు — (ఉద్రిక్తుడై) ఏమిటో నా? ఇంకా మీకు బోధపడలేదూ?

మహారుద్రయ్య — (మెల్లిగా) లేదు మహాప్రభూ!

రాజరాజు — సంగతి తా అప్పుడే అందరికీ తెలిసిపోయిందన్నమాట. మల్లప్ప, ద్రోహిని పట్టి తీసుకురావడంకూడా అందరూ చూశా రన్నమాట.

మహారుద్రయ్య — (చూస్తూ వూరుకుంటాడు.)

రాజరాజు — మీ యేర్పాటు లింత చక్కగా వున్నా యన్నమాట.

మహారుద్రయ్య — (ముఖం వంచుకుంటాడు.)

రాజరాజు — చిట్టిపేరన్నగారు ద్రోహిని విడుదల చేయించడానికి వచ్చా రన్నమాట. ఇక రత్నుడు వస్తా డన్నమాట. తరవాత మహారాణీకూడా — (అర్ధోక్తి)

మహారుద్రయ్య — (దోసిలి వొగ్గి నమ్రుడై) అపరాధిని.

రాజరాజు — ఇప్పుడు మీ అపరాధ నివేదనం తోటీ, క్షమాభిక్షతోటీ యేమి ప్రయోజనం? ఇప్పుడయినా నేను చెప్పినట్టు చేస్తారా చెయ్యరా మీరు?

మహారుద్రయ్య — (దోసిలి వొగ్గి) నాకు తోచింది విన్నవించుకున్నానే కాని నే నెప్పుడూ తమ ఆజ్ఞ జవదాటి యెరగను. సెల విప్పించండి మహాప్రభూ!

రాజరాజు — (దృఢంగా) ఇక విచారణతో పని లేదు.

మహారుద్రయ్య — చిత్తం మహాప్రభూ!

రాజరాజు — ఇది రెండో కంటివాడికి తెలవకూడదు.

మహారుద్రయ్య—అలాగే మహాప్రభూ!

రాజరాజు—నంచున్న పాళ్ళంగా – అతి రహస్యంగా – ద్రోహిని కోట దాటించాలి.

మహారుద్రయ్య — అక్షరాలా నిర్వహిస్తాను మహాప్రభూ!

రాజరాజు—రెండో జాము దాటకుండా పని చెయ్యాలి.

మహారుద్రయ్య—చిత్తం, సెల విప్పించండి మహాప్రభూ!

రాజరాజు—(పక్కకి చూస్తూ, పళ్లుకొరుకుతూ) మాతృద్రోహి కాళ్లూ చేతులూ తెగ్గొట్టించండి.

మహారుద్రయ్య—(శిరస్సు వంచుకుంటాడు.)

రాజరాజు—(మహారుద్రయ్య కేసి తీక్షంగా చూస్తూ) వెళ్లండి.

[మహారుద్రయ్య వెళ్లిపోతాడు.]

రాజరాజు—(ద్వారంకేసి చూస్తూ) చిట్టీ!

[చిట్టి వస్తుంది.]

రాజరాజు—జక్కులదీవి రాణీగారి నగరివార్త లన్నీ మనకి షక్ప్రచ్ఛింగా అందాలి.

చిట్టి—చిత్తం మహాప్రభూ!

రాజరాజు — ఏర్పాట్లు చేసి రా.

చిట్టి—చిత్తం మహాప్రభూ!

[ఇద్దరూ చెరోవేపుకి వెడతారు.]

ఇరవైనాలుగో రంగం

గోడాల చేరువ అరణ్యం.

రాత్రి రెండోజాము కావస్తోంది.

తన పరివారంతో విజయాదిత్యుడూ, సుబుద్ధీ వొక వేపునుంచీ, తన పరివారంతో మహారుద్రయ్య వొక వేపునుంచీ వచ్చి తారసపడుతారు.

పుచ్చపువ్వులాగ వెన్నెల.

***

మహారుద్రయ్య—(నిదానిస్తూ) ఎవరు, విజయాదిత్యులవారా?

విజయాదిత్యుడు—(కరుగ్గా) ఔను.

మహారుద్రయ్య—(నిర్భయంగా తల వంకించి) ఎందాకా మహాప్రభూ!

విజయాదిత్యుడు—(విరసనగా) తమకోసమే.

మహారుద్రయ్య—పనేమిటో?

విజయాదిత్యుడు — (వెటకారంగా) తమ పాదాలు సేవించుకోడమూ, తమవల్ల సర్వనాశం పొందడమూనూ మరేం పని వుంటుందీ మాకూ?

మహారుద్రయ్య—(నిర్లక్ష్యంగా) ప్చ్! సర్వనాశనమైనా సర్వాభ్యుదయమైనా దానికి కర్తలు భృత్యులే; కాని కారయితలు ప్రభువు లని తమకు తెలవందా?

విజయాదిత్యుడు—మరి మంత్రుల ఆలోచనలు?

మహారుద్రయ్య — ఆలోచనలు మాత్రమే మంత్రులవి. నిర్ణయాలూ, ఆజ్ఞలూ ప్రభువులవి.

విజయాదిత్యుడు — ప్రభువులను కీలుబొమ్మలు చేసి— (అర్ధోక్తి)

మహారుద్రయ్య— ఆ కోవలోనే చేరిన తమరు —(అర్ధోక్తి)

సుబుద్ధి — (విజయాదిత్యుడితో) తమ రుండండి మహాప్రభూ! (మహారుద్రయ్యతో కరుగ్గా) పారంగధరులవారి నేం చేశారు మహారుద్రయ్యగారూ మీరూ?

మహారుద్రయ్య — (విజయాదిత్యుడితో హేళనగా, సుబుద్ధికేసి కన్ను గీటుతూ) ప్రభువులను కీలుబొమ్మలు చేసి—(అర్ధోక్తి)

విజయాదిత్యుడు — (కచ్చితంగా) నేనూ అమాటే అనుకుంటున్నాను. అబ్బాయి నేం చేశారూ మీరు?

మహారుద్రయ్య— (నిర్లక్ష్యంగా) ఆజ్ఞాపించడానికయినా, ఏమి చేశా వనడానికయినా పైవసార్వభౌము లున్నారు. తమ రెవరూ, మధ్యని, యిలా కలగచేసుకోడానికి?

విజయాదిత్యుడు—(పళ్లు కొరుకుతూ) నేనా?

సుబుద్ధి— (విజయాదిత్యుడితో) నే నుండగా తమ కెందుకూ శ్రమ? (మహారుద్రయ్యతో) ఇలా

చూడండి. సారంగధరులవారి నేమి చేశారూ మీరూ?

మహారుద్రయ్య — (సుబుద్ధికేసి చూస్తూ హేళనగా) "మహాగజాః పలాయన్తే మశకానాం తు కా గతిః" దోమగా! తప్పుకో! (విజయాదిత్యుడితో) పార్శ్వశోముల పరివారాన్ని ఆటంకపరుస్తున్నారు తమరు. దీనివల్ల చాలా చిక్కు లున్నాయి. మర్యాదగా తప్పుకోండి.

విజయాదిత్యుడు — (కఠినంగా) మీరు కదిలా రంటే మాట దక్కదు. యోచించుకోండి.

మహారుద్రయ్య — యోచన! నాకే అయిపోయింది. రాజసేవలో ప్రవేశించడం వైభవాల కాశించి కాదు, ప్రాణాలకు తెగించి. తమరూ ఒకప్పుడు ప్రభుత్వం చెలాయించి వుండినారు. ముందున్నా చెలాయించ దలుచుకున్నట్టే వుంది. కనక, తమ సేవకు లున్నా అజ్ఞానవర్తులయి వుండా లని వుంటే ముందు మర్యాదగా తప్పుకోండి.

సుబుద్ధి — (విజయాదిత్యుడితో) కాలహరణం తప్ప మరేమీ ప్రయోజనం లేదు, సెల విప్పించండి. (మహారుద్రయ్యకేసి తిరిగి చూస్తుంగా) చెప్పు. లేకపోతే (కత్తిదూసి) కాసుకో.

మహారుద్రయ్య — (వికటాట్టహాసం చేసి సుబుద్ధితో) కుర్రకుంకా! (విజయాదిత్యుడికేసి తిరిగి చూస్తుంగా) ఏమీ?

విజయాదిత్యుడు — (కత్తిదూసి) కాసుకో!

మహారుద్రయ్య — ఓహో! (వెనక వున్న తనవారికేసి చూసి) మీ రెవరూ కలగచేసుకో నక్కరలేదు. (విజయాదిత్యుడి పరివారంకేసి చూస్తూ) ముచ్చటగా వుంటే మీరూ కత్తులు దుయ్యవచ్చు. (తానూ కత్తి దూసి సుబుద్ధిమీద నిప్పులు కక్కుతాడు.)

సుబుద్ధి — సమతలానికి రా.

మహారుద్రయ్య — (వికటంగా) సమతలం. (పళ్లు కొరుకుతూ) చేతకాకపోతేనూ. (విజయాదిత్యుడికేసి తీక్ష్ణంగా చూస్తూ) హరహరమహాదేవ!

[మహారుద్రయ్య విజయాదిత్యుడిమీది కురుకుతాడు. ఇద్దరూ పోరుతూ సమతలానికి దారి తీస్తారు. వీలు చూసుకుంటూ సుబుద్ధి వెంట నడతాడు.]

ఇరవై అయిదో రంగం

రాజరాజు నగరికీ, చిత్రాంగి నగరికీ మధ్య.

రాత్రి రెండు జాము లయింది.

రాజు చిత్రాంగి నగరికి వస్తున్నాడు.

శరవేగంతో వచ్చి వొక భృత్యుడు నమ్రము డౌతాడు.

***

భృత్యుడు — శరణు శరణు మహాప్రభూ!

రాజరాజు — ఎవ రది?

భృత్యుడు — నేను బొంగరాల బేతాళప్పని మహాప్రభూ!

రాజరాజు — ఆ, ఏమిరా?

భృత్యుడు — నన్ను నారాయణ భట్టుగారు తరిమి పంపారు రాజాధిరాజా!

రాజరాజు — ఏమిటి సంగతి?

భృత్యుడు — (వణుకుతూ) నన్నయ భట్టారకుల వారు — కాలం చేశారు — (అర్ధోక్తి)

రాజరాజు — (కళ్లు మూసుకుని విచారంగా) శివశివా! శివశివా! ఎంతపని జరిగిందిరా! ఎంత చెడువార్త తెచ్చావురా?

భృత్యుడు — నగరం అంతా భట్టారకులవారి భవనం ముంచేసింది మహాప్రభూ! జనం కోరికమీద, శవాన్ని, ముంగిట వున్న చంద్రకాంతవేదికమీద వుంచారు మహాప్రభూ!

రాజరాజు — (అభావదృష్టులు పరుపుతూ నిట్టూర్పు విడుస్తాడు)

భృత్యుడు — సోమిదేవమ్మగారు, శవం పక్కని, మాట లేకుండా కూచుని వున్నారు మహాప్రభూ! అమ్మగారికి వూపిరాడడానికీ, జనానికి భట్టారకులవారి ముఖం కనపడడానికీ, శరపరంపరలుగా కురిసిపోతూ వున్న పువ్వులూ, పువ్వులదండలూ, కర్పూరమాలలూ తప్పించలేక నారాయణభట్టుగారూ, పావులూరి మల్లన్నగారూ, వేములవాడ భీమకవిగారూ పాట్లు పాట్లయిపోతున్నారు మహాప్రభూ!

రాజరాజు—(కళ్లు తుడుచుకుంటాడు)

భృత్యుడు — సోమిదేవమ్మగారికి కడసారపు కుంకుమబొట్టుంచి తరిద్దామని వచ్చిన పేరంటాళ్లు, తొత్తిడికి తాళలేకపోవడమే కాకుండా, పువ్వుల గుట్టలూ, పూలదండల దొంకలూ తప్పించుకోలేక తూలిపోతున్నారు మహాప్రభూ!

రాజరాజు—(మళ్లీ నిట్టూర్పు విడుస్తాడు)

భృత్యుడు—ఆంధ్రమహాభారతమూ, నన్నయభట్టారకులవారి వ్యాసపీటా, ఆ భారతం లిఖించిన నారాయణభట్టుగారి గంటమూ వుంచడానికి, దగ్గర వుండి, చిదమయ్యగారు, పూలపాలకి సిద్ధం చేయిస్తున్నారు మహాప్రభూ!

రాజరాజు—(ఉలిక్కిపడి) అదెందుకురా?

భృత్యుడు—రుద్రభూమిదాకా భట్టారకులవారితో కూడా తీసుకువెళ్లి—(అర్థోక్తి)

రాజరాజు—అంతేకదా?

భృత్యుడు—చిత్తం చిత్తం. శవానికి స్నానం చేయించడానికి మహారాణీగారు, అయిదుగిండ్లతో అయిదురకాల సుగంధతైలాలూ, అయిదుకావిళ్ల పన్నీరూ, మీద కప్పడానికి పట్టుపీతాంబరాలూ పంపించారు మహాప్రభూ!

రాజరాజు—నాకున్నా వార్త ముందే యెందుకు రాలేదురా?

భృత్యుడు—మరణచిహ్నాలు గుర్తించి, యేలినవారితో విన్నవించుకోడానికి మహామంత్రిగారిక్కడికి దయచేశారు; కాని దర్శనం లభించక—(అర్థోక్తి)

రాజరాజు—శివశివా! అందుకా వారి రాక? (పశ్చాత్తాపపడుతూ) ఎంతపని జరిగిందీ? ఎంత భ్రాంతి కలిగిందీ? ఎలాంటి పుణ్యకాలం దాటిపోయిందీ? ఎంత దారుణాఘాతం తగిలిందీ?

భృత్యుడు—ప్రాణం పోయేటప్పుడు అబ్బాయిగారి దర్శనం అయినా అవుతుందేమో అని—(అర్థోక్తి)

రాజరాజు—సరే సరే నువ్వు వెళ్లు. నువ్వు అక్కడే వుండి వారి ఆజ్ఞలు పాలిస్తూ వుండు. సకలమూ సలక్షణంగా జరిపిస్తూ వుండవలసిందని నారాయణభట్టుగారితో చెప్పు.

భృత్యుడు— చిత్తం, సెలవు మహాప్రభూ! (బయలుదేరుతాడు.)

రాజరాజు—చూడూ.

భృత్యుడు — (వెనక్కి వచ్చి) చిత్తం మహాప్రభూ!

రాజరాజు— సాధ్యమైనంత త్వరగానే నేనూ వస్తాను. (ఆలోచించి) తెల్లవారకుండానే వస్తాను. ఈసంగతి చిట్టివీరన్నగారితో చెప్పు.

భృత్యుడు— మహామంత్రిగారిక్కడ లేరు మహాప్రభూ!

రాజరాజు—ఎక్కడున్నారురా?

భృత్యుడు — తెలవదు మహాప్రభూ! వారి జాడే యెవరూ చెప్పలేకుండా వున్నారండి.

రాజరాజు—అదేమిరా? ...... పోనీ, తమ్ముడితో చెప్పు.

భృత్యుడు—వారి జాడా తెలవడం లేదు మహాప్రభూ! చివరికి సుబుద్ధి అయ్యవారయినా అక్కడ లేరు. తక్కిన అరుగురు మంత్రులూ మాత్రమే అక్కడ ఉన్నారు దేవరా!

రాజరాజు — ఈమాట వారితోటే చెప్పి, అక్కడే వుండిపొమ్మను. అయితే, సర్వసేనాధిపతిగారు—(అర్థోక్తి)

భృత్యుడు—ఇప్పుడు వారుకూడా అక్కడ లేరు మహాప్రభూ!

రాజరాజు—ఇప్పుడంటే?

భృత్యుడు — భట్టారకులవారు కాలం చేసేదాకా అక్కడే వున్నారండి వారు; కాని తరవాత, వారు శవంమీద పుష్పాలు చల్లుతూ వుండగా, పడవాళ్లు జగ్గరాజుగారూ, వీరపారెడ్డిగారూ, రుద్రప్పనాయనింగారూ, చేతినీడుగారూ ఆత్రంగా వచ్చి వారిని తోడుకునిపోయారు మహాప్రభూ!

రాజరాజు—(ఆలోచించి) సరే నువ్వు వెళ్లు.

[భృత్యుడు వెళ్లిపోతాడు.]

రాజరాజు—(నిట్టూర్పు విడిచి) విద్వత్పర్వతం, సకవిశిఖరంగా కుంగిపోయింది. అమూల్య జాతిరత్నాలన్నీ పాతాళంపా లయిపోయాయి. వంశచరిత్ర అధ్వాన్న మయిపోయింది. (నిరాశాదుఃఖంగా) వంశమే

అంతమయిపోతోంది, యిక వంశచరిత్ర యెక్కడ? ......కాని చిట్టిపీరన్నగారూ, తమ్ముడూ, సేనాపతీ యెక్కడికి వెళ్లినట్టూ? మహారుద్రయ్యగారు వెళ్లిన పని—భట్టారకులవారి మాట వినకపోవడం తప్పవుతుందా? (ఆలోచించి) చిత్రాంగి వర్తమానం యేమిటో, యెందుకో చూసుకుని, తరవాత యేసంగతయినాను.

ఇరవైఆరో రంగం

చిత్రాంగి నగరు.

గదిలో తలు పోరగా చిత్రాంగి.

గుమ్మంలో, మొలకట్టిన చిత్రాంగి కటారితో చిలక.

ఇవతల, వోక పక్కగా రాజు.

*

* *

రాజరాజు—(పళ్లు కొరుకుతూ చిలకతో) వ్రతమూ, గితమూ యిక పనికిరావు.

చిలక—(నిర్లక్ష్యంగా చూస్తూ తల పంకించి వూరుకుంటుంది)

రాజరాజు—ఈ తలుపుచాటులూ, యీ వేషాలూ యిక సాగనివ్వను.

[చిలక చిత్రాంగి కేసి చూస్తుంది. సారంగధరుడి కటారి వడిచేత వుంచుకుని, చురచుర చూస్తూ, ఆకొన్న ఆడపులి లాగ యివతలికి వచ్చి "బకమీద చూడా లని వుందా?" అని గద్దిస్తూ అడిగి, చిత్రాంగి, తోక తొక్కిన ఆడతాచు లాగ రాజు ఎదట నిటార్గా నుంచుంటుంది. చకితుడై రాజు ఒక్క అడుగు వెనక్కి వేస్తాడు.]

చిలక—(చిత్రాంగిని చూపిస్తూ, రాజుతో, వెటకారంగా) ఏం, జంకుతూ, చక్కంగా చూడవచ్చునే?

రాజరాజు—(చిత్రాంగిని ఎగాదిగా చూస్తాడు)

చిత్రాంగి—(రాజు కేసి తీక్ష్ణంగా చూస్తుంది)

చిలక—(రాజుతో) కళ్లు కావు నీవి, గాజు బిళ్లలు. ఎందుకూ ఆ వ్యర్థప్రయాస?

రాజరాజు—(చిలక కేసి రూక్షంగా చూస్తూ) ఆ!

చిత్రాంగి—(వికటంగా నవ్వి) ఇలా చూడూ ......కొడుకు కేం చేసుకున్నావ్?

రాజరాజు—(చూసిచూసి) ఎవరికీ కొడుకు?

చిత్రాంగి—నీకు. (అంజలిబంధంతో రత్నాంగి నగరికేసి చూపిస్తూ) ఆమహాయిల్లాలు రత్నాంగీదేవమ్మగారికిన్నీ.

రాజరాజు—మరి – నీకు?

చిత్రాంగి—పతి – (అని స్ఫుటంగా చెప్పి వొక్క క్షణం ఆగి) అనుకుంటూ వచ్చాను; కాని కొడుకయినా కాలేకపోయాడు. పిరికిపంద.

రాజరాజు—(కోపంగానూ, దిగులుగానూ) ఏమన్నావూ?

చిత్రాంగి—అదంతా తరవాత. అదిగో, నీ కొడుకుని మృత్యువు తరుముకు వెడుతోంది, పోయి, ముందు రక్షించుకో.

రాజరాజు—(అభావదృష్టులు పరుపుతూ) ద్రోహం—(అర్ధోక్తి)

చిత్రాంగి—నీదీ ద్రోహం. కోడలిని చెరపట్ట తలిచావు, ఇల్లాలికి కడుపుచిచ్చు తెచ్చిపెట్టావు, వంశం నాశనం చేసుకుంటున్నావు, నీదీ క్రౌర్యం! నీదీ దౌష్ట్యం! నీదీ మూఢ్యం!

రాజరాజు—(తన కటారిమీద చెయ్యివేసుకుని, పళ్లు పటపట కొరుకుతూ) మర్యాదాతిక్రమణం చేస్తున్నావు. జాగ్రత్త.

చిలక—(పళ్లు కొరుకుతూ) మర్యాద! ఎలా వుంటుందో యెరుగుదువా? (తన కటారి చూపి) తియ్యి కటారి!

చిత్రాంగి—(కటారి యెత్తి చూపిస్తూ) సాహసిస్తే వొక్క పోటుకి చాలవు; కాని నిన్ను తాకరాదు. నువ్వు చండాలుడివి.

రాజరాజు—(ఆసూర్దాగా) ఆ, ఆ! ఆకటారి సారంగధరుడిది, సారంగధరుడిది.

చిత్రాంగి—ఔను. ఇది సారంగధరుడిదే. అతని చేతులతో నీగుండెల్లో గుచ్చవలసిం దిది. కాని

నేను తన సవతితల్లినని తన హృదయంమీద రాసి వుందిట. చీల్చి చూసుకో మని—(అర్ధోక్తి)

రాజరాజు—(నెత్తి కొట్టుకుంటూ) శివశివా! శివశివా!

చిలక—ఆమాట వుచ్చరించడానికి నీ కర్హత లేదు.

చిత్రాంగి—మరి—(తన గుండెలు చూపిస్తూ) ఇక్కడ యేమి రాసి వుందో యెరుగుదువా? నువ్వు పతితుడ వనీ, నీకొడుకు అడ దనీ—(చర్రు మని కటారి దూసి) పాపీ, చూసుకో!

[ఇలా అని 'చిలకా' అని పిలుస్తూ చిత్రాంగీ, 'తల్లీ' అని పిలుస్తూ చిలకా వొకరొకర్ని చూసుకుంటూ పొడుచుకుని, పడిపోతారు. "ఆ, ఆ" అని ఆత్రపడుతూ, చిత్రాంగిని పట్టుకోబోతూ రాజు వంగుతాడు.]

చిలక—చండాలుడా, మాఅమ్మని తాకవద్దు. అమ్మా! కటారి తీసేసుకోండి.

[కటారి తీసేసుకుని హీనస్వరంతో "శివ-శి-వా" అంటూ చిత్రాంగి మెడలు వాల్చేస్తుంది. చిలక రాజుతో "పాపీ! పుట్టికట్టుకు పోతేవు" అని తానున్నా కటారి తీసేసుకుని హీనస్వరంతో "శివ-శి-వా" అంటూ మెడలు వాల్చేస్తుంది. రాజు ఒక్క క్షణం స్తబ్ధుడయిపోతాడు.]

రాజరాజు—(ప్రకృతిలో పడి ఆవేశంతో) సారంగధరా! సారంగధరా!

[ఇలా అంటూ దురుసుగా వెళ్లిపోతాడు.]

ఇరవైయేడో రంగం

రాజరాజు నగరి ముందరి బయలు.

రాజు చిత్రాంగి నగరినుంచి వస్తున్నాడు.

పరుగుపరుగున వచ్చి ఒకభృత్యుడు నమ్రుడవుతాడు.

*

* *

భృత్యుడు—శరణు శరణు మహాప్రభూ!

రాజరాజు—ఏమ దది?

భృత్యుడు—నేను వీరశరభన్నని మహాప్రభూ!

రాజరాజు—ఏమిటి సంగతి?

భృత్యుడు—నేను తిరిగివస్తూవుండగా తమ్ముడు గారూ, సుబుద్ధి అయ్యవారూ వచ్చి అటకాయించారు మహాప్రభూ!

రాజరాజు—(రుష్టుడై) అటకాయించి?

భృత్యుడు—కలసటం అయిపోయిందండి.

రాజరాజు—అయిపోయి?

భృత్యుడు—కాళ్లు తెగి, చేతులు తెగి, ముక్కు తెగి, చెవులు తెగి, పేగులు తెగి, జుట్టు తెగి, తలకాయ యెగిరిపోయి, తమ్ముడిగారి చేతిలో మహారుద్రయ్యగారు దిక్కుమాలిన చావు చచ్చిపోయారు మహాప్రభూ!

రాజరాజు—(మండిపడి) ఆ, తమ్ముడి దౌర్జన్యమా?

భృత్యుడు—సుబుద్ధి అయ్యవారు—(అర్ధోక్తి)

రాజరాజు—(విచారంతో) అబ్బాయి మాటేమిటిరా?

భృత్యుడు—కాళ్లూ చేతులూ తెగ్గొట్టేశాం దేవరా!

రాజరాజు—శివశివా! (కూలబడి) బతికి వున్నాడా?

భృత్యుడు—అంతా అయిపోయింది మహాప్రభూ!

రాజరాజు—హరహరా! (ఉండుండి ఆవేశంతో) అయిపోయింది! అయిపోయింది. సర్వనాశనం! సారంగధరుడు లేడూ? చిత్రాంగి లేదూ? ఇక రాజరాజు—(అర్ధోక్తి)

[ఇంకొక భృత్యుడు వస్తాడు.]

రెండో భృత్యుడు—శరణు శరణు మహాప్రభూ!

రాజరాజు—నువ్వెవరు?

రెండో భృత్యుడు—యెల్లమందప్పని మహాప్రభూ!

రాజరాజు—ఆ, ఏమిటి?

రెండో భృత్యుడు — వల్లమాలిన మూకతో తమ్ముడుగారు దండెత్తి వచ్చారు మహాప్రభూ!

రాజరాజు—(ఆవేశంతో) ఏమన్నావూ?

రెండో భృత్యుడు—కోట చొరబడేశారు మహాప్రభూ!

రాజరాజు—చొరబడి?

రెండో భృత్యుడు—నగరిమీదికి వచ్చేస్తున్నారు దేవరా!


రాజరాజు—వచ్చి? వెనకటి లాగే వొక ఆట ఆడదా మనుకుంటున్నాడా? హ! హ! (అమాంతంగా లేచి) ఇప్పు డెక్క డున్నాడురా?

[తెరలో రణగొణధ్వని]

భృత్యుడు—ముందు ఆయుధాగారం ఆక్రమించుకున్నారండి. ఇప్పుడు బొక్కసం—(అర్ధోక్తి)

రాజరాజు — ఆక్రమించుకుంటున్నాడా? (కటారి దూసి, సింహనాదం చేసి) కొడుకు లేని రాజరాజుకి తమ్ముడు మాత్రం యెందుకూ? ద్రోహీ! ఎదటికి రా.

[పరవళ్లు తొక్కుతూ వెళ్లిపోతాడు.]*



*లిఖిత రూపంగా గ్రంథకర్త అనుమతి పొందకుండా యీనాటకం యెవరూ ప్రదర్శించ గూడదు.



నల నృపతి వంశము

= శ్రీ భావరాజు వెంకటకృష్ణరావు =

దక్షిణాపథమునందు ఒకనాలను ఒకప్పుడు చిన్న రాజ్యమును స్థాపించుకొని ప్రసిద్ధిగాంచిన నలవంశముయొక్క చారిత్రము నేటివఱకు నిరాధారములయిన యూహలమీదనే యాధారపడియున్నది. నలవంశము మొదట ఎచ్చటిదో, యెప్పుడెంతకాలము రాజ్యాధికారము ననుభవించెనో ఇంకను నిర్ధారణకాలేదు. రామకృష్ణగోపాల భాండార్కరు పండితుడు నలరాజులనుగురించి వ్రాయుచు చాళుక్యుల తిలకుడైన మొదటి కీర్తివర్మచే బరిమార్చబడిన నలవంశము యేలిన రాజ్యఖండము ఎచ్చట నుండెనో నిర్ణయించుట దుస్సాధ్యమని తెలిపెను.[1] వారి రాజ్యము కొంకణమందెచ్చటనో యుండియుండవచ్చునని యూహించిరి. పిమ్మట కొంతకాలమునకు చాళుక్య విక్రమాదిత్యుని (మొదటివాడు)కర్నూలు తామ్రశాసనము దొరికెను.[2] అందులో నలవాడివిషయ పేర్కొనబడుటయు, శాసనము కర్నూలునందు లభించుటయు కారణములుగా, అందుదాహృతములయిన గ్రామముల స్థలనిర్ణయము గావించుచు, ఫ్లీటుపండితుడు 'నలవాడి'విషయ ఇప్పటి కర్నూలు — బళ్లారి మండలములలో చేరిన భాగము గావచ్చునని అభిప్రాయమిచ్చెను.[3] నలవంశమును నాశనముచేసి వారి రాజ్యఖండము నాక్రమించుకొనినట్లుగా, మొదటి కీర్తివర్మనుగురించి ఆయ్యవోళ్లె శిలాశాసనము దెలుపుచున్నది.[4] కీర్తివర్మకాలము క్రీ. శ. ౫౬౬-౭ మొదలుకొని ౫౯౭-౮ వఱకు గావచ్చునని సహేతుకముగా ఫ్లీటుపండితుడు నిర్ణయించెను.[5] ఈ నిర్ణయమును బట్టి, యించుమించుగా క్రీ.శ ౫౯౦ నాటికి నలవంశము నిర్మూలింపబడినదని యూహింపవచ్చును. చాళుక్యరాజధాని- వాతాపినగరము నలవాడివిషయకు దగ్గరగా నుండుటచేత, కీర్తివర్మ తన రాజ్యక్షేమముకొఱకు, నలవంశమును కూకటివేళ్లతో కూల్చియుండెననుట నిస్సంశయము. ఆనాడు నలరాజ్యము, లేక నలవాడి కృష్ణా, తుంగభద్రానదుల మధ్యభాగమున రాయచూరిమండ

1. బొంబాయి గెజటీర్, సం. ౧. భా. ౨. పుట ౧౨౧.
2. *J B.Br. R.A S.* Vol XVI, p 225, 241.
3. బొంబాయి గెజటీర్, సం.౧. భా.౨. పుట ౩౬౩.
4. ఎపిగ్రాఫియా ఇండికా, సం.౬. శాసనపాఠములోని పంక్తి: "నలమౌర్యకదమ్బకాలరాత్రిః"
5. బొంబాయి గెజటీర్, సం.౧. భా.౨.

లమునందు వ్యాపించి కొంతవరకు బళ్లారిమండలములోనికిని, కొంతవరకు కర్నూలు మండలములోనికిని ప్రాకియుండును. ఈయూహకు మొదటి విక్రమాదిత్యుని కర్నూలుశాసనమే ప్రమాణము. చాళుక్యరాజ్యస్థాపనారంభకాలమున కృష్ణా, తుంగభద్రానదుల ప్రాంతమునందు నలవంశ మొకటి రాజ్యముచేసి, కదంబరాజవంశ్యులకు సామంతులుగా నుండిరనుట స్పష్టము. కాని తొలుత ఈ నలవంశము ఇచ్చటివారు గారనిమాత్రము తోచుచున్నది. నలవంశము షట్చక్రవర్తులలో ప్రసిద్ధుడు, దమయంతీప్రాణవల్లభుడు నగు నలచక్రవర్తి నుండి యేర్పడినదని యూహించుట అసంగతము గాదు. ఆనలరాజు నిషధేశ్వరుడు. నిషధరాజ్యము నేటి విదర్భరాష్ట్రమునకు, అనగా బీరారు-బీదరుసీమలకు ఉత్తరమున సాత్పూరా వింధ్యపర్వతశ్రేణుల మధ్య వ్యాపించియుండిన ప్రాంతమని పురాణములవలన తెలియుచున్నది. నలవంశము తొలుత నలచక్రవర్తితో సంబంధము కలదని యెంచినయెడల చాళుక్యరాజుచే నిర్మూలింపబడిన కాలమునాటికి ఆరాజవంశమువారు నిషధమునుండి, అనగా మధ్యపరగణాలనుండి పినగంగ, ప్రాణహిత, ఇంద్రావతి, గోదావరి నదీప్రాంతములను దాటి క్రమముగా కృష్ణా, తుంగభద్రాతీరములకు కాలవశమున నలసవచ్చి రాజ్యస్థాపన గావించి, చిరకాలానుభవమువలన ఆసీమకు నలవాడి యన్న పేరు ఆపాదించియుండిరని విశ్వసింపవచ్చును.

నలవంశజుల చరిత్ర మొక్కింత,— వారు నలవాడి సీమయందు రాజ్యము సంపాదించుకొనుటకు పూర్వము జరిగిన వృత్తాంతము—ఇటీవల దొరకిన తద్వంశీయుల ప్రాచీనశాసనములబట్టి తెలియవచ్చుచున్నది. ఆశాసనములలో మొదటిది భవత్తవర్మయొక్క రిథపూరు తామ్రశాసనము; రెండవది స్కందవర్మయొక్క పొడాఘడ్ శిలాశాసనము. రిథపూరు తామ్రశాసనము మధ్యపరగణాలయందున్న అమరావతి జిల్లా, మోర్సి తాలూకా, రిథపూరు (ఋద్ధపురము) గ్రామమున లభించెను. అది వాకాటకరాజ్ఞి ప్రభావతీగుప్తాదేవి యొసగిన యొక తామ్రశాసనముతో పాటుకలిసి దొరకెను. పొడాఘడ్ శిలాశాసనము నేటి జయపురం సంస్థానపు మన్యప్రాంతమున (ఏజెన్సీ) లభించెను. జయపురమున కుత్తరముగా నున్న కోరాపుట్టి జిల్లా, నవరంగపురం తాలూకా భండారిగూడ గ్రామమునకు సమీపముగా, నిర్జనమైన ఒక సాంద్రారణ్యమున, పదిమైళ్లదూరమున నున్నది పొడాఘడ్ అన్న పల్లెటూరు. అచ్చట నొక కొండపై భూమిమట్టమునకు నలభయి అడుగుల యెత్తున ఈశాసనము చెక్కబడి చూపరుల దృష్టి నాకర్షించుచు, ఆశ్చర్యమును గలిగించుచున్నది.

పైన నుడివిన ఈరెండుశాసనములు దొరికిన స్థలములనుబట్టి విమర్శించినపుడు, నలరాజ్య వైభవము ఉచ్చస్థితియందుండిన కాలమున, అది అటు విదర్భప్రాంతమునుండి యిటు కళింగసీమలవరకును వ్యాపించి, ఉత్తరమున నాంధ్రదేశము నంటియుండెనని తెలియుచున్నది. అప్పటి నలరాజ్యమునందు మధ్యపరగణాలలోని నాగపురము, చాందా, దుర్గ్, భండారా, కంకేరు జిల్లాలును, బస్తరురాజ్యములోని యుత్తరభాగమును, కొంత జయపుర మన్యప్రాంతమును చేరియుండినట్లూహింపవచ్చును.

అక్షరముల పైఖరినిబట్టి లిపిశాస్త్రజ్ఞులు రిథపూరు తామ్రశాసనము క్రీ.శ. ౫,లేక ౬-వ శతాబ్దముల నాటిదని చెప్పుదురు. అట్లు చెప్పుటకంటె ౫-వ శతాబ్దమునాటిదని నిస్సందేహముగా చెప్పవచ్చునని నామతము. కారణములను ఇక్కడ విమర్శించ నక్కరలేదు. ఆశాసనము మహేశ్వర, మహాసేనాతిసృష్టరాజ్యవిభవుడును, నలవంశప్రసూతుడును, త్రిపతాకన్యజాడు నగు శ్రీభవత్త మహారాజుచే నాజ్ఞాపింపబడినది. భవత్తవర్మ మహారాజునకు శాసనాంత్యభాగమునందు శ్రీమహారాజ అర్థపతి భట్టారకుడని బిరుదముకూడ వాడబడినది. ఈ పదములలో 'అర్థపతి' అనునది విశేషమయినది. దానికి ధనేశుడని యర్థము కలదు కాని, యిక్కడ నామాటకు 'నృపతి' అన్న యర్థము ప్రత్యేకముగా చెప్పవచ్చును.6

6. ఆచార్య మిరాశీగారు మహారాజ అర్థపతిభట్టారకుడు భవత్తుడు కాడనియు, వానిని కుమారుడు కావచ్చు ననియు తలంచుచున్నారు. (జర్నల్ ఆఫ్ ది న్యూమిస్‌మాటిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ౧౯౩౯ పుట ౩౭). దీనిని నేను అంగీకరింపను.

భగవానుడగు బ్రహ్మదేవుని (ప్రజాపతి) ప్రసాదమువలన సిద్ధక్షేత్ర మైనట్టిదియు, గంగాయమునానదులు సంయోగించునట్టి పుణ్యభూమియు నగు ప్రయాగక్షేత్రమునందు ఒకానొకప్పుడు తీర్థయాత్ర కరిగిన సమయమున భవత్తమహారాజు, పుణ్యకాలమున తన యొక్కయు, తన పట్టపుదేవి (భట్టారిక) యొక్కయు దాంపత్యము అనుగ్రహింపబడుటకు(?)కదంబగిరిగ్రామమును వెలిపాలెముతో గూడ (సవాటకముగా) పరాశర సగోత్రుడైన మాత్రాధ్య యను బ్రాహ్మణునకును, దేవార్య, దేవదత్తార్య, కుమారదత్తార్య, వీరదత్తార్య, వసుదత్తార్య, గౌరీదత్తార్య, గృహదత్తార్య, దుర్గదత్తార్య అను ఆతని యెనమండ్రుగురు కుమారులకును, వెరసిన తొమ్మండుగురకును ఉదకపూర్వకముగా ధారవోసెను. ఆ దానవిషయమును కదంబగిరివాస్తవ్యులయిన కుటుంబినులకు తామ్రశాసనముద్వారా ప్రకటించెను. అది యీభవత్తమహారాజు యొక్క విజయరాజ్యవత్సరములు ౧౧-వనీట కార్తికబహుళ సప్తమినాడు జరిగెను. నోటిమాటతో నొసగబడిన దానశాసనమును రహస్యరాజకార్యముల నిర్వర్తించు చులమంత్రి శాసనముగా రచించెను. దానిని తామ్రపట్టికపై పద్దోపాధ్యాయ పౌత్రుడు బొప్పదేవుడు లిఖియించెను.

భవత్తమహారాజు దానవిషయము ఇంకను నీవిధముగా నాజ్ఞాపించెను: "ఈ బ్రాహ్మణులకు మీవిషయోచితములయిన హిరణ్యాదులను, కట్టుబడులను, పూర్వపు మర్యాదను మాకు చెల్లించినరీతిగానే, యింతటనుండి మీరు చెల్లింతురుగాక. పూర్వపు రాజమర్యాదను, వీరలకు కదంబగిరికుటుంబినులందరు యథోచిత సుశ్రూషలను గావింతురుగాక. మాకు చెల్లవలసిన సర్వకరముల (అన్నివిధములయిన పన్నులు) నన్నిటిని మేము వదిలివేసితిమి. ఈ గ్రామమునుండి యెట్టి కుల్కములు, అపరాధములును మాకు చెల్లుబడి కానవసరములేదు. ఈదాన మీరీతిగా ఆచంద్రార్కస్థాయిగా, స్థిరముగా పాలింపబడుగాక! రాజభటులు, అశ్వములు, గాష్ట్రియ వాహనములు మొదలయిన వేవియు నీ గ్రామమున ప్రవేశింపరాదు." ఈ దానశాసనము నందివర్ధనము నుండి ప్రకటింపబడెను. నందివర్ధనము భవత్తవర్మరాజధాని గావచ్చును.

నందివర్ధన మెచ్చట నున్నదో, ఈకాలమున ఆపేరును ఏగ్రామమునకు సరిగా ముడిపెట్టి నిరూపింపవచ్చునో యన్న విషయము వివాదగ్రస్తమైయున్నది. శాసనపరిష్కర్త శ్రీమంతు వై. ఆర్. గుప్తే నందివర్ధనము యెూట్మల్ తాలూకాలోని నందూరు కావచ్చునని నిర్ణయించెను.[7] రాయ బహదూర్ హీరాలాలు నందివర్ధనము నాగపూరు జిల్లాలో, రామటేకు గ్రామమునకు సమీపముగా, నాగపురమునకు ఇరువదిమైళ్ల దూరమునవున్న నాగవర్ధనమనబడుచున్న గ్రామమే యని నిరూపించిరి. నాగపుర, నాగవర్ధన మన్న పేరు తఱచుగా తరువాతికాలపు తామ్రశాసనములందు గానవచ్చుచుండుట బట్టి హీరాలాలుగారి నిర్ణయము సమంజసముగా నున్న దనవచ్చును. అదియునుగాక, ప్రాచీనకాలమున తామ్రశాసనములు అప్పుడప్పుడు ఒక తావునుండి మరియొక తావునకు గొనిపోవబడుచుండుట కలదు. రిథపూరుతామ్రపట్టికకూడ నట్లే ఎక్కడనో యుండిన కదంబగిరిగ్రామమునుండి, పశ్చిమముగా అమరావతి జిల్లాలోనికి వలసపోయిన ప్రతిగృహీతలసంతతివారితో పోయియుండవచ్చును. వాకాటక రాణి ప్రభావతీగుప్తా దేవియొక్క తామ్రశాసనముతోపాటు కలసి దొరికిన సంగతి యీయూహకు సాయపడుచున్నది.

శాసనమందు మహారాజు పేరు భవదత్తవర్మకు బదులుగా పొరబాటున భవత్తవర్మ అని వ్రాయబడియుండవచ్చునని గుప్తేగారి యభిప్రాయము. ఇది సహేతుకమయినది. అక్షశాలి అక్షరములను చెక్కుటలో 'ద' ను మరచియుండును. లేదా యుచ్చారణయందు 'ద' లోపించియుండును. అది యట్లు గావచ్చుననుటకు దానప్రతిగ్రహీతలలో కడపటివాని పేరు దుర్గదత్తార్య యనుటకు దుర్గత్తార్యుడని వ్రాయబడియుండుట కారణముగా జూపవచ్చును. ప్రతిగ్రహీతలందరి పేరులందును 'దత్తార్య' అని యుండుట బట్టి, దుర్గత్తార్య యను పేరునందు గూడ దత్తార్యుడని

7 ఎపిగ్రాఫియా ఇండికా, సం. ౧౯. పుట. ౧౦౦.

యుండవలెననుట ఈయూహకు కారణముగుచున్నది. కావున రిథపూరు శాసనపతి భవత్తవర్మ అనెడు భవదత్తవర్మ అనియే అంగీకరించెదము.

పొడాఘడ్ శిలాశాసన మున్నచోట ఒక ఫర్లాంగునకు పుణ్యాంగనలు సతీత్వమును బొందుటకై చితిని జొచ్చిన చిహ్నములు (సతీశిలలు) చాల గాన్పించుచున్నవి. శాసనమున్న నిలువుఱాతికి ఎదురుగా శిఖరము కూలిపోయిన శిథిలశివాలయ మున్నది. ఆ ప్రాసాదమున కిపుడు గోడలును, ద్వారబంధమును మాత్రము గలవు. అచ్చట నంది, వినాయకుడు మున్నగు శివమందిర చిహ్నములు గలవు. ఆప్రక్కను తీయని నిర్మలోదకములతో నిండి, రమణీయమై యున్న కొలను గలదు. దానిచుట్టును మనోహరముగా వెదురుపొదలు దట్టముగా నలుముకొనియున్నవి. పూర్వోదాహృతమయిన శాసనమును, పరిశిష్టములయిన చిహ్నములను బట్టి చూచినయెడల, నేడు శిథిలావస్థయందున్న ఆప్రాంతమంతయును, పొడాఘడ్ గ్రామమును పూర్వ మొకప్పుడు బహుళజనాకీర్ణ మైయుండె నని తోచును. పొడాఘడ్ ఒకప్పుడు పెద్దపట్టణముగా నుండెననుటకు సందియము లేదు.

ఈ శిలాశాసనము హరిస్తుతితో ప్రారంభించును కావున దానపతి స్కందవర్మమహారాజు వైష్ణవు డని నిర్ణయింపవచ్చును. స్కందవర్మమహారాజు తండ్రి పేరు భవదత్తవర్మ మహారాజు. అతడు నలాన్వయ ముఖ్యుడు. భవదత్తమహారాజు తన విక్రమముచేత శత్రువుల నోడించి అడిమి కప్పములు గొనినాడు. స్కందవర్మ భ్రష్టరాజ్యలక్ష్మిని మరల సంపాదింప గల్గినట్లు శాసనము తెలుపుచున్నది. జనశూన్యమైన పుష్కరీనగరమును మరల వశపఱచుకొని మాతాపితృ పితామహులకు పుణ్యలోకప్రాప్తికొరకు అతడు తిరిగి జనవాసము గావించెను. అచ్చట విష్ణుదేవుని పాదమూలమునకు దేవప్రాసాదమును నిర్మించెను. అందు వేంచేసియుండు పురుషోత్తముని పూజార్థము కొంత భూమిని, భూరిదక్షిణగా కొంత సువర్ణమును ఉదకపూర్వకముగా ధారవోసెను. ఆ భూరిదక్షిణమీద వచ్చు వృద్ధిని (వడ్డీని) అచటికి తెంచు బ్రాహ్మణులకు, తాపసులకు, దీనానాథులకు నిరంతరము భోజన మిడుటకు వినియోగించుటకై యొక సత్రమును పెట్టించెను. దేవప్రాసాదమును, భూమిని, భూరిదక్షిణసువర్ణమును పూజ్యుడైన చక్రద్రోణుని కుమారుని వశమందుంచెను. ఆదానశాసనము ఆచంద్రార్క స్థాయిగా వర్ధిల్లుటకు దేవాలయముఖప్రాంగణమున శిలాస్తంభముపై లిఖింపబడెను. ఆశిలాశాసనము మహారాజు స్కందవర్మసమక్షమున ఎత్తించబడెను. అది యామహారాజు ప్రవర్ధమాన విజయ రాజ్యసంవత్సరములు ౧౨-వ ఏట, మాధవమాసమున, అనగా వైశాఖ మాసమున ౨౧-వ దినమున జరిగెను. రాజశాసనము ఎల్లరకును దెలియుటకు సేనాపతి శ్రీతిసుప్తుడు దానిని రాష్ట్రియునందు ప్రకటించెను. శాసనకావ్యమును రచించిన కవి పేరు 'కల్యాణమూలి'. భక్తితో దానిని వ్రాసినవాడు 'చౌలి'కుమారుడు జాంకురదాసుడు. దానిని శిలపై చెక్కించినవాడు అజాని కుమారుడు విశ్వరూపుడు.

పైరెండుశాసనములను విమర్శించినపుడు మనకు రెండుమూడుఊహలు కలుగుచున్నవి. అందు రిథపూరు శాసనములోని భవత్తవర్మయు, పొడాఘడ్ శాసనములోని భవదత్తవర్మయు నొక్కరే యగుదురా యనుట మొదటిది. భవదత్తవర్మ పేరే భవత్తవర్మ అని వ్రాయబడి యుండవచ్చునని యూహలకే నిశ్చయించుకొంటిమిగాన, ఇరువురును ఒక్కరే యని నిర్ధారణ చేసికొనవచ్చును. ఈ యూహనబట్టి భవత్తవర్మ కుమారుడు స్కందవర్మ యని తేటపడుచున్నది. శాసనలిపులనుబట్టి వీ రిరువురును ఇంచుమించుగా క్రీ. శ. ౫-వ శతాబ్దపు ఉత్తరార్ధమున రాజ్యముచేసియుండి రనుట రెండవది. లిపికాల నిర్ణయమును బట్టి ఈ రెండుశాసనములు ఇంచుమించుగా నొకకాలము నాటివని నిస్సంశయముగా దెలుపవచ్చును. పొడాఘడ్ శిలాశాసనమున భవదత్తవర్మకు 'శ్రీనలాన్వయముఖ్యః' అనియు, 'విక్రమతః పితదైవతః' అనియు రెండు విశేషణములు చేర్చబడియున్నవి. భవత్తవర్మను రిథపూరుశాసనము 'శ్రీనలనృపవంశప్రసూతః' అని ప్రశంసించినది. ఈ విషయ మిట్లుండ, భవత్తవర్మ శాసనమును వ్రాసినది యాతని 'రహసిమంత్రి' చూల యను వాడు. స్కందవర్మశాసనము రచించినది చౌలికుమారుడు జాంకురదాసుడు. చౌలి చులయొక్క రూపాంతరము గావచ్చు ననుట అసంగతముకాదు. ఈ సన్నిహితసంబంధకారణములనుబట్టికూడ భవదత్త, భవత్తవర్మ

లొక్కరే యని యూహింపవచ్చును. పూర్వోక్త సందర్భములనుబట్టి చూచినపుడు నలరాజ్యము పశ్చిమమున నాగపుర ప్రాంతమువఱకును, పూర్వదిశను జయపురమన్య ప్రాంతమువఱకును వ్యాపించియుండె నని తోచుట యూడదవిషయము.

౨

పైన నుడివిన యూహాలు సంగతములును, యథార్థములు నగుచో, భవదత్తకాలము ఇంచుమించుగా క్రీ.శ. ౪౫౦–౪౭౦ కావచ్చు నని తోచును. ఈ కాలనిర్ణయము విష్ణుకుండి, వాకాటక, గుప్త రాజవంశముల చరిత్రనుబట్టిగూడ సరిపోవుచున్నది. ఈ కాలనిర్ణయమునుబట్టి చూచినపుడు భవదత్తవర్మ వాకాటకసార్వభౌముడగు నరేంద్రసేనునికిని (క్రీ.శ. ౪౧౫–౪౪౦), ఆతని కుమారుడు రెండవపృథ్వీసేనునికిని (క్రీ.శ. ౪౪౦–౪౭౦) సమకాలీనుడని తేలుచున్నది. వాకాటకసామ్రాజ్యము, దక్షిణాపథములో నుత్తరభాగమునందు, అనగా ఆంధ్రదేశము నంటి యుత్తరముగా వ్యాపించి, వింధ్యపర్వతము దాటి విస్తరించియుండినట్లు తెలియుచున్నది. నరేంద్రసేనుని యంత్యకాలమున వాకాటకసామ్రాజ్యము చాల యిక్కట్టులపాలయ్యెను. వాకాటక వంశవైభవము, ఒకవైపుల త్రైకూటరాజవంశముయొక్క యొత్తిడికిని, మరియొకవంక సామంతరాజలోకముయొక్క తిరుగబాటులకును లోనయి, మిక్కిలి కటకటంబడియెను. త్రైకూటవంశతిలకుడుగా ధారాసేననృపతి (క్రీ.శ. ౪౫౯–౪౬౦) శత్రుక్షితిపతుల సేనలను ఓడించి, సమ్రాట్టు నరేంద్రసేనుని ధిక్కరించి, దర్పముతో స్వాతంత్ర్యమును ప్రకటించి అశ్వమేధయాగ మొనర్చి సార్వభౌమ బిరుదము బడసెను.[8] ధారాసేనుని యశ్వమేధము క్రీ.శ. ౪౫౫ సంవత్సర ప్రాంతమున జరిగియుండవచ్చును.[9]

నరేంద్రసేనుని సమకాలికుడును, బంధువు నగు గుప్తసార్వభౌముడు, మొదటి కుమారగుప్తమహారాజు కూడ వాకాటకచక్రవర్తివలెనే మిక్కిలి కడగండ్లపాలయినట్లు గన్పడును. గుప్తసామ్రాజ్యములో చేరిన మాళవదేశమునందు పటుమిత్ర, పుష్యమిత్రగణరాజ్యములు (రిపబ్లిక్సు) స్వాతంత్ర్యము నభిలషించి, గుప్తసార్వభౌముని నెదిరించెను. ఆ గణరాజ్యములపై నడుముకట్టుకొని మొదటికుమారగుప్తుడు దండయాత్ర వెడలెను. అప్పుడు జరిగిన ఘోరరణమందు కుమారగుప్తుడు దుర్మరణమువాత బడియెను. అతనిచావు క్రీ.శ. ౪౫౫–వ సంవత్సర ప్రాంతమున జరిగియుండెను. కుమారగుప్తుని అపజయ మరణములకతన గుప్తసామ్రాజ్యము, ఒక్కసారిగా పెనుగాలికి కదిలిపోయిన మహావృక్షముట్లయ్యెను. ఆ విపత్తు వాకాటకసామ్రాజ్యమునుగూడ కదిలించి, వడకజేసెను. క్రీ.శ. ౪౫౫–వ సంవత్సరమందే కుమారగుప్తుని కుమారుడు స్కందగుప్తుడు గుప్తసింహాసన మధిష్ఠించెను. గుప్తసామ్రాజ్య మా కాలమున కుపానులో జిక్కుకొని పెద్దబరువుతో నిండిన నౌకచందమున నుండెను. కాని స్కందగుప్తుడు ధీరుడు; సామ్రాజ్యనౌకను సురక్షితముగా విపత్సముద్రమునుండి యావలకు గొనిరాగల్గిన ధీశక్తియు, దోశ్శక్తియు గల కర్ణధారి. అతని విజయపరంపరలవలన పుష్యమిత్ర పటుమిత్ర గణరాజ్యములు శిక్షింపబడి, వశపఱచుకొనబడెను. కాని యంతలో తలవనితలంపుగా మరియొక మాల్న విపత్తు గుప్తసామ్రాజ్యముపై బడెను. అనాగరకులును, రాక్షసప్రాయులు నగు హూణజాతులు ప్రశాంతమై, నాగరికత కాస్పదమైయున్న ఆర్యావర్తమును అగ్నిజ్వాలలవలె జొఱబడి మహాభీభత్సమును గావించిరి. దానితో గుప్తసామ్రాజ్యము కూలంకషముగ కదలి కూలిపోవుటకు సిద్ధమయ్యెను. వాకాటక గుప్తసామ్రాజ్యములవలె, విష్ణుకుండివంశీయుల ఆంధ్రసామ్రాజ్యముకూడ ఇడుములపాలయ్యెను. విష్ణుకుండి మొదటిమాధవవర్మ నరేంద్రసేనునికి మిక్కిలి దగ్గరచుట్టము. మాధవవర్మకూడ నించుమించుగా క్రీ.శ. ౪౫౫ ప్రాంతమునందే మరణించెను.

---

8. ఎపిగ్రాఫియా ఇండికా, సం. ౯. పుట. ౫౧–౫౮. పద్ధితామ్రశాసనము.

9. ఈ కాలనిర్ణయము పూర్వోదాహృతమైన పద్ధితామ్రశాసనమునం దీయబడిన కాలమునుబట్టియే చేయవీలగుచున్నది.

ఆతడు వాకాటక, గుప్తనృపతులకు సాహాయ్య మొనరింపబోయి, యచ్చట రణరంగమునందు ఉసురులు గోల్పోయి యుండును. ఆతనివెనుక ఆతని కుమారుడు దేవవర్మ పట్టాభిషిక్తు డయ్యెను. కాని కులవైరులయిన పల్లవుల యొత్తిడివలన వాతడుకూడ నచిరకాలమున మరణించెను. మరణించుటయేగాదు; తత్కారణమున విష్ణుకుండిరాజ్యఖండమును గూడ పల్లవులు వశపఱచుకొనిరి.

అట్లు ఒక్కసారిగా క్రీ. శ. ౪౫౫ సంవత్సర ప్రాంతమునందు విష్ణుకుండి, వాకాటక, గుప్తసామ్రాజ్యములు భరతఖండమున, ఆగంగా కృష్ణవేణీ పర్యంత భూభాగమున, కష్టములపాలగుట సంభవించెను. అది నలనృపతివంశసంభూతుడగు భవదత్తవర్మవంటి సామంత రాజులకు స్వాతంత్ర్యమును ప్రకటించుటకు మంచి తరుణ మయ్యెను. భవదత్తవర్మరాజ్యఖండము నరేంద్రసేనుని వాకాటకసామ్రాజ్యములోనిభాగము. కావున నరేంద్రసేనుని ఓడించి, భవదత్తవర్మ స్వతంత్ర రాజ్యమును స్థాపించుకొనియుండును. అందుచేత పోడాఘడ్ శిలాశాసనమం దాతనికి 'విక్రమతుహిత విద్విషః' అన్న బిరుద ముపయోగింపబడెను. బంధుమిత్రులయిన విష్ణుకుండి, గుప్తసార్వభౌములుకూడ కష్టదశలపాలయి యుండిన కారణమున నరేంద్రసేనునికి ఆపత్సమయమున సాహాయ్యము చేయజాలకపోయిరి. నరేంద్రసేనుడు భవదత్తవర్మను శిక్షించి, అణచివేయజాలకపోయెను. అదియునుగాక నరేంద్రసేను డప్పటికి వార్ధకదశయం దుండెను. ఇన్ని కారణములు గలిసి వాకాటక సామ్రాజ్యమును క్షీణదశకు గొనివచ్చెను. విక్రమసంపన్నుడైన భవదత్తవర్మ అపుడు తన రాజ్యమును నల్దెసల వ్యాపింపజేసెను. సమర్థుడును, తేజశ్శాలియు, చండవిక్రముడు నగు భవదత్తవర్మకు ముప్పదియేండ్లు రాజ్యకాలము నిర్ణయించుట అసమంజసము కానేరదు. ఆతడు ఇంచుమించుగా క్రీ. శ. ౪౫౦ మొదలుకొని ౪౭౦ వఱకు పరిపాలించియుండవచ్చును.

నరేంద్రసేనునియనంతరము ఆతని కుమారుడు రెండవ పృథివీసేనుడు వాకాటక సింహాసన మెక్కెను. ఆత డించుమించుగా క్రీ. శ. ౪౬౦ మొదలు ౪౭౦ వఱకు రాజ్యముచేసినట్లు నిర్ణయింపవచ్చును. ఒకవిధముగా వాతడు తండ్రికంటె నదృష్టవంతు డనదగినవాడు. మరియు ఎక్కువగా విక్రమసాహసములు గలవాడుగా గన్పట్టును. ఆతడు మునిగిపోయిన తన వంశశ్రీయమును మరల నుద్ధరించితి నని 'మగ్నవంశసముద్ధర్తుః' అని గర్వముగా తన బాలాఘాట్ తామ్రశాసనమునందు చెప్పుకొనెను. ఆవాక్యము కేవలము బీరము గాదు. జనకుని కాలమున ప్రబలిన శత్రువర్గము నాతడు జయించియుండినగాని అట్లాతడు చెప్పుకొనుట సంభవింపదు. ఆతడు పరిమార్చిన శత్రువులలో భవదత్తవర్మయో, లేక ఆతని కుమారుడు స్కందవర్మయో యుండును. ఆతడు త్రైకూటకాదులను గూడ ఓడించి బలిమిమై కప్పములుగొని సామ్రాజ్యవైభవమును మరల నుద్ధరించియుండును. నలరాజ్యలక్ష్మి కొంతకాలము భ్రష్టమైన దనియు, దానిని మరల సంపాదించితి ననియు స్కందవర్మ తన పోడాఘడ్ శిలాశాసనమునందు చెప్పుకొనియున్నాడు. కావున రెండవ పృథివీసేనునికాలమున, మాత్సముగా స్వాతంత్ర్యమును సంపాదించుకొనిన నలనృపతివంశము, తమ రాజ్యఖండముతోపాటు స్వాతంత్ర్యమునుగూడ పోగొట్టుకొనియుండును. ఆ యాపత్సమయమును పురస్కరించుకొని, పూర్వదిశయందున కళింగాధీశుడుకూడ నలరాజ్యభాగమును కొంత ఆక్రమించుకొనియుండును. ఈ యూహకు పోడాఘడ్ శిలాశాసనములోని "భ్రష్టా మాకృష్య రాజర్థిం శూన్యా మావాస్య పుష్కరీమ్" అనువాక్యము హేతు వగుచున్నది. ఇం దుదాహరింపబడిన పుష్కరీపుర మే నేటి పోడాఘడ్ (పోరాఘడ్) కావచ్చునని తోచుచున్నది. పోడాఘడ్ యొక్క రూపాంతరము పోరాఘడ్. ఈ పేరుగూడ వ్యవహారమునం దున్నది. పోరాఘడ్ లేక పురాఘడ్, లేక పురీఘడ్ అనునవి క్రమముగా నొకదాని కొకటి రూపాంతరములు గావచ్చునని తోచుచున్నది. ఆవిధముగా పురాఘడ్ పుష్కరీయొక్క వికృతము గావచ్చును.

భ్రష్టరాజ్యమునో, భ్రష్టరాజ్యఖండమునో, లేక స్వాతంత్ర్యమునో మరల సంపాదించుకొనగలిగిన స్కందవర్మ తండ్రితో సమానమైన విక్రమసంపద గలవాడు గావలయును. ఆతని కాలము ఇంచుమించుగా క్రీ. శ. ౪౭౦ మొదలుకొని ౫౦౦ వఱకు గావచ్చునని

నిర్ణయింపవచ్చును. స్కందవర్మ సింహాసన మెక్కు నాటికో, లేక మరికొంతకాలమునకో రెండవ పృథివీ సేనుడు కాలధర్మము నొందియుండును. అతని వెనుక వాకాటకసింహాసనము నెక్కిన దేవసేనుడు మిక్కిలి దుర్బలుడు. ఆతడు కడు స్వల్పకాలము, క్రీ.శ. ౪౭౫ నుండి ౪౭౮ వఱకు రాజ్యముచేసినట్లు చరిత్రకారులు నిశ్చయించినారు. అతడు వట్టి అసమర్థుడు, విశేషించి భోగలాలసుడు. వాకాటకశాసనము లాతని "భోగేషు యథేష్టచేష్టః" అని వర్ణించుచున్నవి. నిరంతరము భోగములయందు కాలముగడుపదలచిన యాతడు, రాజ్యభారమును నిర్వహింపజాలక, దానిని ప్రజ్ఞానిధియు, మహాశక్తిసంపన్నుడును నగు తనకుమారుడు హరిసేనునికి నప్పగించెను. కావున రెండవ పృథివీసేనుని యంత్యకాలమునవో, లేక దేవసేనుని రాజ్యకాలమునవో, స్కందవర్మ భ్రష్టరాజ్యలక్ష్మిని మరల కైవశము చేసుకొనియుండ నోపు.

హరిసేనుడు వాకాటకచక్రవర్తులలో కడపటి వాడు, మహాతేజశ్శాలి, విక్రమసంపన్నుడు, కీర్తిశాలియైనవాడు. ఆతడు క్లేశమున కోర్చి వాకాటకరాజవంశము యొక్క శత్రుసమూహమును చిందిచెండాడి, సామ్రాజ్యమునకు మరల తొల్లిటివిభవమును జేకూర్చెను. అట్టి హరిసేనుని కాలమున (క్రీ. శ. ౪౭౮–౫౧౦), ఆతని శౌర్యాగ్నికి తాళజాలక నలనృపతివంశము, స్కందవర్మకాలమునవో, లేక యాతని సంతతివారి కాలమునవో రాజ్యమును మరల గోల్పోయి, వేణీగంగా, ఇంద్రావతీ, గోదావరీనదుల మధ్యస్థమైన రాజ్యఖండమును వీడి పరరాష్ట్రభూముల నాశ్రయింప వలసపోయి యుండవచ్చును. అది క్రీ. శ. ౫౦౦ సంవత్సరము ఆప్రాంతమున, అనగా ఆఱవశతాబ్దాదిని జరిగియుండవచ్చును. అట్లు దక్షిణాభిముఖముగా వలసవచ్చి, కృష్ణాతుంగభద్రాతీరభూములందు రాజ్యమును స్థాపించుకొని దానికి నలవాడి యని నామమును కలిగించియుందురు. నలవాడియందు ఇంచుమించుగా నొక్కశతాబ్దము రాజ్యపాలనము సలిపి, తుదకు నలనృపతివంశము ఆఱవశతాబ్దము గతించకపూర్వమే మొదటికీర్తివర్మచే విధ్వస్తము గావింపబడియుండును.

౧౯౩౯-వ సంవత్సరమున బస్తరు రాజ్యములోని కొండెగాం తహశీలులో చేరిన 'ఎడెంగ' గ్రామమున నలరాజుల బంగారునాణెములు దొరికెను. వాటిలో కరిగింపబడకుండ ముప్పదిరెండుమాత్రము చిక్కెను. వాటిపైనున్న వ్రాతను, ముద్రలను ఆచార్య మిరాశీగారు చదివి ఇంగ్లీషులో ఒకవ్యాసమును రచించినారు. అవి ముగ్గురురాజులవిగా తేలినవి. ఆనాణెములవలన భవదత్తవర్మకు బూర్వుడు వరాహరాజు అనువాడుండెనని తెలియుచున్నది. నలవంశమున ప్రసిద్ధుడయిన మొదటి మూర్ధాభిషిక్తుడా వరాహరాజని మనము నిశ్చయించుకొనవచ్చును.

వంశక్రమము : నలవంశము

వరాహరాజు

భవదత్త, లేక

భవదత్తవర్మ

మహారాజ అర్థపతిభట్టారకుడు

స్కందవర్మ

[అనుబంధము]

రిథపూరు (బుద్ధపురము)లో దొరకిన భవత్తవర్మయొక్క తామ్రపట్టిక : పరిష్కృతపాఠము

(ఎపిగ్రాఫియా ఇండికా, సం. ౧౯. పుట ౧౦౦. చూ.)

మొదటి రేకు :

౧ సిద్ధమ్ ॥ స్వస్తి । నందివర్థ్ధనాత్ ॥ మహేశ్వర మహాసేనాతిసృష్ట

౨ రాజ్యవిభవః నలనృపవంశప్రసూతః త్రిపతాకధ్వజః శ్రీమహారాజ

౩ భవత్తవర్మ్మా కదమ్బగిరిగ్రామే బ్రాహ్మణపురోగాన్ సమహత్తరాన్

౪ కుటుమ్బినః సమాజ్ఞాపయతి యథాయ మస్మాభిః భగవతః ప్రజాపతేః

౫ ప్రసాదసిద్ధక్షేత్రే గంగాయమునయోస్సంవేద్యే ప్రయాగస్థితై రుదక
పూర్వ్వకం

రెండవ రేకు - మొదటి ప్రక్క :

౬ మమ అపిచ భట్టారికాయాశ్చ దామ్పత్యస్యాస్తాక మనుగ్రహార్థం
పరాశర స-

౭ గోత్రాయ మాత్రాఢ్యార్య్యాయ పుత్రాణాం చాస్యాష్టానాం యథా
దేవార్య్యస్య

౮ దేవదత్తార్య్యస్య కుమారదత్తార్య్యస్య వీరదత్తార్య్యస్య వసు ద-

౯ త్తార్య్యస్య గో(?)దత్తార్య్యస్య ధృవదత్తార్య్యస్య దుర్గ్గార్త్థా (దత్తా)
ర్యస్య చేత్యేవమ్

౧౦ ఆత్మనవమాయమా మాత్రాఢ్యార్య్యాయ దత్తో యత ఏతేషామ్ బ్రాహ్మ
ణానాం వి-

రెండవ రేకు - రెండవ ప్రక్క :

౧౧ పయోచితాః హిరణ్యాదయః సర్వ్వప్రత్యాయాః దాతవ్యాః, శుశ్రూ
షాచ కర్త్తవ్యా

౧౨ వ్యా = ఏష చ గ్రామః ఆచంద్రతారికయా స్థిత్యా సర్వ్వకరవిసర్జ్జితః అభ

౧౩ టప్రవేశః అపహాః అశుల్కః సర్వ్వవాదపరిహీనః చిఞ్చాల ప-

౧౪ లాశ ప్రద్రక మర్య్యాదయా న కిఞ్చి ద్వక్తవ్యః ॥ యోవా కశ్చి ల్లోభా
ద్రాగాద్వా కర

౧౫ ప్రవర్త్తనం భూమిలోపం వా కుర్య్యాత్ స పఞ్చభి మ్మహాపాతకై
స్సంయుక్తో భ-

౧౬ వేత్ । అస్మాభి శ్చ సదశనివర్త్తనికః సహాలః సవాటకః

మూడవ రేకు - మొదటి ప్రక్క :

౧౭ గ్రామే యం దత్తః యత ఏతదర్థం న కేనచిత్ కిఞ్చిత్ వక్తవ్యః॥ సీమాచాస్య
౧౮ గ్రామస్య ఉత్తరేణ పర్వతః విషయసీమా న్తికో కన్మర్నకేన సహ మా-
౧౯ లుక విరకః మధుకలతికా పిణ్డీరకవృక్షేణ బకసామలకం త్రిమందర
౨౦ శ్చ విరకః రాజ్యసీమేతి ॥ యాచైకాదశేథవర్షే కార్త్తికమాసస్య బహుల
౨౧ సప్తమ్యామ్ । స్వముఖాజ్ఞయా భిలిఖితా రహసి నియుక్తేన చుల్లేన ॥ శ్రీమహా రా-
౨౨ జార్థపతి భట్టారకేణ ఆత్మనః మాతాపిత్రోః పుణ్యకీర్త్తివర్ధన ధర్మస్థానం

మూడవ రేకు - రెండవ ప్రక్క :

౨౩ పుత్రాణాం అష్టానా మాచంద్రార్క్కస్థితికాలిక మవిచాల్యం భవత్వతి ఆత్మ
౨౪ నా అయ్యకపాద ప్రసాదానుగృహీతేన తామ్రశాసన మేతత్ కారిత మి-
౨౫ తి॥ స్వస్తి గోబ్రాహ్మణప్రజాభ్యః = సిద్ధరస్తు ॥
౨౬ షడ్డోపాధ్యాయపుత్రస్య పుత్రేణ బాప్పదేవేన కృతమిదమ్ ॥

పోడాఘడ్ శిలాశాసనము (పరిష్కృతము)

[ఎపిగ్రాఫియా ఇండికా, సం. ౨౧, పుట ౧౫౩ (౧౫౪ - ౫)]

మూలపాఠము

౧ సిద్ధమ్ ॥ హరిణా జితం జయతి జేష్యతీ త్యేషా గుణస్తుతి ర్న హి సా ।
సను భగవానేవ

౨ జయో జేతవ్యం చాధిజేతా చ ॥ [౧] శ్రీనలాన్వయ ముఖ్యస్య విక్రమ
క్షపిత ద్విషః ।

౩ నృపతే ర్భవదత్తస్య సత్పుత్రేణావ్యవస్థితామ్ ॥ [౨] భ్రష్టా మాకృష్య
రాజర్ద్ధిం

౪ శూన్యామావాస్య పుష్కరీమ్ । పితుః పితామహానాఞ్చ జనన్యాఽ కృతినా
తతః ॥ [౩]

౫ కృత్వా ధర్మార్థినే భ్యాశా మిద మాత్మ హితైషిణా । పాదమూలం
కృతం విష్ణో రాజ్ఞా శ్రీ స్కంద వ-

౬ ర్మణా ॥ [౪] పూజార్థం మస్య చైవేహ పోదక మ్మ్యారి దక్షిణమ్ ।
పురుషాయ పురం ద ... ...

౭ కృతారకమ్ ॥ [౫] సతో ప్వపభోజ్యం విప్రాణాం యతీనాఞ్చ విశేషతః ।
దీనానా మప్యనాథానాం...

౮ చ సర్వశః [౬] అప్రవేశ్యం భటై శ్చేదం సదా కరవిసర్జితమ్ । శ్రీచక్ర
ద్రోణపుత్రాయ...

౯ యథోచితమ్ ॥ [౭] స్థితి శ్చేయం పురో బద్ధా ధర్మార్థ స్తంభే నివేశితా ।
య శ్చేమాం ప్రోషయే త్సంస్థా మ్మహాపాతక మస్నుతే...[౮]

౧౦ వ్యతిక్రమే ద్యో హి మహీపతేః స్థితిమ్ కులాధమః పార్థివకిల్బిషమ్బిబేత్ ।

౧౧ సమన్వియా ద్యశ్చ వరేస్థి సత్పథమ్ స వాసుదేవాశ్రయ మాప్నుయా
చ్చిరమ్ ॥ [౯]

౧౨ ద్వాదశేబ్దే నరేన్ద్రేణ మాధవే మాసి చోత్తమే సప్తవింశే దినే పుణ్యే

౧౩ స్తంభోయం గాహిత స్స్వయమ్ ॥ [౧౦] స్థితి ర్భాగవతే నైవమ్
భర్తుః ప్రియ చా ...

౧౪ సేనాపతినా కల్పితా* మాలినేహాల్పబుద్ధినా ॥ [౧౧]

౧౫ లిఖితం చౌలిసూనునా భక్త్యా జాంతురదాసేన [౧౨]

౧౬ ఆజేన విశ్వరూపేణ నిర్గుణేన గుణైషిణా ॥ [౧౩]

---

* "కల్యాణమాలి" అనికూడా చదువవచ్చును.

అభినవభారతి

[కథానిక]

శ్రీ నిట్టల మేధాదక్షిణామూర్తి

వైకుంఠైకాదశినాడు శ్రీరంగంలో ద్వారదర్శన మహోత్సవం జరుగుతుందనీ, దానిని చూచినవాళ్ల జన్మ తరిస్తుందనీ లోకులు చెప్పుకోవడం విని తిరుమనాపల్లిలో వున్న నాకు వెళ్లా లనిపించింది. శ్రీరంగం మూడు మైళ్లలోనే వుండడంచేత తెల్లవారుజామున నాల్గుగంటల సమయంలో బయలుదేరాను. కొంచెం దూరం వెళ్లేటప్పటికి నావెంటనే వస్తూవున్న కావేరీ నది రెండుపాయలుగా చీలింది. కావేరీనదిచేత చుట్టబడి శ్రీరంగం శ్వేతద్వీపంలాగా వుంటుందని అంటారు. నా కారాత్రి వెన్నెట్లో ధగధగలాడుతూ నీలాకాశాన్ని ప్రతిఫలిస్తూ అచ్చటచ్చట ఇసుకతిన్నెలతో వున్న కవేరదుహిత భూలోకవైకుంఠ మనబడే శ్రీరంగంలో భక్తవత్సలుడై వేంచేసియున్న శ్రీమన్నారాయణుని సేవించుటకై ఆపుణ్యభూమిని కుండలాకారంగా పరివేష్టించియున్న కాద్రవేయపతిలా గోచరించింది. ఉత్సవసమాగతతైర్థికజనసాహాయ్యంతో అచ్చటి దర్శనీయవిశేషాలన్నీ చూచుకుంటూ సూర్యోదయం కాకుండానే శ్రీరంగం చేరుకున్నాను.

వెళ్లి వెళ్లడంతోనే ప్రాలేయాచలసానుమండల శరద్వారిపూరశైత్యములున్నూ, పరిమళమిళత్కుసుమగర్భనిర్గతతుషారాసారవాహములున్నూ, దాక్షిణాత్య కన్యలా లోతులేనివిన్నీ అయిన కావేరీనదీజలముల్లో స్నాతుడనై శ్రీరంగధామధామదర్శన కుతూహలుడనై భక్తజనప్రవాహాన్ననుసరించి వెళ్లాను. మహాకవి భావంలా మహోన్నతమైన చామీకరచారుగోపురము నా కొక్క మధురస్మృతి నిచ్చింది ప్రథమ దర్శనంతోనే!

కరచరణసాహాయ్యమును కలిగి, జ్ఞానేంద్రియ పంచకమును స్వాధీనముచేసుకుని మనస్సును లగ్నము చేసినగాని శ్రీరంగధాముని దర్శనం కాదన్నట్లు సప్త ప్రాకారపరివేష్టితమైయున్నది గర్భమంటపము. నాలుగు ప్రాకారములు దాటినతరువాత పూజాద్రవ్య

ముల నమ్మే అంగళ్లు జ్ఞానేంద్రియములనూ, వాటితో కర్మేంద్రియములనూ ఆకర్షించాయి. భగవద్భక్తి వెల్లివిరియవలసిన ఆ స్థలంలో నామనస్సన్యథా వర్తిస్తున్నట్లు తోచింది. సౌందర్య మానందదాయక మనిన్నీ, ఆనందమే పరబ్రహ్మస్వరూప మనిన్నీ తర్కించి నిరూపించే యింద్రియరాజు గారి యాజ్ఞ నాదల ధరించి నాకను లట్టే నిలువక కుసుమ మాల్యములను, సుగంధద్రవ్యములను కొనుక్కునే దాక్షిణాత్య తరుణీమణుల ముఖావలోకననిమగ్నములై వారివలెనే చలించిపోతున్నాయి. నడిచేవాళ్లకుతప్ప నిలిచేవాళ్లకు చోటులేని ఆ ప్రదేశంలో నిలబడడంచేత నాశరీర మప్పుడే వెచ్చవెచ్చగా తగిలే తనూస్పర్శసుఖ మనుభవించి మరేంత నాకాంక్షిస్తోంది. ఇంతలో పూజా సమయఘంటానాదము వినబడడంచేత ఒక్కసారిగా జనప్రవాహము ముందుకు సాగిపోయి గర్భమంటప సమీపంలో సుళ్లుతిరుగుతోంది.

సాధారణంగా ఆప్రదేశము కన్నులు పొడుచుకున్నా కనరాని చీకటితో వుండాలిసింది. కాని ద్వార దర్శనమహోత్సవసమయ మవడంచేత విద్యుద్దీపవిరాజమాన మైయున్నది. స్ఫటికశిలానిర్మితసహస్ర స్తంభములున్నూ ఆకాంతిని యినుమడిస్తున్నాయి. రంగనాథుడు దక్షిణాశాముఖు డైయుండడంచేత తూర్పు దిక్కున నిర్మింపబడిన శిలావేదికపై ఇరువురు కూర్చుని స్వామిసన్నిధిని సంగీతకాలక్షేపం చేస్తున్నారు. నలుబదిఏండ్లపురుషు డొకడు వీణ మీటుతున్నాడు. పదహేనేండ్ల ప్రాయము గల నవయౌవనాంగి గీత మాలాపిస్తోంది. ఆగానము, ఆవీణానాదము నాహృదయంలో ఒక్కొక్కమాటు నేయిమగ్నుకీలలను ప్రజ్వలింపజేస్తున్నాయి. రాతిస్తంభాలన్నీ కూడా స్వరమంటపంలో వున్నట్లు స్వరాలు పాడుతూ ద్రవించిపోతూయున్నా యనిపించింది. సంగీతానికి రంగనాథుడు రంగరింపబడి జనప్రవాహంతోబాటు కలిసి కావేరిలో ఐక్యమై పోవలసిందే! భక్తులందరూ శ్రీరంగనాథుని దర్శించడం కోసమూ, శ్రీరంగనాథుడు వారు తెచ్చిన పంచామృతసమేతఫలాహారనివేదనల నారగించడంకోసమూ తహతహలాడిపోతూ వారి గానాన్ని గాని, ఆమె సౌందర్యాన్ని గాని ఆదరించడమే లేదు. లీలామానుష రూపుడైన రంగనాథుడు నాకోసమే ఈ సన్నివేశాన్ని కలుగజేశా డనిపించింది. ఆమె అప్పుడు "యామి హే క మిహ శరణం" అనే జయదేవకవికృతి పాడుతోంది. ఎదురుగుండా స్తంభానానుకొని తదేక దీక్షతో తనవంక చూస్తూన్న నన్నుద్దేశించే ఆమె ఆ కృతి నందుకున్న దనుకున్నాను. వృద్ధుడు కన్నులు మూసుకుని పురుషత్వాన్ని స్ఫుటీకరిస్తూ గాఢంగా తంత్రులు మీటుతున్నాడు. ఆమెమాత్రం మతిచంచల లోచనములతో పరిపరి నావంక చూస్తూ పాడుతూనే వుంది. అప్పటి ఆమెసౌందర్యాన్ని ఏమని చెప్పను! ఒక్కసారి విద్యుద్దీపాల నన్నిటినీ ఆర్పితే అంతటి తేజస్సునూ ఆమెముఖం ప్రసరించగలదని తోచింది. వెంటనే నాకనులు మూసుకున్నాయి. ఆమెసుధా మధుర సౌందర్యాన్ని నామనోనేత్రము తనివి తీరా దర్శించింది. దరహాసచంద్రికాలోవిష్కృతము లైన కపోలములతో, దివ్యనాసికాశోమాల్యరేఖామోహనములై తేజోవంతములైన కనులతో మనోహరమైన యామెముఖవికాసము . సాయంసమయసూర్యకోణ కిరణవర్ణితసితాంబుదమువలె, శారదచంద్రికాస్నాత సముత్ఫుల్లమందారమువలె, అమృతస్పర్శసుఖదాత్రియౌ సమర్థమను నాఆత్మసౌందర్యమువలె తోచింది. ద్వార దర్శనసమయఘంటానాదము విని చలితమయి ముందు వెనక్కుల తోసుకున్న జనప్రవాహము నాచోటునుండి నన్ను త్రోసివేసింది. కనులు తెరిచి చూసుకునేదా నాయెదుటనుండి యింతవరకూ నన్ను 'సంగీతస్వర్లోక మధురసుమమాధుర్యగాన మంజువాటిలో' నాదిటికన త్రేలిని తన చిరునవ్వు బట్టుకొని నాపైన దివ్యజ్యోతులు ప్రసరిస్తూ తిప్పుచున్న ఆసౌందర్యరాశి మాయమైంది. కోటిసూర్యప్రభాభాసమాన విద్యుద్దీపసంశోభిత మయ్యా ఆప్రదేశము గాఢాంధకారబంధురమై కనబడింది. ఒక్కసారి అనుకోకుండా కలిగిన ఆ సుధాధామహాససౌఖ్యంనుండి అట్లానే ఎక్కడో ఎక్కడో అధోలోకాల్లోకి త్రోసివేయబడిన ట్లయింది. నా మనస్సు త్రివ్విపేయబడినట్లయి నన్నా చోట నిలవ నియ్యలేదు. గాఢాంధకారజీమూతగర్భ విద్యోతిత సౌదామినీరేఖానుమమాదృశ్యమాన మాధవీకుసుమ గుచ్ఛమువలె ఒక్కని మేషమున నన్ను శ్రీరంగ

ధాముని జేసి మరుని మేమను మనస్సూక్ష్మనిజేసిన ఆ సుందరి యెక్కడుంటుందో అని ఆ జనసమూహమంతా వెతుకుతూ పిచ్చివాడిలాగా తిరిగాను. అన్యమనస్కుడనై ఉండటంచేత కాని లేకుంటే నన్ను పిచ్చివాడని బయటికి గెంటివేసేవారే దేవాలయాధికారులు. ఉత్తరద్వారం, చంద్రపుష్కరణీతీర్థం జన్మసాఫల్యాన్ని కలిగించడానికి బదులు ప్ర[illegible]శోధ నర్తంలో చేరేయి. సప్తప్రాకారాలు దాటాను. సమస్తేంద్రియాలూ ఏకదేశమునందు లగ్నము చేశాను. కాని అతీంద్రియమైన ఆజ్యోతి పునర్దర్శన మియ్యలేదు. తాళద్వయపరిమాణము కలిగిన తాటిపందిరిసంబలపై తాళద్వయ పరిమాణముగా గల శిలాశిలాక నిర్మింపబడివున్నది. ఒక్కసారి అది నామీద బడితే—!

౨

నాయన గారు ఆ నవమోహనాకారుణ్ణి చూడనే లేదు. నాచిన్నతనంనుండీ ఈ శ్రీరంగదేవాలయం పరిచితమైనదే కాని ఎన్నడూ యిలాంటి సౌందర్యాన్ని చూడనేలేదు. ఆస్తంభాన్ని ఆనుకొని అతడలా నిల్చుంటే మహాశిల్పి చెక్కిన జీవప్రతిమలా వున్నాడు. ఆ సోపరేఖావిన్యాసము, ఆశిల్పము మరెచ్చటా వుండదు. నే నిప్పటికి అయిదేండ్లనుంచీ నాన్నగారితో వచ్చి నాసంగీతకళ నీదేవునియెదుట ప్రదర్శిస్తున్నాను. కోటానకోట్లు వస్తున్నారు, పోతున్నారు. నాసంగీతానికి ఇంతగా ముగ్ధుడైనవా డెవ్వడైనా వుంటాడా! ఐదేళ్ల నిత్యసంగీతకళానివేదన శ్రీరంగధామునిచేత ఈ రూపంగా ప్రసాదింపబడింది. అతని తన్మయత నవలోకిస్తే అతడు వట్టి గాయకుడు కాడని తోస్తోంది. త్యాగరాజుకృతులూ విన్నాడు, జయదేవకృతులూ విన్నాడు. "యామి హే కమిహ శరణమ్" విన్నప్పుడతడెంతో చలించాడు. నావుద్దేశాన్ని అతడు గ్రహించేవుంటాడు. అతడు నావంక అనిమీలితలోచనుడై చూస్తూవున్నప్పుడు అపరిమితమైన సిగ్గూ, నాన్నగారు చూస్తారేమోనన్న భయమూ, అంతమందిజనంలో రసాభాసం అవుతుందేమోనన్న భయంతో దీక్షా ఒక్కసారి నాలో విజృంభించాయి. అప్పటికి నియమవేళాఘంట మ్రోగకపోతే పూర్తిగా రసాభాసమే అయ్యేది. దైవేచ్ఛ అలా వుందికాబోలు. ఘంటమ్రోగడం ఒకవిధంగా అనుకూలమే అయినా నాన్నగారి ననుసరించి ఉత్తరద్వారదర్శనార్థమై వెళ్లవలసివుండడం నా మనస్తృప్తికి పెద్ద గొడ్డలిపెట్టయింది. గాయపడ్డ హృదయంతో అలానే అనుసరించి వెళ్లాను. పరాధీనమనస్కనై ఎప్పటికప్పుడు ఎక్కడవున్నానో తెలియకుండా నిలవబడిపోయే నన్ను నాన్నగారు హెచ్చరిస్తూండడం, వారి హెచ్చరిక నా అన్యమనస్కతకు మరింత దోహదం ఇవ్వడం జరగ్గా ఇంటికి వెళ్లేటప్పటికి పదిగంటలైంది. స్వామివారికి భోగసమయం కాబట్టి నాన్నగారు దేవాలయంలోకి మళ్లీ వెళ్లారు. అతిథిపూజకై పాకక్రియావ్యగ్రురాలై యున్నది మా అమ్మ.

ప్రసాదగ్రహణవ్యాజంతో యిల్లు వీడి దేవాలయం దారి బట్టాను కృష్ణాభిసారిణియగు గోపికలాగా. అంతటిజనంలో నే నాతణ్ణి గుర్తించకపోయినా నా పాటనుబట్టి నన్నతడు గుర్తించగలడనే నమ్మకంతో "యామి హే కమిహ శరణా"న్నే ఉత్కంఠతాగాఢమైన మందస్వరంతో పాడుకుంటూ వెళ్లాను. పూర్వపరిచితమైన ప్రదేశమంతా తదేకదీక్షతో విలోకించాను. ఆ స్తంభా న్నానుకొని అట్లే నిల్చుని మధురస్మృతితన్మయినై ఒకగంటసేపు నిలబడ్డాను. పరదేశీయులే ఎక్కువగా ఉండడంచేత నన్నెవ్వరూ పల్కరించలేదు. నాధ్యానమునకు భంగం కాలేదు. ప్రసాదం పంచిపెట్టే సమయానికైనా రాడా అనుకొని యింతసేపూ వున్నాను. ఆ సమయం అయిపోవడంచేత జనబాహుళ్యం క్రమక్రమంగా మందగిస్తోంది. ఇక అక్కడ నిలవడం భావ్యంగాదని కావేరీనదీమార్గవర్తినయ్యాను. సప్తప్రాకారాలూ దాటివెళ్లగా ఎండ ఎక్కువౌతూవుండడంచేత తాటిపందిరిక్రింద కొంచెంసేపు విశ్రమించాను. ఏకారణంచేతనో అక్కడ కూర్చొనివున్న క్షణంలో మళ్లీ అతని సౌందర్యం గమనక్రాంతమైన నాకు మధురాతిమధురమై, వేదనాతివేదనమై హెచ్చరిక నిచ్చింది. ఆకాని రాళ్లమధ్య నామనస్సు శరపాతశిలాతలముల మధ్యనున్న శిరీషకుసుమమువలె నలిగిపోయింది. లేచి నిలబడ్డాను, ఒక్కసారి పైతాయి మీదబడితే ఎంతబాగుండును అనిపించింది. కాని

నాలో ఏదో ఒక నూతనోత్తేజము మూర్తీభవించింది. అతనితోనమే నేను జన్మించినట్లనిపించింది. ఇంతవరకూ వెనుబంపకలేనన్న ఆ స్తంభము ఈభావం నామనస్సులో ఉదయించడంతోనే పొందిన పరిణామంలాగా దర్పణసదృశమై నాసౌందర్యాన్ని ప్రతిఫలించింది. నారూపలక్ష్మికి నేనే పరవశనైపోయాను. ఈ సౌందర్యానికి తగిన వినియోగం కలిగే సమయం మాసన్నమైందనే ధైర్యంతో ముందుకు నడిచాను.

3

తజకస్మరణతో పంచనదతీర్థాన్ని సమీపించాము.

సూర్యకిరణములు కవేరకుహిత్వరసములను కోష్ణాలుగా మార్చాయి. ఆనీటిలో స్నానముచేస్తూఉంటే నా ప్రేయసినులివెచ్చనికౌగిలిలోని సౌఖ్య మనుభవించాను. విడిచిరా బుద్ధిపుట్టలేదు. రెండుమూడుసార్లు మునిగి లేచేటప్పటికి నామనస్సులో కవేరకన్య నా ప్రేయసిగనే కనిపించింది. అప్రయత్నంగా నాహృదయంలోనుండి కవితాధార వెలువడింది.

"నాదబిందుకళావమితనిర్ఝరిణీ!
ఓనదీసుందరీ! ఓనదీసుందరీ!
నాదేయమూర్ధ్వకనటికతిణాస్వనీ!
ఈనీటిపాయలే గానాంబుధారలై
నానోటిపాటలై నీలోన కలిసెనే!
శీకతాంతరంగం తెలిసెనే ఈనీట
ముఖవినిస్సృతగానమే తెలిసె నీమనసు!
మల్లికాసుమతో మనోజ్ఞమా నీనవ్వు
సాహితీహృదయాన చంద్రికలు పర్వెనే!
చలికెరటంగంబు జ్వలితాంతరంగంబు
తెలిమల్లెపూజేసె కలిసెనే ఓప్రియా,
నీమాపు నామాపు నీరూపు నారూపు
ఏమాపు లేకుండ నేకమైపోయెనే!!
కావేరినీరాన నావాక్కు నీపాట
త్రివేణీవేణిగా ప్రవహించునే సఖీ!"

అని ఒక్కసారి హేలాఖేలనకేళిలోనమునై నిలువునా మునిగి కొంతమారము పెలికలు తిరుగుతూ పోయి నిలుచున్నాను. ఎదురుగుండా దేవాలయంలో వీణమీటిన ఆచార్యులుగారు ప్రత్యక్షమయ్యారు. నా మనస్సు ఉండబట్టలేక ఆతురతా మనిపించింది కాని నానోటినుండి మాటరాకపూర్వమే స్వచ్ఛమైన ఉచ్చారణతో "తమ దేదేశము?" అన్న ప్రశ్న నాహృదయాన్ని తట్టింది. మాటడం తడవుగా ప్రమోగే వీణలాగా "మాది ఆంధ్రదేశము; కృష్ణాతీరవాసిని" అన్న సమాధానము వెళ్లిపోయింది. ఆచార్యులుగారు నన్నొక్కసారి కౌగిలించుకొని, నాశిరస్సును ముద్దాడి "నీపేరేమిటోయ్" అన్నారు. 'శ్రీనగరశర్మ' అన్నాను. "దేవదర్శనార్థమేనా వచ్చింది" అని అడగ్గా 'ఔను' అని ఊరుకున్నాను. నన్నడగనీయకుండా వారి ప్రశ్నపరంపర కురియడం నాకు కొంత విసుగునూ, చిరాకునూ కలిగించింది. వారి విషయం వారిచేత చెప్పించుకొని వినాలనే కోరికం నాకు హెచ్చిపోతోంది. అకస్మాత్తుగా "తమ నామధేయం" అన్నాను. ఆయన ఆగకుండా మహావేశపూరితుడైన కవిలా యిలా ఉపన్యసించాడు:

"నాపేరు ఆనందవర్ధనాచార్యులు. మాది అసలు కృష్ణాతీరంలో అవనిగడ్డ. మాపూర్వులు తంజావూరాంధ్రనాయకులు రఘునాథరాయలవారి కాలంలో ఆస్థానసంగీతవిద్వాంసులుగా తీసుకొనిరాబడ్డారు. మా ముత్తాత గోవిందదీక్షితులు. 'సంగీతసుధానిధి' అనే గ్రంథం వ్రాశాడు. ఆ మనసంగీతసుధామాధుర్యానికి మెచ్చుకొని అప్పటిరాజుగా రాయన కావిరుద మిచ్చి గౌరవించడమే కాకుండా మాముత్తాతగారి కోరికమీదనే శ్రీరంగనాథస్వామిసన్నిధిని ప్రాతస్సాయం సమయాల్లో సంగీతకాలక్షేపం చేస్తూవుండేటట్లుగా అనుజ్ఞ ఇచ్చారు. అప్పటినుండీ మావంశీకులు ఈగ్రామంలోనే నివాస మేర్పరుచుకొని దేవసేవ చేస్తున్నారు. నేనున్నూ వంశాచారాన్ననుసరించి అట్లాగే జీవనంచేస్తున్నాను."

"అహో! ధన్యుడ" ననుకున్నాను. ఆయనపేరు వింటేనే యిందాకటి వీణానాదము స్మృతిపథానికి తగిలి ప్రాణవాయుప్రసారము కావించింది. తదుపరి ఆంధ్రు లని తెలుసుకోవడంతోనే పరవశున్నయిపోయాను. కాని నాపరవశత్వానికి ఆచార్యులవారి కంఠస్వరంలోని మార్పు భంగంకలిగించింది. మళ్లీ ఇలా వినబడ్డది:

"నాకు ప్రథమకళత్రం సంతానభాగ్యం కలి

గించకుండానే పరవశించింది నాయిరవై అయిదవ యేట. ఆమెతో నే యిహపరశ్రేయస్సులు రెండూ ఈ ఫీల్డ్లో కలిసిపోయాయి. మన దేశంలోనే సుప్రసిద్ధవిద్వాంసులైన రామచంద్రదీక్షితులుగారు ఈ క్షేత్రానికి వచ్చినప్పుడు దైవకటాక్షా నా అభిజాత్యాన్నీ, సన్నిహితత్వాన్నీ తెలుసుకుని వారి కన్య నిచ్చి వివాహంచేశారు నాకు, పదిహేనేండ్ల వయస్సులో. నా కామె అన్నివిధాలా ఆనందాన్ని యిచ్చేది. ద్వితీయ కళత్రం వున్నదన్న మాటేగాని సంతానాన్ని యింతవరకూ ప్రసాదించలేకపోవడమే కాకుండా సామాన్య సాంసారిక సౌఖ్యానికిగూడా నన్ను బాహ్యుణ్ని చేసింది. నే నొకనాడు అభినవభారతీతీర్థంలో స్నానం చేస్తూండగా నాలుగేండ్ల పిల్ల ఒకతె ఏడుస్తూ కనబడింది. తప్పిపోయింది కాబోలునని నే నామెను పుత్రికావాత్సల్యంతో చేరదీసి బుజ్జగించి ఇంటికి తీసుకొని వచ్చాను. ఆమె తల్లిదండ్రు లెవరో నాకు ఇంతవరకూ తెలియను. అభినవభారతీతీర్థంలో నా కామె దొరకడంచేత ఆ పేరే పెట్టుకున్నాను. ఈవిడ చూచినప్పుడల్లా నా భార్యసోదరిలాగా కన్పిస్తుంది. నా భార్య తన యుప్పద్వారా ఈ చిట్టితల్లిని నాకు సమర్పించుకొన్నట్లుగా ఎంచుకొని పెంచుకుంటున్నాను. ఇందాకా నువ్వు పాడిన పాట విన్నంతసేపూ నా ప్రథమకళత్రమూ, నా అభినవభారతీ నా కనులలో మెలగి నన్ను తన్మయునిచేశారు. నా సంగీతవిద్యనంతా నా తల్లికి నేర్పాను. ఆమెగళంలో ఏయమృతనిర్ఝరిణి కాపురముందో కాని నే నామెపాట వింటూన్నంతసేపూ ఈలోకాన్ని చూడలేను. వీణ పట్టుకుంటూ నన్న మాటేగాని నే నేం స్వరం కల్పిస్తున్నదీ నాకు తెలియకుండానే మీటుతూవుంటాను. నాకన్నతల్లికి పెండ్లి యీడు వచ్చింది. అయితే, శ్రీధరం! నువ్వేమి చదువుకున్నావు?"

ఆయన ఏం మాట్లాడాడో నేను వింటున్నట్టే వున్నానుగాని నా కేమీ వినబడిందికాదు. ఎంతసేపూ అభినవభారతీస్వరూపమూ, ఆ గానమాధుర్యమూ, ఆ నామధేయసార్థకతా నామనస్సును పరిపరివిధాల తిప్పుతున్నాయి కలవరచుకొని. చిట్టచివరకి నా నేరవమంలోనే ఒక సుఖస్వప్నంనుండి మేలుకొన్నట్లయి చివరిమాట వినబడ్డది. ఏం చెప్పాలో, ఏం చెప్పితే బాగుంటుందో, ఎలా చెప్పితే మంచిదో నాకు తెలిసిందికాదు. "సంస్కృతాంధ్రాల్లో సంపూర్ణసాహిత్యం వుంది" అన్నాను.

"సాహిత్యానికీ సంగీతానికీ ఏకదేశవాససంబంధం వున్నది" అన్న ఆయనవాక్యంలో నా కేవేవో అర్థాలు తోచాయి. పట్టరాని సంతోషం పరవళ్లు త్రొక్కింది నాహృదయంలో.

ఆయనకు సమాధానం చెప్పలేకపోయాను. ఇంతవరకూ నన్ను తన ఆత్మీయునిగా భావించి స్వీయకథ చెప్పుకుంటూ నావాలకం చూడలేదు. ఝాలితాంగవస్త్రాన్ని మస్తకసీమ నుంచికొని, సనాతనాంధ్రునివలె బిళ్లగోచీ పెట్టి నారసంచీలోని పట్టుబట్ట కట్టుకొని కుడిచేత్తో జారీచెంబునూ, ఎడంచేత్తో తడిబట్టల సంచినీ పట్టుకొని నిర్గమించబోతూ "అబ్బాయీ, నాలుగురోజు లుంటావుకదూ ఈ వూళ్లో" అని అన్నారు. "చిత్తం! సామాన్యదినాల్లోతప్ప దేవాలయ శిల్పవిన్యాసాన్ని చూడడాని కవకాశం వుండదు. కాబట్టి ఒకవారంరోజులైనా వుండి తనివితీరా విశేషాలన్నీ చూసిగాని వెళ్లను" అన్నాను వారివంక ఆతురతతో చూస్తూ.

"మాయిల్లు దేవాలయానికి ప్రాగ్భాగంలో మొదటిప్రాకారంలోనే వుంది. వీలున్నప్పుడల్లా వచ్చి చూసి వెళుతూ వుండు" అని సాదరంగా వా రన్న వాక్యాలు నాహృదయంలో అమృతవర్షం కురిశాయి. అప్రయత్నంగా "చిత్తం, దానికేమి, రోజూ వస్తూ వుంటాను" అన్నాను. వారు 'మంచి' దంటూనే అదృశ్యులయ్యారు జనబాహుళ్యంలో.

తంత్రీసమత్వంలో నాతో సరసాలాడడం తగదన్నట్లుగా ఆనందవర్ధనాచార్యులుగా రున్నంతసేపూ లజ్జాసంకుచితశరీరయగు కన్యలా మౌనవిశ్చలత్వాలు తాల్చియున్న నాప్రేయసి వారు నిష్క్రమించడంతోనే యెక్కడలేని అనురాగంతో తరంగబాహువల్లరులను చాచి నన్ను గాఢాలింగనం కావించుకొని నా మీద నీళ్లుచల్లడం మొదలుపెట్టింది. శీకరాసారపరంపరాఘాతానికి ఓర్వలేక ముఖం త్రిప్పుకొని ప్రవాహాన్ననుసరించాను. నాతో అప్రవాహమూ, అప్రవాహ

నుతో నేనూ ఒండొకళ్లతో పెనవైచుకొనిపోతూన్న అప్పటి తన్మయత్వంలో నా ప్రేయసి అభినవభారతీ నామధేయము స్మృతికివచ్చింది. మాజీవనదు లావిధంగా ఏకోన్ముఖమై ప్రవహించే భాగ్యం కలుగుతుందా అని అనుకుంటూ అభినవభారతినే స్మరించుకుంటూ కొట్టుకొనిపోయ్యాను.

అలా ఎంతదూరం వెళ్లానో నాకు తెలియదు. ఎందుకు వెళ్లానోకూడా తెలియదు. అకస్మాత్తుగా నా శ్రోత్రరంధ్రములలో నా ప్రేయసి నామధేయము ప్రతిధ్వనించింది. ఎవరా అని తిరిగిచూచాను. ఒక అరవపోదరుడు వచ్చీరాని తెలుగుతో అది అభినవభారతీతీర్థమనీ, ఇచ్చట స్నానంచేసిన పుణ్యాత్ములకు సంగీతసాహిత్యవిద్యానిష్ణాతృత లభిస్తుందనీ భక్తిపూర్వకంగా వివరిస్తున్నాడు. త్యాగయ్య ఈతీర్థంలో స్నానం చేయడంచేతనే వాగ్గేయకారకు డయ్యాడనికూడా చెప్పుతున్నాడు. నా కెక్కడలేని రాగోన్మాదనూ కలిగింది. నా ప్రేమోన్మూర్తి అనుకొని ఆతీర్థాన్ని గాఢపరిష్వంగసౌఖ్యంకోసం చేతులకొద్దీ కదిలించివేశాను. నాతమకాన్ని ఇనుమడించే కోమలకాఠిన్యం యెక్కడా లేదు. నా అల్లరి కాగలేక నా ప్రేయసి నీరైనట్లనిపించింది. ఆమెహృదయంలో అవిఘ్నంగా చొచ్చుకుపోతానన్నట్లు పాములాగా కోసుగా నీళ్ల లోపలకు పోయాను. నన్నామె యీవిధంగా ఆదరిస్తుందన్నట్లు కొంతదూరము పోయి నిల్చున్నాను. "నాకు మళ్లే నీవు నదీలె పోఆరా" అని ఎవ్వరో అన్నట్లు అయింది. చుట్టుప్రక్కల ఎవ్వరూ కనబడలేదు.

౪

కావేరీతీరాన్నంతా వెయ్యికళ్లు చేసికొని గాలించాను. నామనోహరుని దర్శనం కాలేదు. మనస్సులేనిదానిమాదిరి ఒక్కమాటు నదిలో దూకాను. అప్పటికి నాకు కొంత మనస్స్వాస్థ్యము లభించింది. నాతల్లియెదుట నామనోహరుడు నన్ను స్వీకరించినట్లూ, నాతల్లి నన్నాశీర్వదించినట్లూ నా దేహముప్పొంగిపోయింది. నా ప్రయత్నం మొదటలో కొంతకష్టాన్ని కలిగించినా తుదకు తప్పకుండా సఫల మౌతుందన్నట్లు పైపైకి నీళ్లు కొంతవేడిగా వుండి లోలోపల అతిశీతలములై తల్లిఒడిలో సౌఖ్యాన్ని కలిగించాయి. కాని మనస్సులో అనిర్వాచ్యమైన తీయని వేదనమాత్రము తీపుపెట్టుతూంది. నా ప్రియుని రూపము స్మరణకు వచ్చింది. పునర్దర్శనమునకు హెచ్చరించినట్లయినది. కాని ఆయన పేరేమిటో, వూరేమిటో తెలియదు. ఎవర్ని ఏమని అడిగి తెలుసుకోను? నన్ను నేనే అడుక్కున్నాను.

"ఓకళాప్రియా! ఓకళాపతీ!
గానకళారసప్లావితహృదిలో
ఏ నను మోము ఫలించెను సతిరో!
గేయవిశారదయువ నీయెదలో
ఏయకలంకుడు వ్రాసెను చెలిరో!
శ్రీనగరనృత్యవశీకృతమతిలో
గోసరు దెవ్వరు కూడెను సఖిరో!
ఓకళాప్రియా! ఓకళాప్రియా!"

వచ్చిన సమాధాన మాసుందరాకారుని సుధామధుర సౌందర్యస్వరూపమే! ఆతని ముఖ నిర్గతవిజ్ఞాన తేజఃపుంజమే! ఆసక్తికశిల్పవిన్యాసమే!

తరువాత నా కేమీ తోచిందికాదు. గాఢాంధకారంలో మెఱుపుకాంతిలా నామనస్సులో ఒక భావం తట్టింది. నానాథు డెక్కడున్నదీ మాఅమ్మకు తెలుసునేమో? తెలుస్తే నాకు చూపిస్తుంది తప్పకుండా అని, ఏదో పాడుకుంటూ నదిలోబడి కొట్టుకుపోయాను.

కొంతదూరం పోయేటప్పటికి జనశూన్యమైన అభినవభారతీతీర్థాన్ని చేరుకున్నాను. మా నాన్న నా జన్మవృత్తాంతాన్ని గురించి బాధతో చెప్పిన విషయం అంతా ఒక్కసారి జ్ఞాపకంవచ్చింది. చంటిపిల్లలా క్యావురుమన్నాను. నన్ను బుజ్జగించేందుకు నాతల్లి నన్ను కాగిలించుకుంది. కళ్లవెంబడి నీరు ప్రవహిస్తూండగా ఇలా అన్నాను:

"అమ్మా! నన్ను కన్నతల్లినుండి విడదీసింది నువ్వు. కన్నతల్లికంటె ప్రేమతో చూసే ఆనందవర్ధనాచార్యులుగారికి నన్ను అప్పగించింది నువ్వు. మొదట్లో కష్టపెట్టినా పైమెట్టుకే తీసుకెళ్లుతున్నా వింతవరకున్నూ. నేడు మళ్లీ నీసహాయం వేడుకున్నాను.

నా నాథుం డెక్కడున్నాడో చూపించు. లేకుంటే నన్ను నీవే తీసుకెళ్లిపో" అని అంటూ నీళ్లలో మునిగాను.

మునగనివ్వకుండా నన్నెవ్వరో నిలబెట్టారు. నీళ్లు ముఖంనిండా కారుతూండడంచేత రూపెవరైందీ స్పష్టంగా కనబడలేదు. కాని ఆస్పర్శ నాకు నూతనోత్తేజాన్ని కలిగించింది. ముఖం విదల్చి కనులు విప్పి చూచాను. నామనోహరుడే! తలవాల్చి, లజ్జాసంకుచితనై విడిపించుకోబోయాను. కాని మరుక్షణంలో నా నాథుని—

అలా ఎంతసేపున్నామో నాకు తెలియదు. ఎన్నాళ్లున్నా తెలిసేది కాదేమో!

తుట్టతుదకు తృప్తితీరని హృదయాల్తోనే లోకానికి జడిసి విడివడ్డాము.

*

"నామనోహరి నన్ను ప్రేమించింది, నన్ను ఆదరించింది. కాని నే నెట్లా ఆమెను గౌరవించను? ఆమెకోసం నే నీవూళ్లో ఎన్నాళ్లుంటాను? నాకు జీవనం ఎట్లా గడుస్తుంది? ఇంతవరకూ ఎక్కడ తింటున్నానో, ఎక్కడ పండుకుంటున్నానో [illegible]కోకుండా జరిగిపోతోంది. ఇలా ఎల్లకాలమూ జరుగుతుందా? ఈవూళ్లో వుండిపోతే నావుద్యోగం ఏమవుతుంది? మా ఈ రహస్యసమావేశంసంగతి వింటే ఆనందవర్ధనాచార్యులుగారు ఏమనుకుంటారు, లోక మేమనుకుంటుంది?"

అని పరిపరివిధాల నాలో నేనే పడరాని బాధ పడుతున్నాను అభినవభారతీతీర్థంలో కూర్చొని అదే పనిగా. ఇంతలో నాప్రేయసి రసాలశాఖపై కూర్చొనియున్న నావాలకాన్నవలోకించి 'బాలం ముకుందం' అని పాడుతూ వచ్చింది.

నామనస్సొక్కసారి నిర్మలమైంది. నాప్రేయసి ఆక్రమించేసింది నామనస్సును. కొమ్మదిగాను. పట్టరాని తమకంతో నాప్రేయసిని కౌగిలించుకున్నాను. కొంచెంసేపటికి తెలివివచ్చింది.

ఇద్దరమూ ఒకరిముందు ఒకరం వేణువనంలో నుండి పోతున్నాము. అనిశాంతప్రశాంతత మా గమనాన్ని అనుకరించి ప్రతిధ్వనిస్తోంది. మానిట్టూర్పు గాడ్పుల్ని కూడా ఆ వేణురంధ్రాలు మనోజ్ఞగానంగా మారుస్తున్నాయి. మధ్యమధ్య చేరేడుపళ్లు తింటూ, ఆవెన్నెలరాత్రి ఒకరి సోయగాన్ని మరొకరం ఆస్వాదిస్తూ, ఒకరితో ఒకరు చూపుల్తో మాట్లాడుకుంటూ, అప్పుడప్పుడు స్పర్శసుఖం అనుభవిస్తూ ఎంతదూరం వెళ్లామో తెలియదు. అలా వెళ్లినంతసేపూ మేమిద్దరమూ ప్రత్యక్షంగా మాట్లాడుకోలేదు. ఇంతలో ఒక వెనుకకొంటెకోనగాడు నాప్రేయసిచెంగు పట్టుకున్నాడు. నాకు ఒళ్లు మండిపోయింది. వాణ్ని వదిలించి గట్టిగా లాగిపుచ్చుకుని వదలిపెట్టాను. వాడు సరాసరా పదిగజాలదూరంలోవున్న మామిడిచెట్టుమీద పడ్డాడు. చెట్టు కదలి చిటారుకొమ్మని మిటాయి పొట్లాలు క్రిందపడ్డాయి. ఇరువురమూ పరుగెత్తాము ఏరుకుందామని. కాని నేను వేస్తున్నకొంటెత్తు కనిపెట్టిన నాభారతి నావంక చూస్తున్నట్టే చూస్తూ నాకంటే ముందు పోయి నిచ్చనివుండడంచేత ఆమెకే దొరికాయి రెండుపళ్లూను. ముఖంవాల్చుకున్న నన్నుద్దేశించి "ఎవరు గెల్చారూ?" అన్నది నాచెలి. నా కభిమానంవేసింది. 'నేనే' అన్నాను. 'ఎట్లా' అని మళ్లీ ప్రశ్న. "నిన్ను పంపించి పళ్లు తెప్పించుకోవడంచేత" అని అన్నాను సగర్వంగా. "అబ్బో" అంది వెటకారంగా.

ఇంతలో నాదగ్గరకు రావడానికి కిందచూడకుండా నడవడంచేత నాప్రేయసికాల్లో ముల్లువచ్చుకుంది. సాధ్యమైనంతత్వరలో నేలమీద కూలబడి రాగాలాపన ప్రారంభించింది.

"సంగీతవిదుషీమణు లనిపించుకొన్నారే" అన్నాను, ఆసమయంలో అనడం బాధాకరం అని తెలిసీ కూడా! కాని కోపమూ, అభిమానమూ పొంగిరాగా "మీరు ఛాందసశ్రేష్ఠు లనిపించుకోలా" అన్నది.

నాకు ఉక్రోషం కలిగిందిగాని యింక మితిమీరడం మంచిదికాదని "నాలుగురోజుల సాహచర్యంలోనే చాలాజ్ఞానం సంపాదించావే" అన్నాను.

నాప్రేయసి మాటలాడలేదు. బాధవల్లనో, నాప్రయోజకత్వంవల్ల కాదనో!

నేను నెమ్మదిగా సమీపించి ఆమెప్రక్కనే కూర్చున్నాను. మళ్లీ బాధాసూచకంగా ఒక నిట్టూర్పు

పుచ్చింది. నే నూరుకోలేక ఆమె కాళ్లు తీసి నా ఒడిలో పెట్టుకొని మళ్లు తీశాను. తీస్తున్నంతసేపూ "ఏమి టండీ" అని విసుక్కుంటూనే వున్న భారతి తియ్యటం తోనే కాలు దగ్గరకు లాక్కుంది. నే నామె బాధా నివృత్తికోసం పాదసంవాహనం మొదలుపెట్టాను.

"అలా ఐతే వెళ్లిపోతాను" అంటూ లేచింది. నేను వెంబడిస్తూ "అంతకోపం ఎందుకూ, నే చెప్పింది భారతీపాదసంవాహకుల మే" అన్నాను.

"కావచ్చు! అభినవభారతీశయ్యాసమాప్తసుఖ నిమగ్నులుకూడా కావచ్చు!" అన్నది.

"కావచ్చునేమిటి? ఔదుమ" అన్నాను.

మరుక్షణంలో—

౬

ఆ నాడు శ్రీధరశర్మతో కలుసుకున్నప్పటినుండీ నా బిడ్డకు తగిన వరుణ్ణి శ్రీరంగనాథుడు సమ కూర్చాడని అనుకుంటున్నాను. ఆ పేరెంత బాగుంది! త్రిమూర్తులూ అందులో యిమిడివున్నారు. చాలా చదువుకున్నాడట! అంతైనా—ఎంతవినయం చూపించాడు నాదగ్గర! అతని పేరుకు తగినన్ని గుణాలూ మా భారతి కున్నాయా? బ్రహ్మవిష్ణుల శక్తులైతే ఏమాత్రమైనా మా భారతిదగ్గర వున్నాయికాని శివుడి శక్తి లేదేమోనని నిన్నటివరకూ భయపడుతూనే వున్నాను. కాని క్రిందటిరాత్రి వారిని వేణువనంలో అకస్మాత్తుగా చూచినప్పుడు మా భారతిలో పార్వతీ తత్వంకూడా బాగా వున్నదనుకున్నాను. దైవ మలా వుద్దేశించి యిప్పటివరకూ పెండ్లికానివ్వకుండా వుంచి యిన్నాళ్లకు చక్కని వరుణ్ణి చూపిపెట్టినప్పుడు ఆ మాత్రం తగిన గుణాల నన్నిటినీ సమకూర్చదూ?

ఇలా అనుకుంటున్న సమయంలో భారతి తల వంచుకొని చకాచకా లోపలికి వెళ్లిపోయింది. మళ్లీ ఇటు తిరిగిచూచేటప్పటికి శ్రీధరశర్మ నమ్రుడై నమ స్కరిస్తూ నిలుచున్నాడు.

"తివాచీమీద కూర్చోవోయ్" అన్నాను.

అతని ముఖంలో ఏదో తప్పుచేసి పశ్చాత్తాప పడేవాని లక్షణాలు గోచరిస్తున్నాయి. కదలకుండా మెదలకుండా అలానే కూర్చున్నాడు. నాకు తోచింది కాదు.

"ఈవూళ్లో విశేషాలన్నీ చూడటం అయిందా?" అన్నాను.

"చిత్తం! చాలామటుకు చూశానుకాని కొద్దిగా కొంతవున్నది" అన్నాడు.

"ఐతే ఇంకా ఎన్నాళ్లుంటావ్" అన్నాను.

"రేపొక్కరోజు."

ఆమాటలో ఎంతో దైన్యం కనబడింది.

"నీతోబాటు నేనూ, మా భారతీ వస్తాము" అన్నాను.

"మావూరే!" అన్నా డాశ్చర్యంతో.

"ఔను" అన్నాను దృఢంగా.

అతను మరెంత ఆశ్చర్యపడుతూ—

"మావూళ్లో ఎవ రున్నారు? మా వాళ్లెవరూ లేరు. నేను తిరుచునాపల్లిలో వుద్యోగం చేస్తున్నాను" అని చాలా కంగారుతో అన్నాడు.

"అయితే నీకోసం రాకూడదా?" అన్నాను ఏమని సమాధాన మిస్తాడో చూదామని.

"రావచ్చుగాని నే నిక్కడే వున్నానుగా" అన్నాడు ఏదో పరధ్యానంతో.

ఇంతలో భారతి వచ్చి—


"నాన్నా! ఏవూరూ ప్రయాణం" అన్నది.

"వాళ్ల వూరు" అన్నాను శ్రీధరాన్ని చూపిస్తూ.

ఇద్దరూ తలవంచుకున్నారు.

ఏం గ్రహించుకున్నారో నాపాదములకు నమ స్కరించారు ఒక్కసారిగా.

నేను నామనసారా శ్రీరంగనాథుణ్ణి స్మరించు కుంటూ ఆశీర్వదించాను.



ఆధునిక పరిశోధనలు – పరిశ్రమలు

హెన్రీఫోర్డుగాని, సర్ విలియం మారిస్ గాని బ్రహ్మాండమైన తమకర్మాగారాల్లో రోజుకు కొన్ని వేల మోటారుబండ్లను తయారుచేస్తున్నారని చెప్పితే ఆశ్చర్యపడే రోజులు పోయినాయి. కాని అదే ఫోర్డు మహాశయుడు తను దినదినమూ ప్రపంచానికి కానుకగా సమర్పిస్తున్న వేలకొలది మోటార్ల స్టీరింగ్ చక్రాలు, పైపర్లను, తలుపుల గడియలూ కేవలం చిక్కుడు గింజలవంటి ఒకవిధమైన గింజల్లోంచి తయారుచేస్తున్నాడంటే మాత్రం ఆశ్చర్యపడక మానం. మనది సంయోగీకరణ (Synthetic) యుగము. ప్రకృతిలోవున్న ప్రతిపదార్థాన్నీ చీల్చి చెండాడి అందులోని వివిధపదార్థములను తిరిగి సమకూర్చి విశ్వామిత్రసృష్టి చేస్తున్న కృత్రిమయుగం మనది. ఎటుచూచినా కృత్రిమపదార్థాలే! కృత్రిమరత్నాలు, కృత్రిమబంగారం, కృత్రిమపుపట్టు—మరెన్నో అట్టివే! ఇది సంపూర్ణంగా రసాయనిక సామ్రాజ్యం.

* * *

ఈరసాయనికశాస్త్రజ్ఞులు ఎందుకూ పనికిరావని పరిత్యజించే వస్తువుల్లోనుంచి ఎన్నో ఆశ్చర్యకరమైన క్రొత్తవస్తువులను సృష్టిస్తున్నారు. జర్మనీశాస్త్రజ్ఞుడొకడీమధ్య తమ దేశంలో ఏవస్తువునూ పారేసిపోనివ్వమని సగర్వంగా ప్రకటించాడు. నిజమే. ఎందుకూ పనికిరాకపోగా ప్రతివారూ అసహ్యించుకునే మురికికాల్వల కల్మషంలోనుంచే అనేకులకు ప్రాణదానం చేసిన, చేస్తున్న ఒకానొక ఔషధాన్ని తయారుచేస్తున్నారు జర్మన్ శాస్త్రవేత్తలు.

* * *

మనం సాధారణంగా నూలుబట్టలు కట్టుకుంటాం. ధనవంతులైతే పట్టువస్త్రాలు ధరిస్తారు. చలిదేశాల్లో ఉన్నిదుస్తులు వేసుకుంటారు. కాని పాలవస్త్రాలెవరైనా సింగారిస్తారా? పాలుతాగుతారు, పాలతో వండిన తినుబండారాలు తింటారు. అంతేగాని పాలుధరించటం ఏమిటని ఆక్షేపిస్తారు మీరు. కాని మీరు పొరబడుతున్నారు. పాలల్లోనుంచి వుత్పన్నమయ్యే 'కేసిన్' అనే ఒకానొక పదార్థాన్ని వున్నికి ప్రత్యామ్నాయంగా వాడుతున్నారు. అది పౌనుకి సుమారు రూ. ౧-౬-౦ ఉంటుంది. అసలైన వున్నికంటే చౌక. వున్నివలె కుంగదు. బూజుపడదు. కనుక ఆస్ట్రేలియా బయళ్లలో ఉన్నిపరిశ్రమకై పెంచే వేలాది గొర్రెలకు ఇటుపైన స్వస్తి అన్నమాటే. పాలకేకాకుండా బట్టలకుకూడా ఇకమీద మనం గోమాతపై ఆధారపడతామేమో!

బట్టలేకాదు ఈ 'కేసిన్'తో తయారయేవి. ఎన్నోవిధాలైన సౌందర్యవర్ధక పరికరాలు, బిలియర్డు బంతులు, బొత్తాములు, ఊటకలాలు, తెల్లకాగితాలు, మరెన్నో ఈ 'కేసిన్'తో తయారు చేస్తున్నారు.

* * *

బంకమట్టిలోనుంచి 'ఆల్సిఫిల్మ్' అనే ఒకవిధమైన పల్చటి పదార్థాన్ని తయారుచేస్తున్నారు. ఇది కాగితంవలె వుండటం కాకుండా కాగితానికి లేని లక్షణాలెన్నో కలిగివుంటుంది. నిప్పులోవేసినా మండదు. ద్రావకాలలోపడినా కరగదు. ఉల్లిపొరవలెఉండి ఇటునుంచి అటు కన్పింపచేస్తుంది. దీనికి రుచిగాని, వాసనగాని లేకపోవుటచే భోజనపదార్థాలను పొట్లాలు కట్టుటకు దీన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు.

* * * *

బొగ్గు, గాలి, నీళ్లు — వీటిలోనుండి 'నైలాన్' అనే ఒకపదార్థాన్ని కల్పించారు, శాస్త్రజ్ఞులు. ఇదిపట్టు కంటె మృదువుగానూ, పాలీదు దారంకంటె సుకుమారంగానూ, ఉక్కుతీగకంటె బలిష్ఠంగానూ ఉంటుంది. దీనిని అనేక పనులకు ఉపయోగిస్తున్నారు నేటి నాగరికులు.

*　　*　　*　　*

'లూసైట్' అనే మరియొక పదార్థము వెన్నెల వంటి చల్లనికాంతిని ప్రసరింపజేయుటకు ఉపయోగపడుతున్నది. నరములకు ఏ విధమైన అపాయమూ కలిగించకుండా శరీరంలోని ఏభాగానికైనా వెల్తురును ప్రసరింపజేయ్యడానికి వైద్యులు దీన్ని వాడుదురు. దీన్నే "X"రే చికిత్సలోను, రాజబాటల్లోని 'రిఫ్లెక్టర్ల'కును విరివిగా ఉపయోగిస్తున్నారు.

*　　*　　*　　*

ఇక నిర్మాణములవిషయం. పెద్ద పెద్దనగరాల్లో ఆకాశాన్ని చుంబించే తుంగహర్మ్యాలను నిర్మించారు. సుమారు ౧౨౦ ఎకరాల విస్తీర్ణం కలిగివుండి, రెండులక్షల ప్రజలు నివసించునంత పెద్దవైన భవనాలెన్నో న్యూయార్కులాంటి మహానగరాల్లో ఎంజనీర్లు నిర్మించారు. సుమారు ఎనిమిదికోట్లరూపాయ లుంటుంది ఒక్కొక్కభవనానికైన ఖర్చు. ఇవిగాక చరిత్రలో ఎన్నడూ ఎరుగనంత పెద్దపెద్దవంతెనలు నిర్మించారు. మహానదులకు పర్వతపంక్తివంటి వారధులు కల్పించారు. వాటిసహాయంవల్ల బ్రహ్మాండమైన విద్యుచ్ఛక్తిని ఉద్భవింపజేసి తచ్ఛక్తిని ప్రజోపయోగమైన అనేకకార్యాలకు శానిపగా వాడుతున్నారు.

*　　*　　*　　*

కిటికీలతో పనిలేకుండా సాంతంగా గాజుతో నిర్మించిన వసతిగృహాలు — అన్ని ఋతువులలోనూ సమశీతోష్ణస్థితిని కలిగివుండే యంత్రశాలలు, దుకాణాలు, రైళ్లు — శబ్దాన్ని లోనికి చొరనీయని గోడలు గలిగి లండన్ నగర మధ్యభాగంలో నైనా ఋష్యాశ్రమాలలోని ప్రశాంతతను ప్రసాదించే నివాసాలూ సర్వసాధారణ మైపోయినవి. వీటికన్నిటికిని ఆధారము విద్యుచ్ఛక్తియే.

*　　*　　*　　*

యుద్ధం మానవజాతికి వినాశనహేతు వనుటచే అత్యంత గర్హ్య మైనప్పటికీ ఆధునిక యుద్ధనిర్వహణంలో శాస్త్రపరిశోధనలు తెచ్చిన మార్పునకు మనం జోహారు లివ్వక తప్పదు. యుద్ధము నేడొక వ్యాపారము, ఒక పరిశ్రమ, ఒక వేలంవెర్రిగా మారిపోయింది. యుద్ధపిపాసులు మరెన్నో కొత్తవిషయాలను గూర్చి తెలుపుతుంటారు. విషవాయువులనూ, విషక్రిములనూ కలిగివుండి కొద్దినిముషాల్లో మహానగరాలను మసిచేయగల బాంబులు; నిముషానికి అరవై గుండ్లు వదిలే తుపాకులు; ఆకాశంలో మిడతలదండు వలె మూగి సూర్యరశ్మినికూడా అడ్డుపరచే బాంబర్ విమానసంచయాలు; సముద్రయానమంటే పాతాళయాత్రగా మార్చిన సూపర్ డ్రెడ్ నాట్లు, జలాంతర్గాములు, టార్పెడోలు; త్రోవలో ఏది అడ్డువచ్చినా చూర్ణము చేసి దొల్లుకొనిపోయే టాంకులు, సైనికదళాలను మొత్తంగా త్రుటిమాత్రంలో భస్మీభూతం చెయ్యగల భూగర్భమందుండు మందుగనులు, ఇంకెన్నో మారణయంత్రాలు! మానవజాతి నాశనానికి త్రోవతీసే ఈ 'అభ్యున్నతి'ని కూడా మనం అభినందించాల్సిందే నేమో?

[పు. వెం. సు.]



వేదిక

దర్శన శాస్త్ర పఠన పాఠనములు

ఆంధ్రదేశంలో దర్శన శాస్త్ర పఠన పాఠనాలు ఎంతగా ఉన్నాయి—అనే ప్రశ్న ఈమధ్య నామనస్సులో చాలామాట్లు ఉదయించింది. కారణం? చిన్నప్పు డెప్పుడూ 'దర్శన శాస్త్రం' అనే మాట నాచెవిని పడ్డట్టే లేదు. చిన్నప్పుడే అంటం ఎందుకంటే: కొంచెం పెద్ద అయ్యేటప్పటికే, అనగా పదిహేడు పద్ధెనిమిది ఏళ్లు వచ్చేటప్పటికే — అంతకు చాలా ముందుగా, అంటే పది పన్నెండేండ్ల వయస్సులో ఉదయించిన సంకల్ప బీజాలు ఫలించటం, తురీయాశ్రమ స్వీకారార్థం ఆంధ్రదేశాన్ని వీడటం; అప్పట్నుంచీ అన్యత్రా కాలక్షేపం చెయ్యటం అయితే, తర్కశాస్త్రం, మీమాంస అనే మాటల్ని కూడా వినలేదంటే అబద్ధమే కాకుండా అన్యాయం కూడా అవుతుంది. వర్తమానకాలంలో శ్రద్ధగా సంస్కృతం చదివి పరీక్ష లిచ్చేవాళ్లలో గూడా పాణిని, బాలమనోరమ, సాహిత్యదర్పణం, కౌముది, శాకుంతలం, ఉత్తరరామచరిత్ర, పంచకావ్యాలు అనే గ్రంథాల కున్న ప్రసిద్ధి దర్శనశాస్త్ర గ్రంథాలకి ఈ దేశంలో లేదంటే, నన్నెవ్వరూ ఏమీ అనరనే అనుకుంటాను. వంగ, ఓఢ్ర, సంయుక్తరాష్ట్రాల్లో సంస్కృతాని కున్న సమాదరణ ఆంధ్రదేశంలో లేదనేమాట నిర్వివాదసత్యం. ఏమంటే, ఈ మూడు దేశాల్లో స్కూల్ ఫైనల్ వరకూ సంస్కృతం నిర్బంధ పఠనీయం (Compulsary). అంతే కాకుండా, ఈ మూడుచోట్లా పరీక్షల్ని గ్రహించే సంస్కృత సమితులు ఉన్నాయి. ఇవి గవర్నమెంటువారిచేతనే నడుపబడుతున్నాయి. ప్రతి సంవత్సరం ఈ పరీక్ష లిచ్చేవాళ్ల సంఖ్య వేలకొలదిగా ఉంటుంది. పరీక్షలు కేవలం సాహిత్యంలోనే కాకుండా, విభిన్న దర్శనాలూ, వ్యాకరణాలూ, స్మృతులూ, వైష్ణవ, జైన, బౌద్ధ శాస్త్రపరంగానూ ఉన్నాయి. మొత్తమ్మీద ముప్ఫయి విషయాలదాకా లెక్కవేసుకోవచ్చు. ఈ పరీక్షలుగాని, శాస్త్రపఠనంగాని ఆంధ్రదేశంలో లేకపోగా, ఈ శాస్త్రనామాలైనా ఎవ్వరి పెదవిమీదా ఆడుతున్నట్టు కనిపించదు.

నవద్వీపం, కాశీ, పూరీలలో చదివేవాళ్లకు అన్నపానాదు లిచ్చే ఏర్పాట్లు ఉన్నాయి. ఇంతే కాకుండా ప్రతి కుగ్రామంలో కూడా ఈ సమితి శాఖలుండి ఇంతో అంతో పని చెయ్యటంకూడా ఉంది. అందాకా ఎందుకు, ప్రస్తుతం నే నుండే గ్రామం మిడ్నపూర్ జిల్లాలోని 'కాంథై' అనేదాన్నే తీసుకొంటాను. ఈ ఊరు నిన్న మొన్నటిదాకా యూనియన్ బోర్డుకే నోచుకోలేదు. అల్లాంటిచోట ఒక కాలేజీ, రెండు హైస్కూళ్లూ, మూడు మైనరుస్కూళ్లూ, రెండు గరల్‌స్కూళ్లూ, ఒక నేషనల్‌స్కూలూ, సంస్కృత సమితీ ఉన్నాయంటే ఆశ్చర్యపడాల్సి వస్తుంది. మొన్న సంస్కృతపరీక్ష లిచ్చినవాళ్లసంఖ్య నూటయాభై. ఈ గ్రామంలో పరీక్షలకు తయారుచెయ్యగల పండితులు ఆరుగురు ఉన్నారు. అంతే కాకుండా, చుట్టుపక్కల ఉన్న కుగ్రామాల్లో 'టోల్', అంటే సంస్కృతపాఠశాలలు ఉన్నాయి. వాటి అన్నింటికీ గవర్నమెంటు గ్రాంటు ఉంది. అంతే కాకుండా ఆయా పరీక్షాకేంద్రాల్లో ప్రథమ ద్వితీయ స్థానాల్ని ఆక్రమించిన బుద్ధిమంతులకు మాసికంగా పారితోషికమూ, వాళ్లు పఠించిన పాఠశాలకు గ్రాంటు పెంచటమూ వగైరాలు ఉన్నాయి. ఇది వర్తమానవిషయం; పూర్వం వంగదేశంలో ఉన్న న్యాయదర్శన వ్యాప్తి, పండితుల్ని గురించి ఇక్కడ ప్రసంగించటం లేదు.

దార్శనికుల్లో వల్లభ నింబార్కులూ, సాయణుడూ, అన్నంభట్టూ, పద్మనాభతీర్థులూ మొదలైన

వాళ్లకు జన్మభూమి యైన తెలుగుదేశంలో ప్రస్తుతమీ శాస్త్రచర్చ ఏమోతాదులో ఉంది అనేదే విచారణీయం. ఇటుపైపు పిఠాపురంలో శ్రీపాదవారిని, బెజవాడలో మల్లాదివారిని, బందర్లో రాళ్లభండివారిని, కంభంపాటివారిని, నాగభూషణంగారినీ విడిస్తే మరి పేర్లు వినిపించటం లేదు. గుంటూరులోని జగద్గురువులవారినికూడా పేర్కొనవచ్చు.

ఈ విషయాన్ని వివరంగా తెలుసుకోనేనిమిత్తం బ్రహ్మశ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, శతావధానిగారికి నేను నా ఉత్తరం వ్రాస్తూ, వారి కాలంలో ఉన్న శాస్త్రపఠనాన్ని గురించి వివరంగా వ్రాయమని లోగడ అర్థించియున్నాను. ఫలితంగా, వారు అత్యంత చిత్తాకర్షకాలైన 'వెనకటి పండితులు', 'మా బాల్యదశ – నాటికవిత్వం' అనే వ్యాసాల్ని వ్రాసి, యథాక్రమంగా కృష్ణాపత్రిక, భారతుల్లో ప్రచురించియున్నారు. అందులో నన్ను రామకృష్ణామిషన్ పాఠశాలలో చదివే విద్యార్థిగా పేర్కొనియున్నారు. కాని, నేను విద్యార్థినీకాదు, ఇక్కడ మిషన్ పాఠశాలా లేదు నేను సాధువును — సన్యాసిని. అయితే, ఈ రెండు వ్యాసాలూ ఎంతో రమణీయంగా ఉన్నా, దర్శన శాస్త్రాల్ని గురించిన ప్రసంగం చాలా తక్కువగా ఉంది. దీనికి కారణం, వారి బాల్యదశలోనూ, ఇప్పుడుకూడా ఈ శాస్త్రం మన దేశంలో అంతగా సమాదరణలో లేకపోవటమే అవవచ్చు.

“ఇకనకే, మనభాషలో 'వేదాంతం', 'అద్వైతం' అనే శబ్దాలు అర్థవిపర్యయాన్ని పొంది, రుచిహీనంగా వాడబడుతున్నాయి” అని నేను వేరొకచోట వ్రాసియున్నాను. కారణం మరేమీ లేదు. ప్రతివాళ్లకూ కొంచెం కాగితంమీద కలం పెట్టే శక్తి వచ్చేటప్పటికి స్త్రీనగ్నసౌందర్యాన్ని 'ఆపాదకేశాంత' స్తవం చేద్దామన్న ఉబలాటం కలగటమే.

ఈస్థితి మారి విశ్వశ్రేయాన్నీ, పరానందాన్నీ కలిగించే దర్శనశాస్త్ర పఠన, పాఠన ప్రోత్సాహప్రచారాలకి వీలు కలుగుతుందా అనేదే జిజ్ఞాస.

దర్శనశాస్త్రం శుష్కం, రసహీనం అని చాలామంది అనవచ్చు. కాని కొంచెం ఆలోచిస్తే విశ్వరహస్యకీలకాన్ని విమర్శి, ఇది అద్భుతరసాన్ని ఉద్భవింపజేస్తుం దని తెలుసుకోగలము. కావ్యానందం క్షణికం కాల్పనికం, ఏతచ్ఛాస్త్ర ప్రతిపాద్యానందం శాశ్వతం వాస్తవం అంటే ఎవ్వరూ నన్ను కోపగించ రనుకొంటాను.

ఒక ఉదాహరణ ఇచ్చి ఈప్రసంగం ముగిస్తాను ఒక కవి గానం చేశాడు— 'నేను పక్షినైతే అనంతాకాశవీథుల్లో విహరించి ఆనందించేవాడ్ని' అని. అతన్ని జబ్బట్టుకొని క్రాస్ చేస్తే, బుద్ధికుశలతా విచారశక్తి ఉన్న ఈమనుష్యదేహాన్ని అతడు ఏవగించుకొని, పక్షిశరీరాన్నే చాలాగొప్పదనుకొని, దానికోసమే తపస్సు చెయ్యటం లేదని తేలుతుంది. మరి మనుష్యుడి చలనచాలనాలు పరిమితంగా నియంత్రితాలై, ఒక పరిధిలో ఉండటంవల్ల ఆ పరిధిని ఉల్లంఘించాలన్న ఆశే పక్షియొక్క రూపాన్ని పొందింది. కనుక, అనంతస్వాతంత్ర్యమే కవియొక్క ఆదర్శ మని ఫలితార్థం. దీన్ని ప్రసాదించే శక్తి ఒక్క దర్శనశాస్త్రానికే ఉంది.

ఈ శాస్త్ర పఠన పాఠనాల్ని విరివిగా సాగించే ఏర్పాట్లు చేసే భారం ఆంధ్రదేశస్థులగు పండితుల మీదా, అధికారంలో ఉన్నవాళ్లమీదా ఉంది. ఈ శాస్త్రచర్చ మళ్లా మనదేశంలో ఆవిర్భవించి, రాధాకృష్ణయ్యగారివంటి జగజ్జ్యోతుల్ని విరివిగా మనకు ప్రసాదించమని జగదీశ్వరుణ్ణి ప్రార్థిస్తూ విరమిస్తున్నాను.

శ్రీ పూర్ణానంద.

[శ్రీ రామకృష్ణ ఆశ్రమం, కాంటై, మిడ్నపూర్ జిల్లా.]

చారుదత్తరావు ధోరణి

= శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు =

నన్ను చిన్నప్పుడు కొంతకాలం దేవుడు అని పిలిచేవారని చెబుతారు. కాని, అంత చిన్న పేరు నాకు కొత్తగా పొట్టిఅయిపోవడం గ్రహించి త్వరలోనే మానేశారట, ఆ పేరుతో నన్ను వ్యవహరించడం! నాతల్లిదండ్రులు చెందటే గతించడంవల్ల వాళ్లని నేను ఎరగనే ఎరగను, పీడ వొదిలిపోయింది. నా పిత్రార్జితం ఓ ముసలమ్మ, కొంత ఆస్తినీ. ఆవిడే వండిపెట్టేది, వట్టింట దీపం పెట్టేది. నన్ను ఓ ఆయన పెంచుగోవాలని చూసి, దత్తరావు అంటూ పిలవడంకూడా మొదలెట్టాడు అప్పుడే మహా! వారం తిరక్కుండా ఆయన పెళ్లామూ, ఆవిడమునుగా కూడా అఖరైపోయారు. మరో ఆయనా అందుకే ప్రయత్నించాడు. ఆయన పెళ్లాంపనీ అంతే అయింది. అక్కడితో నన్ను పెంచుగోడం గురించి తెలిసినంత మట్టుకి ఎవ్వరూ తలపెట్టడంకూడా మానుకున్నారు. నేను ఇంట్లో ఉన్న సమయంలో ముసలమ్మ తను నాకు చేసే సాయం ఏదో చేస్తూ నాకేసి చూస్తూ ఊరుకోక నేను అడగనప్పుడుకూడా అడ్డమైన సలహాలూ ఇవ్వడమే. అందుకని ఆవిడమీద నాకు ద్వేషంకూడా బయల్దేరింది. నాస్వాతంత్ర్యం, నారాజ్యం, నాప్రజలు, నాగోడు — ఇవన్నీ ఈముసలమ్మకి ఎందుకన్నాను! అయినా, అయినప్పుడూ కానప్పుడూ నన్ను కాల్చుకుతిని నన్ను రెచ్చగొట్టేది. నేను అనేకరంగుల నాజూకుతిట్లు ఆవిణ్ణి తిట్టేస్తూంటానంటే, చావనా మరి! పెళ్లిచేసుగో, పెళ్లిచేసుగో అంటూ ఆవిడ పీకరొద! "అంత ముచ్చటైతే నువ్వు చేసుగో డర్టీగూస్" అని అరిచి ఆవిడనోరు మూసేస్తూంటాను. నావల్ల వంశానికీ, తనికీ అప్రతిష్ఠ వస్తోందని ఒకనాడు ముసలమ్మ సణుగుడు సాగించింది. అప్పట్లో నేను చారూ అన్నం తింటున్నాను. ఆవిడ రిమార్కువల్ల నాకు మిక్కిలి ఆనందం వేసి, ఆ మూల విరాట్టుని అభిషేకించడం విధిలా కనపడి ఎంతో సదుద్దేశంతో ఆవిడ తలనెత్తిమీద కంచెడు వేడిచారూ పదిలంగా చిందకుండా బోర్లించాను. తత్క్షణం ఆవిడ స్పృహలోకి వచ్చి బాష్పాలు తుడుచుకుంటూ లేచి వెళ్లింది. కాని, ఈవృత్తాంతం విని ఒక ఊరకవి నామీద తక్షణం 'పన్నడం' సంకల్పించి, నన్ను చారుదత్తరావు అంటూ వ్యవహరించి ఒక పద్యాలయం తయారు చేశాడు. ఎంత చెడ్డా, ఆ మాటకట్టులు పద్యాలు కదా అని వాటిని స్తోత్రాలకిందే జమకట్టేసుకున్నాను. కొంత కాలం అందరూ నన్ను అల్లానే పిల్చేవాళ్లు. అ దేమయితేం, ఉన్నమాట అట్టే దాచకూడదు—నేను చిన్న పిడుగుని, అఖండుణ్ణి! నా మేధ పండితులకి లొంగే రకం కాదు. నాప్రజ్ఞ అపూర్వ ప్రజ్ఞ. మూర్ఖులు నన్ను పండితపుత్రుడన్నారని తెలిసింది. వాళ్లమీద కసికొద్దీ నేను మావాన్ని పండితజనకుడంటున్నాను. నన్ను మామూలు మనుష్యుల స్కూలుకి పంపించడం మా ముసలమ్మకి బుద్ధిలేదనడానికి ఋజువుల్లో ఒకటి. స్కూళ్లల్లో పొట్టకక్కుర్తి పంతుళ్లు చెయ్యడానికి ప్రయత్నించే పనికిమాలిన బోధవల్ల నా అసాధారణపు బుర్ర చాలావరకు మందగించిపోయింది గాని, అటువంటి బోధనే గనక— అక్కొస్తానుగా— నాబుర్రని అంటుగోకుండా ఉండిఉంటే, ఈపాటికే నాబుర్ర దినుసు ప్రపంచం అంతటా పాముకుపోయి ప్రపంచాన్ని గిలాబా చేసేసిఉండేది. కాని, ఎంత పాడవుతేనేం గనక, పాడుకాగా నిలవగలిగిన ఆ కుంటి సహజ

ప్రజ్ఞతోనే నేను పరీక్షల్లో పిల్లిమంతరాలు విశేషం లేకుండా నెగ్గి అనుమానరహితంగా చదువుపురించిన పురుదు గడిచాను. అనగా, రెండుకాళ్లవాళ్లలాగ నేల మీద నడవవలిసిన అవసరం నాకు ఆ దెబ్బతో తగ్గింది. ఆకాశంలోంచి లిప్తలో అమాంతంగా లేచి పైకెగిరి విద్యాలయపూర్తికూడా చెయ్యడానికి బయల్దేరాను. ఇంత అకస్మాత్తుగా నాప్రజ్ఞకితగ్గ వైభవం ఎల్లాపట్టిందా అని వాకబుచెయ్యగా, నాకుడిభుజంమీద శంఖం, ఎడంభుజంమీద చక్రం ఉన్నట్టు ఒక చర్మజ్ఞుడు నిర్ణయించ గలిగాడు. అవి పుట్టుకనించీ అక్కడే ఉన్నాయనీ, దరిమిలాని అవి స్ఫుటం అయినాయనీ, తక్కినవాళ్ల కళ్లకి అవి ఆనవనీ, అయినా చెప్పేదు మాటలు విని నిరుత్సాహ పడకూడదనీ ఆతని తీర్మానం. నాజాతకప్రభావం యొక్క వయినం పొక్కగానే, నన్ను చాలామంది శంఖచక్రరావు అని పిలవడం అలవాటు చేసుకున్నారు. అదిలగాయతు, పోతేపోయింది, ఏంశాశ్వతం, నామసార్థకత్వమేనా సాధించుదాం కీర్తిశైనంతవరకూ —అనే ఉత్సాహంలో పడిపోయానని చెప్పడానికి నాకు ఎంతమాత్రమూ సిగ్గులేదు. ఇక నేను ఈభూమిమీద ఉండగల ఏ ఉత్తమోత్తమపదవీశిఖరానికేనా సరే ఎగరడానికీ, ఎగిరి అక్కడ వైభవంగా నిశ్చింతగా క్రియాశూన్యంగా అవ్యాహతంగా నిరంతరంగా కూర్చోడానికీ అర్హుణ్ణి. నేను కొంచెం శ్రద్ధపడితే చాలు అంతవాణ్ణీ నేను కాగలను. అందుకు కావలిసిన పరికరాలు యావత్తూ నాకు సంక్రమించా యన్న మాటే! అసలు నాకిప్పుడున్న మహాగుణాల్లో కొన్ని నేను దరిద్రులకి దానంచేసినా మిగతావి జన్మజన్మలకి చాలు. కాబట్టి, శ్రద్ధో లేకో నేను నిరంకుశంగా భూచక్రంగాని, దిక్చక్రంగాని తిప్పడానికి వెళ్లగల వంటూన్నప్పుడు, ప్రస్తుతంలో అటువంటి పనే (నేను ముందుకాలంలో మూపెట్ట పోయేటంత సామర్థ్యం మూపెట్టకుండానే) చేస్తూన్న ఘటాల్ని చూస్తే నాకు గౌరవం ఎందుకుండాలి? ఇక తక్కిన వాళ్లలెఖ్ఖ నాకసలేమిటీ? అంచేత, నేను ఇతరులప్రజ్ఞ గణించను, గుర్తించను, చూడను. నాప్రజ్ఞముందు ఇతరులకు అసలు ప్రజ్ఞ ఉందనే అనుకోను. నాతో సమానమైనవాడు నావిహితశ్రేణిలో అరుదుగాఉంటాడేమో అనేది చాలా నాసీసందేహం, నాకంటే అధికుడు ఇక ధన్తే ఉండడు అనేది సిద్ధాంతం. నేను ఏ గ్రహంలోనూ, ఏ స్థలంలోనూ, ఏ సందర్భంలోనూ, ఏ వ్యక్తినీ ఎందుకూ ఖాతరీచెయ్యవలిసిన అవసరం లేదు. నాహృదయంమాత్రమే నిష్కల్మషం, కడం వన్నీ కుళ్లురకం అని దెబ్బలాడి కుమ్మేస్తాను. నాకు తోచింది ఎప్పుడూ ఒప్పే అనిన్నీ, నాకు తోచద మేమిటి ఒప్పుకాకపోవడ మేమిటి అనిన్నీ నామతం. అంతే కాదు, నేను ఇంకోరికి తోచింపించిందీ, ఇంకోరిచేత చేయింపించిందీ కూడా ఒప్పే అంటాను. అటువంటిదానికి అడ్డుకెగిరి అది తప్పు అనడానికి ఎవడేనా సాహసిస్తాడా వాడి పని షికారే, అనగా మట్టం! ఎంచేతంటే, నాఅద్వితీయ ప్రజ్ఞేకాక, నాకు కొన్ని ప్రత్యేకాభిప్రాయాలూ, అలౌకికాభిరుచులూ, అసాధారణ స్నేహాలూ, అతీతసాహసాలూ, అగమ్యగతులూ, నిరంకుశతోరణులూ ఉన్నాయి.

నా అభిప్రాయప్రకారం మా నానమ్మలాంటి వాళ్లు ఎందుకు పుట్టారూ అంటే నేను కోరినప్పుడల్లా డబ్బు పంపడానికి. ఆవిడ డబ్బు పంపకపోయినా, తక్కువ పంపినా, పంపి ఖర్చువయినం అడిగినా, ఆవిడకి ఓ మోతాదు ఇవ్వడంరీతి నాకు తెలుసు. పుస్తకాలకనీ, పరికరాలకనీ, జరిమానాలకనీ, చందాలకనీ, పరీక్షలకనీ, దొంగలద్వారనీ, అవసరపుదొంగతనం నామీద మోపారనీ మా నానమ్మకి నచ్చచెప్పడానికి యత్నించి, ఇటువంటి సబబులు చెప్పినప్పుడు ఒకవేళ ఆ ముసలివిడకు నమ్మకపోతే, నైవైదు తీసుకుంటానని గాని, నల్లమందు తింటానని గాని, అసలు అటువంటి వాటి మిశ్రణం తినేసి చచ్చిపోతానని గాని పారుగూ రెల్లి ఒక్క టెల్లిగ్రాం కొడితినా నాకు కావలసినకంటె ఎక్కువసొమ్ము గిరగిరా తిరిగి ఊడిపడుతుంది. కాని, ఆవిడ పూర్వకాలపుమనిషి. చెంపకాయ వెయ్యడానికి చెయ్యి ఎత్తితే చాలు, ముణుచుకుపోయి ఇంట్లోకి పరుగూ! అంత మంచిదిగనక పోనీ అని చెప్పేసి ఆవిణ్ణి క్షమించి వదిలేస్తూంటాను. తక్కిన ప్రపంచపు స్త్రీలంతా నాకు వేళాకోళానికి వదనే. అందుకని, ఎవళ్లమీదైనాసరే నాయిష్టంవచ్చిన రిమార్కు— చీకట్లోంచిగాని, చాటున దాక్కునిగాని, సమూహంలో

దూరిగాని — ముఖవర్చస్సు గుర్తు తెలియకుండా మీద దెబ్బపడకుండా దూసుకుని నిర్భయంగా వేళ్ళేస్తాను. దాంతోటి అవతలవాళ్ల గౌరవం తక్షణమే లేచిపోయి వచ్చి నన్ను వరించడంవల్ల నాగౌరవం బలిసిపోతూంటుంది. అసలు పిచ్చిప్రహ్లాదుణ్ణి గురించి వెళ్లిపోతన్న చెప్పిన పీసపాదం కొంచెం ఫలించింది "కన్నదోయికి నన్యకాంత లడ్డంబైన భార్యభావముచేసి పరగువాడు" లాగ మార్చేస్తే నాకు సరిపోవచ్చు. విద్యావంతులంటే నాకు నమ్మకమే లేదు. విద్యవల్ల—అంటులో నేను చెప్పబడే విద్యవల్ల—బొత్తిగా లాభం ఉండదని నాఅనుభవం. విద్యవల్ల వినయం రావలిసిన అవసరం లేదని రాసిస్తాను. అందుకని "విద్యయొసగును" అనే పద్యాన్ని "విద్యయొసగు నవినయం బవినయమునను బడయు పాత్రత" అని దిద్దివెయ్యడమే బహుశు తెగు వంటాను. అనగా, ఈవిద్యవల్ల అవినయమున్నూ (అభినయమున్నూ అని పాఠాంతరం), దానివల్ల చేతికి పాత్రానూ వస్తాయని అన్వయించుగోమని నాహెచ్చరిక! పెద్దలంటే గౌరవించాలని కొందరంటారు. కాని, సిగ్గుభిడియాలు లేకుండా నాకంటె వెనకేపుట్టిన జంతుజనం నాఅంత నాగరికతలేని సంగతులగనక వాళ్ళని పాటించవలిసిన అగత్యం నాకు లేదు. సరిగదా, వాళ్లమాట పట్టుకుని వేళ్లాడేవాళ్లని నిజంగా వేళ్లాడదియ్యాలని నామనవి. నాకు డ్రెస్సుమీద సరదా. మామూలుమనిషికి కొన్నే దుస్తులు. నాకున్న సూట్లు నాకే తెలియవన్ని. నే కొన్న దెస్తుల రకాలు వరసని పెడితే ఓహాపు ఏర్పడచ్చు—రూములో నడవడానికి ఓరకం, లైబ్రరీకి ఓరకం, షైరుకి ఓరకం, ఆటలకి ఓరకం, సినీమాకి ఓరకం, ప్రయాణానికి ఓరకం, ప్రహాణానికి ఓరకం, సభలకి ఓరకం—ఇల్లా ఉంటాయి. ఈమాత్రమేనా లేకపోతే నాగౌరవం డాసుపడిపోవచ్చు, నాపాదాలు నొప్పిగోవచ్చు. నాకు పాతరకంభోజనం అసహ్యం. కొత్తరకపుదైనా నేను చాలా టూకీగా చేస్తాను. స్వయంగాకాక, స్నేహితుల్తో ఎన్నిసార్లైనా నేను అల్పాహారస్వీకరణం చెయ్యగల్ను. తాంబూలచర్వణం నాకు అవసరం. దానివల్ల నాలిక బండబారుతుందనీ, తత్వం వేడెక్కుతుందనీ కొందరు శిఖామణుల ఉద్దేశంట. వాళ్లు అస్ఖలితమూర్ఖులు. ఏమంటే, నా నాలిక్కి బండబారడందోషం కొత్తగా పట్టడం అసంభవం అనిన్నీ, నాతత్వం మరి వేడెక్కడానికి వీల్లేనంత ఘాటురకం అనిన్నీ వాళ్లెరగరు. నేను నిత్యధూమప్రియుణ్ణి. నా అంతరంగస్నేహితుల్తో ఏరకం ధూమకంబైనా సరే ద్రావకంబైనా సరే పుచ్చుకోడానికి నేను చెవికోసుకుంటాను. ఆరగింపుకి వీలైన ఘనద్రవధూమపదార్థాలు కొల్లలుగా దానం చెయ్యడంలోనూ, అంతకంటె ఎక్కువగా దానంపట్టడంలోనూ నాకు చాలా సరదా. ఆమాత్రం ఇచ్చిపుచ్చుకోడాలు కిట్టనివ్యక్తుల్ని నరకానికి రవాణాకట్టిస్తే యమవాహనానికి విశ్రాంతేనా దొరకకుంది. నాకు పరీక్షలంటే ఎంతో అంత యిది పరీక్షలు ఉండితీరాలని నాపట్టుదల. ఒకే అరతావు మీద యాభై అచ్చుపేజీల్లోని గ్రంథం యావత్తూ సన్నచీమలబారులాగ బ్రహ్మలిపిలో సూదిమొనతో రాసి అతిగూఢంగా పరీక్షచోటికి పట్టిగెళ్లగల నేర్పు నాకుంది. ఆనేర్పుగలవాళ్లని పోషించడం నాముచ్చట. పరీక్షలో కాపీచేసినవాడే మిక్కిలి చురుకైన తెలివిగలవాడని నాసూత్రం. కడంవాళ్లు అక్కడా అక్కడా ఏకుస్తూ ఈకుస్తూ అనేకకాలం వెచ్చించి నేర్చుకోగలిగిన అంశాలు, కాపీచేసేవాడు క్షణంలోనే నీటుగా గ్రహించగలగడం ప్రత్యక్షంచేస్తాడు గనక వాణ్ణే ఎక్కువగా మెచ్చడం నాకు సరదాగనక శుద్ధన్యాయం. పరీక్షాధికారులందర్నీ ఏకలాటుగా తుకిచెయ్యగల వివ.వాయుపురీకని పెడుకున్నాడు నామిత్రుల్లో ఒకడు. అంతకుపూర్వమే పకవగ్రంథాలు రాసేసినవాళ్లుంటారు, వాళ్లనికూడా మాయంచేసే ఏర్పాట్లు మరిచిపోవద్దని వాడితో చెప్పి కట్టుదిట్టంచేశాను. వేడుకకోసం ఉద్దేశింపబడ్డ నాటకం, సినీమా, సర్కస్ వంటివి అవశ్యం నేను వెళ్లితీరవలిసిన వనిన్నీ, అక్కడ నా అందచందాలూ, నా తెలివితేటలూ, నా మానమర్యాదలూ, నా వాక్స్వాతంత్ర్యవిశేషాలూ, నా చమత్కారరసికతలూ చూపించడానికి అవకాశాలు మరీ ఉంటాయి గనక, నాకు అవి చెప్పలేని సరదా. ఆకాశరామన్న ఉత్తరాలనేవి రాసినవ్యక్తిని వ్యక్తీకరించకుండా యాథార్థ్యాన్ని బైటపెట్టేస్తాయి గనకనున్నూ, ఎంత చచ్చి చెడిఅయినా యాథార్థ్యం ప్రకటనచెయ్యడం మానవధర్మం గనకనున్నూ నేను అల్లానే రచిస్తుంటాను.

తెలుగులోకూడా టైపుయంత్రాలు వచ్చాయిగనక, ఇదివరకు నేను ఇంగ్లీషులో నడిపినంత విరివిగానూ వీటిని తెలుగులోనూ బనాయించడానికి వీళ్లు కనిపిస్తున్నాయి. అర్ధరాత్రిఅయినాసరే కారుచీకటి అయినాసరే ఆవతల గోడవెలుగూ ఇవతల నాముఖంతళుకూ సాయంగా నేను ఆంధ్రాంగ్లకవిత్వరచన చేస్తానుగనక, వారాత ఎంత మసి అయినా తాత్కాలికశోభనైనా కలిగించవచ్చు కాబట్టి నా ఆదర్శం మాత్రీభరించినట్టుగా ఆనందిస్తాను. పేరుగలవాడిమీద త్వంకారప్రయోగం, వివాహ సందర్భాల్లో అమంగళ చర్యలూ దిగ్విజయంగా జరిగే కార్యక్రమానికి వీలైనంత సట్టుగా అడ్డుతగలడం కూడా నాకు ఆనందం చేకూరుస్తాయి. కేవలం పదదామాత్రమే కాక నా అభిమానవిద్యలలో ఒకటి అని చెప్పడానికి నేను విర్రవీగేది ఏదీ అంటే, మదీయ గాత్రజనిత ధ్వనివిశేషపరంపర. మాటలుమాత్రమే ఆడి ఊరుకునేవాళ్లు తమ నోటియొక్క పూర్ణప్రయోజనం ఎరగనివాళ్లు. నేను పక్షిలా కూయగలను, లేక సాధుజంతువులలాగ పశేపరి, హింస్రజంతువుల మాదిరిగా కూడా అరిచి పాడగల్ను, స్థాయీ నిలబెట్టగల్ను, శ్రుతి అక్కర్లేకు, ఆయాజంతువుల్ని ఆకర్షించగలను. ఆవిషయంలో నాకు శ్రమగాని, పట్టింపుగాని, వేళగాని, విసుగుగాని లేకపోవడం అటుండగా, నేను అలలిత కళ సృజించేటప్పుడు నా ఎదురుగుండా ఉండి నాకేసి చూస్తుండే సజీవులుకూడా ఆకళకి కర్తని నేనని చెప్పగోలేనంత ఒడుపూ నాటం—విప్రవినోదికంటే ఎక్కువగా—నాదగ్గిర ఉన్నాయి. ఉంటేం! చూసి విని మెచ్చి ఓ మెడల్ వంటిది ఇవతల పారెయ్యలేని దరిద్రాంధ్రదేశం అయింది, తీరిపోయింది.

ఒకటేమిటి! నాకృత్యాలన్నీ వీరకృత్యాలే అని చెప్పచ్చు. నేను ఎక్కడ నడుస్తూన్నా నా ఒయ్యారం వొలకబోసుకుంటూ సూదంటురాయి పాళీల్ని లాగేసేట్టు చుట్టుపక్కల ఉండే స్త్రీ పురుషాదుల్ని నాకేసి లాక్కుంటూపోతాను. ప్రతివిశ్వమూ నా తెలివితేటలు కారి ప్రవహిస్తూంటాయి. నేను ఒంటరిగా ఉండడం నాకు అయిష్టం. ఎంచేతంటే, నా బుద్ధిప్రజ్ఞ ఎంతటిదయినా నన్ను తమ మొండివాదన వల్ల ఒఖ్ఖణ్ణీచేసి నెగ్గేసే తుంటగ్లుండవచ్చు; నాజబ్బ బలం ఎంతటిదయినా నన్ను తమ పశుబలంవల్ల ఒఖ్ఖణ్ణీ చేసి అణిచేసే మొద్దురకాలు ఉండగలరు. అదీకాక నేను సంఘజీవిని. నేను మందలోగాని ఉండను. అందువల్ల ఈర్ష్యతో కొందరు మందబుద్ధులు నాప్రజ్ఞ మందప్రజ్ఞ అనీ, నాబలం మందబలంఅనీ సమాసించి, చివరకి అహోరించారు. ఏమంటే ఒకమాట రాణించాలంటే అది పుట్టేచోట పస ఎంత అవసరమో పడేచోట సిగ్గ అంత అవసరం. ఏమైనా నామధురగాత్రం ఖంగున మోగి నాసహజకవిత్వం వెల్లివిరిసి బయల్దేరాలంటే వినేవాళ్ల అదృష్టం బాగుండి నేను నాఅంతరంగస్నేహితుల్తో కలిసిఉండాలి. వాళ్లు యావన్మందీ నాకూడా ఉన్నారా అనగనేఅక్కర్లేదు, లేకపోతే అందులో ముఖ్యులు నాతో ఉన్నా చాలు. శృంగారరసపోషకులూ, స్థూలశరీరాభిమానులూ, పేకాటమార్తాండులూ, శ్రీరామనవమిపందిరికళారసాస్వాదకులూ, అట్లతద్ది వీరకార్యశూరులూ, ఆకాశరామన్నజ్ఞులూ, అంకజాదర్లూ, ఆకస్మికాన్నత్యాపేక్షితులూ గానలరకాల్లో కొందరైనా చాలు. అటువంటి జివ్యసరసులసమక్షంలోగాని నేను నాధీరలక్షణాలు వ్యక్తీకరించను. నా నోటికి హద్దుగాని, నాఘాటికి అడ్డుగాని లేకపోవడం వాళ్ల కళ్లముందుగాని తేలదు. అంతరంగస్నేహితులన్నాను గనక జ్ఞాపకం వచ్చింది. నాసామాన్యస్నేహ బృందాన్నీ, నాశత్రువర్గాన్నీకూడా కొంచెం వివరిస్తాను. నాయిష్టంవచ్చినట్టు నేను ఉండవచ్చును అని వాదించేవాడు నాస్నేహితుడు. నాకు సంపూర్ణస్వాతంత్ర్యంనురించిన హక్కు ఉందని నిష్కర్షగా పరిష్కరించేవాడు నాకు గాఢభక్తుడు. నాకు బాధ్యతలూ విధులూ ధర్మాలూ ఉన్నాయని చెప్పేవాడు నాకు శత్రువు. ముప్పొద్దులా నేను గ్రంథస్థవిద్యార్జన చెయ్యాలని బోధించేవాడు నాకు గర్భశత్రువు. అటువంటివాడు మమ్మాటికీ 'గురువు'—అంటే మేష్టరూ, తండ్రీ, బృహస్పతీ అన్నమాట! నాడబ్బోపి నేను నాజూకుగా షోకుగా చదువుకురించి యత్నించేసుకుంటూ అవసరాన్నిబట్టి, నేను దళారిగా కల్లరిగా జూదరిగా పోమరిగా రహస్యసంచారిగా ఏమిగా అవడానికయినాసరే ప్రత్యేకపుహక్కు నాదేగనక, నా జోలికి రాకుండాఉండి నాస్మరణ చెయ్యకుండా

ఉండేవాడుకూడా నాదాకుండే! నాకు ధూమపాన వ్యసనాదిఅభ్యాసాలు ఖర్చులేకుండా ఉపదేశించి బాధ లేకుండా నాచేత ఆచరణలో పెట్టించేవాడు నాజన్మ గురువు. మాట్లాడవలసిందని ప్రార్థించి నడిపించి తీసికెళ్లి ఎత్తుమీద జనంఎదట నన్ను నిలబెట్టినప్పుడు(మాట్లాడలేక కాదు)మాట్లాడకపోవడం నాసాహసకృత్యాల్లో ఒకటి. అల్లాగే, ఇంకోరు ప్రసంగించే సమయంలో నేను ఊరు కోడమే మర్యాదలాగ కొందరికి కనిపించేచోట మాత్రమే నావాక్కుయొక్క మాహాత్మ్యం చూపడం కూడా నాగొప్పపన్లలో ఒకటి. కానికాలం గనక నాకు దిష్టికొట్టచ్చునసే దిగులుచొప్పున పోలికకి అంద కుండానే, నాసాహసాలు నేను చీకట్లో గాని, సమూ హంలో గాని నెరవేరుస్తాను. అందుచేత నాకు భయం, పిరికితనం అని కొందరు పిసునుల వాదన. కాని, రెండో కంటివాడికి తెలియకుండాగాని నేను ఏదీ చెయ్యను గదా, అప్పట్లో నాకు భయం అని చెప్పడానికిమాత్రం అదిక్కుమాలినవాళ్లకి సాక్ష్యం ఏదీ! అందుకని విజయం నాస్వంతం. కొట్టుగోడాలు వచ్చినప్పుడు నేను వీలు చూసుకుని మధ్యవర్తిత్వం చేస్తానుగనక బలంచూప వలసిన పోట్లాట అన్నాసరే, నేను సిద్ధమే. నాతో ఆటల్లో పొల్గొనేవాళ్లు నాస్నేహితులేగాని, నన్ను ఓడించే వాళ్లంతా పరమకుర్యాగ్నులు. పెద్దవాళ్లు ఎంత సౌఖ్యం అనుభవిస్తుంటారో అంతా నేనుకూడా అను భవించకూడదు అనేవాళ్లంతా నాకు ఎదరపార్టీ. నాపని మానడమే దేశాభిమానం అనీ, నాపకుత్వం వదలగొట్టే వాణ్ణి ధిక్కరించడమే నా భావిస్వాతంత్ర్యానికి చిహ్నం అనీ ఉపన్యసించేవాళ్లంతా నానమ్మిన బంట్లు. నే డ్రెస్ వేసి, సిగరెట్ పీల్చి, కిల్లీ వేసి, నిద్ర చెరుపు కుని, ఆత్మగౌరవం భంగం అయినా చేత్తో పుస్తకాలు పుచ్చుకుని, పోనీ మేష్టరు ఏడ్చిపోతాడని విద్యాశ్ర మానికి వెళ్లినా ఇంకా నేనేదో తయారీ అయిరాలే దంటూ కోడంటికం పెట్టిగింజుకునే ప్రతీ కూలిగురువూ నా వైరివర్గంలో చేరిన బాపతే. నా అంతవాడికి తెలివి తేటలు లేవని సిగ్గువిడిచి నలుగురిలోనూ చెప్పడానికి తెగించే ప్రతీపట్టాదారూ నాజమ్మే. పాస్ అనే కొత్త వెధవమాటా అంటే వొదిలిపోయేదానికి, నా బుర్రయొక్క అంతరపరిమాణం యావత్తూ అక్కడికి తను చూసి కొలిచి తనులష్టట్లు, నాభావి ఉద్యోగలాభం నాశనం అవుతుం దేమో పాపం అని భయపడక నా సహాధ్యాయుల్లో నాకు తలవంపు అవుతుందేమో అని జంకక, నాకు వస్తాండే మంచిమంచి కట్నాలిచ్చే వివాహసంబంధా లన్నీ తిరిగిపోతాయేమో అని తట పటాయించక, నన్ను ఫేలుచేసి, తన సొమ్మంతా పోయినట్టు నాకు తక్కువమార్కులు రాల్చే ఉపా ధ్యాయు డనే పరమచండాలుడు నేను జీవితంలో మరవడానికి వీల్లేని ఘోరశత్రువు. తెగవయస్సూ, తగనివాచస్సూ, చచ్చుఅధికారమూ, బోడిప్రజ్ఞా ఉన్నాయికదా అని చెప్పి నన్ను కొందరు సమయం కనిపెట్టి వేళాకోళానికి పట్టించే రాలుగాయి లున్నా రని విన్నాను, గమనించాను. వాళ్లమీద నేను కసి తీర్చుకునేటందుకు నేను ఉపయోగించే వీరసాధనం ఒక టేమి టంటే, అన్యాపదేశం. కొమ్ములుతిరిగినవా డైనాసరే అటువంటివాడు నాపక్కనించి (అప్పుడు నేను మేడమీదో అరుగుమీదో చీకట్లోనో సంపు లోనో ఎక్కడున్నాసరే) వెళ్లేటప్పుడు, ఆముహూ ర్తం నేను ఉపయోగించుకుని, నావిద్యావాసన నలుదిశలా వ్యాపింపచేయడపు ఉద్దేశంతో సరికొత్త తిట్లతో మామూలుమాటలకి పోపెట్టి, గాండ్రిస్తూనో సకిలిస్తూనో నాతియ్యటి గాత్రంతో నాకమ్మటికవిత్వం విరజిమ్ముతాను. వాడు తన్నేమో అనే అనుమానం చొప్పున నాకేసి తిరిగేలోపల నేను వాడివేపు చూపు మానుకుని, నాస్నేహితుల్లో ఓణ్ణి తిడుతూన్నట్టు నటించి నావిజయం వెల్లడిస్తాను. వాడికి అంతటితో మృతి. ఏమిటని నన్ను వచ్చి అడిగాడా, నాగొప్పతనం వాడే ఒప్పుకున్నా డన్నమాట. రంగం పూర్తిచెయ్య డానికి నాస్నేహితులు పకాలుమంటారు, దాంతో వా డెగిరిపోతాడు. సభల్లో గల్లంతు సృష్టించి, సృష్టి కర్తలాగే ఉండిపోతాను. అతని పుణ్యం కొద్దీ నా తండ్రి యిప్పుడు లేడుగాని, అతడే ఉండి, అతడితో హెచ్చుతగ్గు వచ్చినాసరే, వాణ్ణి ఏమటయేసిగాని ఎగేసి తెగనరికిపారేసి ఉండేవాణ్ణి. అందుకని ఇరుగు పొరుగువాళ్లు నాసాహసకృత్యాలు విని ఒంటిప్రాణంతో ఉంటారు, ఒంటికంటితో నిద్రపోతారు. అన్యుల్ని నేను సాధారణంగా హడలకొట్టి, ఆట్టేమంది లేకపోతే

చెదిరించి, భాష తెలియనివాళ్ళకి తిట్టి, నా శౌర్యం యొక్క మచ్చు చూపిస్తూంటాను. ఇక, నా సౌందర్యోపాసనగురించి నేను తంటాలుపడడంలో చెయ్యవలిసి వచ్చే సాహసాలు చాలా ఉన్నాయి. అటువంటి సందర్భాల్లో, అనగా యువ్వనులు కాకపోయినాసరే శారీమణులు మిశ్రసమావేశంలో ఉండేటప్పుడు, అవసరాన్ని పురస్కరించుకుని, (చటుక్కున నేను నలుగురి కళ్లఎదటా మెరుపులా మెరవడంవల్ల నాకెప్పటికైనా ఎదైనా ఎవరివల్లనైనా ఏమో స్థిరుగానైనా లాభం ఉండవచ్చుగనక, అవలీలగా నాధనం, నా పణం, నా మానం, నా ప్రాణం చివరకి నా ఉద్యోగంకూడా ఏ ప్రత్యేక వ్యక్తికోసమో ఎందుకోసమోకూడా నాకే తెలియకుండా నేను త్యాగం చెయ్యడానికి తెగించి ఉండడం చూస్తే, నా మహాసాహసానికి మీరు ముక్కుమీద వేలువేసుకుని మళ్లీ తియ్యరన్నమాట! అటువంటప్పుడు నా ఉషార్ తమరు చిత్తగించాలి, దాంతో తమరి జన్మ తరించాలి. కొందరు నారులు రోజుకి ఓడుస్తు మారుస్తారు. వాళ్లకి తెలిసేనిమిత్తం నేను క్షణానికి ఓ డ్రెస్సు పిరాయిస్తాను. నువ్వు ఇంగ్లీషు నేర్చినవాడివి, పొల్లుపన్లు ఎందుకయ్యా చెయ్యడం అని ఎవడేనా అంటే, ఆ అన్న శృంగారశూన్యుణ్ణీ, వాడి ఆర్డరు పొందనివాళ్ల నందర్నీకూడా వరసాగ్గా షూట్ చేసి వాళ్లకి టీపార్టీ చెయించి తద్దినం మానిపించేస్తాను. అది గ్రహించవలసిందేకాని, విప్పిచెప్పేది కాదు. అటువంటి స్త్రీజన సమ్మిశ్రిత సమావేశాల్లో నేను చాటు ప్రసంగం చేస్తాను. నా దేవుడా, అది ఎంత అఖండం గా ఉంటుందని చెప్పను! నా వాగ్జాలపు గట్టు తెగబడుతుంది. అప్పుడు నే నాడే ప్రతిపలుకూ బంగారమే. నే చెప్పేదంతా కవిత్వమే. అందులో శ్లేష, ద్వ్యర్థి, చిత్రం, యమకంవంటివి ఉంటాయంటారు. నాకు వచ్చే వాక్యాలన్నీ పద్యాలైపోగా కొందరు గణాలవాళ్లు వాటిని ఎక్కించుకుపోయి కంఠతాపట్టేసి వాడుకుంటూంటారు. ఒకొక్కప్పుడు అవి వాళ్ల కంఠం పట్టుకుంటాయి. అప్పట్లో నేను చేసే గానం, తీసే రాగాలూ, వేసే 'ఓట్లూ', కూసే నాదాలూ మొదలైనవి మహామహా రసికులవల్లకూడా కావు. నే నప్పట్లో కనపరిచే విలాసచేష్టలూ, దానత్యాగశౌర్యాది లక్షణాలయొక్క ప్రత్యక్షతార్కాణలూ అసలు ఒక టాకీ తియ్యవలిసిన బాపతువే అనిన్నీ, తన్నిమిత్తం ఒకటాకీకంపెనీ లేవాలనిన్నీ, లేవడంతోటే మొహం కడుక్కోడంకూడా మంచిదనిన్నీ, చాలాటాకీల్లో చేష్టలకిమల్లే కృతకంకాకుండా నావి స్వాభావికం అవడంవల్ల అటువంటి కంపెనీ పెట్టి పని చెయ్యకపోతే ఆంధ్రకళకి నష్టం అనిన్నీ నాస్నేహితుల నిశ్చితాభిప్రాయం. అందాకా ఎందుకు? అవతల కీచకుడు, శకారుడు మొదలుచేసుకుని ఇవతల మన గిరీశం వరకూ ఉండే ప్రత్యేక సౌందర్యోపాసకులు నాదగ్గర సవినయంగా, సక్రమంగా, సదక్షిణగా శుశ్రూష చేసి ఉండని దోషంవల్ల సార్వత్రికమై అస్ఖలితమై నవీనజ్ఞాన యుక్తమైన శృంగారవ్యవహారం గురించి చెప్పవలిసొచ్చినప్పుడు వాళ్లు నాకు చాలాచాలా బలాదూరు అని నేను ఘోషించవలిసొచ్చినందుకు నేను ఎంతో తెగించి విధిలేక గర్విస్తున్నాను.

నా విమర్శప్రజ్ఞకూడా ఎల్లాంటిదో నివేదించి ప్రస్తుతం దస్తరం కట్టేస్తాను. అది ఎల్లాంటి దంటే, కేవలం రెండంచుల కత్తిలాంటిది. అనగా, అది నేను అమోఘంగా ప్రయోగిస్తాను, విధిగా నెగ్గుతాను. ఆ ప్రజ్ఞ ప్రయోగించేకాలంలోకూడా నేను ఒంటరిగా ఉండక నామిత్రబృందంలోనే మునిగిఉంటాను. ఆ అఖండప్రజ్ఞ చాలా సూక్ష్మంగానూ, మిక్కిలి తీవ్రంగానూ ఉండి, పండులాంటి సంసారం పాడుచెయ్యడానికీ, అవసరకీర్తిప్రతిష్ఠలు అన్యరంగాల్లో ఆర్జించి విశ్రమించిపోయేవాళ్లకి కొంచెం కళ్లెంలాగ పనిచెయ్యడానికీ, గొప్పవాళ్లకికూడా నేను ఒక అంకుశం అని పత్రికన దాఖలా కనపరచడానికీ, తద్వారా నాకు అల్పశ్రమతో, అల్పకాలంలో, అల్పవ్యయంతో అవతలవాడికంటె గొప్ప పేరు దక్కడానికీ ఉపకరిస్తుంది. అయినాసరే నాకు బడాయి లేకపోడంవల్ల నేను దాక్కునేఉంటానుగాని బయటపడను! బ్రహ్మ నన్ను పట్టుగోలేక నలుముఖాలా చెదిరిపోతూనా, యం బ్రహ్మలు ఏమొహం పెట్టుగుని నన్ను పట్ట యత్నించరం! నే నెప్పుడూ జట్టుతోనే ఉండడంగనక అసలు మేమే సభ. అయినా జనసమూహాల్లోకి మేం తీరుబడి చేసుకుని వెళ్లి దేశాన్ని పైకి లేవనెత్తుతూంటాం.

జనం అనేకచోట్ల సమూహం అవుతారు. జనసమూహాలు రెండు రకాలు — ఒకటి, అధ్యక్షుడు అంటూ ఒకడు ఉండేవి: వార్షికసభలూ, ఉత్సవాలూ, వర్ధంతులూ, సారస్వతాదిసమావేశాలూవంటివి. రెండు, అధ్యక్షుడు లేనివి: తీర్థాలూ, తిరునాళ్లూ, సంతలూ, భజనలూ, సాధారణంగా నాటకాలూ, రైళ్లూ, క్లబ్బులూ, సినీమాలూ, ఆటలూ మొదలైనవి. రెండోరకంసభలో నాకు స్వరాజ్యం. ఆరకం అధ్యక్షరహితసభల్లో ఉన్నప్పుడు నాకు పూర్తిగా స్వరాజ్యంలో ఉన్నట్టు అనిపించడంవల్ల, ఇంకా ఏమిటో స్వరాజ్యం కావాలంటూ ఈదేశంలోజనం పైవాళ్లని అడుగుతా రెందుకా అనిపిస్తుంది. మొదటిరకం సభల్లోనే నాబోట్లకి కొంచెం ఇబ్బంది. నేను జాగ్రత్తగా దాక్కోడం, తలదాచేసుకోడం, నమ్మినవాళ్లమధ్యఉండడం, గొంతికపిరాయించుకోడం, నవ్వు ఆపుకోడంవంటి కట్టుదిట్టాలు చేసుకుని మరీ నాప్రజ్ఞ చేలుస్తాను. అవతల జరుగుతూండే వ్యవహారం ఒకవేళ,

నాకు తెలిస్తే, ఓప్ ఇకేట్రా అంటాను.
తెలియకపోతే, ఓర్, అదేమిట్రోయి అంటాను.
తెలుగైతే, బోడిప్రజ్ఞ పోదూ అంటాను.
అరవం అయితే, హో సాంబార్ అంటాను.
ఇంగ్లీషైతే, బొల్లిటుముక్కలు అంటాను.
పురాణం అయితే హో జనమేజయా అంటాను.
నవీనశాస్త్రం అయితే, హో అపరఅయిన్‌స్టైన్ అంటాను.

ఎరుగున్నసంగతి అయితే స్టేల్ అంటాను.
నేను ఎరగనిదల్లా స్లేట్ అంటాను.
స్వంతంగురించి అయితే కొయ్‌కొయ్ అంటాను.
పరుల్నిగురించి అయితే స్కాండల్, అవుటాఫ్ ప్లేస్ అంటాను.

భౌతికం అయితే పశుత్వం అంటాను.
నైతికం అయితే బరేకద్దుట్రా అంటాను.
మతం అయితే బాష్ అంటాను.
పని అయితే హంబగ్ అంటాను.
ఎడమ అయితే కుడి అంటాను.
కుడి అయితే ఎడమే సవ్యం అంటాను.
ఒకవేళ అవతల వ్యవహరించే వ్యక్తి—
చదువుకోనివాడయితే యాష్ అంటాను.
చదువుకున్నవాడయితే ఫాడిస్ట్ అంటాను.
శ్రోత్రియుడైతే గీతేశ్వర్ అంటాను.
నవీనుడైతే మరమ్మకురావు అంటాను.
పండితుడైతే దయచెయ్యరోయ్ అంటాను.
పామరుడైతే నోరుమూసేసి మోనేస్తాను.

నెగ్గితీరతాను. విజయం నాకు దక్కితీరుతుంది. నాకు దక్కనిదాని పేరే విజయం అంటే! నే దొరకడం కల్ల. నారోజు బాగుండక ఒకవేళ నేను దొరికిపోతే, పీలుకని పెట్టి పిక్కబలం చూపిస్తాను. అయినా పట్టుకుంటే అటువంటి సమయాల్లో అవతల నన్ను పట్టుకున్నవాడు నాకంటె చిన్నవాడైతే వాణ్ణి గొంతిక పిసికి గౌరవిస్తాను. వాడు నాకంటె పెద్దవాడైతే వాడికి జుట్టున్నా సరే పట్టుకోక, కాళ్లు వాడివైనా సరే పట్టుకుని, "తొందరవద్దు స్వామీ, మీరు పెద్దలు. నాకు లేకపోతే పీడా పోయిరి మీకేనా సిగ్గుభిడియాలున్నాయికదా! నాతోటి ఏమిటి పోవరొయ్యా!" అంటూ నాలేవయస్సు ఎగసందోసి ఉపయోగంలోకి తెస్తాను. అప్పుడు చుట్టుపక్కవాళ్లు కలగచేసుకుని ఆపెద్దవాణ్ణి చివాట్లువేసి ఊరుకోమంటారు, లేకపోతే తాడిచ్చి ఉరెట్టుకోమంటారు. పైది నాభయంగాని, నేను చస్తే దొరకను. ఎందుకంటే నాముఖానికి అప్పట్లో ఉండే దేవతాసంబంధమైన అఖండతేజస్సువల్ల ఇతరుల కళ్లు పోవచ్చును అని భయం. ఈశ్వరాజ్ఞలు సదిటం. నేను పదకొండోదిసూత్రం నిలబెట్టుకున్నాను. ఏమి టది? "పట్టుబడకుండా ఉండడం." అనుకుని, నాకు లక్షేమిటి! నాకు భయం ఏమిటి! నాకు ఎవడేనా అంటే భయంఎందుకుండాలీ అసలూ! పోనీ ఎల్లానో తంటాలు పడి భక్తేనా చూపిద్దాం అంటే, దిక్కుమాలిన రోజులు, సరిదైనవ్యక్తి దొరకడమే కష్టమాయిరి!

ఆతఁడు

= శ్రీ కొత్త సత్యనారాయణచౌదరి =

ఆంబరాడంబరంబులు హావభావ
మార్గములు లేకపోయిన మానెఁగాని,
ఒడలు వంచియు, నోరులకుఁ గుడువఁబెట్టి
పారమార్థిక చింతతో బ్రదుకు—నతఁడు.

అమితశాంతికి దాంతికి నవని నెలవు
దాని నమ్మి మెలంగు నమ్మానవునకు
సైతమా సుగుణమ్ములే సంక్రమించు;
నందు నబ్బురమేమి స్నేహమ్ము ఫలము.

శీతవాతాతపములకుఁ జిక్కి స్రుక్కి
బక్కచిక్కుట యిరువురిపట్లఁ జెల్లు;
నెండలో వడ్లతోఁగూడ నెండునట్టి
తట్ట కాపాటి యిక్కట్టు తప్పదేమొ !!

మట్టిలో మానెఁ డుంచియుఁ బుట్టెఁడేసి
ధాన్యమును బిండెద వటంచు నన్యులెవరో
పలుకుదురుగాని తేనెటీఁగలకు దక్కు-
తేనె యది యెంతమాత్రమో తెలియలేరు.

కథానిక

బద్ నసీహత్

= శ్రీ మునిమాణిక్యం నరసింహారావు =

"ఇవ్వాళ ఇంత పెందరాళే వచ్చేశారేం" అంటూ మా ఆవిడ నా కెదురుగా వచ్చి తలుపు తీసింది.

"యకాయకీని వచ్చేశాను" అంటూ లోపలికి అడుగు పెట్టి, "కాఫీ ఏమైనా ఉందా" అని అడిగాను.

"ఆ, ఉంది. రెడీగా ఉంది. మరే, మీకోసం ఎవరో పెద్దమనిషి వచ్చారు. పైన ఆఫీసుగదిలో కూర్చున్నారు ఆమటా" అని చెప్పింది మా ఆవిడ.

సరే ననుకొని, నేను గదిలోకి పోయి, కోటూ చొక్కా విడిచి, ముఖం కడుక్కొని, లుంగీ కట్టుకొని పైన తువాలా వేసికొని, పైకెళ్ళాను వచ్చిం దెవరో చూద్దామని.

ఆ కూర్చున్న పెద్దమనిషి కొత్త వయస్సు మళ్లినవాడులా ఉన్నాడు. ఉంటే యాభై ఏండ్లు ఉండవచ్చు. కాని శరీరం ముసలితలుపడ్డ ముసలి కాదు. యౌవనశేషం యింకా అతని అవయవాల్లో కొద్ది కొద్దిగా కనిపిస్తూ ఉంది. మీసం, తలా చాలా వరకు నెరిసినా ఏదో అందంగా ఉంది. మనిషి అమాయకుడులాగా, చాలా సౌమ్యుడులాగా కనిపించాడు.

నన్ను చూసేచూడ్డంతోటే ఆయన లేచి నమస్కారం చేశాడు. "తమరు ఎవరో నాకు జ్ఞాపకం లేదండీ, క్షమించాలె" అన్నాను నేను.

ఆయన కుర్చీలో కూర్చుంటూ అన్నాడూ—"అయ్యా, మీకు నేను పరిచయుణ్ణి కానూ, నన్ను మీ రెప్పుడూ చూడనూ లేదు. మాది అసలు విజయనగరం. నా పేరు సన్యాసిరాజు. మేము రాజాపేటలో కాపురం ఉన్నాము. తమ దర్శనార్థమై వచ్చాను" అని.

"అయ్యో, అంత పెద్దమాట ఎందుకండీ, నే నెంత పాటివాణ్ణి" అన్నాను నేను నవ్వుతూ.

"అల్లా కాదండోయ్, తమకు మా ప్రాంతాల్లో మా చెడ్డ పేరుందండోయ్" అన్నాడు ఆయన తమాషా విజయనగరం యాసతో.

"చెడ్డ పేరాండీ?!" అన్నా నేను వింతగా చూస్తూ.

నేను ఇల్లాగ అనటం జూచి ఆయన నొచ్చుకొని "క్షమించాలండి. చెడ్డ పేరూ అంటే మహా గొప్ప పేరుందని మనవి చేస్తున్నాను" అన్నాడు. "అల్లాగనాండీ" అని ఒక చిరునవ్వు నవ్వి నే మారుకొన్నాను. ఆయన మళ్లీ ఇల్లాగ అన్నాడు: "తమ కథలూ గట్రా చదివి మేము ఆనందిస్తూ ఉంటామండి. మా చెడ్డ తమాషాగా ఉంటాయిసుమండీ"

ఈ మాటలు విని, సంతోషించి, నేను ఊరుకొన్నాను. ఓ నిమిషం అయిన తరువాత ఆయన నా వంక జూస్తూ మళ్లీ అన్నాడూ—"తమర్ని, తమ కాంతాన్ని, తమ సంతానాన్ని చూచి ఆనందించాలనే ఉద్దేశంతో ఇల్లా వెళ్లిపోవచ్చానండీ" అని.

"ఏదో తమకు మాయందు అల్లాగ అభిమానం కలిగింది" అని నేను అంటూ ఉండంగానే ఆవిడగారు వచ్చింది, వెండి పళ్లెంలో నాల్గు కాల్చి నెయ్యి రాసిన

అప్పడాలు పెట్టుకొనీ, చేత్తో ఫ్లాస్కు పట్టుకొనీ. ఆవిడను చూడటంతోనే నేనన్నాను—"అదిగో రానే వచ్చారు. ఆవిడేనండి కాంతాయమ్మగారు"అని.

సంతోషం, ఆశ్చర్యం కనపరుస్తూ ఆ పెద్దమనిషి లేచి నిలబడి, "ఓహో, తమరేనా అమ్మా. సీతా అనసూయా చూశారూ, అల్లాంటి కోవలోని వారు తమరు" అంటూ కూర్చున్నాడు.

కాంతం ఒక్క క్షణం విచిత్రంగా చూచి, "బాబుగారూ, నన్నంతగా పెద్దచేయటం కేవలం మీకు మాయందుండే అభిమానం తప్ప మరోటి కాదు...ఇల్లా దయచేయండి, ఫలహారం పుచ్చుకోండి" అని ఆ పళ్లెంలోనుంచి రెండు అప్పడాలు తీసి నాచేతికిచ్చి, మిగిలిన రెండు అప్పడాలతో పళ్లెం ఆయన ముందు పెట్టింది. మేమిద్దరం అప్పడాలు కరకరా నమిలేసి, చెరోకప్పు కాఫీ తాగుతున్నాము.

ఇంతలో నేనన్నాను—"మా కాంతం మహా సౌభాగ్యరాలండి ఆ మహా ఇల్లాలియొక్క సౌభాగ్యత వల్లనే మా కుటుంబానికి ఏలోటూ లేకుండా జరుగుతున్నది" అని. "మరేటండీ, ఆ మహాఇల్లాలి పాతివ్రత్య మహాత్యం చేతనే మీకు ఇంత సిరీ సంపదా ఏర్పడ్డవి. మరి సందేహం లేదండీ" అని అన్నాడు ఆయన.

"ఇంకొంచెం కాఫీఅండీ" అన్నది కాంతం, ఆయనను ఉద్దేశించి. ఆయన అక్కరలే దన్నాడు. మరోక్షణం అయినతరువాత "పిల్లలు స్కూలునుంచి వచ్చేవేళైందండి, నేను సెలవ పుచ్చుకుంటానండీ బాబుగారూ" అని చెప్పి కాంతం మేడమెట్లు దిగి వెళ్లిపోయింది.

ఫలహారంకూడా అయిపోయింది. ఇంట్లో ఉడక పోస్తున్నది. బైటికి ఎక్కడికైనా వెడితే బాగుంటుందనూ అని అనిపించింది నాకు. కాని ఆ పెద్దమనిషితో ఏం చెప్పాలో తెలియక కూర్చుని, రెండు నిమిషా లైనతరువాత నేనే అన్నాను—"తమరేమైనా పనిమీద వచ్చినట్లా అండి" అని.

"ఎచ్చెచ్చే వృత్తినే వచ్చానండీ, మరేం పెద్దపనీ లేదూ..."అని ఆవాక్యం పూర్తి చేయకుండానే ఉండి పోయినాడు ఆయన.

ఇల్లాంటి పెద్దమనుష్యులతో చాలాబాధ. వాళ్లు వచ్చిన పనేమో చెప్పనూ చెప్పరూ, మనలను పోనీయనూ పోనీయరూ! ఎంతసేపూ అల్లాగ చూస్తూ కూర్చుంటారు. అందుకనే, నేను మళ్లీ అన్నాను—"చెప్పండి,ఏదైనా పనుంటే; సందేహిస్తున్నట్లున్నారు. చేయగలసాయం ఏమైనా ఉంటే చేస్తాను" అని. ఆయన అప్పటికీ మాట్లాడలేదు! జవాబుకోసం కాసేపు నిరీక్షించాను. మైము చూశాను. అహా, ఎన్నిచేసినా ఆయననోట్లోనుంచి మాట పెగల్లేదు!

సాధారణంగా నాకోసం వచ్చేవాళ్లు రెండు రకాలుగా ఉంటారు: "కథ ఏమైనా వ్రాసి మాపత్రికకు ఇవ్వండీ" అని అడిగే పత్రికాధిపతులు ఒకరకం. ఈయనవాలకం చూస్తే ఆరకంమనిషి కాదని తెలుస్తూనే ఉంది. అది కాకపోతే "మా అబ్బాయికి నాలుగు మార్కులు వేసి ప్యాసు చేయించండీ" అంటూ వచ్చేది రెండోరకం.

ఈ పెద్దమనిషి ఆరెండోరకంవాడు అయి ఉంటాడని తోచింది. నిజంగా అంతే అయి ఉంటుంది. లేకపోతే ఇంతసేపు నీళ్లు నమలటానికి అవసరం ఏముంటుందీ అనుకొని, "అయితే తమకు పిల్లలెంతమంది బాబూ" అన్నాను. "అయిదుగురండీ" అన్నాడు ఆయన. "ఓహో, అయితే తమ పెద్దఅబ్బాయి ఏక్లాసూ?" అన్నాను, సంగతేదో తెలుసుకొని చెప్పాలిసిన మామూలుమాటలు చెప్పి తొందరగా పంపేద్దామని. ఆయన కొంచెం విచారంగా అన్నాడు—"నాకు మొగపిల్లలు లేరండీ, అయిదుగురూ ఆడపిల్లలేనండీ" అని.

ఈజవాబు విన్నతరువాత ఆయన ఎందుకొచ్చాడూ అన్న ప్రశ్న మరీ క్లిష్టమైపోయింది. నిర్మొగమాటంగా "అయితే మరిసెలవ-"అని చెప్పి పంపివేయటానికి మనస్సు ఒప్పలేదు. పిల్లల పెండ్లిళ్ల విషయంలోకూడా మాస్టర్లసాహాయాన్ని ఇల్లాంటి పెద్దమనుష్యులు అపేక్షిస్తూ ఉండటం కద్దు. ఒకవేళ అల్లాంటి పనిమీద ఏమైనా వచ్చాడేమోనని, "పిల్లల పెండ్లిళ్లు అయినాయా అండీ" అని కుశలప్రశ్న వేశాను.

"ఆ, పెద్దపిల్లలు ముగ్గురి పెండ్లీ అయింది. వాళ్లు కాపరానికికూడా వెళ్లారు. మిగిలిన ఇద్దరికీ సంబంధాలు

సిద్ధంగానే ఉన్నాయండీ, మీదయవల్లా" అన్నాడు. ఇక ఇల్లాంటి పిచ్చిప్రశ్నలతో కాలం గడపటానికి ఇష్టంలేక, కుర్చీలోనుంచి లేస్తూ "చిత్తం, అల్లాగ వెళ్లాలిసిన పనుందండి. మళ్లీ ఎప్పుడైనా తమ దర్శనం చేస్తాను" అన్నాను.

ఆయన తెల్లపోయి "చిత్తం, చిత్తం, అల్లాగే నండి. కాని, ఒక్క చిన్న విషయంలో తమ సలహా కావాలని వచ్చాను" అన్నాడు.

"అల్లాంటిదేమైనా ఉంటే చెప్పండి మరి" అని నిలబడిపోయినాను.

"మరేం లేదండీ. మాశారూ, తమరు కథల్లో సంసారాన్ని స్వర్గధామంగా వర్ణించారు" అంటూ మొదలుపెట్టాడు. నాకథలు మెచ్చుకుంటున్నాడు కాబట్టి నేను కూర్చోక తప్పిందికాదు.

మళ్లీ అన్నాడు ఆయన— "ఘోటకబ్రహ్మచారులకైనా కొంతంకథలు చదివినమీదట పెండ్లాడాలని బుద్ధిపుడుతుంది" అని.

"మీకు పూర్తిగా నాయందు అభిమానం" అన్నాను నేను.

"అల్లాకాదండోయ్. ముఖప్రీతికోసం అంటున్న మాటలు కావండి మాష్టారూ...'సంసారం సాగరం సుఖం' అన్నమాటలు స్వర్ణపదాలని అనిపించారు తమరు" అంటూ ఆయన నన్ను మెచ్చుకొన్నాడు.

నేనూ సంతోషించి "అయితే తమరేదో చిన్న పనిమీద వచ్చారన్నారూ!" అన్నాను ఆతురతతో.

"చిత్తం చిత్తం, మనవిచేస్తా. మరి, నాకూ పెండ్లాం బిడ్డలూ ఉన్నారండి. నాకు ఇల్లు జూస్తే నరకకూపంలా ఉందండి!! పిల్లలు చూద్దామా, అల్లరీ! పెళ్లాంచూద్దామా, గయ్యాళీ! నేనూ ఆమే కజ్జా ఆడని రోజు లేదండి. ప్రతిరోజూనూ ఏదోఒక విషయమై తగాయిదా వస్తూనేఉంటుందండి." అంటూ ఆయన కళ్లు తేలేసిచూడటం మొదలుపెట్టాడు.

"అయితే...నన్నేమి చేయమంటారూ?" అన్నా నేను నవ్వుతూ.

"తమరు మాకు ఏదైనా ఓ తరుణోపాయం చూపెట్టాలె. ఎల్లాగ ప్రవర్తించాలో, సాంసారికజీవనం సుఖప్రదం కావటానికి రహస్యం ఏమిటో తమరు సెలవిస్తే తెలుసుకొందామని కొండంత ఆశతో తమదగ్గరికి వెళ్లిపోవచ్చానండి. ఈ విషయంలో...పొద్దిగా, ...నాకు మీరు ఉపదేశం చెయ్యాలె" అంటూ ఆ పెద్దమనిషి ప్రాధేయపడ్డాడు.

"ఉపదేశం చెయ్యటానికి ఇదేమన్నా వేదాంతమా మంత్రశాస్త్రమా అండీ?" అన్నాను, నేను నవ్వుతూ. "మీరు అల్లాగ అంటే కాదు బాబూ, ఏదో మార్గం చూపా"లంటూ ఆయన ఒక్కతీరున బలవంతపెట్టాడు.

ఆయనమాట తోసేయటానికి వీల్లేకపోయింది. సరే, నాకు తోచిన ముక్కలు చెబుదాం, ఇందులో తప్పేముందీ అనుకొని "సరే, అసలు సంగతి....మీ భార్యను మీరు ప్రేమిస్తున్నారా" అన్నాను. "అయ్యో, ప్రేమించకేమండీ; అయిదుగురు పిల్లల తండ్రిని" అన్నాడు ఆయన. "అయితే పోట్లాటలు ఎందుకొస్తయ్యో" అన్నా.

ఆ పెద్దమనిషి నావంక తెల్లపోయి చూచి, ఒక్కక్షణం ఆలోచించి "బాబూ, మాశారూ, ఇదీ కారణం అంటూ చెప్పలేనండీ. అసలు ఒక కారణం అంటూ ఉండదండీ! ఉత్తినే, రైమంటూ లేస్తుందండీ. నేను అవును అన్నదానికల్లా ఆమెగారు కాదు అంటుంది ఎల్లాగండీ!" అంటూ ఆయన ముఖం చిట్లించుకొన్నాడు.

"అల్లా అయినట్లయితే మీరే ముందుగా కాదూ అనండీ" అని అన్నాను నేను వేళాకోళంగా.

ఈమాట, పాపం, ఆయనను కష్టంపెట్టింది. దీనంగా చూస్తూ అన్నాడు ఆయనా—"తమరు అల్లాగ సెలవిస్తే గాదు. సీరియస్‌గా చెపుతున్నాను. ఈ దిక్కుమాలిన పోట్లాటకు అంతూ లేకుండా ఉంది. తమరు...ఏదో... తరణోపాయం చెప్పాలె" అని.

ఆయన్ని చూస్తే నాకు జాలేసింది. కాసేపు ఆలోచించి, చివరకు అన్నానూ—"అయితే సరే, ఒక చిన్న రహస్యం చెబుతాను వినండి. దాంతో మీకూ... మీకూ...పోట్లాటలు లేకుండా పోతవి" అని.

ఆయన, పాపం, ముఖం చేటంత చేసుకొని, "అదేనండీ, అల్లాంటి చిట్కా రహస్యాలు చెబుతారనే...తమ దర్శనానికి వెళ్లిపోవచ్చానండి" అన్నాడు.

"నేను చెప్పేదయినా అంత గొప్పవిషయం కాదు, స్వల్పవిషయమే అనుకోండి" అంటూ నేను ప్రారంభించాను. "తమరు చెప్పే విషయ మున్నది చూశారూ, అది ఎప్పటికీ స్వల్పవిషయం కాదనుకోండీ! సెలవియ్యండి" అంటూ ఆయన కుర్చీని నాకు దగ్గరగా లాక్కొని అత్యంతశ్రద్ధతో వింటానికి తయారైనాడు.

నన్ను ఆరాధించే భక్తుడు ఇన్నాళ్లకు దొరికినందుకు నేనూ సంతోషిస్తూ, గొప్ప స్త్రీవశీకరణ మంత్రాన్ని ఉపదేశిస్తున్నవాడిలాగ "చూడండీ, మీ విషయంలో చెప్పదగిన రహస్యం ఏమిటీ అంటే... ఆవిడ గారు అవును అన్నదానికి మీ రెప్పుడూ కాదనబోకండి. మీ భార్యగారు ఇది బాగుందీ అంటే మీరూ బాగుంది, బాగుంది అని తాళంవెయ్యండి. ఆమెగారు దేన్ని చూచిఅయినా బాగుండలేదూ అన్నదా మీరూ ఛీ, ఛీ, ఏమీ బాగుండలేదూ అనండి. సంసారస్వర్గధామానికి ఇది ప్రథమసోపానం. తెలిసిందా అండీ?" అన్నాను.

పాపం, ఆయన తల ఊపి, "చిత్తం, చిత్తం. అయితే బాబూ, కొన్ని విషయాల్లో చూడండీ, డబ్బూ గట్రా వాటి విషయాల్లో ఆమెగారు చెప్పిందానికల్లా తల ఊపితే సంసారం గడవదు. ఏమంటారు?" అన్నాడు.

"అవునండీ, ఆసంగతి నాకు తెలుసు. మరీ..."

"అహహహహా. తమకు తెలియదని కాదు. ఉట్టినే మనవిచేశాను" అన్నాడు ఆయన ఎంతో నొచ్చుకుంటూ.

"ఇప్పుడు పండగా పబ్బం వచ్చిందా అంటే, మన తాహతు తెలుసుకోకుండానే అవి కావాలె, ఇవి కావాలె అంటారు ఆడవాళ్లు. వాళ్లు చెప్పిందానికల్లా మనం సరే అన్నామా అంటే అప్పులపాలు కావలిసిందే. అదేకదూ మీరనటం?" అన్నాను నేను.

ఆ బ్రాహ్మడు కుర్చీ మరింత దగ్గరగా లాక్కుంటూ "అద్గదీ బాబూ, అదీ అసలు సంగతి. వేధించుకు తింటూన్నదంటే నమ్మండీ! ఏం చేయమని సెలవు?" అన్నాడు.

"ఇప్పుడేం చేస్తున్నారూ?" అన్నా నేను.

"ఏంచేస్తున్నానూ, నాదగ్గర మదుపులేదూ- నేను తీసుకురాలేనూ అని బుర్ర నొక్కుకుంటాను బాబూ. మరేటి చేసేది" అని జవాబిచ్చాడు.

"అదే తప్పపని" అన్నా నేను, ఠీవిగా, అధికారి లాగ. "మరేం చేయమని సెలవు" అంటూ ఆయన నమస్కరించాడు. ఆయన అల్లాంటి భక్తివిశ్వాసాలు చూపటంవల్లనా, నాకు తెలియకుండానే నాలో ఒక గర్వంతో కూడిన భావం పొడగట్టింది.

ఇహ నేను మొదలుపెట్టాను భార్యావశీకరణ మంత్రాన్ని: "చూశారూ, అల్లాంటి సమయాల్లో, భార్య కావాలన్న వస్తువును తీసుకురానూ అని మీ రెప్పుడూ అనకండి. విషయాన్ని మీకు ఇప్పుడు సూత్రప్రాయంగా చెప్పానన్న మాట. అంటే, తెస్తానూ తెస్తానూ అంటూనే మనం ఆడవాళ్లను బురిడీకొట్టించాలె. ఈవ్యాఖ్యానంతో తమకు బోధపడిం దనుకొంటా, ఏమంటారు?"

ఈమాటలు ఆయన శ్రద్ధగా విని తన జన్మ తరించిం దన్నంత సంతోషాన్ని పొందినట్లు చూశాడు. "అదీగాకా ... ఆమెను లొంగతీసుకొంటే ఆమె ఎప్పుడూ మీ ఇష్టానికి వ్యతిరేకమైన కోరికలు కోరనే కోరదూ!" అని మరొక మహత్తరమైన సుస్తరహస్యాన్ని కూడా బయలుపెట్టేశాను.

"అరే! అదేనండి! ఆ లొంగతీసుకోనేది ఎల్లాగో తెలియకే! దాని కేదైనా మార్గం సెలవియ్యాలె" అని మళ్లీ ఆయన ప్రాధేయపడ్డాడు.

రెండు కళ్లనూ వేళ్లతో నొక్కుకొన్నాను, ఒక్కక్షణం. తళుక్కున నాకళ్లముం దేదో మెరిసినట్లు తోచింది. దీర్ఘతపోదీక్షానంతరం జ్ఞానసంపన్నుడైన తథాగతునిలాగ చూస్తూ అన్నాను: "అల్లాఅయితే నే చెప్పినట్లు చేయండి: రోజుకు మూడుసార్లు..."

"ఏదైనా క్రియా అండీ?" అన్నా డాయన కళ్లు పత్తికాయలంత చేసి ఆశ్చర్యంగా చూస్తూ.

"చెప్తా...రోజుకు మూడుసార్లు ... అంటే అధమపక్షం మూడుసార్లు అయినా భార్యను ముద్దు పెట్టుకోవాలె" అన్నాను విస్ఫారితనేత్రాలతో.

ఈమాటలు విని ఆయన, అరవౌన్సుఆముదం గుటుక్కున మింగినవాడిలాగా వికారంగా చూస్తూ "నాకు నలభైఏనిమిదో ఏడండి! మా ఆవిడకు నలభై

దాటేసుంటై! చికిత్సకు ఇల్లాంటిదికాక మరోరకం అనుపానం చెపటానికి..." అని ఏమో అనబోతుంటే, ఆయనను పూర్తిగా మాట్లాడనీయకుండానే నేనన్నానూ—"ఇటువంటి విషయాల్లో, చూశారూ, వయస్సుతో నిమిత్తం లేదు" అని.

"చిత్తం, సరే, అల్లాగే అనుకోండి. అయితే.. మా ముసలిదాన్ని రోజుకు మూడుసార్లు – అంటే... త్రికాలములయందూ ముద్దుపెట్టుకోమని సెలవాండ్లా?" అన్నాడు. నేను తప్పదన్నట్లుగా తలవూపాను.

కొంచెంసేపు కలవరించుకొని ఊరుకొని తరువాత మళ్లీ అన్నాడూ – "చిత్తం, ఇంకా, ఎల్లాంటిఎల్లాంటి పనులు చెయ్యాలో సెలవిచ్చె సెయ్యండీ" అని నిస్పృహతో.

"ముద్దుపెట్టుకోటం మొదటివిషయం. అది చెప్పాశాండీ! ఇక రెండోది: అధమపక్షం రోజుకు నాలుగైదు సార్లయినా, నిన్ను ప్రేమిస్తున్నాను, నిన్ను ప్రేమిస్తున్నాను అంటూ భర్త భార్యకు తెలియజెప్పాలె." అన్నాను.

"నే చెప్పానూ, నాజన్మలో అల్లాంటి మాటలు అని ఎరగనండీ"అని దీనంగా అంటూ ఆయన నావంక చూశాడు.

జాలి లేకుండా కఠినపథ్యం చెప్పే వైద్యుడి ధోరణిలో "తప్పదండీ, నిష్కామకర్మ చెయ్యాలె. పోనీ, పాఠంలాగ ఒప్పజెప్పేసెయ్యండి" అంటూ పెదవి విరిచాను.

ఆయన కళ్లు మూసుకొని, ధ్యానం చేసుకొని "అల్లాగే. ఇంకా" అన్నాడు.

అంతవరకూ తలొంచుకొని ఆలోచిస్తున్న నేను తలెత్తి "ఇంకా ఏమిటీ అంటే, ఆమె సుగుణాలను ఎక్కువగా పొగడండి, ఇల్లాంటివీ అల్లాంటివీ అంటూ" అన్నాను.

కదలకుండా వింటూ కూర్చున్నాడాయన. మరోనిమిషం అయింది. "ఇంకా దేముడు మేలుచేస్తే ఆమెసౌందర్యాన్ని గురించికూడా ఎక్కువగా మెచ్చుకోండి...ఊఁ... అంతే.. మరేంలేదు." అని చెప్పాల్సిన విషయాన్ని పూర్తి చేసినట్లుగా తల ఊపాను.

ఆయనకు నామీంచు విశ్వాసము పూర్తిగా ఉంది. నేను చెప్పినట్లు ప్రవర్తించటానికి ఆయన నిశ్చయించుకోనూ నిశ్చయించుకొన్నాడు. కాని "పొగడటం నాకు అలవాటూ లేదు, తెలియనూ తెలియదు, మరి ఏమిటండీ కీలకం?"అని ఆయన నిట్టూర్పు విడిచాడు.

"తెలియటానికేముందండీ? చూశారూ, ఆవిడపేరేమన్నారూ?" అన్నాను.

"చంద్రమ్మగారు" అన్నాడు.

"అయితే...మీరు ఆమెను చంద్రా అని... పిలుస్తారా?"

"ఛెఛ్ఛే, అసలు పేరుపెట్టి పిలవనండి"

"అవునులెండి. పేరుతో పిలవకూడదు కాబట్టి, జటాజూటశిరోమణీ అని పిలవండి."

"చిత్తం"

"పిచ్చి, అపశ్రంగా పొగిడేసెయ్యండి. ముందు ముఖం తీసుకోండి. 'నీముఖారవింద అవలోకితాశేక్షు'......"

"ఉండండి ఉండండి, లాభంలేదు. కాస్త తగ్గస్థాయిలో ఉండాలె. రాసుకోమని సెలవా?"

"అహా. పోనీ, ఇల్లాగ అనండి. 'నీశరీరం పదారువన్నె పసిమితో మిసమిసలాడుతూ ఉంది. నీమధురాధరం బింబఫలారుణిమను పేకరించుకొన్నది. నీనాసికాపుటాలు నువ్వుపువ్వులను పోలియున్నవి.' తెలిసిందా? ఏమంటారు? ఈధోరణిలో వెళ్లిపోండి. ఆమె సౌందర్యాన్ని వర్ణించటానికి మీకు మాటలు దొరక్కపోతే వసుచరిత్రో పారిజాతాపహరణమో తిరగెయ్యండి." అని సలహా చెప్పాను.

నామాటలన్నీ విని దిక్కుముఖంతో ఆయన సెలవ అని వెళ్లిపోయినాడు.

౨

ఆయన మేడమెట్లు దిగి వెళ్లిపోవటంతోనే మా కాంతం వచ్చి నాఎదుట నిలబడి చురచురా చూస్తూ "పాపం, పెద్దవాడ్ని పట్టుకొని ఏమిటా వేళాకోళం?"అన్నది. నిజానికి ఆయనను వేళాకోళం చేయా

లని నాకు ఏకోశానా లేదు. నేను సిన్సియర్‌గానే చెప్పాను.

"లేదు కాంతం! నేను వెక్కిరింతకూ, వేళాకోళానికీ అన్న మాటలు కావు అవి. అట్లా ప్రవర్తిస్తే గృహకలహాలు ఎప్పుడూ ఉండవని నానమ్మకం. నేను అల్లాగ ప్రవర్తిస్తున్నానా... నే జేస్తున్న పనినే ఇంకొకర్ని చేయమన్నాను. ఇందులో నేను ఒకరిని ఫూల్ చేసిం దక్కడా!" అన్నాను.

"అయితే, మీరు చేసే పిచ్చిచేష్ట లన్నింటినీ అందరినీ చేయమంటా రేం ఖర్మం! నే కాంగా భరించి ఊరుకొంటున్నాగాని ఏఇల్లాలు ఊరుకొంటుందండీ" అంటూ ఆమె నవ్వసాగింది.

"నీవు పొరపడుతున్నావు. భర్త అల్లాగ ప్రవర్తించటం భార్యఅయిన ప్రతిస్త్రీకి ఇష్టమే ఇప్పుడు నే జెప్పిందంతా కూడా అనుభవంమీద ఆధారపడి ఉంది. అంతేకాకుండా ఆడదాని మానసికతత్వం తెలిసిన పండితులుకూడా ఒప్పుకొన్నదే. పొగిడితే ఎంతవాడైనా మెత్తపడతాడు. ఇక ఆడదాని మాట చెప్పక్కర్లేదు. ఏమంటావు?"

కాంతం ఏమీ మాట్లాడలేదు. ఆమెగారికి నా మాటలయందు ఏమీ విశ్వాస మున్నట్లు కనపడలేదు. అందుకని మళ్లీ అన్నాను... "నీకు తెలియదు. చాలా పరమరహస్యాలను ఆయనకు బోధించాను. చూస్తావుగా, ఇంకోవారంరోజులకు ఆయన మళ్లీ నాదగ్గర కొచ్చి 'బాబూ, మీ దయవల్ల నాకష్టాలు గట్టెక్కై. మాభార్యాభర్తలమధ్య పోట్లాటలు అంతరించై. స్వర్గసౌఖ్యం అనుభవిస్తున్నాము' అంటూ చెప్పకపోతేనా" అన్నాను గర్వంగా.

"అయ్యో! అయ్యో!" అంటూ మా ఆవిడ మూతీ ముక్కూ విరిచింది పతాకహస్తాన్ని అధోముఖంగా పెట్టి అటూ ఇటూ ఆడిస్తూ.

ఆవిడ అల్లాగ అన్నా నాకుమటుకు తృప్తిగానే ఉంది. నిజానికి నేను ఏంచేశానూ! భార్యను కొట్టమనలేదు, తిట్టమనలేదు; భార్యను ముద్దెట్టుకోమన్నాను. ఇందులో తప్పు ఏమిటో నాకు తోచలేదు. అయినా ఆవిడ అల్లాగ విరుపుగా మాట్లాడటం నాకు కష్టమేసింది.

అందుకని కాంతాన్ని పిలిచి మళ్లీ అన్నాను "చూడూ, నే చెప్పిందాంట్లో తప్పు ఏమీలేదు. తప్పు అని ఎవరు అంటారో అనమను. నీవు ఒక్కదానివి బయలుదేరావు ఇవి పిచ్చిచేష్టలని చెప్పటానికి. అదీగాక ఇవి నీకు తెలియని విషయాలు. వీటిని సైకలాజికల్ ఎక్స్‌పెరిమెంట్సు అంటారు. మనస్సులో అద్భుతమైన మార్పులు వస్తవి" అని ఆవిడకు నామనస్థితిని విపులంగా చెప్పాను.

అప్పటికీ ఆవిడ కేమాత్రం నమ్మకం కలుగలేదు గాని నేనుమాత్రం, ఒక్క కుటుంబాన్ని గృహచ్ఛిద్ర పంకంలోనుంచి పైకెత్తగలిగాననీ, నారకసదృశమైన ఒక ప్రదేశాన్ని స్వర్గఖండంగా మార్చగలిగాననీ, ఒక దంపతిపూజ చేయగలిగాననీ, ఒక జోడుఆత్మలకు తృప్తినీ, ఆనందాన్నీ ఇయ్యగలిగాననీ నాలో నేను ఉప్పొంగిపోయినాను.

ఆయన మళ్లీ వచ్చి, తాను నే జెప్పినట్లు ప్రవర్తించినమీదట తన భార్యలో కలిగిన అద్భుతమైన మార్పునుగూర్చి నాకు చెప్పి కృతజ్ఞతతో నమస్కరిస్తాడని నాకు ఘట్టినమ్మకం. కంటకపరివృతమైన తన జీవితపథము ఎట్లా మృదుమనోహరకుసుమవిరాజితమైందో, ఇతఃపూర్వం అప్రకృతిరాగకఠోరమైన వృద్ధదంపతుల జీవితరాగం ఇప్పుడు ఎల్లాగ మనోహరైకప్రకృతిని మేళవించిందో, వికలశిలాశకలభయంకరమైన వారి కఠినజీవితశయ్య ఏరీతిని మృదుమనోహరసుమశయ్య అయిందో, కాకఘూకారవవ్యాకులమైన ఘోరజీవితకాంతారము ఎంత చిత్రంగా, శుకపికకోకిలారవవదనోద్యానంగా మారిందో, ఝంఝామారుతోద్ధూతోత్తుంగతరంగములచే చీకాకుపడిన లఘుసంసారసాగరం ఎల్లాగ వైకుంఠవాసావాసవటపత్రశయ్యాపయఃపయోధిగా మారిందో ఆయననోటితో ఆయనే చెప్తూఉంటే వినాలని నేను కుతూహలపడ్డాను.

అందుకని రోజూ సాయంత్రం స్కూలునుంచి రావటంతోనే "ఏం కాంతం, ఆయ నేమన్నా వచ్చాడా" అనేవాణ్ని. ఆమెగారు ముక్కు విరిచి "ఇంకా రావలసిందే" అంటూ వెక్కిరించేది.

3

ఇల్లాగ నాలుగురోజులు గడిచినై. అయిదోరోజున ప్రొద్దున్నే కాంతం నాదగ్గర కొచ్చి "మీకోసం ఎవరో అవ్వగారు వచ్చా"రంటూ నన్ను నిద్రలేపింది. నేను కళ్లు నలుపుకొంటూ లేచి క్రింది కెళ్లాను. హాల్లో నుంచి వంటింటికి పోయే గుమ్మంలో నుంచునిఉంది ఒకావిడ.

యాభైఏండ్ల వయస్సులో ఉన్న మనిషిలాగా కనిపించింది ఆవిడ. శరీరం దబ్బపండుఛాయ. ముఖాన కానీడబ్బంత కుంకపుబొట్టుంది. మామిడిచిగురుజరీ చీర కట్టుకొంది. కొప్పులో మందారపువ్వు ఉంది. కొద్దిగా, ముఖ్యంగా ముఖంపైన నెరిసింది. నలభైఏండ్ల క్రింద నన్ను భూమిమీద పడేసి వెళ్లిపోయిన మా అమ్మే మళ్లీ మా ఇంటి కొచ్చినట్లుంది. లోపల ఈమాతృమూర్తిని నమస్కరిస్తూ నిలుచున్నాను.

"ఈముసలమ్మగారే మీకోసం వచ్చారండీ" అన్నది కాంతం. "ఏమిటండీ పిన్నిగారూ" అన్నాను నేను. ఆమె నన్ను జూచి "ఏంనాయనా, నువ్వేనా మా కాంతం మొగుడివి" అంది.

"నేనేనండీ" అన్నాను నవ్వుతూ.

"ఏంనాయనా, నీవు...మా ఆయన కేదో ఉపదేశం చేశావుట. కాదూ?" అన్నది ఆవిడ. "నేనేమిటి! ఉపదేశం చేయటమేమిటి! మీరు...నేను ఎవరని భ్రమపడుతున్నారోనూ" అన్నాను. "కాదు నాయనా, నువ్వే చేశావుట" అన్నది ఆవిడ మళ్లీను.

"నేను కాదండీ పిన్నిగారూ, నేను ఇంగ్లీషు చదువుకొన్నాను. నాకు మంత్రాలూ గింత్రాలూ రావండీ పిన్నిగారూ" అన్నాను.

ఆ ఇంగిలీషుమంత్రాలే ఉపదేశించావుట. లేదంటావేమిషి. నువ్వే!...కాంతమ్మమొగుడని ఆయన చెప్పారుకారూ?" అన్నది.

"మొన్న మీదగ్గరకు రాలేదూ, ఆయనండీ" అని కాంతం ఎక్స్‌ప్లెయిన్ చేసింది.

అప్పుడు నేనన్నాను: "ఓహో, అదా సంగతి? పెద్దఉపదేశం ఏమిటి లెండి. ఇంట్లో పోట్లాటలు లేకుండాఉండటానికి కొన్ని మంచి సంగతులు చెప్పాను. మరేం లేదండీ" అన్నాను సంతోషంగా. పూర్వము మోస్తరుగా వాళ్లు పోట్లాడుకోకుండా హాయిగా శాంతంగా జీవిస్తాఉంటారు. ఆవిషయమై చెప్పటానికే ఆవిడ వచ్చిఉంటుంది.

ఇల్లా అనకొంటూ నుంచున్నాను నేను. ఆవిడ నాదగ్గరసా రావటం నేను చూడనేలేదు. వచ్చి ఆమె గారు "నీవు ఉపదేశించిన మంత్రమే బెడిసికొట్టింది నాయనా" అని రహస్యంగా చెప్పేదానిలాగా చెప్పింది.

"బెడిసికొట్టటానికి నేనేమీ మంత్రం ఉపదేశించ లేదండీ" అని ఆశ్చర్యపోయినాను

"రాకేం నాయనా, నీకొచ్చిన మంత్రాలు నీ కొచ్చు. ఇంగిలీషులో మటుకు మంత్రాలు లేవంటావా?"

కాంతంవేపు తిరిగి "మంత్రాలు రావూ అంటా రేమిటి నీమొగుడు...నేన ఇల్లాగ ఉంటే పిచ్చిది అను కొంటున్నారు కామోసు. నాకు అన్నీ...తెలుసు నాయనా. కోయమంత్రాలు లేవమ్మా. అల్లాగే ఇంగిలీషుమంత్రాలు ఎందుకు ఉండవూ? ఏవమ్మా?" అంది.

మా కాంతం చూడండి, ఆవిడపక్షం జేరి "ఎందుకు ఉండవండీ పిన్నిగారూ. ఉంటాయి." అని ఆమెగారి వైపు చూస్తూ "వచ్చునండీ. అబ్బో, ఈయనకు ఇంగ్లీషులో ఎన్నో మంత్రాలు వచ్చు" అని కళ్లు ఎగ రేసింది.

"అయ్యో ఖర్మమా, ఇదేమిటండీ, నాకేం మంత్రాలూ రావు! నేను ఏమీ ఉపదేశమూ చెయ్యనూ లేదు" అన్నాను నేను విచారంగా.

"అల్లా అంటా డేమిటమ్మా నీమొగుడూ?" అన్నది ఆవిడ. "ఆయ నంతే" అన్నది మా ఆవిడ.

ఈఇద్దరూ ఇల్లాగ అంటూంటే నేనేమీ అనలేక పోయినాను. నన్ను తగలెయ్య, నా కిన్నిమంత్రాలు ఎల్లాగు వచ్చినయ్యా అని నాలో నాకే ఆశ్చర్యం కలిగింది.

మళ్లీ ఆముసలమ్మగారు ఇల్లాగ అన్నది: "లేదంటా వేమిషి నాయనా. మొన్న ఆయన ఇంటికి రావటంతోనే 'కాంతం మొగుడుగారివల్ల నేను ఉపదేశం పొందానూ, ఇక నీకూ నాకూ పోట్లాటలుండవు ఆమహా' అన్నారు. ఏమిటో అనుకొన్నాను. కృష్ణా రామా అనుకుంటారుకామోలు ననుకొన్నాను. అసలు ఆయన [illegible] పిచ్చిబ్రాహ్మడు! అమాయకుడు!"

"అయితే ఇప్పుడు ఏం జరిగిందేమిటండీ" అన్నాను నేను.

"ఆరాత్రి, అంటే శుక్రవారంరాత్రినుంచే మొదలు నాయినా, పిచ్చిచూపులూ, పిచ్చిమాటలూనూ" అన్నది విచారంగా.

"నే నేమిపాపం ఎరగనే ఇదెక్కడి అవస్థరా బాబూ" అని నాకూ ఖంగారు పుట్టింది. "అయితే పిన్నిగారూ, ఏమిటీ ఆపిచ్చిమాటలూ" అన్నాను.

ఆభాగ్యశాలి నామాటలు వినిపించుకోకుండానే మా ఆవిడతో ఇల్లాగ అంటున్నది: "పిచ్చిమాటలు ఏమిటి, కాంతమ్మతల్లీ, చెప్పటానికి వీల్లేదు. అల్లాంటి మాటలు మనం ఎప్పుడూ వినము. నీవైనా చెప్పు తల్లీ నీ మొగుడితో ఆమంత్రానికి విరుగుడు ఏమైనా చేయమని" అని కాంతాన్ని కాళ్లూవేళ్లూ పట్టుకొని బ్రతిమలాడటం సాగించింది.

"ఊరుకోండి పిన్నిగారూ. ఉన్నవారు ఊరుకోక ఉపదేశంచేయటం ఎందుకు చెప్పండీ ఈయనకి?" అంటూ మా ఆవిడ, ముసలమ్మగారియందు సానుభూతి చూపటం మొదలెట్టింది. అక్కడికి నేను నిజంగా ఏదో మంత్రం ఉపదేశంచేసినట్లు!

మా ఆవిడకొంకెతనం చూస్తే నాకు కోపం వస్తున్నది. ఆముసలమ్మగారిని చూస్తే జాలీ కలుగుతున్నది. ఇంతకూ నాకు అసలుసంగతి ఏమిటో తెలియక, "అయితే, పిన్నిగారూ, ఏమి టాపిచ్చిమాటలు, ఎల్లాంటివి?" అన్నాను.

"ఒకలాంటి వేమిటి నాయినా, చిత్రవిచిత్రాలుగా మాట్లాడుతున్నారు" అన్నది ఆవిడ.

"ఎవరినైనా తిడతారా, ఏమిటీ సంగతి?" అని మళ్లీ అడిగా నేను.

"తిట్టటమేకానీ, దీవించటమేకానీ, ఎల్లాగయినా ఆ పిచ్చిమాటలుమటుకు అవును. మనబోటి సంసారుల కొంపల్లో అనుకునే మాటలు కావు" అంటూ ఆ ముసలమ్మగారు కళ్లను పమిటచెంగుతో అద్దుకొంది.

"అదిగాదండీ పిన్నిగారూ, ఆయన అన్న మాటలు ఒకటిరెండు చెప్పండి. సంగతేమిటో తెలుస్తుంది" అన్నాను నేను.

"చెప్పండి బామ్మగారూ, చెప్పండి. సంగతేమి తెలియొద్దూ ఆయనకు, విరుగుడుమంత్రం చేయటానికైనా" అన్నది.

"చెప్పాలిసిందేనా కాంతమ్మతల్లీ! ఇంతబతుకూ బతికి ఇంటివెనకాల చచ్చినట్లైంది. నాకర్మం కాలితే నానోటితోనే అనాలిసొచ్చింది ఆమాటలు!" అంది ఆవిడ మా ఆవిడతో. ఆముసలికళ్లలోనుంచి రెండు కన్నీటిచుక్కలు రాలినై.

మాతల్లిలాంటి మనిషి అల్లా విచారపడటం చూచి నేనూ ఎంతో కష్టపడ్డాను. అసలు ఆమెకొచ్చిన కష్టం ఏమిటో నాకు బోధపడలేదు. ఏంచెపుతుందో అని ఆవృద్ధురాలివంక చూస్తూ నిల్చున్నాను.

ఆవిడా కళ్లనీళ్లు తుడుచుకొని రుద్ధకంఠంతో ఇల్లా అన్నది: "నా బతుకంతా కడిగేపోస్తున్నారు నాయినా. నాముఖంవ.. చంద్రుడిలాగ ఉంటున్నదవ—" అని ఆవిడ దుఃఖం ఆపుకోలేక భోర్లున ఏడ్చింది.

దుఃఖం కొంచెం ఆపుకొని ఇల్లాగ అన్నది మళ్లీ, జాలిగా చూస్తూ—"నాగోటు పట్టుకుంటారు నాయినా... పట్టుకుని, నీగళం శంఖంలాగ ఉన్నదీ అంటారు, నా గొంతుకొయ్య! ఇదీ వరస, ఇల్లా అయింది నాబతుకు" అంటూ ఆ అవ్వగారు మళ్లీ దుఃఖపడ్డది.

నేను చెప్పిన నసీహత్‌కు ఇది ఫలితంకదా అని అప్పటికి నాకు తెలిసొచ్చింది. నిజానికి నవ్వవలసిన విషయమే. కాని ఆమెస్థితిని జూచి మేము ఇద్దరం కూడా నవ్వలేకపోయినాము. మాఉభయులకూ ఆవిడయందు జాలికలిగింది. చిక్కుముఖాలతో నుంచున్నాం.

పిన్నిగారు తలుపువద్దకే ఒకనూలకు ఒత్తిగిలి "తెలిసిందా నాయినా, ఇదీవరస. ఇంకా, ఇంకా ఘంటాలపు మాటలు అంటారు బాబూ! కొడుకులాంటివాడవు కాబట్టి చెపుతున్నాను. నాజుత్తుపా చమరీవాలాల్లాగో, ఏదో నాపిండం, అల్లా ఉన్నదవ!" అన్నది. ఆతరువాత ఒకక్షణం ఆమె మాట్లాడలేకపోయింది. నేను ఆవిడదుఃఖం చూడలేక అన్నానూ— "సరేలెండి. ఎందుకూ ఇహ తెలిసింది."

నామాటకు అడ్డొచ్చి ఆవిడ మళ్లీ అన్నదీ— "చెపుతా, చెపుతా నాయినా. అంతా విను మరీ. నన్ను ఎగాదిగా చూస్తారు. పోనీ అని ఊరుకుంటా.

అయిందా, మడికట్టుకున్నా సరే వచ్చి ముట్టుకుంటారు. ముట్టుకొని నీశరీరం శిరీషకోమలమే అంటారు, నన్ను తగలెయ్య!"

ఆతరువాత రెండునిమిషాలదాకా ఆవిడకంఠం పెగలలేదు. మేము ముగ్గురంకూడా నిశ్శబ్దంగా వుంటున్నాము. కాసేపటికి ఆవిడ మాఆవిడభుజంమీద చెయ్యివేసి "కాంతమ్మతల్లీ, నేను చెప్పలేను ఆమాటలన్నీ. నన్ను బట్టుకు ఇల్లాంటి మాటలు అంటూవుంటే నిలువునా నీరైపోతున్నాను. కాంతమ్మతల్లీ, ముప్ఫై ఏళ్లు సుఖంగా కాపరంచేశాను. ఎప్పుడూ ఇల్లాంటి పిచ్చిమాటలు ఆయన అనగా నే వినలేదు!" అని చెప్పుకొన్నది. చివరకు మళ్లీ అన్నది—"ఏంతల్లీ, ఎవరో కిరస్తానీలూ అప్రాచ్యులూ అనుకుంటారమ్మా అల్లాగ! ఏమోలే ఎల్లా ఏడిస్తే మనకెందుకు? మాగతి ఇల్లా ఐంది గదా" అని దుఃఖపడ్డది ఆవిడ.

ఈసంగతులన్నీ విని నేను నాలిక కొరుక్కున్నాను. మాఆవిడ ముక్కుమీద వేలేసుకొంది. ఆవిడా కాసేపు ఊరుకొని ఏదో జ్ఞాపకం వచ్చినట్లు తెప్పరిల్లి అన్నది—"అయితే, ఇంకోటి నాయినా! ఇల్లాగ పిచ్చిగా నానా మాటలూ అంటున్నా, రోజల్లా ఇల్లాగ మాట్లాడరు. మధ్యమధ్య బాగానే వుంటారు. గుబులుకింద వస్తాందో ఏమో, రోజుకు నాలుగైదుసార్లు ఇల్లా అంటూ వుంటారు. ఈతిక్క లేనప్పుడు మళ్లీ బాగానే వుంటారు."

ఆ ముసలమ్మగారు ఇల్లాగ విచారపడి ఆఖరుకు కాంతంచెవిలో అన్నది: "ముసలిదాన్ని పట్టుకొని, పైగా, ముద్దు ముద్దు అంటారమ్మా, ఎక్కడచచ్చేదీ—"

ఈమాటలన్నీ విని నేనేమీ అనలేకపోయినాను. కాంతంముటుకు నవ్వు ఆపుకోలేక పోతున్నది. "నేనేమీ ఎరగనండీ పిన్నిగారూ" అన్నాను నేను చివరకు. "నువ్వేమీ ఎరగకపోవటం ఏమిటి? నువ్వే చేశావు ఇదంతానూ!! విరుగుడుమంత్రం ఏదైనా ఉచ్చాటన చెయ్యి బాబూ. మాతండ్రివి గదూ." అంటూ, నాగడ్డాన్ని మునివేళ్లతో తాకి బ్రతిమిలాడటం మొదలుపెట్టింది.

ఆమెదుఃఖం కాస్త తగ్గటం చూచి కాంతం అన్నది: "పిచ్చిగాదండీ, అవ్వగారూ, మీ ముసలాయనకు పిచ్చిగాదది! మీయందు ప్రేమ కనుపరుస్తున్నాడు."

"పోనీ, నీమాటే నిజమనుకో. అల్లా అయితే మటుకు ముప్ఫైఏళ్లనుంచీ లేనిదీ... ఇప్పుడు ఇల్లాగ వికారం కలగటం మంచే అంటావా? అయినా, పిచ్చి కాకపోవటం ఏమిటి?" అంటూ ఆవిడ మళ్లీ విచారపడ్డది. నేనూ, మాఆవిడా ఒక్కసారి నవ్వుకొన్నాము.

"మీరు ఇల్లాగ నవ్వితే నాబ్రతుకు ఏంకావాలె చెప్పు తండ్రీ! పోనీ, ఏభూతవైద్యుడి దగ్గరకైనాపోయి ఇంత విభూతి పట్టుకొద్దామా అంటే, నీవు చెప్పిన ఇంగ్లీషుమంత్రానికి అది పనిచేస్తుందో చేయదో!! నాబాబు కదూ. ఎట్లాగయినా నువ్వే దీనికి మళ్లీ ఇంగ్లీషులోనే ఉచ్చాటన చేసి నన్ను బైటపడెయ్యాలె" అంటూ ఆవిడ మళ్లీ బ్రతిమిలాడింది.

ఆవిడను తృప్తిపరచటానికి ఒకటే మార్గం ఉందని తోచింది, అదేమిటే సరే ననటం. అందుకని నే నన్నాను—"పిన్నిగారూ, పొరపాటే జరిగింది. నేను మళ్లీ ఇంగ్లీషులో ఉచ్చాటనచేసి, ఇదంతా పోగొడతాను. మీరేమీ భయపడకండి" అని.

ఆమెగారు ఈమాటలు విని అమితంగా సంతోషించింది. "మానాయనే. నీకు ఆడపిల్ల పుడుతుంది నాయనా. తప్పకుండా చెయ్యి" అని నన్నూ, మాఆవిడనూ దీవించి వెళ్లిపోయింది.

ఆవిడ వెళ్లిపోయినతరువాత కాంతం నవ్వు ఆపుకొని నాతో అన్నది—"మీరు పొరపాటుచేశారు. ఈమెగారికికూడా ఉపదేశం చెయ్యాల్సింది" అని.

"ఏమని" అని అడిగాను నేను.

"ఏమనా? ఆయనకు చెప్పినట్లుగానే, మొగుడి గుణసంపదనూ, సౌందర్యాన్నీ మెచ్చుకోమని."

నేను మాట్లాడలేదు.

ఆవిడ మళ్లీ ఎత్తుకొని ఇల్లాగ అన్నది: "మొగుడితో ఆవిడ ఇల్లాగ అనాలె—'ఓ ప్రాణనాథా, ఓనవమన్మథా, మీ మోహనమూర్తి సందర్శనమే నాకు తన్మయత్వం కలిగిస్తుంది. మీముఖచంద్రబింబ సందర్శనమే నాహృదయగభీరసాగరాన్ని పొంగులెత్తిస్తుంది. మీ మధురమైన పలుకులే......'"

"చాలించు" అన్నాను విసుగ్గా.

"ఏం?" అన్నది నవ్వుతూ.

"వెక్కిరిస్తే సహించే స్థితిలో లేను నేను. ఇప్పటికే చాలా విచారపడుతున్నాము. అసలు ఇల్లాగ అవుతుం దని అనుకోలేదు" అంటూ నేను మేడపైకి గబగబా వెళ్లిపోయాను.



నాటకవస్తువు

= శ్రీ దివాకర్ల వేంకటావధాని =

నాటకాంగము లన్నిటిలో వస్తువు (*plot*) మిక్కిలి ముఖ్యమైన దని ప్రాచ్యపాశ్చాత్య లాక్షణికు లందఱు నేకగ్రీవముగా నుడివిరి. వస్తువు రసోచితమైనది లభించుచోఁ గవి వన్నె చిన్నెలు చేకూర్చి పాత్రపోషణముద్వారా దాని కొక సంపూర్ణమైన యాకృతి నొసంగఁగలఁడు. అసలు వస్తువే లేనిచోఁ గవి యెంత నిపుణుఁడైనను గావ్యము పఠితల యభిరుచిని బెంపొందింపఁజాలఁడు. పాత్రపోషణమున కతి ప్రాముఖ్యము నొసంగి కేవలము వ్యక్తిత్వ నిరూపణము కొఱకు మాత్రమే వ్రాయఁబడిన నాటకములలో నైతము కొలఁదిగనో గొప్పగనో యేదో యొక యాలంబన వస్తు వుండితీరును. అట్టి వెంత గొప్ప నాటకము లయ్యును, వస్తుహీనతచేఁ, బ్రదర్శించునపుడు రంజకములు కావు. అదిగాక నాటకము రంగస్థలమున జనసామాన్యముకొఱ కుద్దేశింపఁబడినదగుటచే నందు కథయొక్క విస్తృతియు (*kind*), నుత్తమత్వమును (*quality*) గూడ నాశింపఁబడును. నాటకమునఁ గార్యము(*Action*) ప్రాధాన్యము వహించియుండును గాన తత్క్రియ వికాసమునకుఁ జాలిన వస్తు వందుండుట చాల నవసరము. వస్తు వను దేహ మున్నచోఁ గవి పాత్రపోషణాది సాధనసంపత్తిచేఁ బ్రాణప్రతిష్ఠాపన చేసి దానికిఁ జైతన్య వికాసములు చేకూర్పఁగలఁడు.

వస్తువు, పాత్రలు—పరస్పరాశ్రయత్వము

వస్తువిస్తృతికిని, బాత్రపోషణమునకును బరస్పరాశ్రయత్వము కలదు. పాత్రల ద్వారా వస్తువు విస్తరింపఁబడును; వస్తువుయొక్క క్రమపరిణామము ద్వారా పాత్రల శీలస్వభావములు వ్యక్తము లగును. కాని నాటకమున నవలలోవలెఁ బాత్రల సంఖ్య యత్యధికముగా నున్న నది ప్రయోగాసాధ్య మైపోవుటయే కాక యతిక్లిష్టతచేఁ జనులకప్పుడు సరిగా నర్థముకాకపోవుటయు సంభవించును. అందుచే నాటక కవి పరిమితమైన తనవస్తువున కవసరమైనట్టియు, నందు ప్రవేశపెట్టుట కర్హమైనట్టియుఁ బాత్రలను మాత్రమే సృష్టింపవలెను. ఇట్టి యాపాత్రల గుణస్వభావ ప్రకటన కుపకరింపని సన్నివేశములుకాని, సంవాదములుకాని చొరకుండునట్లుగా నతఁడు వస్తువును గూర్చుకొనవలెను.

వస్తుసంధానమున రంగ, పరికరములను విస్మరింపరాదు

వస్తుసంధానము చేయుతఱి నాటకకవి రంగమును, దత్పరికరములనుగూడ సాధారణముగా దృష్టియం దుంచుకొనవలెను. షేక్స్పియరు మున్నగు గొప్పనాటక కవులు సామాజికుల నాకర్షించుటకు మాత్ర మపయో

గించు కొన్ని సన్నివేశములను నాటకవస్తువునఁ బ్రవేశ పెట్టుట కానవచ్చుచున్నది. ఇట్టి సన్నివేశములు తఱుచు హాస్యసమ్మిశ్రితములై యుండును. యశఃప్రార్థియగు కవి యెప్పుడును సామాజికుల దృక్పథమును దొలు దొలుత నాకర్షించునది రమ్యమైన కథాసంవిధానమే యని యెఱిఁగి, దానిని గూర్చినతరువాతనే కార్యము (*Mere action*) కంటె నుదాత్తతరములైన మానసిక తత్త్వనిరూపణాదులకై ప్రయత్నించును. ఇట్లే తాత్కాలికములైన రంగపరికరములను కవి విస్మరించినచో నతఁ డెంత నిపుణముగా రచించిన రంగము నైనను నటకులు ప్రదర్శనాసాధ్య మగుటచే నాటకము నుండి తొలఁగించి వైతురు.

దేశవస్తుకాలాదులలో నియమము పాటింపవలెను

నవలరచయితకు దేశవస్తుకాలాదులలో నియమము లేదు కాఁబట్టి యాతఁడు నవల నెంతదీర్ఘముగానైనను వ్రాయుటకు వీలు కలదు. నాటకకవి పరిమితస్థలములో వీనియం దైక్యము సంధానింపవలయును గావున నంకమునకు నంకమునకు నడుమఁ గొంత వ్యవధానము తటస్థించుచుండును. ఈవ్యవధానమును మఱుఁగుపఱిచి యనుస్యూతముగా, సానుబంధముగా వస్తువును గూర్చుటలో నేకవిశిల్పనైపుణి యంతయు గోచరించును. ఈవ్యవధానగోపనమునఁ గవి లేశమాత్ర ముపేక్షవహించినను నాటకవస్తు వతుకులుపడి సమష్టిసౌందర్యమును గోల్పోవును. ఇట్లే యంకములయం దుండు భిన్నభిన్న రంగముల నడుమఁ గల యంతరమును గూడఁ గవి మిక్కిలి నేర్పుతో నతుకుచుండవలెను. లేనిచో నాటకమున నారంగములకుఁ గల సంబంధము ఖండితమైపోవుటచే నవి యనవసరము లనిపించును.

అరిస్టాటలు చెప్పినట్లు నాటకవస్తువు మిక్కిలి సంక్షేపముగా, నొకేసారి కూర్చుండి చదువుటకుఁ గాని, వినుటకుఁగాని యనువుగా నుండవలెను. ప్రేక్షకుల యుపవేశనశక్తి పరిమిత మగుటచేఁ గొంత కాలము గడచినతరువాత వారు విసుగుదలచే నిక వెడలిపోవుటకుఁ బ్రయత్నింతురు. అట్టిసమయమున నెట్టి మహోత్కృష్టములైన రంగములైనను వారి నాకర్షించుటకుఁ జాలియుండవు. ఈకారణముచే నాటకకవి వస్తువును గుదించి, ప్రధానవిషయములను మాత్రమే గ్రహించి వానిని విస్తరించుటయందే విశేషావధానముతోఁ బనిచేయవలెను. అప్పుడు నాటక మాద్యంతము సామాజికుని దృష్టి నాకర్షించి రససిద్ధిని గలిగించును. ప్రాచ్యలాక్షణికులు సైతము నాయకునికిఁ గాని, రసమునకుఁగాని భంగకరములైన విషయములను నాటకమునుండి తొలఁగింపవలయు నని చెప్పిరి. దానికిఁ గూడ నిదియే హేతువై యుండును.

ప్రఖ్యాతోత్పాద్యములలో ఉత్పాద్యమే శ్రేయము

నాటకకవి కల్పితకథను వస్తువుగా స్వీకరించునప్పుడు సామాజికుల కది సరిక్రొత్తగా నుండును గావున వారు దానిని విశేషావధానముతో వినుచుందురు. కాని వస్తువు ప్రఖ్యాతమైనప్పుడు వారికి దానియం దంత శ్రద్ధ యుండదు. అందుచే నాటకకవి ప్రఖ్యాత వస్తువునే గ్రహించినను అం దడనెడ సామాజికుల దృష్టిని సమాకర్షించుటకుఁగాను కొన్ని యపూర్వ కల్పనములు చేయుచుండుట యావశ్యకము కాకపోయినను నాటకానురక్తికి మిక్కిలి తోడ్పడును. అట్లుకాక యున్న వస్తువునే యథాస్థితముగాఁ బ్రదర్శించినచో నది యంత యాదరణము నాకర్షింపఁజాలదు. ఏల యనఁ, బరిచితవస్తువులయెడ నుపేక్షముగా సంచరించుట మానవుల స్వభావము. "అతిపరిచయా దవజ్ఞా" యని కూడఁ గలదు. షేక్స్పియరు తన నాటకములలో నిట్టి క్రొత్తకల్పనములు కల్పించినచో ట్లంత విరివిగా లేవు కాని కడతర నాటకకర్త లీపద్ధతిని సవిశేషముగా నుపయోగించుకొనిరి. ప్రాచ్యనాటకకవులలో భాస కాళిదాసాదు లందఱును గొలఁదిగనో గొప్పగనో తమ నాటకములలో నిట్టి నూత్నకల్పనములు కావించినవారే.

మూలాతిక్రమణములోని ముప్పు

మూలమునుండి వస్తువును స్వీకరించునప్పుడు కవి ప్రధానవిషయములలో దాని ననుసరించినచో నవాంతరవిషయములలోఁ గొంత దూరముగాఁ బోయినను నంత యనర్థము లేదు. ముఖ్యవిషయములలో సైతము భేద

ములు కానిపించినచో సామాజికులు కవియెడ విశ్వాసమును గోల్పోయి యొక్కొక్కప్పుడు విముఖు లగుదురు. ఉత్తరరామచరిత్రలోఁ జివర సీతారాములకుఁ బునస్సంయోగము కలుగుట ముఖ్యవిషయమునకు సంబంధించిన భిన్నత్వమే. యుద్యాన గరుణావసానమును సహింపఁజాలని హిందువుల మనస్తత్త్వమునకు సరిపడిన దగుటచే నంత హాని లేకపోయినది. అదిగాక జైమిని భారతమున మోదాంతకల్పనముకూడఁ గానవచ్చుచున్నది. మూలమునందే పునస్సంయోగకల్పన ముండఁగా భవభూతి యే కావ్యన్యాయమునో పురస్కరించుకొని సీతారాముల వియోగమును బ్రదర్శించె ననుకొందము. అప్పుడది సామాజికులలో నెంతో వైముఖ్యమును కలిగించియుండును. ఇట్లే "కైక వరము లడుగ లేదు. రాముఁ డడవికేఁగ లేదు." అని కవి రచించినచో సామాజికులకుఁ గవిజ్ఞానమునెడ నభిమానము సన్నగిల్లుటచే వా రతని నజ్ఞానిగాఁ దలంతురు. ఇంక నముఖ్యవిషయములను గవి పాత్రరసానుగుణముగా నెట్లు మార్చినను మార్చవచ్చును. ఒక్కొక్కప్పుడు పాత్రపాదులకుఁ బుష్టికలిగించుటకై యన్యథాకల్పనములతోపాటు పూర్వకల్పనలుకూడ గావింపవచ్చునని యిదివరకే చెప్పఁబడినది.

ఆరంభరచనలో అత్యంతశ్రద్ధ అవసరము

పంచకార్యావస్థలలో నారంభమును (*Exposition*) రచించునప్పుడు కవి మిక్కిలి శ్రద్ధ వహింపవలయును. ఏల యన, నందు సామాజికుల నాటకావబోధమున కావశ్యకమైన తత్పాత్రసంబంధి విషయము సర్వము కళాదృష్టితో సమకూర్పఁబడవలెను. అర్హావిధముగా నీయారంభమును రచించుట మిక్కిలి కష్టము. దీని యుత్తమత్వమునుబట్టియే నాటకకవి శిల్పితనము నరసిచూడవచ్చును. నాటకకార్య మారంభించుటకుఁ బూర్వమందు ప్రధానస్థాన మాక్రమించు పాత్రల కొండొంటికో నెట్టిసంబంధము కలదో, వాని స్వభావ మెట్టిదియో సామాజికుఁ డెఱుఁగుట మిక్కిలి యావశ్యకము. కావున నాటకముయొక్క యీయారంభ మాతనికిఁ గావలసిన యట్టివిషయము నంతయు విప్పిచెప్పవలెను. నాటకవస్తు వెంత సరళమైన దయినను, కవి యీ భాగమును రచించునప్పుడు మిక్కిలి క్లేశపడును. నాటకవస్తువుయొక్క క్లిష్టతనుబట్టియు, నందలిపాత్రల సంఖ్యనుబట్టియు నీక్లేశము మఱింత యధికమగుచుండును.

యూరిపిడిస్, సెనెకా అను పాశ్చాత్యకవులు నాటకావగాహనమునకుఁ దోడ్పడు నీయారంభమును ప్రోలోగ్ (*Prologue*) అను నొక ప్రత్యేకప్రక్రియ ద్వారా వ్యక్తము చేసిరి. ఈపద్ధతి నాంగ్లకవు లెవ్వరును బూర్ణముగా ననుకరించియుండలేదు. షేక్స్పియరు నాటకములు కొన్నిటిలోని యారంభస్వగతములను (*Richard III* లోని గ్లస్టరుస్వగతమువంటివానిని) ఆ పద్ధతి యొక్క పరిశిష్టచిహ్నము లనవచ్చును. ఎలిజబెత్తు కాలములోనికవులు పెక్కురీయారంభమును సంవాదరూపమునఁజే రచించినను నం దొక పాత్రచేతనే నాటకకార్యమున కుపోద్ఘాత మనఁదగిన యీపూర్వగాథాప్రసంగము నుపన్యసింపఁజేయుచుండిరి. ఈపద్ధతి షేక్స్పియరు టెంపెస్టు, హామ్లెట్ మున్నగు నాటకములలోఁ గానవచ్చుచున్నది. కాని కథనరూపమైన యీ యారంభము నాటకగౌరవమునకుఁ జాలినదికాదు. డ్రైడను సామాజికు లిట్టి దీర్ఘోపన్యాసముల నసలు వినవేరిన రని చెప్పుటలోఁ గొంత యతిశయోక్తి యున్నను సత్యము లేకపోలేదు.

సంవాద,కథనములలో సంవాదమే సరియైనది

సంవాదరూపమున నీయారంభమును సాగించుటయే యుత్తమమైన పద్ధతి. ఇది కథనరూపమున నున్నచో సామాజికులకు విసుగు జనింపఁజేయును. షేక్స్పియరు తన ఒథెల్లో నాటకమున నారంభమును సంవాదరూపమున మిక్కిలి నిపుణముగాఁ జిత్రించెను. అది కార్యారంభముతోఁ గలసిపోయినట్లై యుండి మొదటినుండియు సామాజికులలో నాత్రమును, అవధానమును జనింపఁజేయును. ఎట్లైనను గవి యీ భాగమున సమగ్రత్వము వడయుట దుర్లభము. ఏల యన నతఁడు సామాజికుల భావముల (*Emotions*) రంజింపఁజేయుచునే వారి బుద్ధికి (*Intellect*) నీ పూర్వగాథాప్రణాళికను స్పష్టముగా, సంక్షేపముగా విశదపఱుచుచుండవలెను. దీనికితోడి యారంభము నాటకకార్యారంభమునకు ద్వారమువలె నుండి సామాజికుల నందు ప్రవేశింపఁజేయవలెను.

దీనినిబట్టి యీ యారంభమునందే నాటకస్థ పాత్రలన్నియుఁ బ్రవేశించుననియు, దీనివలననే నాటకవిషయము సంపూర్ణముగాఁ దెలియవలెననియు నను

కానరాదు. ఇందు పాత్రలన్నియుఁ బ్రవేశించుట యసంభవము. కాని యిందు ప్రధానపాత్రల నామములు సూచింపఁబడుటయే కాక వారికిఁ దదితర పాత్రలతోఁ గల సంబంధము సైతము కొంతవఱకు సూచింపఁబడును. ఈ విషయమును గూర్చి **Pirre Corneilli** ఇట్లు చెప్పుచున్నాఁడు: *"I desire the first act to contain the basis of all the episodes and shut the door to everything else that might otherwise have been introduced. Frequently this first act does not provide all the necessary information for the entire understanding of the subject and all the characters do not appear in it; but it is sufficient that they are mentioned or that those on the stage are made to go in search of them. An actor must give information to the listener through the passion which moves him and not by means of simple narration"*

ఒండొంటితో నంత సన్నిహితసంబంధము లేని ప్రత్యేకవిషయములు కొన్ని నాయకుఁడను సూత్రముచే ననుసంధింపఁబడుట కొండొకచోఁ గానవచ్చును. ఈ విషయములు నాయకునితో సంబంధము కలిగియున్నను నాటకకార్యమున కేవిధముగను దోడ్పడవు. ఉపసంహృతి వీనియన్నిటి సాహాయ్యమునను క్రమముగాఁ బరిణమింపకపోవుటచే బీజముతో సంబంధము లేని వేఱుఫలముగాఁ గానవచ్చును. ఇట్టిది సాధారణముగా నొకే వ్యక్తియొక్క వివిధానుభవములను వర్ణించునప్పుడు సంభవించును. ఆరంభమునుండి ఫలాగమమువఱకు క్రమాభివృద్ధి కలిగియుండని యిట్టివస్తువు లైక్యవిహీనములై చరిత్రలవలె వేఱువేఱువస్తువుల సంకలనములవలెఁ గానవచ్చును. ఇట్లుగాక యారంభమున పారంభమై ప్రయత్నాదులలోఁ గ్రమముగా నభివృద్ధిఁ గాంచుచు ఫలాగమమున ఫలించు వస్తువు నాటకమునకు మిక్కిలి అనుకూలముగా నుండును. ఇందలి వివిధాంగము లైక్యముతో విలసిల్లుచు నంగియొక్క పుష్టికి మిక్కిలి తోడ్పడును. ఇందలి వివిధ సన్నివేశము లెచ్చటనో పుట్టి వివిధస్థలములలోఁ బ్రవహించి చివరికి సముద్రమునఁ గలయు నదులవలె నుపసంహృతిలోఁ గూడుకొని యేకైకఫలమును సూచించుచుండును. నాటకకార్యముతోడి సంబంధమును వీడి యివి యొక్కింతదైనను దూరముగాఁ బోవు. ఇట్టి నిబిడమైన వస్తువు నాటకసౌందర్యమునకు వేయివిధములఁ బోషకముగా నుండును.

వస్త్వైక్యము - అభిప్రాయభేదములు

నాటకవస్త్వైక్యమువిషయమునఁ బాశ్చాత్యులలో *Neo-classic* తెగవారికిని, ***Romantic*** తెగవారికిని గొంత యభిప్రాయభేదము కలదు. మొదటి తెగవా రరిస్టాటలు ననుసరించి నాటకవస్తువున భేదమోదవస్తువుల పరిమిశ్రణముగాని, వివిధములైన యుపకథల కూర్పుతోడి క్లిష్టతకాని యుండఁగూడదని నుడివిరి. అరిస్టాటలు నాటకనిర్మాణ మితిహాసపద్ధతి ననుసరించియుండఁగూడదని నుడివెను. ఇతిహాసపద్ధతి యనఁగాఁ గథ యితిహాసములోవలె భిన్నములైన యుపాఖ్యానములతోఁ గూడియుండుట. అతఁ డీమాటలను సరళమైన కథాసంవిధానముతోఁ గూడిన గ్రీకు నాటకములఁ బురస్కరించుకొని చెప్పియుండును. కాని రెండవ తెగవా రీవస్త్వైక్యము విషయమునఁ గొంత విశాల దృక్పథమును గలిగియుండిరి. వారి యభిప్రాయముప్రకారము భేదమోద విషయము లొకేవస్తువునఁ గూడియున్నను, ప్రధానకథకుఁ బోషకముగా నుండు నుపకథలందు రచింపఁబడినను దోషములేదు. కాని యీ యుపకథలన్నియుఁ బ్రధానవస్తుపుష్టికిఁ దోడ్పడుచునే యుండవలెనను విషయమును మొదటి తెగవారివలె వీరును గమనించిరి. షేక్స్పియరు తన నాటకములలో భేదమోదవిషయముల నొకేవస్తువున సంఘటించుటయుఁ, బ్రధానకథకుఁ బోషకముగానుండువిధమున నుపకథల రచించుటయుఁ జెక్కుచోట్లఁ గానవచ్చుచున్నది.

నీరసవస్తువులు సర్వథానింద్యములు

Mathew Arnold కావ్యవస్తువు మిక్కిలి యుదాత్తముగా (*Sound subject matter*) నుండవలెనని చెప్పెను. ప్రాచ్యలాక్షణికులు సైత మది "మధురోదాత్తరసభావనిరంతరముగా నుండవలె"ననిరి. అందుచే

నాటకమున నీరసవస్తువును సాధ్యమైనంతవఱకుఁ బరిహరింపవలెను. ఒకవేళ నది కథాసంవిధానమున నపరిహార్య మైనచో సూచ్యమాత్రము కావలెను. అందుకొఱకే ప్రాచ్యలాక్షణికులు విష్కంభాద్యర్థోపక్షేపకముల విధించిరి. పాశ్చాత్యు లిట్టి ప్రక్రియను గల్పింపకపోయినను, నీరసములును, దుష్ప్రదర్శ్యములును నగు విషయములను గథనపూర్వకముగా వ్యక్తము చేయవచ్చునని నుడివిరి. కవి యెంత నిపుణుఁడైనను వస్తువు నీరసమైనచోఁ గంఠమాధుర్యము లేని సంగీతశాస్త్రజ్ఞుని వలెఁ దనసృష్టికి సౌందర్యమును జేకూర్పలేఁడు. అందుచే నాటకమును వ్రాయఁబూనుటకుముందే యర్హవస్తుసంగ్రహణమునకుఁ గవి ప్రయత్నింపవలెను. నీరసవస్తువుపైఁ గావింపఁబడిన పాత్రపోషణాద్యలంకారములు శోభావహత్వమున నూషరక్షేత్రపర్యుప్తములైన బీజములతో సమానములు.

కథనశైలి పనికిరాదు

నాటకము పరాశ్రయకావ్యములలో నుత్కృష్టమైనది. నవలరచయితవలె నాటకకవి తన కావ్యమునఁ దానుగా నేది పల్కుటకును వీలులేదు. అతఁడు సర్వమును పాత్రలద్వారా పలికించుచుండవలెను. ఈ పాత్రల సంవాదమే నాటకమునకుఁ బ్రాణమువంటిది. కవి తన యభిప్రాయము నేదేని వ్యక్తము చేసికొనఁదలఁచినచోఁ దా నొకపాత్రలో లీనమై వానిని సందర్భోచితముగాఁ బల్కుచుండవలెను. నవలలో సంవాదాఖ్యానవర్ణనపద్ధతులు మూఁడును నుండుట కవకాశము కలదు. నాటకమున సంవాదశైలి తప్ప మఱేదియు ననుకూలముగా నుండదు. ఈ సంవాద మెంతరమ్యము గానున్న నాటకశోభ యంత యధికముగాఁ గానిపించును. పూర్వము, రంగపరికరములు సరిగా లేనికాలమున విషయములఁగూర్చి సామాజికులకు సంపూర్ణజ్ఞానము కలుగుటకై కొంతవర్ణనముకూడఁ జేయుట యావశ్యకమై యుండెను. కాని యట్టి వర్ణనభాగమును రంగపరికరములు పూరించుచుండఁగా దాని యావశ్యకమంతగా లేదని యాధునికులు దానిని విడిచివైతురు. కథనశైలి నాటకమునకు నీరసత్వము నాపాదించును. ఏల యన సామాజికుల కది విసుగుదలనే కాని యభిరుచిని గలిగింపనేరదు. అందుచే నాటకకవి కథనపద్ధతిని జాలవఱకుఁ వర్జింపవలెను.



సన్నిధి

శ్రీ గుర్రం వేంకటసుబ్రహ్మణ్యము

వలి వలిపమ్ము వోని ప్రసవప్రసవావసరప్రసూతిలోఁ
దొలి తెలికాంతి లేఁతగిలు దూర్పుమొగం బుదయోదయంబునన్
లలిత లతానుకూల పవనంబు సముద్గమనోద్గమంబు నీ
చెలువపుఁ బ్రాయపుం జెలిమి చిత్తమెలర్చెను జూడ్కి వేడ్కలన్.

మేనిమెఱుంగు లుబ్బికొని మేలిముసుం గిడె కాంతివెల్లి నా
పై నెఱచించె, నించె సుమబాణుఁడు తోడన యంపవెల్లి, నే
లా నను ముంచు నొంచు నివి యంచుఁ దలంప కుపేక్ష సేసెదో
చాన, మనోహరాకృతుల సంగడి లేవె కృపాలిరేకముల్ ?

దూరతరంబు నో యువిద దుర్గమముల్ భవదంతికంబు నీ
చేర కడంబులో విరహసింధువు క్రిందుకొనంగ నిందులో
స్ఫారతరంబు నో యువిద భారతరంబు ప్రతిక్షణంబు దు
ర్వారతరత్రపోచ్ఛ్రితియ నివార్య మదీయ సముత్సుకత్వమై.

మ్రోలను గ్రాలుచున్నపుడు మోమున మోము ఘటింపకుండ నే
వేళ పరస్పరాంతిక గవేషణలోలములై తనర్చు దృ
గ్జాలము సప్రకాశితముగా, నెడబాటునకన్నఁ గష్ట పా
టోలి సహించుకోవలసె నుర్వర నిర్వర మన్యసన్నిధిన్.

కరువున లేని చాలనము, కాంచనమందున శూన్యమైన స
త్పరిమళముం, బువుంగమి నభావము వాడని కామనీయకం
బు, రుచిర కావ్య కల్పనల మోఘము సేయఁగఁజాలు రూప వి
స్ఫురణము గల్గు నీయెడన ముగ్ధుఁడ నైతిని స్నిగ్ధలోచనా.

పున్నమరేయి చెందొవల పోలిక బాలిక విస్ఫురంబులౌ
కన్నులలోనఁ దెల్లమగుఁ గాదను నీనుడి కైతవం బనా,
పన్నగ భామ లొల్లములు బల్కెడు వేళల వల్లెవల్లె యం
చు న్నయనంబు లాడుటలు చోద్యములే సమయజ్ఞ విజ్ఞముల్.

కోయిల కంఠమెత్తి యిదిగో విరచించు నికూజనమ్ము కూ
హూయని, నాదు కూర్మి నుడియున్ భవదీయ రహస్య సమ్మతిన్
జేయునొ లోకవేద్యముగఁ, జెట్టను బట్టను జేరఁబాఱియున్
ధీయుత మింగితజ్ఞము గదే ద్విజజాతి వసుంధరాస్థలిన్.

కలగూరగంప

యోధుల ధ్వజములు

యుద్ధమున లోకలోకులకి వారువారు వరించి యేర్పరచుకొనిన ధ్వజచిహ్నము లుండుట అనాది ప్రసిద్ధమయియున్నది. అయితే ఈ ధ్వజచిహ్నితము లను సింహవ్యాఘ్ర వృషభ గజ నాగ గరుడాదిరూపములు జండా గుడ్డలపై వద్దెరముచేతగాని, కుట్టుచేతగాని, రంగున వ్రాయబడుటచేగాని, లేక నానావర్ణములుగల నూలు పోగులచే నేయబడుటచేగాని యేర్పడిన స్వరూప మాత్రములా, లేక వీనికిని ఆవాహనములు, అభిమాన దేవతలు, అధిదేవతలు, ప్రత్యధిదేవతలు ఉందురా? ఈ జండాలపై నుండు రూపములు సచేతనములా, అచేతన ములా — సజీవములా, లేక ప్రతిమాకృతిమాత్రములా?

"పడగనున్న హనుమ భయవిహ్వలుడు గాడు
అరదమునకు సూతు డమ్యగుండు."

అను వాక్యమున భయవిహ్వలత పొందుటయు, పొందకపోవుటయు పడగనున్న హనుమంతుని కేల చెప్పబడవలెనో?

విరాటపర్వమున (కలకత్తా ప్రతి) అధ్యాయము ౪౭-౧౯ శ్లోక మిట్లున్నది:

"ధ్వజాగ్రే వానర స్తిష్ఠన్ భల్లేన నిహతో మయా,
అద్యైవ పతతాం భూమౌ వినదన్ భైరవాన్ రవాన్"

దీనిని తెలిగించుటలో సోమయాజి "కపిధ్వజము దవ్వుల ద్రేల్మికిఁ గ్రుంచి పై చెదం బఱ పెదం దప్పిశాచముల" అని మాత్రమే వ్రాసియున్నాడు (విరాట. ౪-౨౦౧). ధ్వజాగ్రమునందలి వానరుని బల్లెముచే పొడిచిచంపుట యిందు కనుపడదు. ధ్వజము నందలి వానరరూపమును బల్లెముచే పొడిచిచంపుట ఉత్ప్రేక్షయా, లక్షణారోపమా, లేక యథార్థమా?

ద్రోణపర్వమున (కలకత్తా ప్రతి) ౭౭-వ అధ్యాయమునందలి ౫౬-వ శ్లోకము:

"తతః కపి ర్మహానాదం సహ భూతై ర్ధ్వజాలయైః,
అకరో ద్వ్యాదితాస్యశ్చ భీషయన్ తవ సైనికాన్"

దీనికి తెలుగు (ద్రోణ. ౩-౩౭):

"దేవదత్తరవంబులోఁ దీవ్రపాంచ
జన్యనినదంబు భూరి నిస్వనముతోడఁగ
నినుచు వానరరావంబు నింగిముట్టె ..."

సంస్కృతమూలములోని కపి మహానాదము చేసెను. తెలుగున వానరరావంబు నింగిముట్టినది. రెండును సమానార్థకములే. ఇచట 'మహానాదమును', 'నింగిముట్టిన వానరరావంబును' చేసినది జండాలోని బొమ్మరూపమా, లేక తత్కాలమున కాబొమ్మ సజీవమైనదనియా?

పైవాని కన్నిటికంటె ఆశ్చర్యకరమగు ధ్వజ చేష్టితములు కర్ణపర్వమున గలవు. కర్ణార్జునుల ద్వంద్వ యుద్ధఘట్టమున ఈ క్రింది శ్లోకములు సంస్కృత భారతమున నున్నవి (కలకత్తా ప్రతి, కర్ణ. ౮౭-౮౭):

"తయో ర్ధ్వజౌ వీతమలౌ శుశుభాతే రథే స్థితౌ,
రాహుకేతూ యథాకాశే ఉదితౌ జగతః క్షయే.
కర్ణ స్యాశీవిషనిభా రత్నసారమయీ దృఢా,
పురందరధనుః ప్రఖ్యా హస్తికక్ష్యా వ్యరాజత.
కపిశ్రేష్ఠస్తు పార్థస్య వ్యాదితాస్యో భయంకరః,
భీషయన్నేవ దంష్ట్రాభి ర్దుర్నిరీక్ష్యో రవి ర్యథా.
యుద్ధాభిలాషుకో భూత్వా ధ్వజో గాండీవధన్వనః,
కర్ణధ్వజ ముపాతిష్ఠత్ స్వస్థానా ద్వేగవాన్ కపిః,
ఉత్పత్యాసు మహావేగః కక్ష్యా మభ్యహన త్కపిః,
నఖైశ్చ దశనై శ్చైవ గరుడః పన్నగం యథా.

సకింకిణీకాభరణా కాలపాశోపమాయసీ,
అభ్యద్రవత్ సుసంక్రుద్ధా నాగకక్ష్యా తం కపిం.
తయోస్తా ఘోరతమే యుద్ధే ద్వైరథే ద్యూతఆహితే,
ప్రకుర్వాతే నృపోర్యోద్ధుం ప్రత్యషేధత్ మహాహరీ
మహామాః ”

ఈ రెండు శ్లోకములలోని విచిత్రవిషయములను తిక్కన సోమయాజి ఒక్క సీసపద్యము యొక్క మూడుపాదములలో నిమిడ్చినాడు(కర్ణ. 3-౨౫౬):

“కపికేతనము హస్తికక్ష్యయు నమ్మహో
బలులిద్దరును దపోబలమువలనఁ
గన్నవిద్యలఁ బుద్ధిగల్గి శోభిల్లను
కీర్తి యప్పుడు కపి యురఁగి హస్తి
కక్ష్యపై నడరినఁ గయ్య మారెంటికిఁ
గలిగె నంత హస్తికక్ష్య చెదరె ”

ఈ కపిహస్తుల ఘోరయుద్ధశక్తి కలుగుటకు వ్యాసు డొక కారణమును సూచించియున్నాడు. ‘భీతమువా’ (మొదటి శ్లోకమున మొదటిపాదము)— బహుశః ఈ విశేషణమునకే కాబోలును సోమయాజి ‘తపోబలమును’ తెచ్చిపెట్టినాడు. ఈ ధ్వజద్వయ ద్వంద్వయుద్ధమునకు లోకానుభవమునకును విజ్ఞానమునకును సమన్వయమును సమర్పకమేమైన నుండగలదా, లేక భీతమలక్ష్య తపోబలక్ష్య సంపదలచే ఆ కపియు, ఆ గజకక్ష్యయు ప్రత్యక్షముగ యుద్ధము జేసిన వనియే నమ్మకొనవలయునా? లేక కర్ణార్జునుల ఘోరయుద్ధమున కిది యుపోద్ఘాతముగ కవి చమత్కృతిచే కల్పింపబడిన యుత్ప్రేక్షయై యుండునా?

—వంగోలు వెంకటరంగయ్య

కథానిక : దాని రచనావిధానము

ఆంగ్ల విమర్శకులలో గొప్పవారిలో ఒకడుగా పరిగణింపబడిన అలెగ్జాండరు పోప్ నెథేనియల్ హాథార్న్ రచించిన కథల్ని విమర్శిస్తూ ౧౮౪౨-వ సంవత్సరంలో ఒక వ్యాసాన్ని రచియించాడు. ఇంతకీ పోపుకి ఆ కథారచనావిధానము వచ్చులేదు, కొత్త పోకడ అంటే పోపుకి నచ్చదు కాబట్టి. కథారచనని ఖండిస్తూ రచించిన ఆ పోపుగారి వ్యాసమే లోకానికంతా కథారచన (చిన్నకథల్ని రచించడం)అనే ఒక సారస్వతశాఖ నూతనముగా బయలుదేరినట్లు తెలియజేసినది. అప్పటినుండి కథానిక ఒక సారస్వతశాఖగా పరిగణింపబడినది. ఈ కథానిక అమెరికాదేశమునుండి తీసుకు రాబడినది. కథానికకీ నవలకీ చాలా వ్యత్యాస మున్నది; ఉన్నా విషయములోనూ, రచనావిధానములోనూ, ముఖ్యోద్దేశములోనూ రెండూ ఒకేనియమాన్ని అనుసరిస్తాయి.

జీవితాన్ని యథారీతిగా ప్రదర్శించుటే కథానికయొక్క ముఖ్యోద్దేశము. కథానికకి చక్కనిరూప ముండవలెను. దానిలోని భాగములు ఒకదానితో ఒకటి సమన్వయపడి ఉండవలెను. ఆయాకథాభాగపు ప్రాధాన్యము ననుసరించి ఆ భాగమునకు తగిన స్థానమునుగాని, ప్రాధాన్యమునుగాని ఈయవలెను. నిర్మాణమువందు కథ పరిపూర్ణత నందియుండవలెను. ఒకవ్యక్తిని తీసుకుని అతని జీవితములో అతని శీలమును మనకు చక్కగా బోధింపగలిగే ఒక సంఘటనని వర్ణించడం కాని, ఒక చక్కని సన్నివేశమును తీసుకుని దానిని హృదయరంజకముగా వర్ణించడంగాని కథానికయొక్క ముఖ్యోద్దేశము. ఏదో ఒక దృశ్యాన్నిగాని, ఒక సన్నివేశమునుగాని తీసికొనవలెను. ఒకటిగాని, రెండుగాని పాత్రలుండవలెను. ఒక ముఖ్యమైన ఉద్దేశముగాని, భావముగాని, ఆశయముగాని ఉండవలెను. సాధారణముగా కథానిక ఒక ఉద్దేశముతోగాని, ఒక సన్నివేశముతోగాని, ఒక భావముతోగాని ప్రారంభించవలెను. ఆ సన్నివేశమైనా, భావమైనా, ఉద్దేశమైనా మనకు జీవితములో ఒక ముఖ్యవిషయమును బోధించవలెను. అంతేగాక అది మనము కథలో చెప్పదలచుకున్న విషయపు క్రమక్రమాభివృద్ధికిని, నాయకుని శీలాభివృద్ధికిని తోడ్పడవలెను.

కథయొక్క జీవమంతా కల్పన (Plot)పైననే ఆధారపడియున్నది. కల్పన అంటే ఏమిటి? ఏదో ఒక ఉద్దేశమైనా, సన్నివేశమైనా పునాదిగా చేసుకుని మనము కథాసౌధమును నిర్మింపవలసియున్నది. కల్పనకి వేగమైన నడక ఉండవలెను. అంటే ఏదో ఒకటి సంభవించవలె నన్నమాట. కథాంతమునను, కథా ప్రారంభమునను పాత్రల పరిస్థితులు భిన్నములుగా ఉండవలెను.

కథలోని పాత్రలలో ఒక అద్భుతమైన మార్పు కనిపించవలెను. ఇదే కథానిక యొక్క ముఖ్యోద్దేశము. ఈకల్పన సామాన్యమైనదిగను, సంపూర్ణత నందినదిగను ఉండవలెను. మహాద్భుతవిషయమే కల్పనగా ఉండవలెనను నియమము ఎక్కడా లేదు. మనము ఈకల్పన విషయంలో ముఖ్యముగా గమనించవలసిన దేమిటంటే కల్పనావిషయము నూతనముగా నుండవలెను. ఈకల్పన నూతనముగా ఉన్నప్పుడు చదువరులకు కథానికను చదవ బుద్ధేస్తుంది. ఈ కల్పన సాధారణముగా ఒక మనిషితోటిగాని, ఒక ముఖ్యకర్తవ్యముతోటిగాని, ఒక నిర్ణీతప్రదేశముతోటిగాని, ఒక నిర్ణీతకాలమునకుగాని సంబంధించినదై యుండవలెను. ఈకల్పన హృదయరంజకముగా నుండవలెను, అసంభవవిషయమై ఉండకూడదు. కథావిషయమునం దైనను, కథారచనావిధానమునం దైనను ఒకవిధమైన నూతనత్వమును కన్పింపచేయునదై యుండవలెను. కల్పన ఎంతచక్కనిదై యుంటే కథానిక అంతచక్కగా ఉంటుంది. కథానిక యొక్క సత్తా అంతా ఈ కల్పనమీదనే ఆధారపడి యున్నది.

కల్పనతర్వాత మనము ముఖ్యముగా గమనించవలసినది శీర్షిక. శీర్షిక ఆకర్షణీయముగా ఉండవలెను. శీర్షిక ఆకర్షణీయముగా లేని కథని ఎవరూ చదవరు, చదవనుత్సహింపరు. ముఖ్యముగా కథయొక్క ఆకర్షణశక్తి ఈ శీర్షికయొక్క ఆకర్షణశక్తిమైననే ఆధారపడియుండును. కథావస్తువుగాని, కల్పనగాని ఎంతచక్కనిదై యున్నప్పటికిని శీర్షిక ఆకర్షించకపోతే ఏ చదువరిగాని ఆకథను చదవ నుత్సహింపడు. తరుచుగా క్రొత్త శీర్షికల్ని ఇస్తూ ఉండవలెను. ప్రతిశీర్షికలోను ఏదో ఒకవిధమైన నూతనత్వము కనిపించవలెను. అంతే కాకుండా శీర్షిక వీలైనంతవరకూ చిన్నదిగా ఉండవలెను. దీర్ఘమైన శీర్షికలవలన ప్రయోజన మేమీ లేదు. సాధారణముగా చిన్న శీర్షికలే చదువరుల్ని ఆకర్షిస్తాయి. శీర్షికని చూడగానే కథావస్తువు ప్రతివారికీ చూచాయగా బోధపడవలెను. శీర్షిక కథావస్తువుకి సంబంధించడమే కాకుండా కథావస్తువును కథను చదవక పూర్వమే తెలియజేయునదై యుండవలెను.

కేవలము విషయసంగ్రహణములోనే కాదు, అలాగ సేకరించిన విషయాల్ని తగువిధమున ఉపయోగించుటయందుకూడ కథకుడు తన సామర్థ్యమును చూపవలెను. మనము వ్రాసే ప్రతివిషయమూ నిజముగా జరిగియుండవలెనసే నియమము అనవసరం. కూడదు కూడాను. మనము రచియించిన కథ సంభవమును నని చూపరులకు తోపజేయవలెను. అలాగ తోపించడము లోనే రచయితయొక్క సామర్థ్యము కనబడును. సంభవవిషయముతో కొంత అసంభవవిషయమును కలిపినప్పుడే చదువరులకు కథను చదవడాని కోవిధమైన ఉత్సాహము కలుగుతుంది. ఈ కథానిక రచనలో కొంత వ్యక్తిగతమైన విషయము ఉంటే మంచిది. తాను ముఖ్యముగా తలచే ఒకఉద్దేశముపై కథానికని ఆధారముగా చేసుకుని రచయిత రచియించడం చాలా ఉత్తమమైన విషయము. అప్పుడే చదువరుల మనస్సుకి ఆకథ చక్కగా నాటుతుంది. వాళ్లు రచయితయొక్క ముఖ్యోద్దేశాన్ని గ్రహించగలుగుతారు. వ్రాయుసకాడు తనకు తోచిన ప్రతివిషయాన్నీ కథారూపములో పెట్టి ప్రకటించి తద్వారా సంతోషించడంవల్ల లాభ మేదీ లేదు. ఆకథలో జీవ ముండదు. ఒక నియమ మనేది ఉండదు. ఒక్కొక్కప్పుడు చదువరులకు విసుగు పుట్టిస్తుంది. ఎన్నో అసంభవవిషయాల్ని కథలో ప్రవేశపెట్టవలసివస్తుంది. చదువరులతో అట్టికథకుడు చనవుగా మెలగడం తటస్థించదు. అందుచేత విషయాల్ని ఉపయోగించడంలో ఒక నియమాన్ని మనము పాటింపవలసియుంటుంది. ఏ విషయమైనా సరే నియమానుసారంగా నడిస్తేనే దాని కోవిధమైన సొంపు ఉంటుంది.

కథానికని ఎలాగ ప్రారంభించాలి? అనవసరమైన వర్ణనలతోగాని, లేనిపోని వేదాంతసిద్ధాంతములతోగాని, నీతివిషయకమైన చర్యతో గాని కథానికని ఎంతమాత్రమూ ఆరంభించకూడదు. చదువరికి కథని చూడగనే దానిని తప్పక చదివి తీరవలెననే ఉత్సాహము కలిగించేటంత ఆకర్షణీయముగా ఉండవలెను. ఈ ప్రారంభవిషయము రెండుమూడు 'పారాగ్రాఫు' లని మించకూడదు. అంతకు మించితే చదువరులకి విసుగు కలుగుతుంది. రాబోయే సన్నివేశాన్ని గురించి రచయిత ఎంతమాత్రమూ స్పష్టముగా చెప్పరాదు. ఏదో చూచాయగా తెలియజేయాలి. అనవ

పరమైన సామాన్యవిషయాలతో నింపకూడదు. కథని వేగముగా ప్రారంభించడం, రాబోయే సంఘటనకి తగిన పునాది ఇక్కడే చూపించడం, తర్వాత చదువరిని, అతడు విసుగు చెందకముందే, కథామధ్యమునకు తీసుకొనిపోవడం—ఇది ప్రతికథకునూ కథాప్రారంభమున అనుసరించవలసిననియమము. కథానికయొక్క ముఖ్యోద్దేశము చదువరులకి కొలదినిముషములకు ఆనందము నిచ్చుటే. వారా కొలదిసేపటిలో లోకమును మరిచి పోయి, కథకుని లోకమును ప్రవేశించి, తమ్ము తాము మరిచిపోవలెను.

ఇక కథాభాగమునకు వద్దాము. కథ కొలదికాలములోనే జరుగునదై యుండవలెను; ఏదో ఒక నిర్ణీత ప్రదేశములో జరుగునదై యుండవలెను. రెండుమూడు కంటె ఎక్కువగా ప్రత్యేకములైన సన్నివేశము లుండకూడదు. చేతికి వచ్చినది, నోటికి వచ్చినది రచియించడం కాదు కథకుని కర్తవ్యము. విషయమును క్లుప్తీకరించడం లోనే సాధారణముగా కథకుని సామర్థ్యము కనబడుతుంది. ఈక్లుప్తీకరణ ప్రతికథకునూ ముఖ్యముగా అనుసరించవలసిన నియమము. అనవసరమైన వర్ణనలతో కథని నింపక విషయాల్ని క్లుప్తముగా, హృదయరంజకముగా చెప్పవలెను. ఏదో ఒక దృశ్యానికిగాని, ఘట్టానికిగాని అనవసరమైన ప్రాముఖ్యము నీయకూడదు. ఇతర దృశ్యములవలె అదికూడా ఒకదృశ్యమైయుండి కథానికలో ఒకభాగమై ఉండవలెనేకాని లేనిపోని ప్రాముఖ్యమును దానికెంతమాత్రమూ ఈయకూడదు. ముఖ్యమైన సన్నివేశములను విడిచివేయకూడదు. ఏదో ఒక అనవసరమైన దృశ్యమును వర్ణించుటకొరకై కథకెంతోకూ ముఖ్యమైన ఒక సన్నివేశమును అశ్రద్ధచేసి కథలోనికి తీసుకురావడము మానివేయరాదు. అనవసర విషయాల్ని విడిచివేసి అవసరమైన విషయములను, అవి ఎన్నిఉన్నాసరే, అశ్రద్ధచేయక, వాటిని కథలోనికి తీసుకురావలెను. కథాంతము ప్రతివారికీ యథావిధిగా జరిగినదని తోచవలెను. ఇంకేవిధముగా కథని రచియించినాసరే ఆకథమాత్రము ఆవిధముగనే ముగియవలె నని చదివే ప్రతివ్యక్తికీ తోచవలెను. అయినా ఆముగింపు అలాగే సంభవించవలెననేవిషయము చదివే వ్యక్తికి కథాంతమునకు వచ్చేఅంతవరకూ తెలియకూడదు. అనగా కథ ఈవిధముగా ముగియును అని చదువరికి కథాంతమువరకు వచ్చేవరకూ తెలియకూడదన్నమాట.

ఇక కథానికలలో వచ్చే పాత్రల్నిగురించి కొంత చర్చిద్దాము. జీవితములో వచ్చే వ్యక్తుల ఛాయల్ని మనము ఈ కథానికలలో చూపవలెను. ఆ వ్యక్తుల మనోగతాభిప్రాయాల్ని ఛాయలద్వారా తెలియజేయవలెను. కథానాయకుడు గుణములోగాని, రూపములోగాని ఆకర్షణీయుడై యుండవలెననే నియమములేదు. కథారచనలో అనుభవము చాలా తక్కువగా ఉన్నవారు చేసే పొరపాటేమిటంటే పాత్రకి సంబంధించిన ప్రతి విషయాన్నీ వర్ణించడం, చదువరిఊహకేవిధమైన తావూ ఇయ్యకపోవడం. కొన్నికొన్ని విషయాల్ని మనము చెప్పక వదలిపెట్టవలెను. అటువంటి విషయాల్ని చదువరే ఊహించుకోగలడు. అలాగ మనము చదువరిమనస్సుకి కొంతపని ఇయ్యకపోతే అతనికి విసుగు కలిగించినవాళ్లమౌతాము. ఏ పాత్రనైనా సరే స్వేచ్ఛగా విడిచిపెట్టివేయవలెను. ఆయాపాత్ర తనకు వచ్చినట్లు నడచుకొనేటట్లుగా మనము విడిచిపెట్టవలెను. పాత్రల చావుబ్రతుకులతో మన మేమీ జోక్యము కలుగజేసుకోకూడదు. అప్పుడే ఆపాత్రలో జీవము కనిపిస్తుంది.

ప్రతి కథానికలోనూ వీలైనంతవరకూ ఎక్కువగా సంభాషణ ఉండవలసినదే. ఈసంభాషణే సజీవతను, పరిపూర్ణతను పాత్రలకి చేకూరుస్తుంది. దానిమూలముననే వ్యక్తిత్వమనేది ప్రతిపాత్రలోనూ కనిపిస్తుంది. ఈ సంభాషణమూలముననే మనము ఆయాపాత్రయొక్క మనోగతాభిప్రాయములను తెలుసుకోగలుగుతున్నాము. ఇది కల్పనయొక్క క్రమక్రమాభివృద్ధికికూడా తోడ్పడుతుంది. ఈ సంభాషణమూలముననే కథానికకి జీవకళ చేకూరుతుంది. ఏపాత్రైనాసరే మాట్లాడితేనేగాని అతనిలో జీవమున్నట్లు మనకు కన్పడదు. పాత్రోచితమైన భాషని మనము ఉపయోగించవలెను. అప్పుడే కథానిక హృదయంగమంగా ఉంటుంది. దానిమూలాన్నే పాత్రలలో వ్యక్తిత్వమనేది కనబడుతుంది. అనవసరమైన సంభాషణల్ని విడిచిపెట్టివేయవలెను. ప్రతిసంభాషణా వ్రాయవలసిన అవసరము లేదు. ఎంత కథకి

సంబంధించినవైనా సరే సంభాషణని అనవసరముగా పెంచకూడదు. దీర్ఘ సంభాషణవలన విసుగుపుడుతుంది. సంభాషణలు వీలైనంతవరకూ చిన్నవిగాను, కథావిషయకము లైనవిగాను ఉండవలెను.

ముగింపు మనము చాలా జాగ్రత్తగా గమనించవలసిన కథాభాగము. కథాంతములో కథాశిఖరము (Climax), కథముగింపు ఇమిడిఉంటవి. కథాశిఖరమున కథానికలో ఉన్న పాత్రలయొక్క గమ్యస్థానము నిర్ధారణపరుపబడును. పాత్రలవర్తుల అంతము కనబడవలెను. ఈ కథాశిఖరముతో పాత్రలు అంతముందును. ఈ కథాశిఖరమును మించి ఇంకే ఏ ముఖ్యవిషయమూ నడవదు. ఈ కథాశిఖరము అయిపోయినతర్వాత కథానిక తక్షణమే ముగియవలెను. ముగింపు ఒక 'పారగ్రాపు'లో ఉండవలెను. ఒక 'పారగ్రాపు'ని మించకూడదు. అలాగ ఒకవేళ మించిన చదువరులు దానిని చదివి మన్నహింపరు.

ఇక కథానికశైలి ఎలాఉండాలో గమనిద్దాము. శైలి వీలైనంతవరకూ కథావస్తువున కనుగుణమైనదిగా ఉండవలెను. వివిధములైన కథానికలకు వివిధములైన శైలులున్నాయనేవిషయాన్ని మనముగమనించవలెను. శైలి ఏ ధారణముగా కథావస్తువుపైననే ఆధారపడియుండును. శైలి, కథావస్తువు రెండూ సమన్వయపడినప్పుడే కథ చక్కగా ఏర్పడుతుంది. చదువరులను సాంతమువరకూ చదివేటట్లు పురికొల్పుతుంది. శైలి నిరాడంబరంగా ఉండవలెను. చదవడానికి సులభంగా ఉండవలెను. దీర్ఘముగా ఉండకూడదు. అనవసర పద ప్రయోగములను మానుకోవలెను. వీలైనంతవరకూ స్వాభావికముగా ఉండవలెను. అలంకారములను వీలైనంతవరకూ ఉపయోగించకూడదు. అసలు అలంకారములను వాడకుండాఉండుటే చాలా ఉత్తమము. అలంకారభూయిష్ఠమైన భాష కథానికకెంతమాత్రమూ పనికిరాదు. ఒకవేళ మన మట్టిభాష నుపయోగించినా విద్యావంతులు మాత్రమే దానిని గుర్తించగలరు. తదితరులట్టిభావను గమనించనే గమనించరు. శైలి సులభముగాను, అనర్గళధారాప్రవాహముగాను ఉండవలెను. అప్పుడే అట్టికథానిక చదువుటకు చాలా ఇంపుగా ఉండును. మధ్యమధ్య హాస్యానికీ, వ్యంగ్యానికీ తావీయవలెను.

చెప్పదలచుకున్నదేదో గబగబా చెప్పేసి కథానికని ముగించుట అంత ప్రశంసార్హమైన విషయముకాదు. మనము చెప్పే విషయాన్ని చదువరులు వినేటట్లు చేయవలెను. అందుకనే మనము మధ్యమధ్య హాస్యానికీ, వ్యంగ్యానికీ తావిస్తూ ఉండవలెను. క్రమశిక్షణవల్లా, జ్ఞానమువల్లా, ఓరిమివల్లా చక్కనిశైలిని సంపాదించవచ్చు. శైలి చక్కనిదై యుంటే కథ అంతబాగుగా ఉండకపోయినా ఆకథానికని చూచిన ప్రతివారూ దానిని చదవడానుత్సహిస్తుంది. శైలి బాగుండకపోతే కథ ఎంత చక్కనిదైనా దానిని చదువుట కెవ్వరూ ఉత్సహింపరు. కాబట్టి కథానికయొక్క ఆకర్షణ దానిశైలియందే కేంద్రీకరింపబడియుండును. శైలీ, కథావస్తువూ రెండూ బాగుంటే ఆకథానికని పండితుల దగ్గరనుండి పామరులవరకూ చదివి తీరతారు. దానిని చక్కగా అభినందిస్తారు.

కథారచనకు గడగేముందు విషయసంగ్రహణము చేయవలెను. చక్కని సన్నివేశాలు, వింతవింత విషయాలు, కొన్నికొన్ని వ్యక్తిగతములైన విషయాలు – వీటివన్నిటిని ముట్టమొదట సేకరించుకొని, ఆటుపైని కథారచనకి పూనుకోవలెను. ఈ విషయాలనన్నిటినీ ఉపయోగిస్తూ కథని వేగముగా ముగించివేయవలెను. ఒక్కసారి కూర్చుని లేచేలోగా ఆకథానికని ముగించివేయవలెను. అలాగ వేగముగా రచించడం వల్ల కథ స్వాభావికమైనదిగా కనబడుతుంది. రచించిన విషయాన్ని ఒకసారి చదవవలెను. చెప్పదలచుకున్న విషయాన్ని తగుభాషలో తెలియచేయలేకపోయిన యెడల, అప్పటికా కథానికని రచించడం మానివేసి మరల ఇంకోసారి వ్రాయుటకు ప్రయత్నింపవలెను. అప్పుడు మనస్సు ప్రశాంతంగా ఉండుటవల్ల చక్కని భావను ఉపయోగించవచ్చు.

కథానికని రచించటం సామాన్యమైన విషయం కాదు. ఎంతో ప్రయాసపడితేనేకాని ఒక చక్కని కథానికను వ్రాయలేము. ఎంతో ప్రయాస కోర్చి విడువక ప్రయత్నించువారే చక్కని కథకు లవుతారు. చక్కని కథకుడౌటకు కొన్నియేండ్లు పట్టును. కథారచన ఒక కళ.

—డా. రామచంద్ర అగస్త్య.

నగ్నగీతి

= శ్రీ శ్రీరంగం నారాయణబాబు =

❀

నరిక్రొత్త
శరీరంలో
నెత్తురు పాకిన
పాటకు
నగ్నశోభ
నందనవనమై
పూచింది
అవలోకిస్తే
అవిసీతని
బుద్ధులు చెప్పే
బుద్ధికి కాదు
కన్నులు నిండే
అందంకోసం
కళవళపడు
డెందాలకె
చూపులతో
అందుకోండి!

వారెవరు ?
ఏదో కీచకభావం
నాసైరంధ్రిగీతాన్నే
చెరపడితే
చూస్తూ ఊరుకొనే
నా రక్తం
ధర్మరాజు !

అదేమిటి ?
పండ్లరుచి
తెలిసికూడా
పసరుకాయలు
రాల్చుకుంటూ
పారిపోయే
ఉపుతసరదా !

అంటే
నాహృదయం
అద్దం అయితే
నాభావం

ప్రతిబింబిస్తే
ఉడుకుపోతు
నా రక్తం "హా" అంటే
మసకమసకబారి
నాగీతం ! [స్వం

జగమంతా
కనైతే
చీకటి కజ్జలమైతే
నాగీతం
చూపు !

యీ ప్రపంచం
జీవనవైతరణీ
దాటేందుకు
నీకోసం
నే చేసిన
గోదానం
నాగీతం !

—'కవితజ్యోతి' నుండి.

ఆంధ్రాభ్యుదయము



ప్రొఫెసరు యస్. భగవంతంగారు

(యం. యస్ సి., డి. యస్ సి.)

మొదట వీరి విద్యాభ్యాసము హైదరాబాదు నందు ప్రారంభమయ్యెను. 1924 లో హెచ్. యస్. యల్. సి. యందు నిజాంరాష్ట్రమున ప్రథములుగ నుత్తీర్ణులై గోల్డ్ స్కాలరుషిప్పును బడసిరి. ఇందుకు ఆంధ్రజన కేంద్ర సంఘమువారిచే ఒక పతకమును, మరి పెక్కు బహుమానములను పొందిరి. ౧౯౨౭ వరకు నైజాం కళాశాలలో ఆ స్కాలరుషిప్పుతో చదివి బి. యస్ సి. యందు మొదటితరగతిలో నుత్తీర్ణులైరి. పిమ్మట కలకత్తాలోని **Indian Institute for the Cultivation of Science** యందు చేరి సర్. సి. వి. రామన్‌గారివద్ద పరిశోధనలు జరిగించుచు ౧౯౩౦ లో మద్రాసు యూనివర్సిటీవారి యం. యస్ సి. పరీక్షయందు కృతార్థులైరి. ౧౯౩౩ లో వీరు ఆంధ్రా యూనివర్సిటీలో ఫిజిక్సు లెక్చరరుగ నియమింపబడిరి. ౧౯౩౮ లో ఫిజిక్సు రీడరుగను, ౧౯౩౫ లో యూనివర్సిటీ సైన్సుకళాశాలకు ఆక్టింగు ప్రిన్సిపాలుగను నియమింపబడిరి. ౧౯౪౦ లో ప్రొఫెసరుగ నియమింపబడిరి. వీరు తమ పరిశోధనాంశముల నన్నిటిని చేర్చి 'Raman effect' అను నొక ఉద్గ్రంథమును రచింప దానిని యూనివర్సిటీవారు ప్రచురించిరి. అది మన దేశమునందే కాక ఖండాంతరములందుకూడ విరివిగ వ్యాప్తిగాంచెను. ఈ ౧౯౪౧ లో యూనివర్సిటీ సెనేటువారు ఈ భగవంతంగారికి డాక్టరు ఆఫ్ సైన్సు అను గౌరవబిరుదను నొసగ నిర్ణయింప గవర్నరుగారందుల కామోదించిరి. ఆంధ్ర విశ్వవిద్యాలయమువారు తమలో తామొక విజ్ఞానశాస్త్రనిధి కిట్టి గౌరవబిరుద మివ్వ నిశ్చయించుట యన సామాన్యవిషయము గాదు. డిసెంబరులో జరుగబోవు కాన్వొకేషనులో వీరి కీబిరుద మొసగబడును. ౧౯౪౧ జూనులో యూనివర్సిటీకి ప్రిన్సిపాలుగానున్న శ్రీ ప్రొఫెసరు విస్సా అప్పారావుపంతులుగారు రాజీనామా నొసగుటచే ఆస్థానమున ఈ భగవంతంగారిని ప్రిన్సిపాలుగా నియమించిరి. ఆంధ్రయువకులలో యూనివర్సిటీయందు ప్రధానస్థాన మాక్రమించినవారిలో వీరినే ప్రథము లనవచ్చును. వీరిది పండితవంశము. గుడివాడవాస్తవ్యులు, జిల్లాకోర్టు ప్లీడరులు, నిరతాన్నదాన ధర్మకర్మనిరతులు నగు కీ. శే. నూరి సుబ్బారాయశాస్త్రిగారి ద్వితీయ పుత్రులు. ఆకిరిపల్లి వాస్తవ్యులు, సంస్కృతపాఠశాలా ప్రతిష్ఠాపక పోషకులు నగు కీ. శే. నూరి మార్కండేయ శాస్త్రిగారి దత్తపుత్రులు.

—కొ. వేం. రా. ల. నా. శర్మ



శ్రీమతి లీలావతికన్య

ఈమె అడయారు దివ్యజ్ఞానసమాజమునకు చేరిన పి. కృష్ణయ్యగారి కుమార్తె. ఈ యేడు మద్రాసు విశ్వవిద్యాలయమువారి బి. ఏ. పరీక్షలో ఫిజిక్సు తెలుగులందు రెండవతరగతియందు ఉత్తీర్ణురాలైనది.



శ్రీమతి పి. యల్. కాంతమ్మగారు

ఈమె చిత్తూరువాస్తవ్యులైన కీ. శే. పి. యల్. వెంకటరమణగారి కుమార్తె. మద్రాసు విశ్వవిద్యాలయమువారి ఈ యేటి బి. ఏ. పరీక్షలో తెలుగునందు రాజధాని కంతకును రెండవస్థానమున ఉత్తీర్ణురాలైనది.



విమర్శనము

యామినీపూర్ణతిలకావిలాసము

గ్రంథకర్త: చెళ్లపిళ్ల నరసకవిగారు. ప్రకాశకులు: శృంగారకావ్య గ్రంథ మండలి, మచిలీపట్టణము. పుటలు ౨౫౪. వెల ౨ రూపాయ.

జీవకోటి యావత్తున్ను శృంగారజీవము. అందు లలితకళాప్రియులు అధికులు. మన సారస్వతములో తదితర రసములకన్న యీ శృంగార రసమునకు ఆధిక్యము కలిగి అతి విస్తీర్ణమైన ఆవరణలో విహరించినది. ప్రకృతగ్రంథము మనకు అతిపరిచితులైన శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రులవారి పినతాతగారిచే రచింపబడినది. వీరిది పండితకవివంశము. శ్రీ వేంకటశాస్త్రులవారు దీనికి పీఠిక వ్రాసినవారు. కవి రసికుడు, కవనము సరసము. పీఠికాకారుడు రసపురుషుడు. అనుట పీఠిక ప్రశస్తమై యున్నది. వస్తువు నెరుగనివా రుండరు. ఇది బిల్హణచరిత్రము గదా. నైసర్గికము మొదలు ఉత్సర్గమువరకును వారి హస్తలాఘవమునకు, శబ్దచాతురికి కవిగారికి లభ్యమైన అవకాశ మింతింత కాదు. వారు దానిని పూరాగా వాడినారు. ఈ కవి ౧౮౫౫-౧౯౦౦ కాలపువాడనియు, చదువరి ౧౯౫౧ కాలపువాడనియు గ్రహించినచో పారవశ్యమున కవకాశ ముండదు. ఇది శృంగారప్రియులకు అత్యంతమును, భాషాప్రియులకు కొంతవరకును, విమర్శకులకు లేశమాత్రముగను రంజకము, హర్షజనకము నై ఒప్పగలదు.

వ. వ.

కాషాయాంబరం

రచయిత: శ్రీ తెల్లంకొండ రామదాసుగారు. నవ్యకళాపరిషత్తు, వన్నారావుపేట.

౧౨ పేజీల చిన్నపుస్తకం. తారాశశాంకం కథ. వైరాగ్యం, సన్యాసం, వేదాంతం అని మూడు విభాగాలు. యావన్మాధుర్యంచేత ఎట్టికార్యాలు చేసినా తుదకు అందరి బ్రతుకూ ఈ మూడు విభాగాలక్రిందనే పరిణమిస్తుందనీ, బృహస్పతివంటి జ్ఞానులు ఎటువంటి పరిస్థితుల్లోనూ చలింపరనీ ఇందలి భావమై యుండవచ్చునని ఊహించుకోవచ్చును.

ఆకుకూరలు

ప్రకాశకులు: ఆంధ్రభూమి బుక్కుడిపో, వేపేరి, మద్రాసు. వెల రు. ౦-౨-౦.

'ఆంధ్రభూమి'నుండి పునర్ముద్రితమైన ఈ చిన్న పుస్తకములో ౩౧ ఆకుకూరల వివరములు కలవు. ఇందు చాలాభాగం కూరలు ఆంధ్రులుపయోగించేవే. ఆకుకూరల గుణములూ, వాటిని ఉపయోగించడంవల్ల కలిగే లాభాలూ చక్కగా వివరింపబడినవి. పుస్తకము చదివితే ఆకుకూరలు తిన నిష్టం లేనివారికికూడా తినవలె ననే అభిలాష కలుగుతుంది. ఇవన్నీ ఔషధప్రాయములునూ, అనేకవిధ రోగములను వేరే మందూ మాకూ అక్కరలేకుండా పోగొట్టునవియునూ, సులభసాధ్యములునూ అని చక్కగా వివరింపబడియున్నది. ఆకుకూరల విషయము చదివి వాటిని ఉపయోగించుకొనుటకు ముందు ఇందులో ఉపోద్ఘాత

రూపమున వ్రాయబడిన పంక్తులను ముఖ్యముగా ధ్యానమందు ఉంచుకోవాలి. లేనియెడల వాటివల్ల కలిగే గుణము కలుగదు.

శ్రీ భగవద్గీతోపదేశసారము

రచయిత: శ్రీ తల్లాప్రగడ వీరేశలింగం శర్మగారు, భగవద్గీతా ప్రచారకుడు, ఇంజరంపోస్టు, వయా కాకినాడ. తూర్పుగోదావరిజిల్లా.

ఇందులో శ్లోకములుగాని, పద్యములుగాని లేకుండా ప్రతి అధ్యాయమునందును గల విషయమంతయు సామాన్యజనులకుగూడా అవగతమయ్యేలాగు వ్రాయబడినది. మొదటి ఆరు అధ్యాయములును ఇందు గలవు. ప్రతిశ్లోకమునకును కొంబరువారీ అర్థము మాత్రమే వ్రాసుకొంటూ పోకుండా ముత్తంమీద అధ్యాయంలోని శ్లోకముల యన్నింటి తాత్పర్యమూ, సారమూ సంగ్రహించి వ్రాయబడినది.

విప్ర వంశము

రచయిత: శ్రీ కాణాద పెద్దన. ప్రకాశకులు: శ్రీ దువ్వూరు జగన్నాథశర్మగారు. వెల రు. ౦-౨-౮.

ఆశ్వ యాగోత్ర, ప్రవర సమితిసభ్యులకు ఈ పుస్తకము మూల్య రహితముగా దొరుకును. ఇందులో వింధ్యపర్వతమునకు ఉత్తరభాగమందున్న పంచగౌడులని పిలువబడు సారస్వత, కాన్యకుబ్జ, గౌడ, ఉత్కల, మైథిల బ్రాహ్మణులయొక్కయు, వారి యందలి అంతర్భేదముల యొక్కయు పేర్లు పేర్కొనబడినవి. అటులే వింధ్యకు దక్షిణమున నివసించు మహారాష్ట్ర, ఆంధ్ర, ద్రవిడ, కర్ణాట, ఘూర్జరులనబడు పంచద్రావిడులయు, వారి యంతర్భేదముల యొక్కయు వివరములు గలవు. తోడ్తోడ ఈ నానా విధ బ్రాహ్మణులు నివసించు దేశమందలి నానా ప్రాంతములును, ఏ జాతిబ్రాహ్మణుల కేలాగు ఆ పేరు గల్గినదియు, ఎట్లేర్పడినదియు సంగ్రహముగా పద్యములలో వ్రాయబడినది. ఇది ముఖ్యముగా బ్రాహ్మణు లందరును పఠింపదగిన చిన్నపుస్తకము.

అహింసాతత్త్వము

రచయిత: శ్రీ దువ్వూరి వెంకటరమణ భారతిగారు.

నోరులేని జీవజంతువుల రక్షణపోషణములకుగాను రెండుకాల ధర్మముచేసినవారికి చిన్నపుస్తకము ఉచితముగనే పంపబడును. కాకినాడయందలి ఈశ్వర పుస్తక భాండాగారపు రజతోత్సవ సందర్భమున పోటీలో గెలిచిన వ్యాసముయొక్క పుస్తకరూపము ఇది. అహింసనుగురించీ, తద్విషయక అర్షమతసిద్ధాంతములను గురించీ, యజ్ఞయాగాదులలోని హింసనుగురించీ ఇందు సంగ్రహముగా చర్చింపబడినది.

కొంటెకోణంగి కవిచౌడప్ప

రచయిత: దువ్వూరి జగన్నాథశర్మగారు. సంక్షిప్తముగా వ్రాయబడిన కవి చౌడప్పయొక్క జీవితచరిత్రము. వెల రు. ౦-౧-౦.

ఆటువేలనియోగులు: నందవరీకులు

రచయిత: దువ్వూరి జగన్నాథశర్మగారు. పై రెండుశాఖల సంగ్రహ వృత్తాంత మిందు గలదు. వెల రు. ౦-౪-౦.

పై వానిపుస్తకములు దొరుకుచోటు: ఆత్రేయాశ్రమం, దేవాలయంవీధి, కాకినాడ.

శ్రీ హంపీక్షేత్రము

రచయిత: శ్రీ తొగర్చేటి భాస్కరశాస్త్రిగారు. ప్రకాశకులు: శ్రీ హంపీవిరూపాక్షదేవస్థాన ప్రచురణశాఖవారు. వెల రు. ౦-౩-౦.

స్వయంగా వెళ్లి చూడజాలకపోయినా ఈ పుస్తకం చదివితే చాలు. విజయనగరముయొక్కయు, దానిచుట్టుపక్కల అనేక మైళ్ల పర్యంతం వ్యాపించియున్న శిథిలావశేషములయొక్కయు సంగతులన్నీ కంటికి కట్టినట్లు గన్పడుతవి. ఈ శిథిలావశేషములను జూడబోయే యాత్రికుల కందరికీ ఇది మార్గదర్శిలాగు ఉపయోగపడుతుంది. జీర్ణకర్ణాటకాంధ్ర రాజధాని మహిమను చూడగోరువారు, తెలియగోరువారు దీన్ని అవశ్యం దగ్గిర వుంచుకోవాలి.

దక్షిణాఫ్రికాసత్యాగ్రహము, మహాత్మాగాంధీ

ప్రథమ ద్వితీయ భాగములు. రెండు సంపుటములు. అనువాదకులు: గొల్లపూడి సీతారామశాస్త్రిగారు. ప్రకాశకులు: ఆంధ్రగీర్వాణ విద్యాపీఠము, కొవ్వూరు, పశ్చిమగోదావరిజిల్లా. పుటలు ౫౮౧. వెల రు. ౧-౦-౦

గాంధిమహాత్ముని ఆత్మకథ ననుసరించి చదువవలసినవి దక్షిణాఫ్రికాసత్యాగ్రహేతిహాసము, చంపారణ్య వృత్తాంతము, బార్డోలీకథ, చీరాల – పేరాల చరిత్ర మున్నగునవి కలవు. అందు దక్షిణాఫ్రికాసత్యాగ్రహచరిత్రే ముఖ్యమైనది. ఎందుకనగా అది ఆయన తొలి ప్రయోగముయొక్క చరిత్ర. లోగడ శ్రీదిగవల్లి శివరావుగారు వ్రాసిన గ్రంథము గాంధిగారిని పురస్కరించుకొనినదే యైనను ప్రస్తుతగ్రంథము గాంధీగారిచే వ్రాయబడినదానికి గొల్లపూడి సీతారామశాస్త్రిగారు తెనిగించినది. తెలుగునాటివారలకు యీ గ్రంథమును అందచేయవలెననే శాస్త్రిగారి కుతూహలమును ప్రశంసింపగలను గాని వారి ఈ అనువాదమును మెచ్చజాలను. ఈ గ్రంథమందలి తెలుగును తెలుగుభాషగా పరిగణించవలసినయెడల యీ తెలుగది యేతెనుగో యేతీరో నిర్ణయింపజాలను. గ్రంథవిషయము బోధపడదని కాదు. శైలి శూన్యత, రచనాసౌష్ఠ్యముయొక్క లేమిడి బాధ కలిగించుచున్నవి. వ. వ.

చరఖా సబ్బులు

సౌత్ ఇండియన్ సోప్ వర్క్సు, మద్రాసువారు మా పరిశీలనార్థము తమ తయారీలోనున్న అనేక రకముల 'చరఖా' సబ్బులలో మచ్చుకు రెండురకముల సబ్బులను పంపినారు. సువాసనలోను, నురుగు నిచ్చుటలోను, మురికిని పోకార్చుటలోను ఈ సబ్బులు పేరుకెక్కిన సబ్బులతో ఇంచుమించు తులతూగుచున్నందుకు సంతసించుచున్నాము. కంపెనీ కొత్తదైనను అత్యంత శ్రద్ధాసక్తులతో మేలిరకపు సబ్బులను తయారుచేయుచున్న వీరి కృషి ప్రశంసనీయమైనది.

గ్రంథస్వీకారము

నవకథామంజరి

గ్రంథకర్త: పెండ్యాల వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు, పిఠాపురము. వెల ఒక రూపాయ.


లోకమాన్యతిలక్

గ్రంథకర్త: చెళ్లపిళ్ల వెంకటేశ్వరకవిగారు. ప్రకాశకులు: లోకమాన్య గ్రంథమాల, కానూరు అగ్రహారము, కానూరుపోష్టు, పశ్చిమగోదావరిజిల్లా. వెల ఒకరూపాయ.

గాలియాత్ర

స్వానుభవపూర్వకమైన యోగవ్యాయామశాస్త్రము. గ్రంథకర్త: శేషభట్టర్ వీరరాఘవాచార్యులుగారు, లింగరాయకొండ, నెల్లూరుజిల్లా. వెల ఒక రూపాయ.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press,
No. 7, Thambu Chetty St, Madras. Editor:— S. Sambbu Prasad.



= నాగానందము =